Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 118 • మంగళవారం 8 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ పాడ్యమి రా. 11.41 వరకు; అనంతరం విదియ; నక్షత్రం: ధనిష్ఠ తె. 5.14 వరకు, అనంతరం శతభిషం; అమృతకాలం: రా. 6.25 నుండి 8.05 వరకు; వర్జ్యం: ఉ. 8.11 నుండి 9.52 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.17 నుండి 9.08 వరకు, తదుపరి రా. 11.00 నుండి 11.45 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు

రక్షాబంధన్


న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి రాఖీ కడుతున్న వితంతువులు


హైదరాబాద్: ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాఖీ కడుతున్న సోదరి


సోదరుడు కల్వకుంట్ల తారక రామారావుకు రాఖీ కట్టి.. హెల్మెట్ అందజేస్తున్న ఎంపీ కవిత


మంత్రి హరీష్ రావుకు రాఖీ కడుతున్న మహిళలు

భూరికార్డుల ప్రక్షాళన

ప్రస్తుత పట్టాదార్ పాస్‌పుస్తకాలు, పహాణీలు గందరగోళంగా ఉన్నాయి. వాటిలో మార్పులు తేవాలి. ఒకసారి ప్రక్షాళన జరిగిన తర్వాత వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి, సర్వే పూర్తయిన తర్వాతే కొత్త పాస్ పుస్తకాలు జారీ చేయాలి. ప్రతీ భూమికి ప్రత్యేక నెంబర్ కేటాయించాలి. అవసరమైతే భూములకు హద్దు రాళ్లను కూడా పాతాలి. గ్రామస్థాయిలో నిర్వహించే రికార్డుల వివరాలే సీసీఎల్ఏ దగ్గర కూడా ఉండాలి. ఎక్కడ ఏ మార్పు జరిగినా ఆన్‌లైన్‌లో అంతటా రికార్డుల్లో మార్పులు రావాలి. బ్యాంకులో డబ్బులు వేసినా... ఏటీఎంలో డబ్బులు తీసినా వెంటనే సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చినట్లుగా, రికార్డుల్లో వివరాలు నమోదైనట్లుగా ఎస్ఎంఎస్ వచ్చేలా భూమి రికార్డుల నిర్వహణ కూడా ఉండాలి. బ్యాంకులు అవలంబిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దీనికి ఉపయోగించాలి.

– ముఖ్యమంత్రి కేసీఆర్



గ్రామగ్రామాన ల్యాండ్ సర్వే...
స్పెషల్ డ్రైవ్
3 ఊళ్లకి ఓ రెవెన్యూ ఇన్‌చార్జ్...
15 రోజుల్లో పూర్తయ్యేలా ప్రణాళిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: 'బ్యాంకులో లావాదేవీలు ఎంత పారదర్శకంగా జరుగుతాయో...అంతే పారదర్శకంగా భూమి రికార్డుల నిర్వహణ జరగాలి...రాష్ట్రంలోని భూమి రికార్డులన్నీ ప్రక్షాళన చేయాలి...ఏ భూమి ఎవరిపేరుమీద ఉందన్న విషయం నిగ్గు తేల్చాలి' అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సర్వే సెటిల్‌మెంట్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. భూముల రికార్డులను బహిరంగ పర్చాలని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసమే ప్రత్యేకంగా రాష్ట్రమంతటా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి భూముల సర్వే సెటిల్ చేయాలని ఆయన సూచించారు. ఇకమీదట భూముల క్రయవిక్రయాలన్నీ పారదర్శకంగా ఉండాలని, పట్టాదార్ పాస్ పుస్తకాలు, పహాణీ పత్రాలు మరింత సరళంగా ఉండాలని ఆయన ఆదేశించారు. రెవెన్యూ వ్యవస్థలో గందరగోళానికి తావుండకూడదని ఆయన నిక్కచ్చిగా పేర్కొన్నారు. సోమవారం ప్రగతి భవన్‌లో సర్వే సెటిల్‌మెంట్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహిం చిన హైలెవల్ సమీక్షలో ఆయన కీలక ఆదేశాలను జారీ చేశారు. ప్రధానంగా భూముల రికార్డులు, పారదర్శకత, సరళతర లావాదేవీల విధానంపై వ్యూహం ఖరారు చేయాలని కోరారు. గ్రామం యూనిట్‌గా జరిపే సర్వే సెటిల్‌మెంట్ కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా సర్వే నిర్వహించాలన్నారు.

భూమి రికార్డుల ప్రక్షాళన చేసేందుకు అనువైన కార్యాచరణ దిశగా జరిగిన సమావేశం 7 గంటలపాటు కీలక అంశాలను సమీక్షించింది. 1936లో నిజాం కాలంలో జరిగిన బందోబస్తు తప్పా మళ్లీ భూముల రికార్డుల ప్రక్షాళన జరగలేదని, దీంతో అనేక ఇబ్బందులు వస్తున్నాయని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ఆయా సమస్యల తీవ్రత నేపథ్యంలో వివాదాలు పెరిగి శాంతిభద్రతల సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూవివాదాల కారణంగా హత్యలు కూడా జరుగుతున్నాయి...వీటన్నింటికీ చరమగీతం పాడాలంటే ముందుగా ఏ భూమి ఎవరిది..యజమాని ఎవరన్న స్పష్టత

➪ 3వ పేజీలో...

భూసేకరణ విభాగం రద్దు

జాయింట్ కలెక్టర్లకు బాధ్యతలు అప్పగింత.. గ్రామ రెవెన్యూ వ్యవస్థ ఆధునీకరణ 3

సమంత సోయగం! చేనేత సౌరభం..!!


చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఐసీసీలో నిర్వహించిన చేనేత ఫ్యాషన్ షోలో సినీనటి సమంత క్యాట్‌వాక్

3 లో

జీఎస్టీ ఓ ప్రయోగం
ఏమవుతుందో చూడాలి!



- 9వ తరగతిలోనే లారీ దెబ్బలు తిన్నా
- మా నాన్న చెన్నారెడ్డికి అనుచరుడు
- ఎన్టీ రామారావు పార్టీ పెట్టగానే కొత్త రాజకీయంతో టీడీపీలో చేరా
- అడుగడుగునా తెలంగాణకు అన్యాయమే
- చంద్రబాబు కేబినెట్‌లో ఉంటూ విభేదించా
- గొప్ప వృద్ధి రేటులో రాష్ట్రం: సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం లక్ష్యంతో అమలు చేస్తున్న జీఎస్టీ ఓ ప్రయోగమని, దీని ఫలితాలు ఎలా ఉంటాయనేది ఎదురు చూడాల్సి ఉందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అభిప్రాయపడ్డారు. పన్నుల శ్లాబుల విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయని, కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలని ఆయన వెల్లడించారు. 'గోదావరి, కృష్ణా నదుల్లో చాలినంత నీరుంది..వాటిని సద్వినియోగం చేసుకోవడం వలన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు బాగుపడ్తాయి' అని ఆయన తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. సమైక్య పాలనలో తెలంగాణ పట్ల చూపించిన వివక్ష, నిర్లక్ష్యం వల్లే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం చేయాల్సి వచ్చిందని అంటూ, ఆయన తన గతాన్ని నెమరేసుకున్నారు. ఉద్యమ సమయంలో తాను అనేక సందర్భాల్లో, సభల్లో చెప్పినట్లుగానే తెలంగాణ రాష్ట్రం ఆదాయ వృద్ధిరేటులో ముందంజలో ఉందని ఆయన సంతోషం వ్యక్తం

➪ 3వ పేజీలో...

సిండికేట్లు... బందిపోట్లు



- రాష్ట్రమంతటా బెల్టు షాపుల హవా
- స్థానిక నేతల కనుసన్నల్లో దుకాణాలు
- ప్రభుత్వ రాబడికి భారీగా గండి
- వినియోగదారుడి జేబుకు చిల్లు
- కోట్లాది రూపాయల అక్రమ దందా

మద్యంతో కలిగే అనర్థాలు, ప్రమాదాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాదాలకు కారణం మద్యమేనని, దుకాణాలను కట్టడి చేయాలని ఆదేశించినా ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోలేదు. అందుకు భిన్నంగా మద్యం దుకాణాలకు అనుసంధానంగా అనధికారిక బెల్టు షాపులు పెరుగుతూ వస్తున్నాయి. రాష్ట్రంలో లెక్కకి మించిన బెల్టు దుకాణాలు, గరిష్ట చిల్లర ధరకు మించిన అమ్మకాలతో సర్కార్‌కు, వినియోగదారుడికి నష్టం కలిగిస్తున్నా అధికార యంత్రాంగానికి పట్టడంలేదన్న విమర్శలు పెరుగుతున్నాయి.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో మద్యం విక్రయాలు కొత్త పుంతలు తొక్కుతున్నది. గల్లీకో బెల్టు షాపు, ఊరుకో బార్ షాపు అన్నట్లుగా వర్ధిల్లుతున్నాయి. అధికారిక లైసెన్సుడు మద్యం దుకాణం కంటే అనధికారిక బెల్టు దుకాణాల్లోనే అధిక విక్రయాలు జరగుతున్నాయని లెక్కలు రుజువు చేస్తున్నాయి. విశ్వనగరం హైదరాబాద్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసి, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు 24 గంటల మద్యం విధానం

➪ 9వ పేజీలో...

మద్యం మాఫియా... ప్రత్యేక కథనాలు 2లో

ఆగస్టు 22న బ్యాంకర్ల సమ్మె

సంస్కరణలకు వ్యతిరేకంగా నిరసన 6 లో

షా...షో.. పటేల్ ఫీట్




రసకందాయంలో గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు
నేడే పోలింగ్.. క్రాస్ ఓటింగ్, నోటాపై ఉత్కంఠ
అమిత్ షా, అహ్మద్ పటేల్‌లలో గెలుపెవరిది? 11

ఔరా..!



హిల్ స్టేషన్లు ప్రైవేటుపరం?



- నష్టాల ఊబిలోంచి గట్టెక్కేందుకు రైల్వే తంటాలు
- నిరర్థక ప్యాసింజర్ మార్గాలను వదిలించుకునే యత్నం
- ఇప్పటికీ ప్రయాణికుల విభాగంలో 80శాతం నష్టాలే


రైల్వే పునర్వ్యవస్థీకరణలో భాగంగా సిగ్నలింగ్, ట్రాకింగ్ వ్యవస్థల ఆధునీకరణలో కార్పొరేట్ భాగస్వామ్యానికి బాటలు వేస్తోంది. నిరర్థక ఆస్తులను ఉపయోగంలోకి తీసుకురావడం, మానవ వనరులను సద్వినియోగపరచడం, వ్యయభారాలను తగ్గించుకుని, ప్రైవేటు సంస్థలకు ధీటుగా రైల్వేల ద్వారా రవాణా, ఇతర సేవాపర సర్వీసులను పోటీతత్వానికి అనుగుణంగా విస్తరణకు కార్యాచరణ.

న్యూఢిల్లీ: ప్యాసింజర్ కారిడార్‌లో ఇబ్బడిముబ్బడి నష్టాలతో సతమతం అవుతున్న భారతీయ రైల్వే క్రమంగా భారాన్ని తగ్గించుకునే దిశగా అడుగులు వేస్తున్నది. ముఖ్యంగా నిర్వహణ భారంతో కునారిల్లుతున్న, నిరర్ధక మార్గాలైన హిల్‌స్టేషన్లను అద్దెకు ఇవ్వాలన్న ప్రతిపాదన ఆరేడునెలల కిందటే చేసింది. బ్రిటీషు కాలం నాటి 1.08 లక్షల కిలోమీటర్ల న్యారో, మీటర్ గేజ్ ట్రాక్స్ పరిధిలోని హిల్ స్టేషన్ రైల్వే నెట్‌వర్క్‌ను తొలుత ప్రైవేటుకు అప్పగించి ప్రయోగాత్మకంగా పరిశీలించాలని ఆలోచన చేసినట్లు సీనియర్ రైల్వే అధికారి ఒకరు ఉటంకించారు. ముఖ్యంగా కల్కా, సిమ్లా, సిలిగురి, డార్జిలింగ్, నీలగిరి తదితర పర్వత, మైదాన ప్రాంతాలను లక్ష్యంగా ఎంచుకున్నారు. ప్రైవేటు సంస్థలు ఏవైనా ముందుకొస్తే, నిర్వహణ, కార్యకలాపాల బాధ్యతలను లీజుకింద అప్పజెప్పాలని ఉన్నతాధికారులు ప్రణాళికలు వేశారు. అయితే దీనిపై

➪ 9వ పేజీలో...

చొరబాటు భగ్నం


- కాశ్మీర్‌లోయ మొబైల్ సెక్టార్‌లో ఐదుగురు మిలిటెంట్లు హతం
- వెనుదిరిగి పారిపోయిన మరికొందరు ఉగ్రవాదులు
- కొనసాగుతున్న గాలింపు చర్యలు
- పుల్వామా జిల్లాలో లష్కరే తోయిబా ఉగ్రవాది కాల్చివేత



శ్రీనగర్: భారత భద్రతాదళాలు ఉగ్రవాదుల ఆటలను ఎక్కడికక్కడ కట్టడి చేస్తూనే ఉన్నాయి. భారత్‌లో చొరబాటు యత్నిస్తున్న ఉగ్రవాద చర్యలను తిప్పికొడుతున్నాయి. తాజాగా నియంత్రణ రేఖ నుంచి భారత్‌లో చొరబడేందుకు ప్రయత్నించిన ఐదుగురు ఉగ్రవాదులను భద్రతాదళాలు

➪ 5వ పేజీలో...

నిబంధనలు బలాదూర్



మేడ్చల్, కెఎన్ఎన్ : నమ్మకు నమ్మకు ఈ రేయినీ..కమ్ముకు వచ్చిన ఈ మాయని అంటూ పల్లెల్లో మద్యం మత్తులో జీవితాలను చిత్తు చేసుకుంటున్న అమాయకులను మేలుకొల్పేందుకు ఓ సినీ కవి ఇలా పాడారు. అయితే ప్రస్తుతం మన పల్లెల పరిస్థితి అలానే మారింది. ముసలోల్ల ముచ్చట్లు..చిన్నారుల ఆటా పాటలతో కనిపించే పల్లెలు నేడు మద్యం మత్తులో తూగుతున్నాయి. మంచి నీరు దొరకని గ్రామాలెన్నో ఉన్నాయి..కానీ మద్యం దుకాణాలు లేని గ్రామం ఎక్కడా లేదు. ఇది ఇలా ఉంటే ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రోత్సహిస్తుండడంతో మద్యం వ్యాపారులు సిండికేటుగా మారి కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. కాగా జిల్లాలో మద్యం దుకాణాలు నిబంధనల మత్తులో తుల తూగుతున్నాయి. ఆబ్కారీ శాఖ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ వైన్స్‌లను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఉప్పల్, కాప్రా, అల్వాల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, బోడుప్పల్, ఫిర్జాజీగూడ, కీసర, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. అయితే ఇక్కడ ప్రభుత్వ ఆదేశాలను బుట్టదాఖలు చేస్తున్నా ఆ శాఖ అధికారుల్లో చలనం లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రజలు ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడంతో జనాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకు అధికంగా విక్రయాలు నిర్వహిస్తున్నారు. క్వార్టర్‌కు రూ.10, ఆఫ్‌కు రూ.15, ఫుల్ బాటిల్‌కు రూ.30 ల చొప్పున బెల్ట్ షాపు నిర్వాహకులు సిండికేట్‌గా మారి బార్‌షాపుల యాజమాన్యం విక్రయిస్తుండగా, దీనికి అదనంగా మరో రూ.10 అదనంగా బెల్ట్ షాపుల్లో వసూలు చేస్తున్నారు. రూ. 110 లకు అమ్మాల్సిన ఏసీ క్వాటర్ బాటల్‌ను రూ.130, రూ.90 కు విక్రహించాల్సిన ఓసీ క్వాటర్‌ను రూ.120 నుంచి రూ.125 లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

గ్రామాభివృద్ధి కోసం వేలం....

గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వాహకుల మధ్య తీవ్రంగా పోటీ పెరగడంతో షాపుల నిర్వాహనకు వేలం నిర్వహిస్తున్నారు. మొదట్లో కొన్ని గ్రామాల్లో మొదలైన బెల్టు షాపుల వేలం ఇప్పుడు జిల్లాలోని అన్ని గ్రామాలకు పాకింది. ముందుగా బెల్టు షాపు నిర్వాహకులు మద్యం అమ్ముకోవడాని తమకు మాత్రమే అవకాశం ఇస్తే ఏడాదికి గ్రామాభివృద్ధి కోసం పెద్ద మొత్తంలో నగదు ఇస్తామని గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామంలోని పార్టీల నాయకులు, పెద్ద మనుషులతో ఒప్పందం కుదుర్చుకుంటారు. అనంతరం గ్రామంలోని అందరి సమక్షంలో వేలం పాట నిర్వహిస్తారు. వేలం పాటలో ఎవరు ఎక్కువ పాడితే వారికే మద్యం అమ్ముకోవాలని ఆదేశిస్తారు. అయితే వేలం పాటలో దక్కించుకున్న బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం ప్రియులను నడ్డి విరిచే విదంగ అధిక ధరలకు మద్యం అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.

బెల్ట్ షాపులకు సిండి కేటు బారు షాపుల నుంచి ప్రత్యేకంగా ముద్రించిన స్టిక్కర్లు అంటిస్తుంటారు. గ్రామాల్లో స్టిక్కర్ ఉన్న మద్యాన్ని విక్రహించే వారిపై అధికారులు పట్టించుకోరు. అయితే స్టిక్కర్ లేకుండా మద్యం విక్రహిస్తే వారిపై ఎక్సైజ్ అధికారులతో దాడులు చేయించి కేసులు పెట్టిస్తారు. ఎక్సైజ్ అధికారులను వివరణకోరగా ఇప్పడి వరకు ఎక్కడా విక్రయాలు జరిపినట్లు మా దృష్టికి రాలేదు. వస్తే వారిపై చర్యలు తీసుకుంటామని సమా దానం చెబుతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి పర్మిట్‌రూం లు, గ్రామాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులను అరికట్టి పేద, మద్యతరగతి కుటుంబాలను మద్యం భారీనుంచి విముక్తి కలిగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వీధికో కొట్టు ..విపరీతమైన రేట్లు

24X7

వరంగల్ రూరల్, కెఎన్ఎన్: పచ్చని పల్లెల్లో మద్యం రక్కసి అనునిత్యం గొడవలు సృష్టిస్తోంది. నిండు వర్షాకా లంలో మంచి నీటి ఎద్దడి ఎదుర్కొనే గ్రామాలు ఉండవచ్చేమో గానీ మద్యం దొరకని గ్రామాలున్నాయంటే మాత్రం అది నిజంగా అతిశయోక్తే. మొన్నటి వరకు తెలంగాణ సర్కారు గుడుంబా తయారీ, అమ్మకాలపై ఉక్కుపాదం మోపడంతో పల్లెల్లో చాలా వరకు గుడుంబా అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో గుడుంబా వ్యసనపరులు మద్యం వైపు అడుగులు వేస్తున్నారు. గ్రామాల్లోని కిల్లీకొట్టు మొదలు కిరాణాదుకాణాల వరకు 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటుండడంతో మద్యం మత్తులో గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో వరంగల్ రూరల్ జిల్లాలోని మద్యం గొలుసుకట్టు దుకాణాలపై ఆంధ్రప్రభ అందిస్తున్న ప్రత్యేక కథనం....

గుడుంబా అమ్మకాలు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న పల్లె ప్రజల్లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న అక్రమ బెల్టు షాపులు ఆందోళన కలిగిస్తున్నాయి. **ఆంధ్రప్రభ** సేకరించిన వివరాల మేరకు వరంగల్ రూరల్ జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 269 గ్రామ పంచాయతీలుండగా 50 కిపైగా వైన్‌షాపులుండగా పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రాల్లో 8 వరకు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. అక్రమ బెల్టుషాపులను నియంత్రించాల్సిన అధికారులే మాముళ్ల మత్తులో పడి పరోక్షంగా బెల్టుషాపు నిర్వాహకులను ప్రోత్సహిస్తుండడంతో వారి వ్యాపారం మూ డు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. వైన్‌షాపు నిర్వాహకులే గ్రామాల్లోని గొలుసుకట్టు దుకాణదారులను ప్రోత్సహిస్తుండడంతో ఇక గ్రామా ల్లో పగలు రాత్రి తేడా లేకుండా 24 గంటలు మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. అంతేకాక ఒక్కో బాటిల్‌పై రూ. 20 నుంచి 40 రూపాయాల వరకు పెంచి మద్యం విక్రయాలు జరుపుతుండడంతో ఇటు మద్యం ప్రియుల జేబులకు సైతం చిల్లులు పడుతున్నాయి. రూరల్ జిల్లాలోని గీసుకొండ, సంగెం, చెన్నా రావుపేట, దుగ్గొండి మండలాలతో పాటు పలు మండలాల్లోని వివిధ గ్రామాల్లో విద్యా సంస్థలు, ఆలయాల పక్కనే అక్రమ మద్యం దుకాణాలను నిర్వహి స్తుండడంతో అక్కడ తాగి గొడవ చేసే వారికి భయపడి విద్యార్థులు మొదలుకుని సామాన్య ప్రజల వరకు నరకయాతన అనుభవిస్తున్నారు. సంగెం మండలంలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆనుకుని చుట్టూ 10 వరకు అక్రమ మద్యం దుకాణాలను నిర్వాహకులు ఎలాంటి జంకుగొంకు లేకుం డా నిర్వహిస్తున్నారని ఈ విషయంపై ప్రశ్నిస్తే దుకాణదారులు బెదిరింపులకు దిగుతున్నారని ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు మండల విద్యార్థి నాయకులు ఆంధ్రప్రభకు వివరించారు.

కమిటీల కనుసన్నల్లోనే... 'బెల్ట్' అమ్మకాలు

- చోద్యంచూస్తున్న ఎక్సైజ్‌శాఖ
- మద్యం దుకాణాలకు అండగా ఉంటున్న గ్రామాభివృద్ధి కమిటీలు
- వేలంపాటలో షాపుల కేటాయింపు



నిజామాబాద్, కెఎన్ఎన్ బ్యూరో : గ్రామాల్లో ఆర్థిక వ్యవస్థపైనే పెను ప్రభావం చూపుతున్న బెల్టు షాప్‌లను నియంత్రించడంలో ఎక్సైజ్ శాఖ అచేతనంగా ఉండిపోతుంది. దీంతో గ్రామాల్లోని అభివృద్ధి కమిటీలే ఎక్సైజ్‌శాఖ పాత్రను పోషిస్తున్నాయి. మద్యం దుకాణాల టెండర్ల నుంచి నిర్వహణ దాకా ఎక్సైజ్ శాఖ ఎలాంటి కార్యాన్ని నిర్వహిస్తుందో అదే తీరున గ్రామాభివృద్ధి కమిటీలు బెల్టుషాప్‌ల విషయంలో చేస్తున్నాయి. బెల్టు షాప్‌లకు టెండర్లు పిలువడం, అందులో అమ్మే మద్యం ధరలు నిర్ణయించడం, నిబంధనలు ఉల్లంఘించే నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం, మందుబాబుల వైపు నుంచి ఏదైనా న్యూసెన్స్ జరిగినా గ్రామాభివృద్ధి కమిటీలే రంగంలోకి దిగుతున్నాయి. గ్రామాభివృద్ధి కమిటీల ఆగడాలను అరికట్టే విషయంలో పోలీసు శాఖే ఎన్నో ప్రయత్నాలు చేసి చాలించుకుంది. అందుకే ఎక్సైజ్ శాఖ గ్రామాభివృద్ధి కమిటీల స్వీయ పర్యవేక్షణలో నడుస్తున్న బెల్టు షాప్‌లను ఏమి చేయలేని పరిస్థితి ఉత్పన్నమైంది. దీంతో బెల్టు షాప్‌ల వ్యవస్థ వేళ్లానుకపోయింది. ముఖ్యంగా గ్రామాభివృద్ధి కమిటీలకు బెల్టు షాప్‌ల నుంచి పుష్కలంగా ఆదాయం సమకూరుతుండడంతో వీటి విషయంలో కమిటీలు నిక్కచ్చిగా ముందుకెళ్తున్నాయి. ప్రతి యేటా నిర్దేశిత గడువు ముగియగానే కమిటీలు సమావేశమై బహిరంగంగా వేలం నిర్వహిస్తాయి. ఒక్కో గ్రామంలో ఏడాదికి రెండు సార్లు కూడా బెల్టు షాప్‌ల నిర్వహణకు సంబంధించి వేలం ప్రక్రియను జరుపుతున్నాయి. ఒక్కో బెల్టు షాప్ నిర్వాహకుడు గ్రామాభివృద్ధి కమిటీకి ప్రతి నెల రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తాడు. మేజర్ గ్రామ పంచాయతీలో ఒక వ్యక్తికి బెల్టు షాప్ నిర్వహణ అప్పగిస్తే అతడు అదనంగా కౌంటర్‌లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఉంటుంది. సదరు నిర్వాహకుడు సైతం ఎంతో కొంత గుడ్‌విల్ తీసుకుని మరి కొందరికీ వీటిని అప్పగిస్తాడు. అయితే బెల్టుషాప్‌ల నిర్వహణ వేలం పద్ధతిలో అప్పగిస్తున్న గ్రామాభివృద్ధి కమిటీలు అందులో అమ్మే మద్యానికి సంబంధించి ధరలను సైతం అప్పుడు నిర్ణయిస్తాయి.

మద్యం మాఫియా

- విచ్చలవిడిగా 'బెల్టు' షాపులు
- దుకాణాల ముందే మద్యం సేవనం
- ఆరోగ్యం చెడిపోతున్నా పట్టించుకోని యువత
- మామూళ్ల మత్తులో అధికారగణం?
- కానరాని పర్యవేక్షణ



మద్యం తాగడానికి ఆపసోపాలు పడుతున్న ఓ దివ్యాంగుడు..

మెదక్ ,కెఎన్ఎన్ : ''మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం..'' అనే నినాదం మద్యం సీసాలపైనే పరిమితమైంది..''మద్యం ప్రభుత్వానికి ఆదాయం..'' అనే నినాదం ప్రభుత్వ ఖజానా నింపడానికి ఉపయోగ పడింది.. ''అక్రమ మద్యం..కల్తీ మద్యం..'' అనే పదాలు అధికారుల జేబులు నింపడానికి సరిపోయింది..''మద్యాన్ని మానండి..కుటుంబాన్ని కాపాడుకోండి..'' అనే మద్య నిషేధ నినాదం కను మరుగైంది..ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో నినాదాలు పుట్టుకొస్తాయి.. మరో వైపు ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఖజానా మద్యం అమ్మకాల ద్వారానే లభిస్తున్నందున మద్య నిషేధం మరుగున పడిపోయింది..ఇదే అదనుగా మద్యం వ్యాపారులు మాఫియాగా ఏర్పడి విచ్చలవిడిగా నకిలీ మద్యంతో పాటు నిబంధనలకు విరు ద్ధంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు..ఊరూ..వాడ ఎక్కడపడితే అక్కడ గొలు సు దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి..

పచ్చని పొలాలతో..స్వచ్ఛమైన వాతావరణంతో కళకళలాడే పల్లె సీమల్లో మద్యం ఏరులై పారుతుంది. గుక్కెడు మంచినీరు దొరక దేమో గానీ, ఏ గ్రామానికి వెళ్ళినా బీరు సీసా మాత్రం లభిస్తుం దంటే పరిస్థితి ఎలావుందో అర్థం చేసుకోవచ్చు. అందరికి 'అవసరం'గా మారిన మద్యం వ్యాపారం మూడు పువ్వు లు..ఆరు కాయలుగా మారింది. దీంతో నిరుద్యోగ యువత గ్రామాల్లో మద్యం వ్యాపారం చేయడానికి ముందుకొస్తున్నారు. ఒక్క కార్టర్ సీసాపై రూ.20 పైనే లాభం రావడంతో యధేచ్ఛగా మద్యం అమ్మకాలు నిబంధనలకు విరుద్ధంగా కొన సాగుతున్నాయి. ఇదే మంచి తరుణమని మద్యం వ్యాపారులు గ్రామాలనే ప్రధాన ఆర్థిక వనరులుగా మార్చుకొని ఇష్టా రీతిగా గొలుసు(బెల్ట్) దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయ తీల్లో బెల్టు దుకాణాలు లేవంటే అతిశయోక్తి కాదు.

ఇంతగా పాతుకు పోయిన బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ అధికారుల నియంత్రణ లేకపోవడంతో కల్తీ మద్యానికి ఊపిరిపోసినట్లయింది.

సిండికేట్‌గా వ్యాపారం..

మద్యం దుకాణాల కోసం నిర్దేశించిన ప్రాంతాల్లో ప్రభుత్వం టెండర్లకు ప్రతి ఏటా ఆహ్వానిస్తుంది. ఈ నేపథ్యంలో మద్యం వ్యాపారులు తమకు నచ్చిన ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి వేలం పాటలో పాల్గొంటారు. ఇందుకు ముందస్తుగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 25 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడే అసలు తిరకాసు మొదలవుతుంది. మద్యం మాఫియా ఒక సిండికేట్‌గా ఏర్పడి బినామీ పేర్ల మీద టెండర్లలో పాల్గొని తమ కు కావల్సిన ప్రాంతాల్లో దుకాణాలు మంజూ రయ్యేలా ప్రయత్నాలు సాగిస్తారు. ఇక్కడి నుండే వ్యాపారుల లావాదేవీలు కొనసాగుతుంటాయి. ఒక దుకాణానికి పోటీ ఉంటే నలు గుర్రైదుగురి బినామీ పేర్ల మీద టెండర్లలో పాల్గొంటారు. వేలం పాటలో దుకాణం మంజూరైతే సదరు వ్యక్తిని డమ్మీగా మార్చి మాఫియా చేతుల్లోకి తీసు కుంటారు. ఒకవేళ టెండర్లలో అధిక మొత్తంలో వేలం పాడి మరో వ్యక్తికి సొంతమైతే ఆ వ్యక్తి నుండి దుకాణాన్ని తీసుకోవడానికి బేరసారాలు లేకపోతే బెదిరింపులకు గురి చేసి తమ ఖాతాలో వేసుకుంటారు. ఇలా సిండికేట్‌గా ఏర్పడిన మద్యం మాఫియా తమ అక్రమ వ్యాపారాన్ని యధేచ్ఛగా కొనసాగించేందుకు ఇదివరకు కొనసాగుతున్న బెల్టు దుకాణదారులతో బేరం కుదు ర్చుకుంటారు. ఎంఆర్‌పి ధర కంటే రూ.5-10 తక్కువకు వారికి అందజేస్తారు. ఇందుకు తమ దుకాణాల్లోనే మద్యం కొనుగోలు చేయాలని షరతు లు విధిస్తారు. దీంతో బెల్టు దుకాణదారులు తమ గ్రామా ల్లోఎంఆర్‌పి కంటే రూ.10- 15 ఎక్కువకు అమ్ముకుం టారు. ఎప్పుడైనా ఎక్సైజ్ అధి కారులు దాడులు చేస్తే తాము న్నామంటూ భరోసా ఇస్తారు. కేసులు నమోదై జైలుకెళ్తే బెయి ల్ కూడా మంజూరు చేయించే బాధ్యత మద్యం వ్యాపారులు తీసుకుంటారు. ఇందుకు సంబంధిత అధికారులతో నెలసరి మామూళ్ళ బేరం కుదుర్చుకోవడం పరిపాటే. ఒక దశలో ప్రభుత్వం ఇచ్చే నెల జీతం కంటే ముందుగా మామూళ్ళు వారికి చేరవేస్తున్నారంటే ఆశ్చర్యం కలిగించక మానదు. ఇందులో ఎక్సైజ్ అధికారులతో పాటు పోలీసులు, రెవెన్యూ, తూనికలు, కొలతల శాఖ అధికారులు కూడా పాత్ర పోషించడం జరుగుతుంది. అయితే ఒక వ్యక్తి ఆరు ఫుల్ బాటిళ్ళు, ఆరు బీరు బాటిళ్ళను కొనుగోలు చేయడానికి అనుమ తులు న్నాయి. కానీ నిబంధనను తుంగలో తొక్కి పెద్దమొత్తంలో గ్రామాలకు తరలిస్తున్నారు.

'చీప్' లిక్కర్ దందా..

మద్యం మాఫియాకు అధికసంపాదన కలిగించేది చీప్ లిక్కర్ దందా. ప్రభుత్వం సరఫరా చేస్తున్న లిక్కర్‌కు ప్రత్యామ్నాయంగా మద్యం వ్యాపారులు చీప్ లిక్కర్ దందాకు తెరదీశారు. ఉమ్మడి మెదక్ జిల్లా కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడం వ్యాపారులకు కలిసొచ్చింది. ఆ రాష్ట్రాల్లో లభించే చీప్ లిక్కర్‌ను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ ప్రకటించిన ఎంఆర్‌పి ధరలకు అమ్ముతున్నట్లు ఆరోపణలున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన లేబుళ్ళను ఇతర రాష్ట్రాల నుండి తీసుకొచ్చిన కల్తీ సీసాలపై అంటించి అమ్మకం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో ఈ వ్యాపారం ఉమ్మడి మెదక్ జిల్లాల్లో జోరుగా సాగుతోంది. దీంతో కోట్ల రూపాయలను మద్యం మాఫియా వెనకేసుకోగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు.



మద్యం దుకాణాలు ఎత్తేయాలి

ఊర్లలో బెల్టు దుకాణాలు నడపడం వల్ల ఎంతో మంది కూలీలకు వ్యసనంగా మారుతుంది. రోజంతా కూలీ చేసుకొని వచ్చి ఆ డబ్బులను తాగుడుకు పెడుతున్నరు. నిబంధనల ప్రకారం గ్రామాల్లో బెల్లు దుకాణాలు నడపొద్దని ఉన్నా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మామూళ్ళు తీసుకొని నడిపిస్తున్నరు.



మాసాయిపేట మల్లేశం, రామాయంపేట

విచ్చలవిడిగా అమ్మకం

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. యువకులు కూడా తాగుడుకు బానిసవుతున్నరు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు అమ్మకం చేయవద్దని పెద్ద ఎత్తున ఉద్యమం తీసుకురావాలి. ప్రభుత్వం కూడా ఇందుకు సహకరించాలి.



కాంశెట్టి సతీష్, కన్యారం, చేగుంట మండలం

మామూళ్ళ మత్తులో...



గ్రామాల్లో అక్ర మంగా బెల్టు దుకాణాలు నడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదొక పెద్ద మద్యం మాఫియాగా తయారైంది. యు వకులు కూడా ఈ దందా లో దిగడం వల్ల పలు కేసులు నమోదై వారి జీవి తం నాశనమవుతుంది. అధికారులు నెలనెలా మామూ ళ్ళకు అలవాటుపడి పట్టించుకోవడం లేదు. తెలంగాణ సర్కార్ ఈ విషయంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. **పోలీస్ దేవేందర్, అక్కన్నపేట**

బెల్టు తీయరా..?



మహబూబ్‌నగర్, కెఎన్ఎన్ బ్యూరో : తెలంగాణ రాష్ట్రంలో గత నెల రోజులుగా డ్రగ్స్‌పై హల్ చల్ చేస్తూ సంపన్న వర్గా లకు మాత్రమే చెందిన ఆ మహమ్మారిపై ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం ఓ మేరకు మంచిదే అయినా .. తెలంగాణ పల్లెల్లో సామాన్య కుటుంబాలను అతలాకుతలం చేస్తూ ఆర్థికంగా , ఆరోగ్యపరంగా నష్టపోయే విధంగా రాత్రిబవళ్లు గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న బెల్టు షాపులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని ప్రజా సంఘాలు, మహిళ సంఘాలు విమర్శిస్తున్నాయి. కేవలం ఒక శాతం డ్రగ్స్ తీసుకునే వారిపై ఇంత పెద్ద మొత్తంలో విచారణలు , అరెస్టులు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రం మొత్తం విచ్చల విడిగా కొనసాగుతున్న బెల్టు షాపుల్లో సామాన్య మధ్య తరగతి జనం ఎక్కువ శాతం మద్యం తాగి ఇబ్బందులు పడుతూ ఉన్న విషయాన్ని ప్రభుత్వం ఎందుకు చూసి చూడనట్లు వదిలేస్తుందో ఇప్పటి వరకు తెలియని ప్రశ్నగానే మిగిలిపోతుంది. బంగారు తెలంగాణగా చెప్పుకొస్తూ ఆదాయమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని వరదలా పారిస్తూ మద్యం సిండికేట్లతో కుమ్మక్కై పల్లెల్లో బెల్టు షాపుల మహమ్మారి విజృంభిస్తున్నా కనీసం ప్రభుత్వ అధికారులు ఆవంక చూడటం లేదు. ఇదేనా బంగారు తెలంగాణ కానే కాదంటున్నారు ప్రజలు. ఇది మద్యం తెలంగాణగా తలపించే విధంగా ఉందని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని గుడుంబ రహిత రాష్ట్రంగా మార్చడంలో పూర్తి విజయం సాధించిన గ్రామాల్లో మాత్రం ఇంకా మత్తు వదలడం లేదు. ప్రభుత్వం నియమ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని పలు వ్యాపార సముదాయాల్లో , జన సముహాల్లో మద్యాన్ని విక్రయిస్తూ వ్యాపారులు అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని నవాబ్‌పేట, హన్వాడ, దేవరకద్ర లాంటి గ్రామీణ మండలాల్లో బెల్టు షాపుల దందా జోరుగా కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని హోటళ్లు, కిరాణ షాపుల్లో అక్రమ సిట్టింగ్ రూంలను ఏర్పడ్చుకొని మద్యం షాపు యాజమాన్యాల సహకారంతో మద్యం విక్రయాన్ని ఇష్టానుసారంగా కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మారు మూల గ్రామాల్లో కొనసాగుతున్న అక్రమ మద్యం వ్యాపారులపై అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గృహ సముదాయాల్లో మద్యం షాపులు కొనసాగుతుండటంతో సాయంత్రం అవగాహనే మందుబాబుల ఆగడాలతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణ రాష్ట్రంగా మార్చ డంలో విజయం సాధించిన ప్రభుత్వం గ్రామాల్లో నేటికి విచ్చలవిడిగా కొనసా గుతున్నా అక్రమ మద్యం వ్యా పా రులను కట్టడి చేయలేని పరిస్థితుల్లో ఉందని జిల్లా ప్రజలు ఆరోపిస్తున్నారు.

మత్తులో పల్లెలు



- యథేచ్ఛగా బెల్టుషాపులకు మద్యం సరఫరా
- బాల్యంలోనే బారుషాపుల బాట
- సిండికేటు వ్యాపారంతో ఛిద్రమవుతున్న బతుకులు
- మామూళ్ళ మత్తులో ఎక్సైజ్
- గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం



వరంగల్ అర్బన్, కెఎన్ఎన్ : చిన్నారుల ఆటపాటలతో సరదాగా కనిపించే పల్లెలు నేడు మద్యం మత్తులో తూగుతున్నాయి. ఆడ, మగ, చిన్నా పెద్దా తేడా లేకుండా విచ్చలవిడిగా మందుకు బానిసలవుతున్నారు. మంచినీరు దొరికని గ్రామాలెన్నో ఉన్నాయి. కానీ మద్యం దుకాణాలు లేని గ్రామం ఎక్కడా లేదు. వీధి వీధిలో విచ్చలవిడీగా బెల్టుషాపులు వెలసి.. మద్యాన్ని కూల్ డ్రింక్, టీ, కాఫీలా తెల్లవారు జామున 5గంటల నుంచి రాత్రి 1 గంట వరకు నిరంతరంగా అమ్మకాలు జరుపుతున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వాలు మద్యం దుకాణాలను ప్రోత్సహిస్తుండడంతో మద్యం వ్యాపారులు సిండికేటుగా మారి అడ్డగోలుగా ధరలు నిర్ణయిస్తూ మద్యం ప్రియులకు జేబులు జిల్లులు పెడుతున్నారు. యువకులు బానిసలుగా మారి ఆరోగ్యంతో పాటు కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ ఆ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో మొత్తం 59 వైన్ షాపు లు ఉండగా.. 78 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇవి అధి కారి కంగా మద్యం దుకాణాలు కాగా.. గ్రామాల్లో మాత్రం మద్యంతో స్నానం చేసే స్థాయిలో దొరుకుందంటే అతిశయోక్తి కాదూ.. జిల్లాలో ఉన్న 59 వైన్ షాపులు పూర్తిగా సిండికేటుగా మారాయి. ఇక్కడి నుంచే గ్రామాల్లో ఏర్పాటు చేసిన బెల్లుషా పులకు మద్యం సరఫరా చేస్తున్నారు. మద్యం దుకాణాలకు అనుబంధంగా గ్రామాల్లో బెల్టు షాపులు నడిపిస్తున్నారు. సిండికేటుగా మారిన యజమానులు గ్రామాలను ంచుకుని ప్రతి పల్లెలో 10 నుంచి 15 బెల్టు షాపులు వెలిశాయి. అయిన ప్పటికీ బెల్టు దుఖా ణాల్లో భారీ స్థాయిలో మద్యం నిల్వలు ఉంచుతూ దర్జాగా దందా సాగిస్తున్నారు.

నాయకుల అండతో టెండర్లు

గ్రామాల్లో రాజకీయ ఆదిపత్యం చలాయించుకునే దిశగా స్థానిక ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. తమకు సంబంధించిన వ్యక్తులను, బంధువులను మద్యం వ్యాపారంలోకి దింపి గ్రామాల్లోని బెల్టుషాపు లన్నింటినీ మూసివేసే విధంగా టెండర్లు నిర్వహిస్తున్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలో 11 మండలాలు ఉండగా అందులో 2 మండలాలు పూర్తిగా అర్బన్‌లో కలువగా మరో 3 మండలాలు సగం గ్రామాలు అర్బన్‌లోనూ మరో సగం గ్రామాలు గ్రామ పంచాయతీలు గా కొనసాగుతున్నాయి.

అర్బన్‌లో కలిసిన 42 విలీన గ్రామాలతో పాటు మిగిలిన మండాలాల్లో బెల్టుషాపులు విచ్చలవిడీగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా కాజీపేట మండలంలోని మడికొండలోని ఓ వైన్ షాపు నుంచి చుట్టు ఉన్న గ్రామాల్లోని బెల్టు షాపులకు మద్యం సరఫరా అవుతోంది. అలాగే గ్రామాల్లో సైతం బెల్టుషాపులను గ్రామంలోని సర్పంచ్‌లతో పాటు బడా నాయకుల కనుసన్నల్లో నడుస్తుండగా మరికొన్ని గ్రామాల్లో పోటీ ఎక్కువగా ఉంటే వేలం పాటల ద్వారా బెల్టుషాపులను నిర్వహించేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. గ్రామ పంచాయతీతో అక్కడి పెద్దలకు పెద్ద మొత్తంలో ముట్టజెప్పిన వారికి మద్యం అమ్ముకోవడానికి సర్పంచ్‌లు, పెద్ద మనుషులు అవకాశం కల్పిస్తున్నారు. వీరితో పాటు స్థానిక అధికారులకు సైతం వారి వాటను నెలనెలకు పంపించాల్సి ఉంటుంది. దీంతో గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వాహణ మూడు పూలు.. ఆరు కాయలుగా విరాజిల్లుతుండగా.. బడుగు జీవీలు జీవితాలు మాత్రం ఛిద్రమవుతున్నాయి.

మద్యంవల్ల భర్తను, కొడుకును కోల్పోయా

మద్యం మహమ్మారీ వల్ల మా కుటుంబం పూర్తిగా కూలిపోయింది. నా భర్త తాగుడుకు బానిసై అనారోగ్యంతో మంచపట్టాడు. ఎన్ని దవాఖానాలకు తిప్పినా ఆరోగ్యం బాగుపడలేదు. 12 ఎరాల భూమి ఉండగా తాగడానికి సగం భూవి అమ్మగా.. రోగం కోసం 2 రెండేకరాల భూమి అమ్మాం. అయితే ఇద్ద రు కొడుకుల్లో పెద్ద కొడు కు అదే పరిస్థితిలో తాగు డుకు బానిసై పెళ్లి చేసిన కొద్ది రోజులకే చనిపోయిండు. దీంతో ఉన్న భూమి అమ్ముకోని అప్పులు కట్టాం. ఇప్పుడు కూలీకి పోతగాని పూటగడవం లేదు. ప్రభుత్వం పింఛన్ కూడా ఇవ్వడం లేదు.



అరెల్లి అనసూయ, సుభాష్ నగర్ చింతగట్టు

ప్రత్యేక స్టిక్కర్లు

బెల్టుషాపులకు సిండికేటు బారు షాపుల నుంచి విక్రయించే మద్యం బాటిళ్లపై ప్రత్యేకంగా ముద్రించిన స్టిక్కర్లు అంటిస్తున్నారు. గ్రామాల్లో స్టిక్కర్లు ఉన్న మద్యాన్ని విక్రయించే వారిపై అధికారులు పట్టించుకోవడం లేదు. ఒక్కో వైన్ షాపులో రోజుకు 30 కాటన్ ల మద్యం అమ్మితే పెంచిన ధరతో అదనంగా రూ. 15వేలు ఆదాయం వస్తుంది. అయితే నెలకు రూ. 5లక్షలకు పైగా అదనంగా ఆదాయం సమకూరుతోంది. వచ్చిన ఆదాయంలో నుంచి సిండికేట్ వ్యవహారాలు గమనించే కొంత మంది ప్రత్యేక సిబ్బంది, ఎక్సైజ్ శాఖకు నెలవారీగా మామూళ్లు అందిస్తూ దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది బెల్టు షాపు నిర్వాహకులు, వైన్స్ యాజమాన్యం అక్రమంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రదేశాల్లో మద్యం సేవించే సమయంలో పలుమార్లు ఘర్షణ వాతావరణాలు చోటుచేసుకున్న సందర్భాలున్నాయి.

ఆడపిల్లలను సాదలేకపోతున్నా..



నా భర్త తాగుడుకు బానిసై ఉన్న ఆస్తంత పోగొట్టిండు. చివరికి ఆ తాగుడుతోనే తాను పోయిండు. నాకు ఇద్దరు కూతుళ్లే.. అప్పటి నుం చి ఆ ఇద్దరు బిడ్డలను సాదుకో వడానికి చాల కష్టంగా మారింది. కూలీకి పోతే వచ్చే డబ్బులు తిండిగింజలకే సరిపోవడం లేదు. ఇంకా పిల్లలను చదివించడం కష్టం గా మారింది. వారిని సాది ఎలా పెల్లి ళ్లు చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం సాయం చేస్తే బాగుండు.

నందునూరి విజయ, చింతగట్టు, హసన్ పర్తి మండలం

చేనేతను ఆదరిద్దాం

- ప్రతి ఒక్కరూ అవే వస్త్రాలు ధరించాలి
- నేతన్నలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- రూ. 1280 కోట్ల బడ్జెట్ కేటాయింపు
- రూ. 100 కోట్లతో సంక్షేమ నిధి
- రుణాల మాఫీ కోసం రూ. 1500 కోట్లు
- పీపుల్స్‌ప్లాజాలో జాతీయ దినోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి ఆ రంగాన్ని ఆదుకునేందుకు ముందుకు రావాలని రాష్ట్ర జౌళి, చేనేత, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. దేశంలో వ్యవసాయ రంగం తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రంగంలో చేనేత ద్వితీయ స్థానం ఆక్రమించిందన్నారు. అయితే ఈ రంగంపై ఆధార పడి జీవిస్తున్న కుటుంబాలు మాత్రం ఆర్థిక సమస్యలతో తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి నుంచి వారికి విముక్తి కల్పించాల్సిన అవసరముందన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో పాటు ప్రజల అండదండలు కూడా ఉన్నప్పుడే చేనేత రంగాన్ని అదుకునేందుకు అవకాశముంటుందన్నారు. వారంలో ఒక రోజైనా ఐటీ ఉద్యోగులు చేనేత దుస్తులు ధరించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా కోట్ల మందికి టెక్నాలిజీ రంగం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోందన్నారు. వాళ్ళందరూ చేనేత దుస్తులు ధరిస్తే కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని పీపుల్స్‌ప్లాజాలో జాతీయ చేనేత సంబురాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. తొలత ఆయన చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించారు. ఈ రంగాన్ని ప్రొత్సహించేలా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ,1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ప్రారంభమైన రోజన్నారు.

అందుకే ఈ నెల 7వ తేదీనీ జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని పేర్కొన్నారు. అలాంటి రంగం ప్రస్తుత అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు గత పాలకులు చేనేత రంగంపై అంతగా దృష్టి సారించకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి అంశాల కారణంగా నేతన్నల జీవితాల్లో వెలుగులు నిండడం లేదన్నారు. అయితే తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగాన్ని ఆదుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు.

ఇందులో భాగంగానే గతంలో ఎప్పుడు లేని విధంగా ప్రస్తుత వార్షిక బడ్జెట్‌లో రూ. 1280 కోట్లను కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. ఈ రంగాన్ని ఒక కళగా గుర్తించామన్నారు. పవర్, హ్యాండ్లూమ్‌కు సమాన ప్రొత్సహకాలు ఇస్తున్నామన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేశామని మంత్రి కేటీఆర్ వివరించారు. ఆర్థికంగా చితికిపోయిన మూడువేల చేనేత కార్మికులు తీసుకున్న రుణాల మాఫీ కోసం రూ. 1500 కోట్లు కేటాయించామన్నారు.

చేనేత రంగంలో పనిచేస్తున్న కార్మికులను ప్రొత్సహించడానికి యేటా 30 మంది కార్మికులకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అవార్డులు ఇవ్వనున్నామని తెలిపారు. అలాగే దాదాపు 40వేల మందికి నేత కార్మికులకు ఫించన్లు ఇస్తున్నామన్నారు. చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదన్నారు.

చేనేత కార్మికుల ముడి సరుకుపై 50శాతం రాయితీ ఇస్తుమన్నారు. జియో ట్యాగింగ్ ద్వారా చేనేత కుటుంబాలను గుర్తించి వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. తదనంతరం వీవర్ జిందాబాద్ అనే పుస్తకాన్ని, అలాగే తెలంగాణ చేనేత మరనేత వైభవ గీతాల సీడీని మంత్రిని ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జౌళి, చేనేత పరిశ్రమకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, తెరాస నాయకులు పాల్గొన్నారు. అనంతరం రాఖీ పండుగను పురస్కరించుకుని గుండు సుధారాణీతో పాటు పలువురు మహిళలు మంత్రి కేటీఆర్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

నేతన్నకు సంపూర్ణ మద్దతు: మంత్రి జూపల్లి

చేనేత రంగానికి అన్ని విధాల ప్రోత్సహం ఇస్తూ నేతన్నలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించు కొని యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లిలో చేనేత ర్యాలీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, జగదీష్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పని ముట్లు, నూలు, రంగులను రాయితీపై నేతన్నలకు అందజెస్తున్నామని అన్నారు. అంతేకాకుండా నేతన్నలు నేసిన వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. వారంలో ఒకరోజు ప్రతి ఒక్కరూ చేనేతను ధరించి, వారికి ప్రోత్సహమిచ్చేలా తమ ప్రభుత్వం పిలుపునిచ్చిన వియాషన్ని గుర్తు చేశారు. ప్రజల్లోనూ చేనేతను ప్రోత్సహించాలన్న ఆలోచన రావడం అభినందనీయమని అన్నారు. చేనేత కార్మికులకు పింఛన్ కూడా అందజేసున్నామని, బడ్జెట్‌లోనూ చేనేత రంగానికి రూ.1283కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. బతుకమ్మ పండుగకు మహిళలకు చేనేత చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రులు నివాళ్లు అర్పించారు.

కార్మికులు ఆగ్రహం

చేనేత దినోత్సవ ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఒక ఘనంగా నిర్వహిస్తుంటే.. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్ పోచంపల్లిలో మాత్రం ఉత్సవాలు కళతప్పాయి. అగ్గిపెట్టెలో చీరను నేసిన చరిత్ర పోచంపల్లి చేనేత కార్మికులకు ఉన్నది. భూదాన్ పోచంపల్లిలో చేనేత కార్మికులు ఎక్కువగానే ఉంటారు. చేనేత ఉత్సవాలను సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. హ్యాండ్‌లూమ్ వాక్ నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన సభకు మంత్రులు హాజరుకాకపోవడంతో.. చేనేత కార్మికులతో పాటు, స్థానిక ప్రజలు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. అయితే పోచంపల్లి మండంలోని జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామనంద తీర్థ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన సమావేశానికి వెళ్లిపోయారు. దీంతో నేత కార్మికులు మంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపైనే బఠాయించారు.



ప్రతి పండక్కీ వస్త్రాల పంపిణీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : చేనేత వస్త్రాలను ఫ్యాషన్‌గా నేటితరం గుర్తించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. చేనేత ఉత్పత్తులను ఆదుకునేందుకు రాష్ట్రంలో ప్రతి పండగకు పేదలకు చేనేత వస్త్రాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హెచ్ఐసిసిలో నిర్వహించిన చేనేత ఫ్యాషన్ షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చేనేత వస్త్రాలు ధరించిన మోడల్స్ క్యాట్‌వాక్ చేసి చేనేత దుస్తుల అందాలను కనువిందు చేశారు. తెలంగాణ చేనేత బ్రాండ్ అంబాసిడర్, సినీనటి సమంత కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, అద్భుతమైన చేనేత ఉత్పత్తులను నేత కళాకారులు ఆవిష్కరిస్తున్నారని, వాటిని ధరించి ఈ రంగాన్ని ఆదుకునేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

కేటీఆర్ స్ఫూర్తి : సమంత



కేటీ రామారావు ఆలోచనలతో స్ఫూర్తి పొంది తాను తెలంగాణ చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నా నని సమంత చెప్పారు. నేతన్నలు కష్టాలు అర్థం చేసుకున్న ప్రభుత్వం వారిని ఆదుకనేందుకు ఎన్నో కార్యక్రమాలు చేస్తోం దని ప్రశంసించారు. చేనేతకు ప్రోత్సాహం ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యంలో తాను భాగస్వామ్యమైనందుకు ఎంతో గర్వం గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సినీనటి కేథరిన్ కూడా పాల్గొన్నారు.

ఢిల్లీలోనూ చేనేత వేడుకలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :చేనేత రంగాన్ని ప్రోత్సాహించేలా, చేనేత కళల్ని భావితరాలకు అందించేందుకు మంత్రి కేటీఆర్ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఢిల్లీలోని తెలంగాణా భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అరవింద్ కుమార్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఢిల్లీ తెలంగాణ భవన్ డ్రైవర్లకు ఆయన చేనేత వస్త్రాలు పంపిణీ చేశారు. మంత్రి కేటీఆర్ ఆదేశాలతో తెలంగాణ భవన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి సోమవారం ప్రభుత్వోద్యోగులు చేనేత వస్త్రాలు ధరించనున్నారు. రాష్ట్రంలో 8 నెలలుగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.తెలంగాణ భవన్ సిబ్బంది మొదలు రెసిడెంట్ కమిషనర్వరకు ప్రతి సోమవారం ఇకపై చేనేత వస్త్రాలే ధరిస్తారని అరవింద్ కుమార్ అన్నారు. ఉద్యోగులు, మహిళా సిబ్బంది, అధికారులకు టెస్కో నుంచి చేనేత వస్త్రాలు అందించనున్నామని ఆయన వివరించారు.



ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌కు తన స్వీయ రచనను అందజేస్తున్న హిందూ దినపత్రిక మాజీ ఎడిటర్ ఎన్. రామ్

జీఎస్టీ ఓ ప్రయోగం... ఏమవుతుందో చూడాలి!

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. తెలంగాణ గత స్మృతులను, చరిత్ర, తాను వెల్లడించిన అంశాలు నిజమవుతున్న సందర్భాన్ని తనను కలిసిన ప్రముఖ పాత్రికేయుడితో సీఎం కేసీఆర్ పంచుకున్నారు. సోమవారం ది హిందూ దినపత్రిక మాజీ ఎడిటర్ ఇన్ చీఫ్, ప్రస్తుత కస్తూరీ అండ్ సన్స్ లిమిటెడ్ చైర్మన్ ఎన్ రామ్ ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా రామ్ రచించిన వై స్కామ్ ఆర్ హియర్ టు స్టే పుస్తకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేశారు. ఈ భేటీలో వారివురి మధ్య సమకాలీన అంశాలతోపాటు తెలంగాణ ఉద్యమం, కొత్త రాష్ట్రం పయనిస్తున్న తీరుతెన్నులపై చర్చ జరిగింది. ఎన్ రామ్ అనేక ప్రశ్నలను అడిగి సీఎం కేసీఆర్ నుంచి సమాధానాలను రాబట్టారు. జీఎస్టీపై అడిగిన ప్రశ్నకు సీఎం కేసీఆర్ సమాధానంగా...'జీఎస్టీ ఓ ప్రయోగం.. ప్రపంచంలో చాలా దేశాలు ఈ విధానం తెచ్చాయి. కానీ అమలులో ఏర్పడిన ఇబ్బందుల వల్ల చాలా దేశాలు వెనక్కి తగ్గాయి..మన దేశంలో ఏమవుతుందో చూడాలి,,పన్నుల శ్లాబుల విషయంలో కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. కేంద్రానికి వినతులు అందుతున్నాయి, కేంద్రం ఎలా స్పందిస్తో చూడాలి' అని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

తెలంగాణ ఉద్యమం ఎందుకు చేయాల్సి వచ్చిందన్న అంశంపై వివరణాత్మకంగా మాట్లాడిన సీఎం కేసీఆర్ గత అణచివేత, ద్రోహాలను వివరించారు. 1956లో హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రరాష్ట్రంతో కలిపి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై తొలుతే వ్యతిరేకత వచ్చింది. ఫజల్ అలీ కమిషన్ తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగానే కొనసాగించాలని సిఫార్సు చేసింది. అప్పటి ప్రధాని నెహ్రూ కూడా ఆంధ్ర ప్రాంతం వారు తెలంగాణ ప్రాంతాన్ని కోరుకోవడం సామ్రాజ్య వాద విస్తరణ కాంక్ష మాత్రమేనని చెప్పారు. అయినా సరే ఆంధ్రా వాళ్లు ఢిల్లీలో లాబీయింగ్ చేసి హైదరాబాద్ స్టేట్‌ను విలీనం చేసుకున్నారు' అని చెప్పారు. నిజాం రాజ్యంలో ఉన్న తెలంగాణ నాయకులకు ఢిల్లీతో పరిచయాలు తక్కువ ఆంధ్ర ప్రాంతం బ్రిటీష్ రాజ్యంలో ఉండటం వల్ల మొదటినుంచి ఢిల్లీ వారితో సన్నిహితంగా ఉండేవారు.

దీంతోనే లాబీయింగ్ చేశారు. కానీ దీనిపై కేవలం తొమ్మిదేళ్లలో ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. ఆందోళన మొదలైంది' అని చెప్పారు. అప్పుడు తాను తొమ్మిదో తరగతి చదువుతున్నానని 1966లో నిరసన ప్రారంభమై 1969 వచ్చేనాటికి మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలో ఉద్యమం ఉవ్వెత్తున వచ్చిందన్నారు. నేను కూడా లాఠీ దెబ్బలు తిన్నా...మా నాన్న చెన్నారెడ్డికి అనుచరుడు...మా ఇంట్లో చెన్నారెడ్డి 10 రోజులున్నారు. సమైక్య పాలనలో వివక్ష ఎక్కువైంది తప్ప తక్కువ కాలేదు... దీంతో ఎన్టీఆర్ పార్టీ పెట్టిన వెంటనే వచ్చిన కొత్త రాజకీయంతో టీడీపీలో చేరా. దాదాపు రెండు దశాబ్దాలు ఎమ్మెల్యేగా పనిచేశాను. మంత్రిగా కూడా ఉన్నా. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో మంత్రిగా ఉన్న నేను తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై నిత్యం పంచాయతీ పెట్టుకునే వాడిని. చివరకు 1999లో కరెంటు చార్జీలు పెంచడంతో రైతులు బాగా నష్టపోతారని చెప్పాను. అయినా వినలేదు. దీంతో పదవులన్నీ వదులుకుని ఉద్యమం మొదలు పెట్టాను' అని నాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లుగా వివరించారు.

కిరణ్‌కుమార్ రెడ్డి నిండు అసెంబ్లీలో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వను అని ప్రకటించారు. ఆంధ్ర పాలకుల గర్వానికి, అహంకారానికి అది నిదర్శనం. వివక్ష, నిర్లక్ష్యం అన్ని రంగాల్లో కొనసాగింది. తెలంగాణ ప్రజలు ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రం సాధించారు' అని చారిత్రాత్మక సన్నివేశాలను గుర్తు చేసుకున్నారు. మేం ఉద్యమ సమయంలో చెప్పినట్లే అన్ని రంగాల్లో దూసుకుపోతున్నామని, తెలంగాణ రాష్ట్రం గొప్పగా ముందుకుపోతున్నదని చెప్పారు. 21 శాతం ఆదాయ వృద్ధి రేటుతో దేశంలోనే నెంబర్ 1గా ఉన్నామన్నారు. గోదావరి, కృష్ణా నదుల జలాలను సద్వినియోగం చేసుకోవాల్సి ఉందన్నారు. అందుకోసం మేము ప్రాజెక్టులు కడుతున్నాం అని వివరించారాయన. ఈ సందర్భంగా తనతో భేటీ అనంతరం రామ్‌ను కారు దాకా స్వయంగా వెళ్లి కేసీఆర్ ఆయనకు మర్యాద పూర్వక వీడ్కోలు పలికారు.

సీఎంగారూ... జీఎస్టీపై మాటమార్చొద్దు

- సిమెంట్, స్టీల్, కంకర ధరలు తగ్గాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ : జీఎస్టీ అమలుపై సీఎం చంద్రశేఖర్ రావు విమర్శలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సూచనలను పరిగణలోకి తీసుకునే ఈ నిర్ణయం తీసుకున్నారని, తెలంగాణ అసెంబ్లీలో కూడా జీఎస్టీకి అనుకూలంగా తీర్మానం చేసిన విషయం ఆయన గుర్తు చేశారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తమ ప్రమేయంతోనే జీఎస్టీ 28 శాతం నుంచి 12 శాతం వరకు తగ్గిందని చెప్పారని, ఇప్పుడు కేంద్రంపై ఆపాదించడం సరికాదన్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక వస్తువుల రేట్లపై మార్పులు వచ్చాయన్నారు. రోడ్ల నిర్మాణం, ఇతర పథకాల కోసం రూ. 2.30 లక్షల కోట్లు వెచ్చించిందన్నారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమన్నారు. సిమెంట్, కంకర, స్టీల్ లాంటి వస్తువలపై 10 శాతం పన్ను తగ్గిందని, ఇంకా భారం అంటే ఎలా..? అని ఆయన నిలదీశారు. రాజకీయ దురుద్దేశ్యంతోనే కేంద్రంపై విమర్శలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి

- టీపీసీసీ నేత దాసోజు శ్రవణ్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : జీ ఎస్టీపై టీఆర్ఎస్ ప్రభుత్వం ఆత్మవంచన చేసుకుని మాట్లాడుతోందని టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ కుమార్‌విమర్శించారు. జీ ఎస్టీ సహా పలు అంశాలపై పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్న సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ నేతలపై శ్రవణ్ విరుచుకుపడ్డారు. ఢిల్లీలోని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. "జీ ఎస్టీ వల్ల రూ. 3,000 కోట్ల నష్టం వస్తుందని ఆర్థికశాఖ మంత్రి ఈటెల రాజేందర్ అంటే, లేదు జీ ఎస్టీ వల్ల రూ. 2,000కోట్లు లాభమేనని కేసీఆర్ చెప్పుకొచ్చారు. ఇద్దరిలో ఎవరి మాట నిజం? అసలు ఈటెల ఆర్థికమంత్రా? లేక కేసీఆర్ బంట్రోతా?" అని ప్రశ్నించారు. ఈటెల గొంతునొక్కి ఆత్మన్యూనతకు గురిచేస్తున్నారని శ్రవణ్ అన్నారు.

జీ ఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుడిగా ఆర్థిక మంత్రి హాజరవాల్సి ఉండగా, ఐటీ మంత్రి కేటీఆర్ ఏ హొదాలో హాజరయ్యారని నిలదీశారు. ప్రాజెక్టులపై విధించిన పన్ను రేటు కారణంగా రూ. 19,200 కోట్ల నష్టం వస్తుందని ముఖ్యమంత్రి అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సామాన్యులందరిపై తీవ్ర ప్రభావాన్ని చూపే జీ ఎస్టీ బిల్లుపై చర్చించకుండా ఎందుకు పాస్ చేశారని ప్రశ్నించారు. ఆనాడు జీ ఎస్టీ బిల్లుపై చర్చ జరగాలని ప్రతిపక్షా లు పట్టుబట్టినా వినకుండా, అందరినీ సభ నుంచి గెంటేసి మరీ బిల్లును పాస్ చేశారని శ్రవణ్ గుర్తుచేశారు. ప్రధాని మోడీకి గులాం అంటూ ఏకోన్ముఖంగా, ఏకపక్షంగా వ్యవహరించి ఇప్పుడేమో ప్రభుత్వానికి నష్టం, చేనేత కార్మికులకు కష్టం అని ఎలా మాట్లాడగల్గుతున్నారని విమర్శించారు. వేల కోట్ల రూపాయల నష్టం కలిగించే జీ ఎస్టీపై కేసీఆర్ అనాలోచితంగా, ఎవరి మాట వినకుండా గుడ్డిగా సమర్థించారని అన్నారు.

భూరికార్డుల ప్రక్షాళన

(మొదటిపేజీ తరువాయి)

రావాలి..ఈ స్పష్టత తెచ్చేందుకు రెవెన్యూ స్పెషల్ డ్రైవ్ అవసరం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'ఇందుకు గ్రామం యూనిట్‌గా జరిగే సర్వే ద్వారా గ్రామంలో ఎంత భూమి ఉంది...ఏ భూమి ఎవరి పేరుమీద ఉంది..వంటి అంశాల్లో మరింత స్పష్టత రావాలి మొత్తం రాష్ట్రంలోని 2.70 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో ఏ భూమి దేనికింద ఉంది అనే వివరాలు రూపొందించాలి. ఈ ప్రక్షాళన ద్వారా రూ. 8వేల ప్రభుత్వ సాయం పథకం సక్రమంగా అమలవడంతోపాటు, వివాదాలను నివారించినట్లవుతుంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. 'భూమి పెరగదు, తరగదు.. ఎంత ఉండాల్నో అంతనే ఉంటది..ఏది ఎవరి పేరుమీద ఉందో స్పష్టత ఉంటే చాల్తది..గ్రామ పరిధిలో వివరాలు సరిగ్గా నమోదు చేస్తే చాలు' అని ఆయన రెవెన్యూ ఉన్నతాధికారులకు దిశానిర్ధేశం చేశారు. రాష్ట్రంలోని 10850 గ్రామాల్లో సర్వే జరగాలన్నారు. 3500 మంది రెవెన్యూ అధికారులను ఒక్కొక్కరినీ మూడు గ్రామాలకు ఇంచార్జిలుగా నియమించాలని ఆయన ఆదేశించారు. 'ఒక్కో గ్రామంలో పదిహేను రోజుల్లో గ్రామస్తులు, గ్రామరైతు సంఘాల ఆధ్వర్యంలో సర్వే చేయాలి..సర్వేకు ఆధునిక విధానాలు అవలంభించాలి...సర్వే ఆఫ్ ఇండియా సహకారంతోపాటు సర్వే ఏజెన్సీల సహకారం తీసుకోవాలి..ఇంత మంచి కార్యక్రమం కాబట్టి ప్రజలు సహకరిస్తారు' అని ఆయన తన మనోభావాన్ని స్పష్టం చేశారు. కలెక్టర్‌తోపాటు రెవెన్యూ అధికారులెవరికీ ఈ సర్వే పూర్తయ్యే వరకు ఇతర పనులు అప్పగించొద్దన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పట్టాదార్ పాస్‌పుస్తకాలు, పహాణీలు గందరగోళంగా ఉన్నాయని, వాటిలో మార్పులు తేవాలని కోరారు. ఆయా వ్యవహారాల్లో అన్ని కాలమ్స్ అవసరం లేదని, సరళీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకసారి ప్రక్షాళన జరిగిన తర్వాత వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాతే కొత్త పాస్ పుస్తకాలు జారీ చేయాలన్నారు. ప్రతీ భూమికి ప్రత్యేక నెంబర్ కేటాయించాలన్నారు. 'అవసరమైతే భూములకు హద్దు రాళ్లను కూడా పాతాలి.. గ్రామస్థాయిలో నిర్వహించే రికార్డుల వివరాలే సీసీఎల్ఏ దగ్గర కూడా ఉండాలి...ఎక్కడ ఏ మార్పు జరిగినా ఆన్‌లైన్‌లో అంతటా రికార్డుల్లో మార్పులు రావాలి...బ్యాంకులో వేసిన డబ్బులు ఏ ఏటీఎంలో తీసినా వెంటనే సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చినట్లుగా, రికార్డుల్లో వివరాలు నమోదయినట్లుగా ఎస్సెమ్మెస్ వచ్చినట్లుగా భూమి రికార్డుల నిర్వహణ కూడా ఉండాలి. బ్యాంకులు అవలంభిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దీనికి ఉపయోగించాలి' అని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

భూ సేకరణ విభాగం రద్దు..!

- జాయింట్ కలెక్టర్లకు బాధ్యతలు
- సిబ్బంది సర్దుబాటు
- భూ నక్షతో రికార్డులు
- గ్రామ రెవెన్యూ వ్యవస్థ ఆధునీకరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భూ సేకరణ ప్రత్యేక విభాగాన్ని రద్దు చేయాలని సర్కార్ నిర్ణయించింది. గతంలోనే ఈ నిర్ణయం సర్కార్ వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వాలు ఎటువంటి కార్యాచరణకు పూనుకోలేదు. దీంతో భూ సేకరణ విభాగాన్ని గత సిఫార్సులకు అనుగుణంగా పూర్తిగా రద్దు చేసి జాయింట్ కలెక్టర్లకే ఈ బాధ్యలను అప్పగించాలని సర్కార్ నిర్ణయించింది. భూ సేకరణ విభాగంలో ఉన్న నామమాత్రపు సిబ్బందిని రెవెన్యూ శాఖకు బదలీ చేయనున్నారు.

సర్కార్ తీసుకుంటున్న అనేక సంస్కరణల్లో భాగంగా పని భారం తక్కువగా ఉన్న శాఖల్లోని సిబ్బందిని పనిభారం అధికంగా ఉన్న ఇతర శాఖలకు సర్దుబాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అసలేమాత్రం పనిలేని ఈ విభాగంపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీని రద్దు తర్వాత భూ సేకరణ బాధ్యతలు జాయింట్ కలెక్టర్ల పరిధిలోకి చేరనున్నాయి. అదేవిధంగా రెవెన్యూ శాఖలో సంస్కరణలకు రెవెన్యూ శాఖ సిద్ధమవుతోంది. రెవెన్యూ పరిపాలనలో భాగంగా వీఆర్వోలు ఇకపై కనీసం వారంలో 5 రోజులు పనిచేసేచోట నివాసం ఉండాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. గ్రామాల్లో భూములు, పంటల తీరును సేకరించేందుకు వీఆర్వోలకు టాబ్‌లను అందిస్తున్నారు.

విలేజ్ మ్యాపులపై...

విలేజ్ మ్యాప్‌ల డిజిటలైజేషన్‌ను కూడా ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్ఆర్ డిపార్ట్‌మెంట్ శాఖ వేగవంతం చేస్తోంది. గతంలో డేటాబేస్‌లో తెలుగు, ఉర్ధూ, మరాఠా, ఇంగ్లీష్‌లో ఉన్న రికార్డులను తెలుగు, ఇంగ్లీష్‌లలో రూపొందించాలని, ఇందుకు అనువుగా డిజిటలైజేషన్‌తో మరింత సులువు చేయాలన్న ప్రయత్నాలను వేగవంతం చేశారు. ఇందుకు తెలంగాణ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ సహాయంతో డేటా వెక్టోరైస్ చేసి జియో రిఫరెన్స్‌ను వర్తింపజేయనున్నారు.

జియో ట్యాగ్ ఫోటోగ్రఫీ విదానంతో పంటల ఫోటోలను తీసి భద్రపర్చే చర్యలకు శ్రీకారం చుడుతున్నారు.

మొదటిసారిగా రెవెన్యూ చరిత్రలో గ్రామాల మొత్తం రికార్డులను ఆయా గ్రామాల వీఆర్వోలకు ఇవ్వనున్నారు. విధిగా గ్రీవెన్స్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్‌ను వీఆర్వోలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఫారం-1, ఫారం-1బి, ఫారం 7 ఆర్వోఆర్ యాక్టు 1971 ప్రకారం రెవెన్యూ రికార్డులను స్కాన్ చేసి వీఆర్వో సిద్దంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలోని 11200 రెవెన్యూ గ్రామాల్లోని 10250 రికార్డులను డిజిటలైజ్ చేశారు. త్వరలో మొత్తం మ్యాపులను భువన్ పోర్టల్‌లో నిక్షిప్తం చేయనున్నారు. రాష్ట్రంలోని 360 కార్యాలయాల్లో తహశీల్దార్లు, అసిస్టెంట్ డైరెక్టర్‌లకు మోడ్రన్ రికార్డు రూముల కల్పన వేగంగా జరుగుతోంది.

దేశంలోనే తొలిసారిగా తెలం గాణ ప్రభుత్వం భూ నక్షకు శ్రీకారం చుట్టింది. ఏ ఒక్క సర్వే నెంబర్ భూమినైనా గూగుల్ ఎర్త్‌లో చూసుకునేలా సరికొత్త సాంకేతికత అందుబాటులోకి తెచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సేత్వారీ, డిజిటలైజ్డ్ విలేజ్ మ్యాపులను సర్వే సెటిల్‌మెంట్, భూమి రికార్డుల శాఖ సిద్ధం చేస్తోంది. భూ ఆక్రమాలకు తావులేకుండా రాష్ట్రంలోని ప్రతీ ఇంచు భూమితో సేత్వారీ అప్‌డేట్ అవుతోంది. తద్వారా 10800 గ్రామాల్లో సర్వే నెంబర్ల వారీగా ఒక్కో గ్రామపు భూములన్నీ ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. అయితే 10800 గ్రామాలకుగానూ 6450 గ్రామాలే సేత్వార్ రికార్డుల్లో చేర్చేందుకు వీలుగా ఉన్నాయి. ఇందులో 4250 గ్రామాల సేత్వార్‌లను పూర్తిచేసి రెవెన్యూ శాఖకు పంపారు. వీటిని కాస్రా పహాణీలో చేర్చాల్సి ఉంటుంది. తద్వారా ఏది ప్రభుత్వ భూమి...ఏది పట్టా భూమి అనేది క్షణాల్లో తేలిపోనుంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 8 ఆగస్టు 2017

మంచిమాట నవ్వావో ప్రపంచం నీతోపాటు నవ్వుతుంది. ఏడ్చావో ఒంటరిగా ఏడవాల్సిందే. ● ఇ.డబ్ల్యు.విల్‌కాక్స్

ప్రభుత్వం ఏ పథకాన్ని లేదా, సంస్కరణను ప్రవేశపెట్టినా అది ప్రజల ప్రయోజనాలను కాపాడేదిగానే ఉండాలి. దెబ్బతీసేదిగా ఉండకూడదు. ఒక్కొక్కసారి పైకి ప్రయోజనకరంగా కనిపించినా, ఆచరణలోకి వచ్చేసరికి వాటి భారం తడిసిమోపెడు అవుతుంది. అంత భారం పడినప్పుడు దానిని తగ్గించమని అడగడం ప్రజాహితమే అవుతుంది. సాగునీటి, తాగునీటి పథకాలపై పన్ను భారం పెరిగితే దాని వల్ల ప్రజలపై నేరుగా భారం పడుతుంది. అలాగే, సామాన్యులు వినియోగించే చేనేతపై జిఎస్‌టి భారాన్ని తగ్గించమని చాలా రాష్ట్రా లు కోరుతున్నాయి. ఇది ఒక నిరంతర ప్రక్రియ. అంతా ఆమోదించిన తర్వాత ఇప్పుడేమిటి అభ్యంతరాలని ప్రశ్నించేవారు ఒక వైపునుంచే ఆలోచిస్తున్నారని అనుకోవాలి.

జిఎస్‌టిపై అభ్యంతరాలు పరిశీలించాల్సిందే!

వస్తు సేవా పన్ను (జిఎస్‌టి) అమలులోకి వచ్చి నలభై రోజులు అయింది. దీనిపై ఇప్పటికీ అభ్యంతరాలేమిటన్నది అర్థంలేని మాటే అవుతుంది. అమలులోకి వచ్చిన తర్వాతనే ఏ సంస్కరణపైనైనా దాని మంచి సెబ్బరలపై సమీక్ష జరగడం సర్వసాధారణమే. జిఎస్‌టిని ఎవరూ వ్యతిరేకించడం లేదు. అయితే, పన్నుల శ్లాబులు, ఏయే వస్తువులకు లేదా సేవలకు ఎంతెంత పన్ను అనే దానిపై అభ్యంతరాలు రావడం సహజమే. మనది ప్రజాస్వామిక వ్యవస్థ. ప్రభుత్వం ఏ పథకాన్ని లేదా, సంస్కరణను ప్రవేశపెట్టినా అది ప్రజల ప్రయోజనాలను కాపాడేదిగానే ఉండాలి. దెబ్బతీసేదిగా ఉండకూడదు. ఒక్కొక్కసారి పైకి ప్రయోజనకరంగా కనిపించినా, ఆచరణలోకి వచ్చేసరికి వాటి భారం తడిసిమోపెడు అవుతుంది.అంత భారం పడినప్పుడు దానిని తగ్గించమని అడగడం ప్రజాహితమే అవుతుంది. సాగునీటి, తాగునీటి పథకాలపై పన్ను భారం పెరిగితే దాని వల్ల ప్రజలపై నేరుగా భారం పడుతుంది. అలాగే, సామాన్యులు వినియోగించే చేనేతపై జిఎస్‌టి భారాన్ని తగ్గించమని చాలా రాష్ట్రా లు కోరుతున్నాయి. ఇది ఒక నిరంతర ప్రక్రియ. అంతా ఆమోదించిన తర్వాత ఇప్పుడేమిటి అభ్యంతరాలని ప్రశ్నించేవారు ఒక వైపునుంచే ఆలోచిస్తున్నారని అనుకోవాలి. బీజేపీ ఎంపీ డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి జిఎస్‌టిపై ఇప్పుడు అభ్యంతరాలేమిటి అని ప్రశ్నించడం వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకపోవడమే. జిఎస్‌టి అమలులోకి వచ్చిన తర్వాత నెలరోజుల్లో పన్నుల వసూళ్ళు బాగా పెరిగాయనీ, పన్ను చెల్లింపుదారుల్లో జవాబుదారీతనం పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆకాశవాణి మన్‌కీ బాత్ కార్యక్రమంలో స్పష్టం చేసిన మాట నిజమే. అంతేకాదు, ఒకే దేశం, ఒకేపన్ను విధానం వల్ల దేశ ప్రజల్లో ఏకతా భావం పెరిగింది. ప్రధానమంత్రి మోడీకోరుకున్నది కూడా ఇదే. చట్టాలు మనం చేసుకున్నవే కనుక,వాటిల్లో మార్పులు చేర్పులు చేసుకోవడానికి ఎప్పుడూ వీలుంటుంది. సాగునీటి పథకాలపై జిఎస్‌టిని తగ్గించాలంటూ తెలంగాణ ప్రభుత్వం కోరడాన్ని ఈ కోణం నుంచేఅర్థం చేసుకోవాలి. తెలంగాణ మాత్రమే కాదు, బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈపన్నుల విధానంలో మార్పులు కోరుతున్నాయి. పన్నులరేట్ల నిర్ధారణ అయిపోయినా, మొత్తం 160 వస్తువులు, సేవల్లో 63 రకాల వాటిపై మినహాయింపు ఇచ్చినా, జిఎస్‌టి మండలి ఇప్పటికీ సమావేశాలను నిర్వహిస్తున్నది దేనికి? ఇలాంటి అభ్యంతరాలనూ, అభ్యర్థనలనూ పరిశీలించడానికే. జిఎస్‌టి ప్రభావంపై ఏ రాష్ట్రా నికారాష్ట్రం సమీక్ష జరిపి ప్రజల ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడాలని కేంద్రం కోరడం మంచిదే కానీ, ప్రతికూలమైన చర్య ఎంతమాత్రం కాదు. ఇతర రాష్ట్రా లు కూడా మరిన్ని వస్తువులు, సేవలపై పన్ను రేట్లు తగ్గించాలని కోరుతున్నాయి. రాష్ట్రాలు ఇంతవరకూ వసూలు చేస్తూ వచ్చిన పన్నుల వ్యవహారాలు కూడా జిఎస్‌టి పరిధిలోకి వచ్చాయి. అవి కోల్పోయిన ఆదాయాన్ని రాబట్టుకోవడానికి ప్రయత్నించడం వాటి ధర్మం. అలాగే, అదనపు భారం పడే సందర్భాల్లో అవి మోయలేని స్థితిలో ఉంటే వాటి గురించి కేంద్రం దృష్టికి తీసుకుని రావడం వాటి బాధ్యత.తమిళనాడు కూడా జిఎస్‌టికి సంబంధించి ఇప్పటికే కొన్ని అభ్యంతరాలను లేవనెత్తింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ జిఎస్‌టిపై కేంద్రానికి సహకరించడం లేదని బిజేపీ నాయకులు ఇప్పటికే ఆరోపించారు. ఆమె లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించడానికి బదులు రాజకీయ కోణంలోనే చూడటం సరైన పద్ధతి కాదు. ఫెడరల్ వ్యవస్థలో అన్ని రాష్ట్రాల, ప్రాంతాల అభ్యంతరాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. ఒడిషా ప్రభుత్వం జిఎస్‌టి పన్ను రేట్ల విధానంలో మార్పులు కోరుతోంది. తెలంగాణ, ఒడిషా, తమిళనాడు తదితర రాష్ట్రా లు లేవనెత్తే అభ్యంతరాలనూ, చేసే అభ్యర్థనలనూ కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి. జిఎస్‌టి మండలి తీసుకున్న నిర్ణయాలు ఫైనల్ కాదు. వాటిని పరిశీలించడం,. మార్పులు చేర్పులు చేయడం ఒక నిరంతర ప్రక్రియలా కొనసాగుతూ ఉండాలి. నీతిఆయోగ్ ఉపాధ్యక్ష పదవినుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించిన అరవింద్ పనగారియా కూడా జిఎస్‌టి రేట్లపై తన అభ్యంతరాలను తెలియజేసినట్టు సమాచారం సుప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త, నీతిఆయోగ్ సభ్యుడు వివేక్ దేబ్‌రాయ్ జిఎస్‌టి రేట్లు ఎక్కువ ఉండటం వల్ల సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. కార్లపై గతంలో43 శాతం పన్ను ఉండేది. జిఎస్‌టి అమలులోకి వచ్చిన తర్వాత వాటిపై పన్ను 28 శాతంగా ప్రకటించారు. కార్ల ధర తగ్గుతాయని విస్తృతమైన ప్రచారం జరిగింది. దీంతో పెట్టుబడులకు కార్ల తయారీ రంగం అనుకూలమైన ప్రచారం కూడా జరిగింది. ఇందుకు సిద్ధం అవుతున్న పెట్టుబడిదారులకు అశని పాతంలా ఇప్పుడు కార్లపై 28శాతం జిఎస్‌టి కాకుండా, మరో 25 శాతం పన్ను విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలాంటి చర్యల వల్ల ప్రధానమంత్రి ప్రతిష్ఠాత్మకంగా అమలు జేస్తున్న మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి విఘాతం కలగవచ్చు.ఇంకా ఎన్ని రకాల వస్తువులపై లేదా, సేవలపై ఇలాంటి పన్నులు వేస్తారోనన్న భయ సందేహాలు జనంలో కలగడం సహజం. జిఎస్‌టి రేట్లను గరిష్ఠం 28 శాతం నిర్ధారించడంపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు గతంలో వ్యతిరేకించాయి. జిఎస్‌టి రేట్లు గరిష్ఠం 18 శాతం ఉండరాదని చాలా రాష్ట్రా లు కోరాయి. అయితే, జిఎస్‌టి మండలి సమావేశంలో ప్రభుత్వం వివిధ రాష్ట్రాలూ, పార్టీలనూ చతుర్విధోపాయాలతో తన దారికి తెచ్చుకున్నది. ఇది బహిరంగ రహస్యమే. ఇంత పెద్ద ఆర్థిక సంస్కరణ అమలు చేసేటప్పుడు రాష్ట్రాలు ఇబ్బందులున్నా సరిపెట్టుకోవాలని కేంద్రం నచ్చజెప్పింది. జిఎస్‌టి అమలు వల్ల లాభాలున్నాయని మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు పేర్కొనగా, వేల కోట్ల రూపాయిల నష్టం వాటిల్లుతుందని మరికొన్ని రాష్ట్రాలు మొదటి నుంచి భయసందేహాలను వ్యక్తం చేశాయి. అయితే, అది అమలులోకి వచ్చింది కనుక, ప్రజలపై పెనుభారం పడే రంగాల్లో ఈపన్ను రేట్లను సవరించాల్సి ఉంటే కేంద్రం దానిపై దృష్టిపెట్టడం తప్పేమీ కాదు. దేనినీ బలవంతంగా రుద్దడం ప్రజాస్వామ్యయుతం కాదు. ఈ అభ్యంతరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం శ్రేయస్కరం.

వాగ్ధాటి = వెంకయ్య!



1972-73లో ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులు. బందరు రోడ్డులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, ఇప్పుడు స్వరాజ్ మైదానం అనుకుంటా. అక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రధాన వక్తలు మాట్లాడిన తరువాత ఒక యువకుడు మైకు అందుకున్నాడు. నిమిషాల వ్యవధిలోనే సభికులను తన వాగ్ధాటితో మైకంలో ముంచి తేల్చాడు. ఎవరని ఆరా తీస్తే వెంకయ్య నాయుడు అన్నారు. పేరు చూస్తే వయసుమళ్ళినవాడనిపించేది కానీ, మనిషి మాత్రం చాలా చిన్నకారువాడే.

1975 లో హైదరాబాదు ఆలిండియా రేడియోలో విలేకరిగా చేరిన మూడు సంవత్సరాలకు వెంకయ్యానాయుడు ఎమ్మెల్యేగా మొదటిసారి శాసన సభలో అడుగుపెట్టారు. ఆయనకు జోడీ ఎస్. జై పాల్ రెడ్డి. ఇక వాళ్ళు సభలో ప్రసంగం మొదలు పెట్టినా, ప్రశ్నలు లేవనెత్తినా, ప్రభుత్వాన్ని నిలదీసినా ప్రెస్ గ్యాలరీ మొత్తం పూర్తిగా నిండిపోయేది. వింటూ రాసుకోవడం విలేకరులకి అలవాటే అయినా వాళ్ళిద్దరూ చెబుతున్నది ఆసక్తిగా వినాలా, శ్రద్ధగా వింటూ పొల్లుపోకుండా రాసుకోవాలా అనేది అందరికీ ఒక సమస్యగా వుండేది. ఆ రోజుల్లో 'శాసన సభలో ఛలోక్తులు' అనేశీర్షికతో ప్రతి పత్రికా ఒకకాలం ప్రచురించేది. వాటిల్లో సింహభాగం వారిద్దరివే ఉండేవి. ఈ విషయంలో ఇద్దరూ ఇద్దరే. వెంకయ్యానాయుడి విశ్వరూపం చూసింది అసెంబ్లీలోనే. అంత్యప్రాసలతో ఉపన్యాసాన్ని రక్తి కట్టించేఆ సాంప్రదాయాన్ని ఆనాటి నుంచి ఈనాటివరకూ తెలుగు, హిందీ, ఇంగ్లీష్ ప్రసంగాల్లో కూడా వెంకయ్యానాయుడు కొనసాగిస్తూ వస్తూనే వున్నారు.

ఆయనతో రేడియో అనుబంధం ఇంకా విచిత్రం. ఏదైనా వార్తను పత్రికలకు ఎలా కూర్చి చెప్పాలో, రేడియోకు ఎలా మార్చి చెప్పాలో ఆయనకు కరతలామలకం. రేడియో వార్తలకు వున్న పరిమితులు రేడియోలో పనిచేసే వారికన్నా ఆయనకు బాగా తెలుసేమో అనిపించేది. ఎందుకంటే ఆయన ఏదైనా వార్త రేడియో కోసం ఫోనులో చెబితే మళ్ళీ తిప్పి రాసుకోవాల్సిన అవసరం వుండేది కాదు. అంత క్లుప్తంగా, సూటిగా వార్తను మలిచి చెప్పేవారు. మధ్యాహ్నం పూట, మళ్ళీ సాయంత్రం రేడియోలో ప్రాంతీయ వార్తలు ప్రసారం అయ్యేవి. ఆయన ఇరవై మూడు జిల్లాల్లో ఎక్కడ వున్నా ఫోనుచేసి వార్త చెప్పేవారు. ప్రసారం చేసింది విని, మళ్ళీ ఫోను చేసి 'బాగానే చెప్పారు కానీ మరో వాక్యం జత చేస్తే బాగుండేది, సాయంత్రం వీలుంటే చెప్పండి' అనేవారు, 'కాదు' అనడానికి అవకాశం ఇవ్వకుండా. ఇక ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమంలో ఆయన పాత్ర ఇంతా అంతా కాదు. ప్రజల్లో రగిలిన అసహనానికి ఆయన వాగ్ధాటి ఆజ్యం పోసిందనడంలో అతిశయోక్తి లేదు.మరోసారి కలిసింది ఢిల్లీలో. మాస్కో రేడియోలో పనిచేస్తూ సెలవుపై హైదరాబాదు వస్తూ ఢిల్లీలో దిగిన సందర్భమది. పూర్వ పరిచయం పురస్కరించుకుని వెడితే, గుర్తుపట్టి ఆప్యాయంగా పలకరించారు. మాస్కో విశేషాలు అడిగి ఆసక్తిగా విన్నారు. వై.ఎస్. రాజశేఖర రెడ్డి మొదటి విడత ముఖ్యమంత్రిగా వున్న రోజుల్లో నేనూ జ్వాలా నరసింహారావు ఒకసారి ఢిల్లీ వెళ్ళాము. ఏపీ భవన్ లో దిగిన మమ్మల్ని కలవడానికి సీనియర్ జర్నలిష్టులు చంద్రకాంత్, ఆనంద్ వచ్చారు. మాటల మధ్యలో వెంకయ్యానాయుడు గారి ఇంటికి వెడుతున్నట్టు చెప్పి మమ్మల్ని కూడా రమ్మన్నారు. ఆయన ప్రతి సంక్రాంతి పండక్కు కాబోలు తన ఇంట్లో చక్కటి విందు భోజనం ఏర్పాటుచేసి, ఢిల్లీలోని తెలుగు కుటుంబాలను ఆహ్వానిస్తారు. పిలవని పేరంటంగా వెళ్ళిన మా ఇద్దర్నీ కూడా వెంకయ్యానాయుడు చాలా ఆదరంగా కనుక్కున్నారు. అద్వానీని చాలా దగ్గరగా ఆ సందర్భంలోనే చూడడం తటస్తించింది. అందరూ వెళ్ళిన తరువాత వెళ్లి కలిస్తే 'వచ్చిన పనేమిటని' ఆయనే ఆరా తీసారు. అప్పుడు జ్వాలా 108 లో పనిచేస్తున్నాడు. రాజస్థాన్ రాష్ట్రంలో విస్తరణ గురించి జ్వాలా చెబితే అక్కడి ముఖ్యమంత్రితో మాట్లాడుతానని చెప్పి, అప్పటికప్పుడే మాట్లాడారు కూడా.

ఏడాది క్రితం ఒకసారి హైదరాబాదులో ఏదో కార్యక్రమానికి హాజరయి, జనాల హర్షధ్వానాల నడుమ ఆసక్తికర ఉపన్యాసం ముగించుకుని, విమానం టైం అయిందని మధ్యలోనే వెడుతుంటే దారిలో కనిపించారు. 'ఎలా వున్నావు శ్రీనివాసరావు' అంటూ అదే ఆదరణతో కూడిన పలకరింపు. నడుస్తూనే మంచీచెడూ కనుక్కుంటూ కారెక్కి వెళ్ళిపోయారు. మొత్తం దేశానికి ప్రథమ పౌరుడు రాష్ట్రపతి తర్వాతి స్థానం ఉపరాష్ట్రపతి పదవిలోకి అడుగుపెడుతున్న వెంకయ్యా నాయుడు గారికి అందరి అభినందనలు.


-భండారు శ్రీనివాసరావు



అనిత నలూజి
సీనియర్ పాత్రికేయురాలు

అచ్చేదిన్ వస్తే... మంచిదేగా!

అభివృద్ధిపై ఎప్పుడైతే దృష్టిని కేంద్రీకరించి, సాధించగలుగుతారో.. అప్పుడు ఎటువంటి ప్రయత్నమూ లేకుండా 132 ఏళ్ళ కాంగ్రెస్ పార్టీ దానంతటదే అదృశ్యమవుతుంది. అంటే కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు.. బీజేపీ చేసే అభివృద్ధి కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేస్తుందన్న మాట.



భారతీయ జనతా పార్టీ ప్రస్తుత రాజకీయాల్లో బలోపేతంగా మారింది. దేశంలోని నాలుగు ఉన్నత రాజ్యాంగ పదవులనూ తన ఖాతాలో వేసుకుంది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, లోక్ సభ స్పీకర్ పదవులలో ఆ పార్టీకే చెందిన వారు కైవసం చేసుకోవడంతో బీజేపీ బలీయమైన శక్తిగా మారింది. ఒకే పార్టీ ఈ పదవులన్నింటినీ వశం చేసుకోవడం దేశ రాజకీయ చరిత్రలో ఒక రికార్డు. 2014లోక్ సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని రికార్డు స్థాయిలో బలహీనపరిచింది కాషాయ దళం. కేవలం 44 స్థానాలకు పరిమితం చేసింది. అక్కడితో ఆగకుండా అసెంబ్లీ ఎన్నికలలోనూ తన పట్టును నిరూపించుకుంటోంది. నయాన్నో భయాన్నో ఒక్కో రాష్ట్రాన్నీ తన గుప్పెట్లోకి తెచ్చుకుంటోంది. తానేమిటో దేశ ప్రజలకూ, రాజకీయ ప్రత్యర్థులకూ చూపిస్తోంది మోడీ బృందం.

ప్రజాభిప్రాయం బీజేపీకి అనుకూలంగా ఉండటం నరేంద్ర మోడీకి కలిసొస్తున్న అంశం. ఇంత బలోపేతంగా ఉన్న ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న ప్రధానికి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులకు పార్టీ లేదా ముఖ్యంగా ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారిని ఎంపిక చేయించుకోవడం అంత కష్టమేమీ కాదు. ఉప రాష్ట్రపతి ఎన్నికలనే తీసుకుంటే ప్రతిపక్ష ఎంపీలు సైతం వెంకయ్యానాయుడుకు ఓటు చేశారు. రైతు కుటుంబ నేపథ్యమున్న వెంకయ్య ఉప రాష్ట్రపతిగా ఎన్నికై ఓ చరిత్రను సృష్టించారు.

దక్షిణాది నుంచి ఉప రాష్ట్రపతి, ఉత్తరాది నుంచి రాష్ట్రపతి, పశ్చిమాది నుంచి ప్రధాని, మధ్య భారతం నుంచి లోక్ సభ స్పీకర్ పార్లమెంటులో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరంతా బీజేపీవారే కావడం, ఆర్ఎస్ఎస్‌కూ గర్వకారణమే. ఇది తమ విజయమేనని ఆరెస్సెస్ కార్యకర్తలు ఉప్పొంగిపోతున్నారు. ఈ విజయాలతో బీజేపీ సరిపెట్టుకుంటుందా.. ఎంతమాత్రమూ కాదు... దేశం నుంచి కాంగ్రెస్ పార్టీని సమూలంగా తొలగించే వరకూ బీజేపీ నాయకులు విశ్రమించరు.

1984లో బీజేపీకి లోక్ సభలో కేవలం ఇద్దరే ఎంపీలున్నారు. గుజరాత్‌లోని మెహసానా నుంచి ఏకే పటేల్, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలోని హన్మకొండ నుంచి చందుపట్ల జంగారెడ్డి మాత్రమే ఆ ఎన్నికల్లో గెలుపొందారు. ఇప్పుడా పార్టీ దేశం మొత్తాన్నీ కాషాయ పతాకంతో రెపరెపలాడించాలని ప్రయత్నిస్తోంది. దక్షిణాదిలోని కర్ణాటక, కేరళ.. తూర్పు ప్రాంతంలోని పశ్చిమ బెంగాల్ పైనా ఇప్పుడు కన్నేసింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించడం బీజేపీకి నల్లేరుమీద నడకే. కేరళ, పశ్చిమ బెంగాల్‌లో కూడా అధికారంలోకి రావడం అంత కష్టమేం కాబోదు. కానీ, అందుకు కొంత సమయం వేచి ఉండాలంతే. ఈ రెండు రాష్ట్రాలలోనూ బీజేపీ ఇప్పటికే కనీస స్థాయికి తొక్కేసింది. దేశవ్యాప్తంగా కార్యకర్తలున్న ఆర్ఎస్ఎస్ మద్దతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి అమిత్ షా బీజేపీ జాతీయాధ్యక్షుడిగా ఉండడం ఎంతో అదృష్టం. అమిత్ షా రాజకీయ చతురత పార్టీకి అత్యుత్తమమైన ఫలితాలను సాధించిపెట్టింది.

రాజకీయ నేతల బృందంతో కూడిన షా కష్టించి పనిచేయడాన్ని అమితంగా నమ్ముతారు. వ్యూహాల్ని రచించడం ఆయనకెంతో ఇష్టం. ఎన్నికలు ఇంకా ఎంతో దూరంలో ఉన్నప్పటికీ అమిత్ షా తన వ్యూహాలకు పదును పెడుతూనే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా ఏడాది పైన సమయముంది. కానీ ఆయన విశ్రమించడం లేదు. ప్రత్యర్థుల్ని ఎలా మట్టికరిపించాలనే అంశంపై దృష్టి పెట్టారు. రాజకీయ సమీకరణాలను ఇప్పటికే సిద్ధం చేసేసుకున్నారు. 2014లో తాము గెలవలేకపోయిన 261 స్థానాలపై తొలుత దృష్టి పెట్టామని అమిత్ షా కుడి భుజమైన భూపేంద్ర యాదవ్ తమ వ్యూహాన్ని బహిర్గతం చేశారు. యాదవ్ మధ్య ప్రదేశ్‌నుంచి రాజ్య సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మేం గెలుచుకున్న స్థానాలలో తిరిగి విజయం సాధించడం మాకు పెద్ద కష్టమేం కాదని ధీమా వ్యక్తం చేస్తున్నారాయన.

ఓటమి చెందిన స్థానాలలో గెలవడమే ధ్యేయంగా పార్టీ పనిచేయడం బీజేపీ వ్యూహమని తేలిపోయింది. భారీ విజయాలను లక్ష్యం చేసుకోవడం ఏ పార్టీకి తప్పుకాదు. విజయ పథాన్ని అందుకోవడంలోనూ, రామ రాజ్యాన్ని స్థాపించే దారినుంచీ తప్పుకోకూడదని బీజేపీ నేతలు అంటున్నారు. పార్టీ నేతలు ఈ రెండు మాటలనూ తరచూ ఉచ్చరించేవారు. రాజకీయ దిక్చక్రం నుంచి రామరాజ్యం అనే పదాన్ని తప్పించకుండానే లక్ష్యాన్ని చేరుకోవాలంటున్నారు వారు. అధికారంలో ఉన్నది బీజేపీ కావచ్చు లేదా కాంగ్రెస్ కావచ్చు..ప్రజలకు కావాల్సింది మాత్రం సత్పరిపాలన. దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయడం మాత్రమే కాకుండా ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ అభివృద్ధినే ధ్యేయంగా మార్చుకోవాలి.

అభివృద్ధిపై ఎప్పుడైతే దృష్టిని కేంద్రీకరించి, సాధించగలుగుతారో.. అప్పుడు ఎటువంటి ప్రయత్నమూ లేకుండా 132 ఏళ్ళ కాంగ్రెస్ పార్టీ దానంతటదే అదృ శ్యమవుతుంది. అంటే కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు.. బీజేపీ చేసే అభివ ృద్ధి కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేస్తుందన్న మాట. మంచి రోజులు(అచ్చేదిన్) భారతీయ జనతా పార్టీకీ దాని నేతలకూ మాత్రమే కాకుండా దేశ ప్రజానీకం కూడా దాని ఫలితాన్ని అనుభవించినప్పుడు పార్టీకి తిరుగుండదు.

రిసార్ట్ రాజకీయం!

ఎన్నికలంటే ఇంతేనా.. తొలుత ప్రజలకు ఆ తరువాత ఎన్నికైన ప్రజా ప్రతినిధులకూ డబ్బులు పంచడమేనా. కర్ణాటకలో ఐటీ దాడులలో పట్టుబడిన మొత్తం.. ఓ రిసార్టులో గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలుండడం.. రెండింటికీ సంబంధముందా? దాడులు అనైతికమని కాంగ్రెస్ అంటుంటే.. అసలంత డబ్బెక్కడెందుకుందో చెప్పమని కేంద్రం ప్రశ్నిస్తోంది.

కర్ణాటక రాజధాని బెంగళూరులో రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి డి.కె. శివకుమార్‌కు చెందిన ఈగిల్‌టన్ రిసార్ట్ ఇతర నివాసాలలో పది కోట్ల రూపాయలు ఎందుకున్నాయి? మెరుపువేగంతో సాగిన ఆదాయ పన్ను శాఖ దాడులలో ఇంత పెద్ద మొత్తాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీమానిటైజేషన్ అయిపోయిన తరవాత ఇంత పెద్దపెద్ద నోట్ల కట్టలు ఇక్కడెందుకున్నాయి? దీనికి కారణం రాజ్యసభ ఎన్నికలు. గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు బహుమతిగా ఇవ్వడానికి ఈ మొత్తాన్ని అక్కడుంచారు. సోనియా రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్ రాజ్యసభ పదవికి పోటీ చేస్తున్నారు.

డికెఎస్‌గా సుప్రసిద్ధుడైన శివకుమార్ కర్ణాటకలో అపారమైన ధనవంతుడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. ఈ రెండు రంగాలలో ఆయన అపరిమితంగా ధనాన్ని ఆర్జిస్తున్నారు. డికెఎస్ రాజకీయంగా ఏదైనా తప్పు చేసినా..పొరపాటుగా మాట్లాడినా ముఖ్యమంత్రి సిద్దరామయ్య సైతం మందలించలేరు సరికదా.. కిమ్మని కూడా అనరు. ఈ ఒక్కటి చాలు డికెఎస్ ఎంత బలవంతుడో తెలియచెప్పాడానికి.

గుజరాత్ రాజ్యసభ ఎన్నికలకు ఇన్చార్జిగా నియమితుడైన డికెఎస్ గుజరాత్‌కు చెందిన 44మంది ఎమ్మెల్యేలను ఈగిల్‌టన్ రిసార్టులో ఉంచారు. బెంగళూరు శివార్లలో ఉన్న ఈ రిసార్టుకు వారు గత నెల 30 తేదీరాత్రి చేరి వారం రోజుల తర్వాత ఆగస్టు 7వ తేదీన అహ్మదాబాద్ చేరుకున్నారు.వీరందరినీ గుజరాత్‌లో ఆనంద్‌లోని మరో రిసార్ట్ కు తరలించారు.తమపార్టీ ఎమ్మెల్యేలంతా తమతోనే ఉన్నారనీ, రాజ్యసభ ఎన్నికల్లో గెలుస్తానని కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ ధీమాగా చెప్పారు. దేశంలోని 29 రాష్ట్రాలూ, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలలోని ధనవంతులైన మంత్రులలో శివకుమార్ రెండో స్థానంలో ఉన్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ అనే సంస్థ చేసిన సర్వేలో తేలింది. డికెఎస్ ఆస్తులు మొత్తం 251 కోట్ల రూపాయలని ఆ నివేదిక పేర్కొంది. శివకుమార్‌కి చెందిన కార్యాలయాలూ,నివాసాలలో 80 గంటల పాటు ఈడీ అధికారులు జరిపిన సోదాల్లో 800కోట్లు పైగా విలువైన ఆస్తులను గుర్తించినట్టు,వీటిలో 300 కోట్లకు పైగా లెక్కలు తేలాల్సి ఉన్నట్టు అధికారులు తెలిపారు.

డికెఎస్ ఆస్థులపై ఆదాయ పన్ను శాఖ దాడులు జరిగాయో లేదో కాంగ్రెస్ గూండాలు బెంగళూరులో రెచ్చిపోయారు. ప్రభుత్వ ఆస్థులను ధ్వంసం చేశారు. అయినా వెంటనే సాధారణ పౌరులలో దీనిపై ఎటువంటి చలనమూ లేదు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య నుంచి నాయకులంతా ఈ దాడులు రాజకీయ ప్రేరేపితమనీ, కక్షతో చేస్తున్నవనీ గగ్గోలు పెట్టారు. ఇంత గగ్గోలు పెట్టిన వారు అసలా పదికోట్లు ఎలా ఉన్నాయన్న దానికి మాత్రం స్పందించడం లేదు. ఈ దాడుల్ని పార్లమెంటులో కూడా కాంగ్రెస్ ఖండించింది. రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ అజాద్‌కు ఈ దాడులు అమితాశ్చర్యాన్ని కలిగించాయట. ఎందుకీ దాడులు చేశారో అంతుపట్టలేదట. కిందటి నెలో.. వచ్చే నెలో ఈ దాడుల్ని ఎందుకు చేయకూడదని కూడా ఆయన సభలో ప్రశ్నించారు. ఆయన ప్రశ్నలోనే సమాధానమూ ఉంది. గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆనందంగా ఉంచేందుకూ, ధనికులను చేసేందుకూ ఆ మొత్తాన్ని పంపిణీ చేసే బాధ్యతను డికెఎస్ చేపట్టారని గులాం నబీకి తెలియదా?

ఆ డబ్బును తీసుకున్న ఎమ్మెల్యేలకు సైతం ఈ దాడులు ఒక హెచ్చరికే. ఆ డబ్బు తీసుకుంటే ఇబ్బంది పడేది వారే అనేది ఆ హెచ్చరిక. రాజ్యసభ ఎన్నికలకూ ఐటీ దాడులకూ ఎటువంటి సంబంధమూ లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభలోనే గులాం నబీ ఆజాద్‌కు బదులు చెప్పారు. దాడుల సమయంలో డికెఎస్ రిసార్టులో ఉన్నారు..ఆయన ఇంట్లో కాదన్నారు. ఈ కారణంగానే ఐటీ అధికారులు డికెఎస్‌ను ప్రశ్నించాలనుకున్నారని ఆజాద్ తెలిపారు.

వేకువనే డికెఎస్ రిసార్టులో ఏం చేస్తున్నారు..

ఎమ్మెల్యేల్ని ఉంచిన ప్రాంతంలో ఆదాయ పన్ను శాఖ దాడులు చేయలేదు.. ఏ ఒక్క శాసన సభ్యుణ్ణీ తనిఖీ చేయలేదని అరుణ్ జైట్లీ చెబుతూ.. అంత ఉదయాన్నే డికెఎస్ రిసార్టులో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆయన రిసార్టులో ఉన్నారనే ఐటీ అధికారులు ప్రశ్నించేందుకు అక్కడికెళ్లారని చెప్పారు. రిసార్టు నుంచి డికెఎస్‌ను ఆయన ఇంటికి తీసుకెళ్ళారని తెలిపారు. రిసార్టులో ఉంటే చట్టం నుంచి మంత్రికి రక్షణ లభించదని స్పష్టంచేశారు. ఐటీ దాడులు అధికార దుర్వినియోగం తప్ప మరోటి కాదని కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. దాడులేమైనా కావచ్చు.. ఎంత స్వాధీనమైందనేది ఇక్కడ ప్రశ్నని అరుణ్ జైట్లీ అందుకు బదులిచ్చారు.

నిబంధనలు అప్పుడు గుర్తురాలేదా!

ఇక్కడే ఇంకో ట్విస్టుంది. గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శక్తిసింహ్ గోవిల్ ఒక వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. సాయుధులైన సిఆర్‌పిఎఫ్ జవాన్లు రిసార్టు ఆవరణలో తిరుగుతున్న ఈ వీడియో కలకలం సృష్టించింది. వారిని అక్కడ నియోగించడానికి మా ఎమ్మెల్యేలేమైనా నేరస్థులా అని గోవిల్ ప్రశ్నించారు. రాజకీయాలు పతనమైపోయాయనడానికి ఇంతకు మించిన ఉదాహరణ కావాలా అంటూ ఆ పోస్టులో ప్రభుత్వాన్ని నిలదీశారు. గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మద్దతిస్తున్న డికెఎస్‌ను బెదిరించేందుకు కేంద్రం ఈ పనికి పూనుకుందన్నది ముఖ్యమంత్రి సిద్దరాయ్య ఆరోపణ. సిఆర్‌పిఎఫ్ సాయం తీసుకోవడం నిబంధనలకు విరుద్ధమంటున్నారాయన. దీనికి బదులు రాష్ట్ర పోలీసుల సాయాన్ని వారు అర్థించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఇలా అనేటప్పుడు తాను నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేసిన నిజాయితీ గల అధికారులు ఆయనకు గుర్తొచ్చుంటే బాగుండేది.

ఈగిల్టన్ రిసార్టుకెంతో చరిత్ర

వివాదానికి కేంద్రమైన ఈగిల్టన్ రిసార్టుకు ఎంతో చరిత్రుంది. ప్రపంచ స్థాయి రిసార్టుగా పేరుంది. రామనగర జిల్లాలో ఉన్న ఈ రిసార్టు 2006-07 సంవత్సరంలో రాజకీయానికి కేంద్రంగా మారింది. కాంగ్రెస్-జెడి(ఎస్) బృందంనుంచి కొందరు ఎమ్మెల్యేలు బీజేపీతో చేరడానికి ప్రయత్నించిన తరుణంలో హెచ్‌డి కుమారస్వామి తన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ఇక్కడే ఉంచారు. ఈ రిసార్టుకు చెందిన 77 ఎకరాలను క్రమబద్ధీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం 982 కోట్ల రూపాయలను జరిమానాగా చెల్లించాలని కోరింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఇందులో ఉంచే ముందు వారమే ఈ సంఘటన చోటుచేసుకుంది.

-సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి

బీసీ బిల్లు వాపస్‌పై ప్రధానికి వినతి

జాతీయ బీసీ కమిషన్ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. దీన్ని రాజ్యసభకు పంపితే సవరణల పేరుతో లోక్‌సభకు తిరిగి పంపడంపై 60 కోట్ల బీసీల నుంచి, బీసీ అయిన ప్రధాని మోడీ గార్ని వేడుకునేది ఏమిటంటే స్వాతంత్ర్య వచ్చి 70 ఏళ్ళు పూర్తి అవుతున్న వేళ బీసీ బిల్లును రాజ్యసభ ద్వారా ఆమోదింపచేసేలా, ప్రధాని మోడీ రాజకీయ పక్ష నేతలతో మాట్లాడి బీసీ బిల్లును ఆమోదింపచెయ్యాలి. తెలంగాణా రాష్ట్రంలో నవంబర్ 21, 2015 నాడు ఆన్ టైమ్ ద్వారా బీసీ కార్పొరేషన్ రుణాలకై దరఖాస్తులు చేసుకొని, ఫిబ్రవరి 17 నాడు స్థానిక సంస్థలలో జరిగిన మౌఖిక ఇంటర్వ్యూలకు హాజరైన బీసీలకు నేటివరకు రుణాలు, సబ్సిడీ మంజూరు కాకపోవడంపై బీసీ సంక్షేమ మంత్రి జోగు రామన్న బీసీ కార్పొరేషన్ చైర్మన్ గౌడ్, బీసీ అధ్యయన కమిటీ చైర్మన్ బి.ఎస్.రాములు, బ్యాంకుల చుట్టు సబ్సిడీల కోసమే ఎదురుచూస్తున్న బీసీ లకు తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్ గారు 80 శాతం సబ్సిడీని లబ్దిదారుల ఖాతాల్లోకి జమచేసి బీసీలను ఆదుకోవాలని తెలంగాణా సిఎం గార్ని బీసీ బిల్లు ఆమోదింపచేసి, బీసీ కార్పొరేషన్‌కు రూ.25,000 కోట్ల నిధులు ప్రతి రాష్ట్రానికి ఇచ్చి బీసీలను ఆదుకోవాలని ప్రధాని గార్ని కోరుతున్నాను.

-కోలిపాక శ్రీనివాస్
బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

విజయవాడ, కెఎన్ఎన్: కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందగా, మరో మహిళ ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించింది. విజయవాడ నుంచి అవనిగడ్డ వెళ్లే ఆర్టీసి బస్సు పెదప్రోలు వద్దకు రాగానే, మోపిదేవి నుండి చల్లపల్లి వైపు వెళ్లుతున్న మారుతి షిఫ్ట్ కారు ఒక్కసారిగా బస్సు కిందకు దూరిపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన సంఘటన స్థలంలో ముగ్గురు నిమ్మగడ్డ రాజ్యలక్ష్మి(54) శివకుమారి (55), హేమకాంత్ (35)లు చనిపోగా, ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నిమ్మగడ్డ సీతామహాలక్ష్మి (50) మరణించారు. కృష్ణాజిల్లా మొవ్వ మండలం మంత్రిపాలెం గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు గుంటూరు జిల్లా దోనేపూడి నుంచి వస్తుండగా మార్గ మధ్యంలో ఈ ప్రమాదం జరిగింది.

పాయింట్లకు విముఖం?

వాహనదారుల్లో వ్యతిరేకత



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ట్రాఫిక్ ఉల్లంఘనలపై అమలులోకి వచ్చిన పాయింట్ల విధానాన్ని వాహనదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసేందుకే పాయింట్ల విధానం ప్రవేశపెట్టారని ధ్వజమెత్తుతున్నారు. కొత్త విధానంపై వాహనదారుల్లో అవగాహన కలిగించడం, నిబంధనల మేరకు రహదారులను తీర్చిదిద్దడం లాంటి చర్యలు పూర్తయిన తర్వాతనే కొత్త నిబంధనలు అమలు చేయడం సహేతుకం అని వాదిస్తున్నారు. మూడు కమిషనరేట్ల పరిధిలో ఎక్కడ కూడా రహదారులు ప్రమాణాల మేరకు తీర్చిదిద్దపడలేదు, ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రాలైన్లు, స్టాప్‌లైన్లు సక్రమంగా ఏర్పాటు చేయలేదు, నగరంలోని రహదారులను ప్రమాణాల మేరకు తీర్చిదిద్దిన తర్వాత పాయింట్ల విధానం అమలు పర్చడం సహేతుకంగా ఉంటుంది అని వాహనదారులు సూచిస్తున్నారు.

కొత్త విధానం ప్రకారం రెండు సంవత్సరాల వ్యవధిలో 12 పాయింట్లు దాటితే ఏడాది పాటు డ్రైవింగ్ లైసెన్సు రద్దు, రెండవ సారి 12 పాయింట్లు దాటితే 2 ఏళ్ల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు, మూడవ సారి, ఆ పైన 12 పాయింట్లు దాటిన పక్షంలో ఏకంగా 3 ఏళ్ల పాటు డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేయడం జరుగుతుంది. మద్యం తాగి బైకు నడిపితే 3 పాయింట్లు, మద్యం సేవించి కార్లు నడిపితే 4 పాయింట్లు, బస్సు క్యాబ్‌లు నడిపితే 5 పాయింట్లను జరిమానాగా పరిగణించడం జరుగుతుంది. అదే విధంగా అతి వేగానికి 3 పాయింట్లు, రేసింగ్‌కు 3 పాయింట్లు, బీమా లేని వాహనాలకు 2 పాయింట్లు, సిగ్నల్ జంప్ అయితే 2 పాయింట్లు, సీట్ బెల్టు ధరించకపోతే 1 పాయింట్, హెల్మెట్ ధరించకపోతే 1 పాయింట్ రాంగ్ సైడ్ డ్రైవింగ్‌కు 2 పాయింట్లను జరిమానాగా పరిగణించడం జరుగుతుంది.

కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు సిగ్నల్స్‌ను ఎత్తి వేసి యూ టర్నును అమలు పర్చడంతో సమీప దూరానికి అత్యధికులైన వాహనదారులు రాంగ్ రూట్‌లో వాహనం నడిపించవలసి ఉంటుంది. లేని పక్షంలో కనీసం అర కిలో మీటర్ నుండి కిలో మీటర్ దూరం వరకు ముందుకు వెళ్లి మరో అర కిలో మీటర్ నుండి కిలో మీటర్ మేరకు వెనకకు రావలసి వస్తుంది. అదే విధంగా స్టాప్ లైన్లు ఎక్కడ కూడా సక్రమంగా కనిపించవు, జీబ్రా లైన్లు సరిగా ఉండవు, వీటన్నింటిని సవరించాలని వాహనదారులు కోరుకుంటున్నారు. యూ టర్న్ మంచిదే అయినప్పటికీ వాటి పక్కనే సర్వీస్ రోడ్ వేయాల్సిన అవసరం ఉందంటున్నారు. ప్రధాన రహదారుల పైన కిలో మీటరుకుపైగా దూరం వెళ్లి తిరిగి వెనకకు రావలసి వస్తుందని అంటున్నారు. ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు, ప్రైవేటు వాహనదారులు, వ్యక్తిగత వాహనదారులు ఈ నిబంధనలను స్వాగతిస్తునే వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

పాయింట్ల ఆధారంగా చిన్న చిన్న పొరపాట్లకు లైసెన్సులను రద్దు చేసిన పక్షంలో వాహనదారులు ఇబ్బంది పడవలసి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న తప్పులకే పాయింట్లు వేసి లైసెన్సు రద్దు చేస్తామనడం సహేతుకమైన అలోచన కాదంటున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమీషనరేట్ల పరిధిలో రహదారులు ఎక్కడ కూడా సరిగా లేవని, వర్షాల వల్ల వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఉండిపోవలసి వస్తుందని అంటున్నారు. రోడ్లన్ని బాగుంటే ట్రాఫిక్ జామ్‌లు ఎందుకుంటాయని ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు ట్రాఫిక్ ఉల్లంఘనలను నివారించేవిగా ఉండాలి కాని వాహనదారులను ఇబ్బంది పెట్టేవిగా ఉండరాదని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సరి కొత్త పాయింట్ల విధానాన్ని మరో సారి ఆలోచించి అమలు పర్చడం ఉత్తమం అనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

చొరబాటు భగ్నం



(మొదటి పేజీ తరువాయి)

మోచిల్ సెక్టర్‌లో మట్టుబెట్టాయి. చొరబాటు యత్నిస్తున్న ఉగ్రవాదులు మోచిల్ సెక్టర్ లో ఉన్నట్లు గుర్తించిన భద్రతా దళాలు ఆదివారం సాయంత్రం నుంచి జాయింట్ ఆపరేషన్ ప్రారంభించాయి. కొన్ని గంటల పాటు శ్రమించిన భద్రతా దళాలు ఐదుగురు ఉగ్రవాదులను హతమార్చాయి. భద్రతా బలగాలు కాల్పుల దాటికి తట్టుకోలేక కొందరు ఉగ్రవాదులు తప్పించుకుని తోకముడిచారు. ఉగ్రవాదుల కోసం నియంత్రణ రేఖ వెంబడి గాలింపు కొనసాగుతూనే ఉంది. కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతనెల 23 తేదీన కూడా పుల్వామా జిల్లాలోనే ఇదే ప్రాంతం నుంచి భారత్‌లోకి చొరబడేందుకు ఉగ్రవాదులు యత్నించారు. అప్పట్లో వారి యత్నాలను భగ్నం చేసిన భద్రతా దళాలు..ఆ ప్రాంతంలో నిఘా పెంచాయి. ఈ ఏడాది నియంత్రణ రేఖ దాటి భారత్‌లో చొరబాటు యత్నించిన 40 మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఈ సంవత్సరం 22 సార్లు చొరబాట్లు జరిగినట్లు అధికారులు తెలిపారు.

కశ్మీర్‌లో లష్కరీ తోయిబా ఉగ్రవాది హతం

శ్రీనగర్ః కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో భద్రతాదళాలు లష్కరీ తోయిబాకు చెందిన ఓ ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. పుల్వామాలోని సంబూర ప్రాంతంలో మిలిటెంట్లు ఉన్నట్లు సమాచారం రావడంతో ఆదివారం సాయంత్రం నుంచే వారి ఏరివేతకు ఆపరేషన్‌ప్రారంభించిన భద్రతా దళాలు... ఎదురు కాల్పుల్లో ఓ ఉగ్రవాదిని హతమార్చారు. చనిపోయిన వ్యక్తి లష్కరీ తోయిబా ఉగ్రవాది ఉమర్‌గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఉమర్ వివిధ నేరాల్లో నిందితుడిగా ఉన్నాడని.. అబు ఇస్మాయిల్ సంస్థ ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి నుంచి ఏకే47 రైఫిల్ ను స్వాధీనం చేసుకున్నారు. భద్రతా దళాల ఎదురుకాల్పుల నుంచి మరో ఇద్దరు ఉగ్రవాదులు తప్పించుకుని పారిపోయినట్లు నిఘా వర్గాలు తెలిపాయి.

ప్రధానికి రాఖీ కట్టిన తెలంగాణ అంధులు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణాకు చెందిన అంధులు ఢిల్లీలోప్రధాన మంత్రితో రక్షా బంధన్ వేడుకలు జరుపుకున్నారు.నల్గొండ జిల్లా అంధ పాఠశాల నిర్వాహకులు నరేంద్ర మోదీ నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. తెలంగాణా ఉద్యోగుల కౌన్సిల్ కోశాధికారి కర్నాటి విజయ్ కుమార్, జనరల్ సెక్రటరీ చొక్కారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్వరలో తెలంగాణకు చిన్ననోట్లు

- రూ. 100, రూ. 500 నోట్ల సరఫరాకు ఆర్బీఐ అంగీకారం
- రాష్ట్రంలో తీరనున్న చిన్ననోట్ల సమస్య



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రానికి రూ. 2000ల ముఖ విలువ కలిగిన పెద్ద నోట్ల సరఫరాను నిలిపివేయాలని భారతీయ రిజర్వు బ్యాంక్ నిర్ణయించింది. ప్రభుత్వం పదే పదే కోరిన మీదట రూ. 500లు, రూ. 100 ముఖ విలువ కలిగిన నోట్లను ఎక్కువ మొత్తంలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటుంది. పెద్ద నోట్లను రద్దు చేసిన తర్వాత తెలంగాణలో చిన్న నోట్ల సమస్య తీవ్రమైంది. ఆర్‌బిఐ తెలంగాణకు విడుదల చేసిన మొత్తంలో 90 శాతానికి పైగా రూ. 2000ల ముఖ విలువ కలిగిన నోట్లనే విడుదల చేయడంతో చిన్న నోట్ల సమస్య తీవ్రమైంది. చిన్న నోట్ల సమస్య గ్రామాల్లో మరింత జఠిలమైంది. సామాన్యులు, రైతులు, ఉపాధి కూలీలు చిల్లర సమస్యతో సతమతమయ్యారు. దాదాపు ఐదు మాసాల క్రితమే రూ. 2000ల ముఖ విలువ కలిగిన పెద్ద నోట్ల ముద్రణను రిజర్వు బ్యాంకు నిలిపివేసినట్టు తెలిసింది. అప్పటికే ముద్రించబడిన నోట్లను ఏప్రిల్ వరకు వివిధ రాష్ట్రాలకు పంపిణీ చేశారు. దీంతో చిన్న నోట్ల సమస్య తీవ్రతరమైంది. రూ. 2000ల విలువగల నోట్లు అధికం కావడం, రూ. 20, రూ. 50, రూ. 100లు, రూ. 500ల నోట్లు పెద్దగా చలామణిలో లేకపోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది కలిగింది.

తెలంగాణకు పంపిణీ చేసిన నగదులో రూ. 2000ల ముఖ విలువ కలిగిన నోట్లు అధికం కావడంతో మార్కెట్ వర్గాలు ఆందోళనకు గురి కావలసి వచ్చింది. క్రయ విక్రయాల పై చిన్న నోట్ల కొరత తీవ్రంగా కనిపించింది. గ్రామాలు, పట్టణాలు, ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులో లేని ప్రాంతాల్లో నగదు మార్పిడి పెను సమస్యగా మారింది. ప్రభుత్వం అనేక సందర్భాల్లో బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో ఉత్పన్నమవుతున్న నగదు సమస్యను ఆర్‌బిఐ దృష్టికి తెచ్చింది. ఆర్‌బికికి లేఖలు కూడా రాసింది. కేంద్రం పై ఒత్తిడి పెంచింది. ప్రతి చిన్న కొనుగోలు నగదు రహితం అనే ఆలోచన ఫలించక పోవడం, ఆచరణలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవడంతో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ఆర్‌బిఐతో పాటు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. చిరు కొనుగోళ్లు నగదు రహితం సాధ్యం కాదనే వాస్తవాలను ఆర్‌బిఐతో పాటు కేంద్రం గుర్తించి చిన్న నోట్లను అధికంగా అందుబాటులోకి తేవాలని కోరారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడానికి, సామాన్యులు నిత్యావసరాలను కొనేందుకు పడిన ఇబ్బందులను బ్యాంకర్లకు వివరించారు. బ్యాంకుల ముందు రైతులు నగదు కోసం బారులు తీరి నిలుచున్న ఫోటోలను ఆర్‌బిఐకి పంపించారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ఆర్‌బిఐ రూ. 2000ల ముఖ విలువ కలిగిన నోట్ల సరఫరాను తగ్గించడం జరుగుతుంది. గత రెండు మాసాలుగా ఈ ప్రక్రియను ఆచరించి రూ. 100, రూ. 500ల ముఖ విలువ కలిగిన నోట్లను అధికంగా సరఫరా చేస్తున్నారు. రూ. 2000ల ముఖ విలువ కలిగిన నోట్లను ఆగస్టు నుండి పూరిగా నిలిపివేయడానికి ఆర్బీఐ అంగీకరించింది. ఈ సంవత్సరం జనవరి నుండి మే వరకు ఆర్‌బిఐ తెలంగాణకు రూ. 40,000 కోట్ల విలువైన నోట్లను సరఫరా చేసింది. అందులో రూ. 2000ల ముఖ విలువ కలిగిన పెద్ద నోట్లు 90 శాతం వరకు ఉన్నాయి. జూన్‌లో రూ. 20,000 కోట్ల కరెన్సీ తెలంగాణ బ్యాంకులకు ఆర్‌బిఐ నుండి చేరింది. అందులో 90 శాతం వరకు రూ. 500లు, రూ. 100ల ముఖ విలువ కలిగిన నోట్లు కాగా 10 శాతం మాత్రమే రూ. 2000ల ముఖ విలువ కలిగిన నోట్లు సరపరా చేశారు. ఇక మీదట రూ. 2000ల విలువ కలిగిన నోట్లను సరఫరా చేయబోరని, చిన్న నోట్లనే అధికంగా సరఫరా చేసే అవకాశం ఉందని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. త్వరలోనే రూ. 200ల ముఖ విలువ కలిగిన కొత్త నోటును ఆర్‌బిఐ విడుదల చేయబోతుంది. రూ. 2000ల విలువ కలిగిన నోట్ల కంటే కూడా రూ. 200లు, రూ. 500ల ముఖ విలువ కలిగిన నోట్లను అత్యధికంగా చలామణిలో ఉండే విధంగా చర్యలు తీసుకోబోతున్నట్లుగా తెలిసింది.

హస్తిన ప్రజావాణిలో ఫాతిమా బాధితులు


న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి మొదటి వారమే మంచి స్పందన లభించింది. అయితే అందరూ ఊహించినట్టు ఢిల్లీలో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్ వాసుల కంటే తమ సమస్య పరిష్కారం కోసం హస్తినబాట పట్టిన కడప జిల్లా ఫాతిమా మెడికల్ కాలేజి విద్యార్థులే ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. దేశ రాజధానిలో నివాసముంటున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు వారి సామాజిక, ఆర్థిక సమస్యలు, వారి స్వగ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి 'జన్మభూమి మా ఊరు' పేరుతో ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ప్రవీణ్ ప్రకాష్ రెసిడెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలవుతున్నట్టుగా ఢిల్లీలోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని భావించారు. ప్రతి సోమవారం సాయంత్రం 5-6 నుంచి గంటల మధ్య సమయాన్ని ఇందుకు కేటాయించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలు, విజ్ఞాపనలను ఆంధ్రప్రదేశ్‌లోని సంబంధిత శాఖాధిపతుల ద్వారా పరిష్కరించేందుకు ఇక్కడి అధికారులు కృషి చేస్తారు. అయితే తొలి ప్రజావాణి కార్యక్రమానికి ఫాతిమా కాలేజి బాధిత విద్యార్థులు క్యూ కట్టారు. విద్యార్థులంతా కలిసి తమ సమస్యల్ని వినతి పత్రం రూపంలో వివరిస్తూ రెసిడెంట్ కమిషనర్‌కు అందజేశారు. వీరితో పాటు ఢిల్లీలో నివాసముంటున్న కృష్ణా జిల్లా పెడనకు చెందిన బట్టు శ్యామల కుమారి తాను నిరుద్యోగినని, తనకు ఉపాధి మార్గం చూపాలని కోరుతూ ఓ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఢిల్లీలో నివాసముంటున్నఆంధ్రా వారు నేరుగా గానీ 01123382031 / 9871115754 ఫోన్ నంబర్ల ద్వారా గానీ తమ సమస్యను రెసిడెంట్ కమిషనర్ దృష్టికి తీసుకు రావచ్చని తెలిపారు. ఇక్కడి వివిధ తెలుగు అసోసియేషన్ల వారూ 'జన్మభూమి మా ఊరు' కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పాడునందించాలని ప్రవీణ్ ప్రకాష్ కోరారు.

నేరం రుజువు కాకముందే క్షమాపణలు చెప్పడం ఏంటి?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : డ్రగ్స్ కేసు విచారణ సమయంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫిల్మ్ ఛాంబర్ రాసిన లేఖపై డైరెక్టర్ రాంగోపాల్ వర్మ స్పందించారు. నేరం రుజువు కాకుండానే ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పడంలో అర్థం లేదన్నారు. సినీ పరిశ్రమ నిజంగా సిగ్గుపడాల్సిన విషయం డ్రగ్ స్కాండల్ కాదని, దానికి సంబంధించి ఫిల్మ్ చాంబర్ రాసిన బహిరంగ లేఖ ద్వారానే తెలుగు సినిమా పరిశ్రమకు తలవంపులు తెచ్చే విధంగా మారిందని ఆయన ఘాటుగా పేర్కొన్నారు. ఫిల్మ్ చాంబర్ రాసిన లేఖకు బదులుగా రాంగోపాల్ వర్మ సోమవారం బహిరంగ లేఖ రాశారు. ఇందులో ఫిల్మ్ ఛాంబర్ చర్యలపై ఆయన తీవ్ర స్థాయిలో అసంతృప్తి, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. డ్రగ్స్ కేసులో నోటీసులు అందుకుని విచారణకు హాజరైన వారిలో ఏ ఒక్కరూ కూడా తాము తప్పు చేశామని బహిరంగంగా చెప్పడంకానీ, వారిలో ఫలానా వారు తప్పు చేసినట్లుగా అధికారులు సైతం ఇప్పటి వరకు నిరూపించలేకపోయారన్నారు. ఈ రెండు జరగనప్పుడు మరి ఫిల్మ్ ఛాంబర్ ఎందుకు క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. పైగా రాసిన క్షమాపణ లేఖలో అతికొద్దిమంది చేసిన పొరపాట్లకు ఒక పరిశ్రమ తలవంచుకోవాల్సిన పరిస్థితి రావడం చాలా బాధకరమని పేర్కొనడాన్ని వర్మ అభ్యంతరం వ్యక్తం చేశారు. సినిమా పరిశ్రమలో ఎవరైన పొరపాట్లు చేసినట్లుగా ఛాంబర్‌కు ఎవరైనా చెప్పారా? అని ప్రశ్నించారు.

మెదక్ జిల్లాలో గంజాయి పంట ధ్వంసం



రామాయంపేట రూరల్, కెఎన్ఎన్ : గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్న రైతు పొలంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్న సంఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. రామాయంపేట ఎక్సైజ్ సిఐ రాధాకిషన్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామంలో కుంట సిద్దయ్య అనే రైతు తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నాడు. తనకు గంజాయి తాగే అలవాటు ఉన్నందునే సాగు చేస్తున్నానని రైతు సిద్దయ్య విలేకరులకు తెలిపారు. సిద్దయ్య ఇంట్లో సోదాలు చేయగా సుమారు 500 గ్రాముల గంజాయి, 150 గ్రాముల గంజాయి విత్తనం లభించినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు. అలాగే వ్యవసాయ క్షేత్రంలో తనఖీ చేయగా పసుపు, బంతి తోటలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. సుమారు 450 నుండి 500 గంజాయి మొక్కలను గుర్తించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.3-4 లక్షల వరకు ఉంటుందని వివరించారు. సిద్దయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ యాదగిరి, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు. ఇలావుండగా తాను 40 ఏళ్లుగా గంజాయి సాగు చేస్తున్నట్లు సిద్దయ్య తెలపడం విశేషం.

కుంతియాతో పొన్నాల, దాసోజ్ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ డాక్టర్ రామచంద్ర కుంతియాను పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, రాజ్యసభ సభ్యుడు ఎంఏ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్‌కుమార్ సోమవారం ఢిల్లీలో కలిశారు. రాష్ట్ర ఇంచార్జి అయిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ పరిస్థితిని కుంతియాకు పొన్నాల వివరించారు. జీఎస్టీ విషయంలో కేసీఆర్ ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నారని, రాష్ట్రానికి కేసీఆర్ వ్యూహాత్మక ద్రోహం చేస్తున్నారని వివరించినట్లు పొన్నాల తెలిపారు. మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ఆమరణ దీక్ష విషయమై కుంతియా ఆరాతీశారు. ఆయనకు పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ నుంచే ఫోన్‌లో దీక్షలో ఉన్న పొన్నం ప్రభాకర్‌తో కుంతియా మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

తుగ్లక్‌ని తలపిస్తున్న కేసీఆర్: దాసోజు

ముఖ్యమంత్రి కేసీఆర్ పూటకోమాట మాట్లాడుతూ పిచ్చి తుగ్లక్ మాదిరిగా వ్యవహరిస్తున్నారని దాసోజు శ్రవణ్‌కుమార్ విమర్శించారు. దేశ అధ్యక్ష,ఉపాధ్యక్ష పదవులకు బీజేపీ అభ్యర్థులకు భేషరతుగా మద్దతు ప్రకటించి జీఎస్టీపేర ఇప్పుడు డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో కుంతియాతో భేటీ అయిన తర్వాత దాసోజు విలేఖరులతో మాట్లాడారు. జీఎస్టీ సమావేశంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ తన నిరసనను సమావేశంలోనే ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేయించలేని కేటీఆర్‌కు చేనేత సంబురాలు నిర్వహించడం మోసమని అభివర్ణించారు.

నామినేషన్ల పరిశీలనలో తీవ్ర ఉత్కంఠ

- అధికార, ప్రతిపక్షాల ఫిర్యాదులు
- శిల్పా నోటరీ చెల్లదన్న టీడీపీ
- భూమా రిటర్న్ సరిగ్గా లేవన్న వైకాపా
- నంద్యాలలో హైడ్రామా... ఉద్రిక్తత
- అంతా ఓకే అన్న అధికారులు
- 24 నామినేషన్లు సక్రమం



కర్నూలు, కెఎన్ఎన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్వవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నంద్యాల ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన సోమవారం ఉత్కంఠ మధ్య ముగిసింది. అధికార, ప్రతిపక్షాలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులతో ఒక్కసారిగా టెన్షన్‌కు గురి చేసింది. మొదట్లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్ల తిరస్కరణకు గురైందన్న వార్త గుప్పుమనడంతో ఆ వర్గంలో ఒక్కసారిగా అలజడి రేగింది. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి నామినేషన్ల పత్రాల్లో ఇన్‌కంటాక్స్ పత్రాలు సరిగ్గా లేవని వైసీపీ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసింది.

ముందుగా వైఎస్ఆర్‌సీపీ నుండి ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్ పత్రంలో నోటరీ రాంతులసీరెడ్డి సంతకంపై టిడిపి నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. రామతులసీరెడ్డి నోటరీ లైసెన్సు గడువు 2013లోనే ముగిసిందని ఫిర్యాదు చేశారు. లైసెన్సు గడువు ముగిసినా నోటరీ సంతకం చెల్లనేరదని అభ్యంతరం వ్యక్తం చేశారు. శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్ పత్రాన్ని రద్దుచేయాలని టీడీపీ నేతలు ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో వైఎస్ఆర్‌సిపి నేతలు టీడీపీ చేసిన ఆరోపణలు, ఆక్షేపణలపై నిరసనలు వ్యక్తం చేశారు. అధికార దుర్వినియోగానికి అధికార పార్టీ కుట్ర పన్నుతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కావాలనే శిల్పా నామినేషన్ పత్రంపై వివాదం చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి 2013 నుండి నోటరీ లైసెన్సు రెన్యువల్స్‌ను ప్రభుత్వం నిలపివేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏ న్యాయవాదికి కూడా నోటరీ లైసెన్సులను రెన్యువల్ చేయలేదని తెలిపారు. ఈ విషయంపై న్యాయవాదులే కోర్టులో ఫిర్యాదు చేశారని చెప్పారు. ప్రస్తుతం ఆ విషయం కోర్టు పరిధిలో ఉన్నందున ఎలాంటి సమస్య లేదని వైఎస్ఆర్‌సిపి నాయకులు ఎన్నికల అధికారులకు తెలిపారు.

ఇదిలా ఉండగా శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్ పత్రం సమస్యపై బయటికి ప్రచారం పొక్కడంతో నంద్యాల పట్టణంలో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు రెండు గంటల పాటు శిల్పా నామినేషన్ పత్రాలపై హైడ్రామా చోటుచేసుకుంది. చివరకు అన్ని పత్రాలను పరిశీలించిన ఎన్నికల సంఘం అధికారులు వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్ పత్రాలను ఓకే చేశారు. నామినేషన్ పత్రంలో అన్ని కరెక్టుగానే ఉన్నాయని అధికారులు స్పష్టం చేయడంతో వివాదం సద్దుమణిగింది.

మరోవైపు టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తమ నామినేషన్ పత్రంలో ఐటి రిటర్న్ దాఖలు చేయలేదని ఎన్నికల అధికారులకు వైఎస్ఆర్‌సిపి నాయకులు ఫిర్యాదు చేశారు. అయితే, ఆయన నామినేషన్ కూడా సక్రమంగానే ఉన్నట్లు ప్రకటించారు.

మొత్తం 48 నామినేషన్లు దాఖలు కాగా, 30 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీటిలో ఆరుగురి అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. టీడీపీ నుంచి డమ్మీ అభ్యర్థి భూమా మౌనికా రెడ్డి, వైఎస్ఆర్‌పీ నుంచి రవిచంద్రకిశోర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి చాకలి పుల్లయ్య, సుదర్శన్‌రెడ్డి, ఎంఐఎం నుంచి నారాయణరెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థి రామరాజు నామినేషన్లను తిరస్కరించారు.

దీంతో మొత్తం 24 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఉప ఎన్నికల్లో 2వ ఘట్టమైన నామినేషన్ల పరిశీలన పూర్తి అయింది. అధి కార ప్రతిపక్షాల ఫిర్యాదులతో ఒక్కసారిగా ఇరువర్గా లకు చెందిన ముఖ్య నాయకులు ఆర్వో కార్యాలయ ఆవ రణకు చేరుకున్నారు. అప్పటికే ఆర్వో ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలన సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. అక్కడ పరిశీలన సాగుతున్న సమయంలో ఇరుపార్టీల అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారన్న సమాచారం బయటకు రావడంతో ఇరువర్గాల్లో ఉత్కంఠకు తెర లేపింది. చివరకు ఇద్దరు అభ్యర్థుల నామినేష న్లకు అధికారులు ఆమోద ముద్ర వేయడంతో ఊపిరిపీల్చుకున్నారు.

కరువుపై ఏపీ సీఎం నిర్లక్ష్యం: వైకాపా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావ దుర్భిక్షంతో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ దుర్భిక్షాంధ్రగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రైతులకు ఉపయోగపడే ఒక్క ఆలోచన కూడా చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయమే తెలియని వ్యక్తిని వ్యవసాయశాఖ మంత్రిని చేశారన్నారు. ఆ మంత్రికి ప్రతిపక్షనేత జగన్‌ను తిట్టడమే పనిగా మారిందన్నారు. రాష్ట్రంలో రెయిన్‌గన్‌లతో కరువును పారద్రోలామని ప్రగల్బాలు పలుకుతున్న చంద్రబాబు ఇపుడు ఆ రెయిన్‌గన్‌లను ఎక్కడ పెట్టారని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే రాయలసీమ ప్రాంతం అత్యంత దుర్భిక్షప్రాంతంగా మారిపోయిందన్నారు.

కరీంనగర్ నుంచే కేసీఆర్ పతనం


- ఆయనవన్నీ అబద్ధపు మాటలు
- నాడు మీరాకుమార్‌ను ప్రాధేయపడింది ఎంపీ కవిత కాదా?: పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కరీంనగర్, కెఎన్ఎన్ : టీఆర్ఎస్, కేసీఆర్‌ల రాజకీయ చరిత్ర కరీంనగర్ నుండే ప్రారంభమైందని, కరీంనగర్ నుంచే కేసీఆర్ పతనం ప్రారంభమవుతుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మెడికల్ కళాశాల కోసం మూడు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మాజీ ఎంపి, టీపీపీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్‌కు సోమవారం ఉత్తమ్ కుమార్ రెడ్డి సంఘీభావం ప్రకటించి సంపూర్ణ మద్దతు పలికారు. ఈ సందర్భంగా దీక్షశిబిరం వద్ద మాట్లాడుతూ కేసీఆర్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని పొన్నం ప్రభాకర్ దీక్ష చేస్తున్నారని, ఈ దీక్షకు ఆటంకాలు కల్పించడమే కాకుండా పాఠశాల, కళాశాల యాజమాన్యాలను విద్యార్థులు సంఘీభావం తెలుపకుండా పోలీసులచేత బెదిరింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను ప్రజలు తరిమి కొడతారని, అది కరీంనగర్ నుంచే నాంది పలుకుతుందని, 2019లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, కరీంనగర్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేస్తుందని స్పష్టం చేశారు. విద్యుత్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలపై కోర్టు స్టే ఇస్తే కాంగ్రెస్ కారణమని ఆరోపణలు చేస్తున్నారని, నిజానికి సింగరేణి డిపెండెంట్ల విషయంలో కోర్టును ఆశ్ర యించింది తెలంగాణ జాగృతికి చెందిన వ్యక్తి కాదా అని ఆయన నిలదీశారు. తాను ఉప రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఢిల్లీలో మీరాకుమార్‌ను కలిసి సీఎం కేసీఆర్ వ్యాఖ్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఆమరణ దీక్ష సమయంలో డిసెంబర్ 7, 2009న కేసీఆర్ కూతురు కవిత మీరా కుమార్‌కు ఫోన్ చేసి తన తండ్రి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు, తెలంగాణ పై నిర్ణయం తీసుకోమని వేడుకుందని, మీరాకుమార్ వెంటనే అప్పటి హోం మంత్రి చిదంబరంకు విషయాన్ని చెప్పారని, ఇది నిజం కాదా అవునా కవిత చెప్పాలన్నారు. సమావేశంలో షబ్బీర్‌అలీ, కటకం మృత్యుంజయం టి. జీవన్ రెడ్డి, తదితరులున్నారు.

గాంధీ పేరుతో కాంగ్రెస్ మనలేదా?

- నెహ్రూ కుటుంబానికే పార్టీ అవసరమా?
- పార్టీకి వారేమీ చేయలేరా?
- వరుస ఓటములతో రాహుల్ నాయకత్వంపై అనుమానాలు



న్యూఢిల్లీ: భారత దేశంలో నెహ్రూ కుటుంబానికి, గాంధీ పేరుకు ప్రాధాన్యం తగ్గిపోయిందా? నెహ్రూ-గాంధీ కుటుంబం ఇక ఎంత మాత్రమూ కాంగ్రెస్‌కు నాయకత్వం వహించలేని స్థితిలో ఉందా? ఆ కుటుంబాన్ని వదిలించుకుంటేనే కాంగ్రెస్‌కు మోక్షమా? అవుననే అంటున్నారు కొందరు విశ్లేషకులు. అందుకు తార్కాణంగా ఉపరాష్ట్రపతి పదవికి కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ బలపర్చిన మహాత్మా గాంధీ మనుమడు గోపాలకృష్ణగాంధీ ఓటమినే పేర్కొంటున్నారు. గాంధీ రక్తసంబంధాన్ని కూడా లెక్కచేయకుండా వెంకయ్యనాయుడిని పార్లమెంటు సభ్యులు గెలిపించారు. గోపాలకృష్ణగాంధీ గెలవకపోయినా, క్రాస్ ఓటింగ్ జరిగి వెంకయ్యకు పడాల్సిన ఎన్డీయే ఓట్లలో కొన్ని గోపాలకృష్ణగాంధీకి పడితే అది తమ నైతిక విజయంగా కాంగ్రెస్ భావించేది. అది జరగకపోగా, యూపీఏ ఓట్లే కొన్ని వెంకయ్యకు పడడంతో గాంధీ పేరుకున్న విలువ ప్రశ్నార్థకమైంది. దీంతో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, స్పీకర్ పోస్టులను బీజేపీ సంబంధిత వ్యక్తులు కైవసం చేసుకున్నట్లైంది. దీంతో కాంగ్రెస్ పరిస్థితి నామమాత్రమైంది. పైగా కాంగ్రెస్‌లో సంక్షోభం చెలరేగి అగ్రనాయకత్వానికే సవాల్‌గా తయారైంది. ఈ సంక్షోభాన్ని డీల్ చేయడంలో జవహర్‌లాల్ నెహ్రూ మునిమనవడు రాహుల్‌గాంధీ విఫలమవుతున్నారు. ఈయన నాయకత్వంలో కాంగ్రెస్ 2014 పార్లమెంటు ఎన్నికల్లో దారుణమైన ఓటమిని చవిచూసింది. ఆ పార్టీకి దార్శనికత ఉన్న నాయకత్వం కరువయిందని విశ్లేషకుల అంచనా. 2014లో కాంగ్రెస్ ఓటమి వింతకాదని, ఆ పార్టీ దారుణంగా ఓడిపోవడం విచిత్రమని పరిశీలకుల భావన. కనీసం ప్రతిపక్ష హోదా రావడానికి కూడా అవసరమైన సీట్లను సంపాదించలేకపోవడం రాహుల్ నాయకత్వానికి మచ్చేనని అంటున్నారు. దీనికి తోడు రాజ్యసభలో అతి పెద్ద పార్టీగా ఇప్పటి వరకూ ఉన్న కాంగ్రెస్ నుంచి బీజేపీ లాగేసుకుంది. దీనితో ఆ పార్టీ కోసం ఏమీ చేయలేని రాహుల్ నిస్సహాయత మరింత బయటపడింది. వరుస ఓటములతో రాహుల్‌ను పార్టీకి బరువుగా చూసేవారు ఎక్కువయిపోయారు.

దీనికి తోడు ఉత్తరప్రదేశ్‌లో కోలుకోలేకపోవడమే కాక, బీజేపీ అఖండ విజయాన్ని సాధించడం రాహుల్ ప్రతిష్టను మసకబారేలా చేసింది. దీంతో కాంగ్రెస్‌కు ఆ కుటుంబం అవసరమన్న స్థితి నుంచి ఆ కుటుంబానికి కాంగ్రెస్ అవసరమన్న స్థితికి పార్టీ దిగజారింది. రాహుల్‌కు నాయకత్వ లక్షణాలు లేవని భావించే వారు చాలా మంది ఉన్నారు. ఇటీవల బీహార్‌లో నితీష్ను బీజేపీ లాగేసుకోగా, ఆ పరిస్థితిని రాహుల్ నివారించలేకపోయారు. దీంతో నెహ్రూ కుటుంబం మీద ఆధారపడే స్థితి నుంచి కాంగ్రెస్ బయటికి రావాలన్న సూచనలు పెరిగిపోతున్నాయి.



చైనా టైర్లపై యాంటీ డంపింగ్ డ్యూటీ

టన్నుకు 452 డాలర్లు

277.53 డాలర్ల నుంచి 452.33 డాలర్లు

న్యూఢిల్లీ : దేశీయ టైర్ల కంపెనీల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చైనాకు చెందిన కొన్ని రకాల టైర్లపై ఉదాహరణకు న్యూమాటిక్ రేడియల్ టైర్లపై టన్నుకు 452.33 డాలర్ల డంపింగ్ డ్యూటీ విధించే ఆలోచనలో ఉంది. చైనా నుంచి చౌకరకం టైర్లు భారత్ మార్కెట్లో పెద్దెత్తున రావడంతో దేశీయ కంపెనీలు దెబ్బతింటున్నాయని వాణిజ్యమంత్రిత్వశాఖ దర్యాప్తు విభాగం డైరెక్టర్ జనరల్ ఆఫ్ యాంటి డంపింగ్ అండ్ అల్లాయెడ్ డ్యూటీస్ (డీజీఏడీ) గుర్తించింది. అపోలోటైర్స్, జెకె టైర్స్, సియెట్ లిమిటెడ్ తరపున ఆటోమెటివవ్ టైర్స్ మాన్యూఫ్యాక్చరర్స్ అసోసియేషన్ యాంటీ డంపింగ్‌పై దర్యాప్తు చేపట్టి చైనా నుంచి దిగుమతి చేసుకునే చౌకరకం టైర్ల న్యూమెటిక్ రేడియల్ టైర్లు లేదా ట్యూబ్‌లెస్ టైర్ల పై సుంకం విధించవచ్చునని సిఫారసు చేసింది. ఈ టైర్లను బస్సులకు, లారీ, ట్రక్కులకు వినియోగిస్తారు. టన్నుకు సుంకం విధించాలని డీజీఏడి సూచించింది. ఇక ఆర్థికమంత్రిత్వశాఖ సుంకాన్ని విధించాల్సి ఉంటుంది. చైనా నుంచి దిగుమతుల విషయానికి వస్తే ఏడాదికేడాది దిగుమతులు పెరుగుతున్నాయి. 2012-13లో 4,146 టన్నుల నుంచి క్రమంగా 2014-2015 నాటికి 52,092 టన్నులకు ఎగబాకాయి. చైనా టైర్ల దిగుమతుల విషయానికివస్తే 2012-13లో 16.03 శాతం నుంచి 2014-15 నాటికి 81.52 శాతానికి పెరిగిపోయాయి. ప్రపంచంలోని పలు దేశాలు తమ దేశీయ పరిశ్రమలను కాపాడేందుకు యాంటీ డంపింగ్ డ్యూటీ లేదా సుంకాల్ని విధిస్తుంటాయి. భారత్ విషయానికి వస్తే వివిధ దేశాల నుంచి వస్తున్న ఉక్కు, ఫ్యాబ్రిక్స్, (దుస్తులు), రసాయనాలపై సుంకం విధిస్తున్నాయి.

లగ్జరీ కార్ల ధరలకు రెక్కలు

• జీఎస్టిలో 25 శాతం సుంకం పెంపు • కార్ల తయారీ కంపెనీలు గరం గరం..

న్యూఢిల్లీ : విలాసవంతమైన కార్లు, ఎస్‌యూవీ ధరలకు భారీగా పెరిగే అవకాశాలున్నాయి. ఎందుకంటే జీఎస్‌టి కౌన్సిల్ వీటిపై ప్రస్తుతం ఉన్న సుంకం 15 శాతం నుంచి 25 శాతానికి పెంచాలనే ప్రతిపాదనలు చేసిందని ఆర్థికమంత్రిత్వశాఖ సోమవారం నాడు ఒక ప్రకటనలో వెల్లడించింది.

జీఎస్టి కౌన్సిల్ సిఫారసుతో కేంద్రప్రభుత్వంచట్టాన్ని సవరించి 8702, 8703తో పాటు ఎస్‌యూవీలపై ప్రస్తుతం 28 శాతానికి అదనంగా 15 శాతం సుంకాన్ని విధిస్తున్నారు. దీన్ని 25 శాతానికి పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే వాస్తవంగా సుంకాన్ని ఎప్పటి నుంచి పెంచాలనే అంశాన్ని జీఎస్టి కౌన్సిల్ నిర్ణయం తీసుకుంటుందని ఆర్థికమంత్రిత్వశాఖ ప్రకటనలో పేర్కొంది.

ఆగస్టు 5వ తేదీన జరిగిన జీఎస్టి కౌన్సిల్ సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత వాస్తవానికి కార్లపై పన్ను రేటు తగ్గింది.

జీఎస్టి చట్టంలో 8702, 8703లోకి మిడ్ - సెగ్మెంట్, పెద్ద కార్లు, ఎస్‌యూవీలు, పది మంది కంటే ఎక్కువ 13 మంది కంటే తక్కువ ప్రయాణికులను తీసుకువెళ్లే వాహనాలను ఈ విభాగంలోకి వస్తాయి. హైబ్రిడ్ వాహనాలు .. ఇంజిన్ సామర్థ్యం 1500 సీసీ కంటే ఎక్కువ ఉండి, మిడ్ సెగ్మెంట్ హైబ్రిడ్ కార్లు 1500 సీసీ కంటే తక్కువ కేటగిరీలకు చెందిన కార్లు కూడా ఈ విభాగంలోకి వస్తాయి.

వస్తు సేవల పన్ను (జీఎస్టి) ఫిట్‌మెంట్ కమిటి జులై 25వ తేదీన జరిగిన సమావేశంలో జీఎస్టి పరిధిలోకి వచ్చే పలు వస్తువులు, సేవలకు ఎలాంటి పన్ను రేట్లు లెక్కించే బాధ్యతను ఫిట్‌మెంట్ కమిటికి అప్పగించింది. అయితే ఈ ఫిట్‌మింట్ కమిటి జీఎస్టి అమలుకు ముందు వాటితో పోల్చుకుంటే ధరలతో పాటు పన్నులు బాగా తగ్గాయని గుర్తించింది. జీఎస్టి అమల్లోకి రాకముందు మోటార్ వాహనాలపై అత్యధికంగా 52-54.72 శాతం వరకు పన్నులువసూలు చేసేశారు. వాటిలో 2.5 శాతం సీఎస్‌టి (సెంట్రల్ సేల్స్ టాక్స్), ఆక్ట్రాయ్ తదితర వాటిని రుద్దేవారు. ప్రస్తుతం అంటే జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత మోటార్ వాహనాలపై మొత్తం పన్ను 43 శాతంగా తేలింది. ప్రస్తుతం జీఎస్టిలో 28 శాతం వసూలు చేస్తున్నారు. జీఎస్టి కంటేముందు ఉన్న పన్ను స్థాయిలో కొనసాగించాలనుకుంటే అత్యధికంగా 25 శాతం నిర్ణయిస్తేనే జీఎస్టికి ముందు రేటుకు వస్తుందని ఫిట్‌మింట్ కమిటి అభిప్రాయపడింది. అయితే ప్రస్తుతం గరిష్ఠంగా 28శాతంతో పాటు అదనంగా 15 సెస్ విధించడానికి మాత్రమే అవకాశాలున్నాయి.

జులై 1 నుంచి కొత్త జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత ఎస్‌యూవీ ధరలు రూ.1.1 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు తగ్గాయి. కొత్తగా జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత సుమారు డజను పన్నులు ఉదాహరణకు కేంద్ర, రాష్ట్రస్థాయిలో పన్నులు ఎక్సైజ్ డ్యూటీ, సర్వీస్‌టాక్స్, వ్యాట్‌లు మాయం అయ్యాయి. కాగా పెద్ద కార్లపై జీఎస్టిలో 28 శాతం పన్ను వసూలు విధిస్తున్నారు. వాటిలో ఎస్‌యూవీ, మిడ్ సెగ్మెంట్, పెద్ద, హైబ్రిడ్ కార్లు, హైబ్రిడ్ మోటార్ వాహనాలపై అత్యధికంగా 15 శాతం సుంకం విధిస్తున్నారు. చిన్న పెట్రోల్ కార్లు అంటే నాలుగు మీటర్ల కంటే తక్కువ .. 1200 సీసీ కార్లపై 1 శాతం సుంకం విధిస్తున్నారు. కాగా చిన్న డిజిల్ కార్లు నాలుగు మీటర్ల కంటే తక్కువ 1500 సీసీ ఇంజిన్లపై 3 శాతం సుంకం విధిస్తున్నారు. ఇక సుంకం విషయానికి వస్తే కార్లతో పాటు పొగాకు, బొగ్గులపై పెద్దెత్తున విధించి వచ్చిన ఆదాయాన్ని జీఎస్టి అమలు చేయడం వల్ల రాష్ట్రాలు కోల్పోతున్న రెవెన్యూను సర్దుబాటు చేస్తున్నారు. దీని కోసం పార్లమెంటులో చట్టాన్ని కూడా తీసుకొచ్చారు. ప్రస్తుతం సుంకం రేటును మార్చాలి కాబట్టి చట్టసవరణ అవసరం అవుతోంది.

సుంకంపై పెంపుపై కంపెనీలు గరం గరం.. ప్రభుత్వం పెద్దకార్లు, ఎస్‌యూవీపై సుంకాన్ని 25 శాతానికి పెంచాలనే ప్రతిపాదనను కార్ల తయారీ కంపెనీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం మేకిన్ ఇండియాను పెద్దెత్తున ప్రోత్సహిస్తుంది.. తాజా సుంకం పెంపుతో దీనికి గండిపడుతుందని చెబుతున్నాయి. టయోటా కిర్లోస్కర్ మోటార్, మెర్సిడెజ్ బెంజ్, ఆడి, బీఎండబ్ల్యులు ముక్తకంఠంతో సుంకం పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత లగ్జరీకార్ల ధరలు దేశవ్యాప్తంగా చౌక అయ్యాయి. దీంతో ఆటో రంగం జోరందుకుంటుందని ఉత్సాహపడుతుంటే.. తాజాగా సుంకాన్ని తెచ్చి తమ ఉత్సాహంపై నీళ్లు జల్లిందని కంపెనీలు వాపోతున్నాయి. టయోటా కిర్లోస్కర్‌మోటార్ వైస్ చైర్మన్, హోల్‌టైం డైరెక్టర్ శేఖర్ విశ్వనాథన్ దీనిపై స్పందిస్తూ.. కొన్ని కంపెనీలు లబ్ది పొందితే కొన్ని కంపెనీలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో రోలాండ్ ఫోల్గార్ మాట్లాడుతూ ప్రభుత్వం తాజా నిర్ణయం తమను నిరుత్సాహపర్చిందన్నారు. దీంతో దేశంలో లగ్జరీ కార్ల మార్కెట్ వృద్ధికి అడ్డుకట్ట వేసినట్లని ఆయన అన్నారు. మేకిన్ ఇండియాకు ఊతం ఇస్తూ.. పెద్దెత్తున విస్తరించాలన్న తమ ప్రణాళికలపై ఇది ప్రభావం చూపుతుందని ఆయన ఒక ప్రకటనలో అన్నారు. ఇదే అభిప్రాయాన్ని ఆడి ఇండియా హెడ్ రాహిల్ అన్సారీ వ్యక్తం చేశారు. తాజాగా తలెత్తిన పరిస్థితుల దృష్ట్యా తమ ప్రణాళికలు మార్చుకోవాల్సి వస్తుందన్నారు. ఇటీవలే జీఎస్టి లబ్దిని వినియోగదారుడి కంపెనీలు రూ.10 లక్షల వరకు బదలీ చేశాయి. అయితే తిరిగి సుంకం పెంచితే, కంపెనీలు, డీలర్లు, కస్టమర్లు అందరూ డీలాపడతారని అన్సారీ అన్నారు.





బ్రిటానియాకు జీఎస్‌టి సెగ

• క్యూ1 లాభం రూ.216 కోట్లు

న్యూఢిల్లీ : ఎఫ్ఎంసీజీ దిగ్గజం బ్రిటానియా ఇండస్ట్రీస్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభంలో 1.40 శాతం క్షీణించి రూ.216.12 కోట్లు ఆర్జించింది. జీఎస్టి ప్రభావంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో వ్యాపారం మందగించడంతో కంపెనీ నష్టాలను చవిచూసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.219.21 కోట్లు నమోదు చేసినట్లు కంపెనీ బీఎస్ఈకి సమా చారం అందించింది. అమ్మకాల విషయానికి వస్తే 6.41 శాతం పెరిగి రూ.2,300.93 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,162.16 కోట్లని రెవెన్యూను సాధించిందని తెలిపింది. మార్కెట్లో పలు సవాళ్లను ఎదుర్కొన్నా గత త్రైమాసికం సంతృప్తికరంగా ఉందని, జీఎస్టి అమల్లోకి వస్తున్నందున వల్ల సరకు (బిస్కెట్లు) పెద్దగా సరఫరా చేయలేదని కంపెనీ ఎండీ వరణ్ బెర్రి తెలిపారు. అయితే జీఎస్టి ప్రభావం స్వల్పకాలం మాత్రమే ఉంటుందని ఆయన అన్నారు. త్వరలోనే అమ్మకాలు జోరందుకుంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికి వస్తే మధ్యప్రాచ్య దేశాలతో పాటు ఆఫ్రికా దేశాల్లో రాజకీయ అస్థిరత, కరెన్సీ ఒడిదుడుకుల వల్ల వ్యాపారం మందగించిందని ఆయన చెప్పారు. బీఎస్ఈలో దీని షేరు 7.27 శాతం పెరిగి రూ.4,197.80 వద్ద ముగిసింది.

వెల్‌స్పన్ లాభంలో 38 శాతం ఆవిరి

న్యూఢిల్లీ : టెక్స్‌టైల్స్ కంపెనీ వెల్‌స్పన్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 38.39 శాతం క్షీణించి రూ.128.56 కోట్లు ఆర్జించింది. ఆదాయం తగ్గడంతో పాటు ఖర్చులు ఎక్కువగా పెరిగాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ నికరలాభం రూ.208.68 కోట్లని బీఎస్ఈకి కంపెనీ సమాచారం అందించింది. ఆదాయం విషయానికి వస్తే రూ.1552.64 కోట్లు కాగా క్రితం ఏడాది ఇద త్రైమాసికంలో రూ.1644.49 కోట్లని ఆదాయంలో 3.65 శాతం తగ్గిందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ముడి పదార్థాలు పెరిగిపోవడంతో పాటు విద్యుత్ చార్జీల వ్యయంతో పాటు రూపాయి బలపడ్డం కూడా కంపెనీ లాభాలపై ప్రభావం చూపించిందని వెల్‌స్పన్ గ్రూపు చైర్మన్ బీకె గోయెంకా చెప్పారు.

వర్ల్‌పూల్ లాభంలో 8.5 శాతం వృద్ధి

• క్యూ1 లాభం రూ.132.72 కోట్లు

న్యూఢిల్లీ : హోం అప్లియెన్సెస్ తయారీ సంస్థ వర్ల్‌పూల్ ఇండియా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 8.8 శాతం వృద్ధితో రూ.132.72 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.121.95 కోట్లు నమోదు చేసింది. ఆదాయం విషయానికి వస్తే 15.06 శాతంతో రూ.1639.54 కోట్లు కాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1424.85 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది.

ఎం&ఎం చైర్మన్ వేతనంలో 16.38 శాతం పెరుగుదల

• గత ఆర్థికసంవత్సరం రూ.7.67 కోట్లు

న్యూఢిల్లీ : దేశీయ ఆటో దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా చైర్మన్ ఆనంద్ మహీంద్రా గత ఆర్థిక సంవత్సరం రూ.7.67 కోట్ల వేతనం తీసుకున్నారు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 16.38 శాతం వృద్ధి కనిపించింది. కంపెనీ ఉద్యోగుల వేతనాలతో పోల్చుకుంటే 108.27 శాతం పెరిగిందని వార్షిక నివేదికలో పేర్కొంది. అలాగే కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పవన్ గోయెంకా క ూడా గత ఆర్థిక సంవత్సరం రూ.7.39 కోట్ల వేతనం దక్కించుకున్నారు. ఉద్యోగుల వేతనాలతో పోల్చుకుంటే 104.43 శాతం పెరిగింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉద్యోగుల వేతనాలు సరాసరి రూ.7.08 లక్షలుగా ఉన్నాయి. ఇక ఉద్యోగుల వేతనాల విషయానికి వస్తే 0.43 శాతం వృద్ధి కనిపించింది. ఎగ్జిక్యూటివ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వేతనాలు వారి పనితీరును బట్టి ద్రవ్యోల్బణంతో పాటు ఆ రంగానికి చెందిన పరిశ్రమలో ప్రస్తుతం ఉన్న వేతనాల బెంచ్‌మార్కురు పరిగణనలోకి తీసుకుని నిర్ణయిస్తారు. కాగా గ్రూపు సీఎఫ్ఓ వీఎస్ పార్థసారథి రూ.3.52 కోట్లు వేతనం స్వీకరించారు. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 19.74 శాతం వృద్ధిని కనిపంచింది.



జెఎల్ఆర్ జులై అమ్మకాలు 46,074 యూనిట్లు

న్యూఢిల్లీ : టాటామోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జెఎల్ఆర్) జులై అమ్మకాల్లో 3.6 శాతం పెరిగి రూ.46,074 యూనిట్లు విక్రయించింది. చైనాలో అమ్మకాలు 34.4 శాతం పెరిగాయని వాటిలో పెద్ద చక్రాలు కలిగిన జాగ్వార్ ఎక్స్ఎఫ్ఎల్ అమ్మకాలు బాగా పుంజుకున్నాయని, దీంతో పాటు ఎఫ్ - ఫేస్, డిస్కవరీ స్పోర్ట్, రేంజి రోవర్ స్పోర్ట్, ఈవోక్‌లున్నాయి. కొన్ని మార్కెట్లో రిటైల్ అమ్మకాలు తగ్గాయని వాటిలో బ్రిటన్, ఉత్తర అమెరికా, యూరోప్‌లని పేర్కొంది. అయితే చైనాలో మాత్రం అమ్మకాలు పుంజుకున్నాయని పేర్కొంది. జాగ్వార్ బ్రాండ్ రిటైల్ అమ్మకాల విషయానికి వస్తే జులైలో 1.8 శాతం తగ్గి 12,964 యూనిట్లు విక్రయించింది. కంపెనీకిచెందిన ఎక్స్ఈ అమ్మకాలు బాగా తగ్గడమే కారణం. ల్యాండర్ రోవర్ అమ్మకాలు క్రితం ఏడాదితో పోల్చుకుంటే 5.8 శాతం పెరిగి 33,110 యూనిట్లు విక్రయించింది. కొత్త డిస్కవరీతో పాటు డిస్కవరీ స్పోర్ట్, రేంజి రోవర్, కొత్త రేంజి రోవర్ వీలార్ అమ్మకాలు జోరందుకున్నాయి.



మార్కెట్లను ముంచిన ఐటి, టెక్ షేర్లు

• 52 పాయింట్ల పతనం

న్యూఢిల్లీ : స్టాక్ మార్కెట్లో ఐటి, టెక్ రంగానికి చెందిన షేర్లపై మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో మార్కెట్లు నష్టపోయాయి. అయితే మరింత కుంగకుండా టాటాస్టీల్ అడ్డుకుంది. ఎందుకంటే క్యూ1లో మంచి ఫలితాలను ప్రకటిస్తుందన్న అంచనా బాగా పనిచేసింది. బీఎస్ఈ 51.74 పాయింట్ల లాభంతో 32,273.67వద్ద, నిఫ్టీ 9 పాయింట్లు క్షీణించి 10,057.40 వద్ద ముగిసింది. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన సూచిల విషయానికి వస్తే చమురు సహజవాయు సూచి 1.6 శాతం లాభపడగా.. పీఎస్‌యు 1.4 శాతం, రియల్టీ 1.4 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 1.24 శాతం.. దీనికి వ్యతిరేకంగా ఐటీ సూచి 0.94 శాతం, టెక్ 0.83 శాతంనష్టపోయాయి.

బీఎస్ఈలో లాభపడిన టాప్ ఐదు కంపెనీల షేర్లు ఇలా ఉన్నాయి. టాటాస్టీల్ 4.26 శాతం, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 1.85 శాతం, అదానీపోర్ట్స్ 1.59శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 1.28 శాతం, కోల్ ఇండియా 0.84 శాతం కాగా దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన టాప్ 5 షేర్లు ఇలా ఉన్నాయి. ఇన్ఫోసిస్ 1.75 శాతం, ఎన్‌టీపీసీ 1.64 శాతం, డాక్టర్‌రెడ్డీస్ 1.51 శాతం, ఎంఅండ్ఎం 1.34 శాతం, టాటామోటార్స్ 1.07శాతం ఉన్నాయి.ఎన్ఎస్ఈ,బీఎస్ఈలు గత వారం రికార్డు స్థాయికి చేరాయి.

దీనికి కారణం క్యూ1 ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో పాటు ఆర్థిక వ్యవస్థ మెరుగుపడ్డం కారణంగా చెప్పుకోవచ్చు. అయితే ఇక్కడి నుంచి మార్కెట్ మరింత ముందుకు కానీ, వెనక్కి కానీ పోయే అవకాశాలు లేవని, షేర్ల విలువ సాధారణం కంటే చాలా ఎక్కువగా ఉన్నా యని మార్కెట్ నిపుణులు అభాప్రాయాలను వ్యక్తం చేస్తు న్నారు. టాటాస్టీల్ ఫలితాలు మెరుగ్గా ఉంటాయని భావిస్తున్నారు. దీంతో షేరు ధర భారీగా పుంజుకుంది. ఐటి రంగానికి వస్తే ఇన్ఫోసిస్, టీసీఎస్‌లు వరుసగా 1.75%, 0.72 % నష్టపోయాయి.

అమరరాజా బ్యాటరీస్ లాభాలకు భారీ గండి

• క్యూ1లో 99.85 కోట్లు

హైదరాబాద్ : అమరరాజా బ్యాటరీస్ లిమిటెడ్ జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో నికరలాభం రూ.99.85 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదేత్రైమాసికంలో రూ.130.66 కోట్లు ఆర్జించింది. అయితే మొదటి త్రైమాసికంలో రెవెన్యూ పెరిగి రూ.1684.96 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1465.28 కోట్లని ఒక ప్రకటనలో తెలిపింది. మార్చి 31,2017తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి కంపెనీ లాభం రూ.478.49 కోట్లు కాగా మొత్తం ఆదాయం రూ.6030.63 కోట్లు బీఎస్ఈలో దీని షేరు రెండు శాతం పెరిగి రూ.821.75 వద్ద ట్రేడ్ అయ్యింది.

22న బ్యాంకు ఉద్యోగుల సమ్మె

హైదరాబాద్ : యూనైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయు) దేశవ్యాప్తంగా ఈ నెల 22న సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చినట్లు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఐబాక్) ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం చెప్పారు. బ్యాంకుల్లో పెద్దెత్తున తీసుకువస్తున్న సంస్కరణలకు వ్యతిరేకంగా రెండు రోజుల క్రితం సమ్మె నోటీసు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. వేతన సవరణతో పాటు ఇతర అంశాలను వేగవంతం చేయాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)ను యూనియన్ కోరింది. దీంతో పాటు పీఎస్‌యు బ్యాంకుల విలీనం, బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి బకాయిలను రద్దు చేయడాన్ని నిరసిస్తూ సుమారు పది లక్షల మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని వెంకటాచలం తెలిపారు. డిమాండ్ల విషయంలో ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మొండిబకాయిల వసూలుకు పార్లమెంటరీ కమిటి సిఫార్సులను అమలు చేయాలనేది తమ డిమాండ్ అన్నారు.

ఐటిఆర్ ఫైలింగ్స్‌లో 25 శాతం వృద్ధి

• 2.82 కోట్ల ఈ ఫైలింగ్స్

న్యూఢిల్లీ : ఆదాయపు రిటర్న్స్ ఫైలింగ్ 2016-17 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా 25 శాతం పెరిగి 2.82 కోట్ల మంది ఐటీఆర్‌ను దాఖలు చేశారు. పెద్దనోట్ల రద్దు తర్వాత వ్యక్తిగతంగా పన్ను చెల్లింపుదారులు భారీగా పెరిగారని ఐటి శాఖ సోమవారం నాడు తెలిపింది. ఆగస్టు 5వ తేదీ వరకు వ్యక్తిగతంగా ఐటీఆర్ ఫైల్ చేసిన వారి సంఖ్య 25.3 శాతం పెరిగి 2.79 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో 2.22 కోట్ల మంది రిటర్న్స్ ఫైల్ చేశారు. పెద్దనోట్ల రద్దు, ఆపరేషన్ క్లీన్ మనీ తర్వాత ఐటిఆర్ ఫైలింగ్ బాగా పెరిగిందని ఐటిశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఐటిఆర్ ఫైలింగ్‌కు చివరి తేదీ ఆగస్టు 5 వరకు పొడిగించిన విషయం తెలిసిందే.

పది లక్షల పాన్‌కార్డుల రద్దు

న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వం సుమారు పది లక్షల కంటే ఎక్కువ పర్మనెంట్ అకౌంట్ నెంబర్ (పాన్)లను రద్దు చేయడం లేదా డియాక్టివేట్ చేయడమో జరిగింది. నకిలీ పాన్‌కార్డులను పూర్తిగా తొలగించే ఉద్దేశంతో ఈ కార్డులను రద్దు చేసింది. జులై 27 నాటికి మొత్తం 11,44,211 నకిలీ పాన్‌కార్డులను గుర్తించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. ఎవరైనా ఒక వ్యక్తి ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలంటే పాన్ తప్పనిసరి. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ పాన్ నెంబర్‌లను రిజిస్టర్ చేసుకోవడానికి వీల్లేదు. మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం ప్రభుత్వం నకిలీ పాన్‌కార్డులను గుర్తించినట్లు తెలిపింది. అలాగే ఊరు, పేరు లేని వ్యక్తులతో పాటు, తప్పుడు సమాచారం ఇచ్చి కూడా పాన్‌కార్డులను దక్కించుకున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.

మీ పాన్‌కార్డు చలామణిలో ఉందా లేదా ఇలా చూసుకోవాలి?

1. ఇన్‌కంటాక్స్ ఈ-ఫైలింగ్ పోర్టల్‌ను సందర్శించాలి. పోర్టల్ www.incometaxindiaefiling.gov.in
2. హోం పేజీలో 'సర్వీస్' ట్యాబ్ కింది 'నో యువర్ పాన్'పై క్లిక్‌చేయాలి.
3. వెబ్‌సైట్ కొత్త పేజీకి తీసుకువెళుతుంది. అక్కడ మీరు పేరు, లింగం, మతం, పుట్టిన తేదీ, రిజిస్టర్ మొబైల్ నెంబర్‌పై 'సబ్‌మిట్' అనే చోట్ క్లిక్ చేయాలి.
4. ఓటీపీ లేదా వన్ టైమ్ పాస్ వర్డ్ రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు వస్తుంది. ఎంటర్ చేయాలి. వాలిడేట్‌పై క్లిక్ చేయాలి.
5. ఒక వేళ మీ పాన్ వ్యాలిడెట్.. అంటే చెల్లుబాటు అయితే యాక్టివ్ అని రిమార్కు కాలంలో చూపిస్తుంది.

నిర్మలా లాజిస్టిక్స్‌కు.. అశోక్‌లేలాండ్ ట్రక్కుల డెలివరీ

హైదరాబాద్ : అశోక్‌లేలాండ్ ప్రాంతీయ జనరల్ మేనేజర్ దివాకర్ రెడ్డి, మాధవ్‌శర్మ జనరల్ మేనేజర్ ఆటోమొటివ్ మాన్యుఫ్యాక్చర్‌లు సంయుక్తంగా గురు బీఎస్ 4 ప్రమాణాలు కలిగిన ట్రక్కులను నిర్మలా లాజిస్టిక్స్‌కు చెందిన ప్రవీణ్‌రెడ్డితో పాటు ఇతరులకు హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో శనివారం నాడు అందజేశారు. కాగా గురుట్రక్స్‌కు కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఐఈజీఆర్ (ఇంటెలిజెంట్ ఎగ్జాట్ గ్యాస్ రిసర్క్యులేషన్)ను వినియోగించి దేశీయంగా తయారు చేశారు. బీఎస్-4 ఉద్గార నిబంధనలతో పాటు ఐఈజీఆర్ టెక్నాలజీతో ఈ టక్కును ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించారు. ఇంజిన్ సామర్థ్యం 400 హెచ్‌పీ వరకు ఉంటుందని ప్రపంచంలో ఇలాంటి ట్రక్కు ఎక్కడ తయారు చేయాలేదన్నారు. దీంతో పాటు ఈ ట్రక్కు అత్యంత ఇంధన సామర్థ్యం కలిగిన హెచ్ సీరీస్ ఇంజిన్‌ను బిగించారు. 115 హెచ్‌పీతో పాటు ఐఈజీఆర్ టెక్నాలజీని వినియోగిండంతో ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. గురు రెండు వెరియెంట్లలో లభిస్తుంది. ఒకటి 11.9 టీ జీవీడబ్ల్యు, రెండోది 13.1 టీ జీవీడబ్ల్యు అత్యధిక పే లోడ్‌తో పాటు పవర్ స్టీరింగ్, రేడియల్ టైర్లు అదనపు ఫీచర్లు దీంతో పాటు మ్యూజిక్ సిస్టమ్, మొబైల్ చార్జర్, డ్రైవర్ నిద్రించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కాగా అశోక్‌లేలాండ్ అధీకృత డీలర్ ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్. తెలంగాణ, ఏపీలో కలిసి మొత్తం 30 సేల్స్, సర్వీసు సెంటర్‌లున్నాయి.



దుమ్మురేపిన టాటా స్టీల్

• క్యూ1లో రూ.921 కోట్లు

• నాలుగు రేట్లు పెరిగిన లాభం

న్యూఢిల్లీ : టాటాస్టీల్ మొదటి త్రైమాసికం ఫలితాలు దుమ్మురేపాయి. ఏడాది క్రితం కంపెనీ భారీ నష్టాలను చవిచూసింది. కళింగనగర్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి మొదలు కావడంతో పాటు అమ్మకాలు పెరగడంతో కంపెనీ మంచి లాభాలను ఆర్జించగలిగింది.

జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికరలాభం రూ.921 కోట్లు ఆర్జించగా.. సరిగ్గా ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.3,183 కోట్లు నష్టాన్ని ప్రకటించింది. అయితే ఫారెక్స్ దెబ్బకు (డాలర్ మారకంతో రూపాయి ఒడిదుడుకుల) వల్ల కంపెనీకి గరిష్ఠ రుణభారం రూ.4798 కోట్లకు ఎగబాకాయి. కంపెనీ ఏకీకృత ఆదాయం 19 శాతం పెరిగి రూ.31,129 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.26,107 కోట్లని తెలిపింది. దీనికి ప్రధాన కారణం భారత్‌లోని ఉక్కుప్లాంట్‌లలో పూర్తి సామర్థ్యంలో ఉత్పత్తి చేస్తున్నాయి. దీంతో పాటు యూరోప్‌లో కంపెనీని పునర్వ్యవస్థీకరించడం జరిగిందని గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఫైనాన్స్, కార్పొరేట్) కౌశిక్ చట్టర్జీ చెప్పారు. త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే జీఎస్టి అమల్లోకి వస్తున్నందు వల్ల కొంత సరకు మిగిలిపోయి అమ్మకాలు తగ్గాయని వివరించారు. కాగా జూన్ 30 నాటికి కంపెనీ నికర అప్పులు రూ.71,703 కోట్ల టాటాస్టీల్స్ వెల్లడించింది. గతేడాది ఇదే జూన్ త్రైమాసికంలో టాటాస్టీల్ నికరనష్టం రూ.3,296 కోట్లుగా తేలింది. డాలర్ మారకంతో రూపాయి బలపడ్డం కంపెనీకి ఆందోళన కలిగిస్తోందని.. మొత్తానికి భారత్‌లో స్టీల్ మార్కెట్ అనుకూ లంగా ఉందన్నారు. ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో టాటాషేరు ధర 6 సంవత్సరాల గరిష్ఠానికి 4.5 శాతానికి ఎగబాకింది.

ఎవరెడీ ఇండస్ట్రీస్ లాభం రూ.13.56 కోట్లు

న్యూఢిల్లీ : ఎవరెడీ ఇండస్ట్రీస్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభంలో 39.36 శాతం క్షీణించి రూ.13.56 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.22.36 కోట్లు నమోదు చేసిందని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే రూ.357.66 కోట్లకు దిగిరాగా..క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.371.79 కోట్లని, రెవెన్యూలో 3.8శాతం క్షీణించిందని తెలిపింది. జీఎస్టి ప్రభావంతో వ్యాపారం దెబ్బతిందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. జీఎస్టి ప్రభావంతో బ్యాటరీ అమ్మకాలు బాగా తగ్గాయని.. మార్కెట్లో 50 శాతం వాటా బ్యాటరీలదేనని ప్రకటనలో వివరించింది. త్వరలోనే పరిస్థితులు సాధారణస్థితికి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేసింది.

నాగార్జున ఆగ్రికెమ్ ఆదాయం రూ.186 కోట్లు

హైదరాబాద్ : నాగార్జున ఆగ్రికెమ్ లిమిటెడ్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆదాయం రూ.186.56 కోట్లపై పన్ను చెల్లించిన తర్వాత నికరలాభం రూ.1.97 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.182.84 కోట్లపై రూ.2.29 కోట్లు నికరలాభాన్ని ప్రకటించింది. నికరలాభం స్వల్పంగా తగ్గింది. అయితే క్రమంగా ఎగుమతులు పుంజుకుంటున్నాయని తెలిపింది. క్యూ1లో కొత్తకస్టమర్ నుంచి అతి పెద్ద ఆర్డర్ దక్కించుకున్నట్లు పేర్కొంది. జీఎస్టి వల్ల క్యూ1లో కొంత ఇబ్బందులు ఏర్పడ్డా, దేశవ్యాప్తంగా రుతుపవనాలు అనుకూలంగా ఉన్నందు వల్ల గత ఆర్థికసంవత్సరం కంటే ఈ ఆర్థికసంవత్సరం మంచి లాభాలను ఆర్జిస్తామని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది. రెండవ త్రైమాసికంలో కొత్త ప్రొడక్టులను తీసుకొస్తామని తెలిపింది. ఇదిలా ఉండగా కంపెనీ పేరును నాగార్జున ఆగ్రికెమ్ లిమిటెడ్ నుంచి ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌గా పేరుమారుస్తామని, రిజిస్టార్ ఆఫ్ కంపెనీస్ ఆమోదం తెలిపిన వెంటనే పేరు మారుతుందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది.

పారిశుద్ధ్యం పరేషాన్

- ఆటకెక్కిన స్వచ్ఛ్ తెలంగాణ మిషన్ • ఎమ్మెల్యేలు, ఎంపీలు దత్తత గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లకు దిక్కులేదు
- సీఎం ఆదేశాలు భేఖాతరు • పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ
- సెర్ప్, గ్రామీణాభివృద్ధిలపై నెట్టిన వైనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో పారిశుద్ధ్యంపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పెద్దగా దృష్టి కేంద్రీకరించడం లేదు. చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. వర్షాకాలం వచ్చి మూడు నెలల కావస్తున్న కొద్ది పారిశుద్ధ్యంపై పెద్దగా పురోగతి లేదు. దీంతో కేంద్రప్రభుత్వ స్వచ్ఛ్ భారత్ మిషన్ కార్యక్రమం పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసిన స్వచ్ఛభారత్ నిధులను ప్రణాళికబద్ధంగా వినియోగించుకోవడం లేదని తెలిసింది.

రాష్ట్రంలో 30లక్షల మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు గతంలో రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. స్వచ్ఛ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఈ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించింది. మరుగుదొడ్ల నిర్మాణం కోసం యూనిట్ ధరను ప్రభుత్వం పెంచింది. అంతేకాకుండా రాబోయే నాలుగేళ్లల్లో ప్రతి గ్రామాన్ని బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలుగా ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు గతంలో ప్రకటించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అయా నియోజకవర్గాల్లో గ్రామాలను దత్తత తీసుకొని విధంగా వ్యక్తిగత మరుగుదొడ్ల (ఐఎస్ఎల్) నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. గతేడాది గాంధీ జయంతినాటికి మంత్రులు కే తారకరామారావు, తన్నీరు హరీష్‌రావులు తమ నియోజకవర్గాలను బహిరంగ మల విసర్జన లేని నియోజకవర్గాలుగా ప్రకటించారు. ఈ నియోజకవర్గాలను ఆదర్శంగా తీసుకోవాలని సీఎం కేసీఆర్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను పలుమార్లు సూచించిన విషయం తెలిసిందే. కానీ ఇప్పటి వరకూ మంత్రులుగానీ, ఎంపీలుగానీ, ఎమ్మెల్యేలుగానీ పెద్దగా దృష్టికేంద్రీకరించలేదని తెలిసింది. దత్తత గ్రామాలు ఏమైనాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ఎంపిక చేసిన గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టలేదని తెలిసింది. సీఎం ఆదేశాలను కూడా సదరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పెద్దగా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం స్వచ్ఛ్ భారత్ మిషన్‌ను అమలు చేసేందుకు ఒకప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. గ్రామీణ తాగునీటి సరఫరాశాఖకు బాధ్యతలు అప్పగించారు. ఈ విభాగం ద్వారా రాష్ట్రంలో పారిశుద్ధ్య నియంత్రణ కార్యక్రమం చేపట్టాలి. దీంతోపాటు గ్రామీణాభివృద్ధి, తెలంగాణ రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లతో కల్సి సమన్వయంతో పనిచేయాలి. ఎందుకంటే గ్రామీణాభివృద్ధి, సెర్ప్‌లకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణాలను చేపట్టేందుకు ప్రభుత్వం టార్గెట్ ఇచ్చింది. కానీ ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ విభాగం పెద్దగా పట్టించుకోవడం లేదని తెలిసింది. దీంతో ఈ విభాగాన్ని పూర్తిగా గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌కు అప్పగించింది. అయినా కూడా పెద్దగా పురోగతి లేదు. దీంతో స్వచ్ఛ్ భారత్ మిషన్‌పై రాష్ట్రప్రభుత్వం కూడా పెద్దగా దృష్టికేంద్రీకరించడం లేదని తెలుస్తోంది. రాష్ట్రంలో పారిశుద్ధ్యంపై సెర్ప్ కొంతమేరకు పనిచేసిందని తెలిసింది.

మెదక్ జిల్లా తిమ్మాపూర్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో బహిరంగ మలవిసర్జన లేని గ్రామంగా ప్రకటించాయి. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆ గ్రామంలో పారిశుద్ధ్యం నియంత్రణ చేస్తున్నారు. కానీ వచ్చే ఏడాది గాంధీ జయంతినాటికి బహిరంగ మలవిసర్జనలేని రాష్ట్రంగా ప్రకటిస్తామని చెబుతున్న సీఎం కేసీఆర్ కలను అధికారులు సాకారం చేసే పరిస్థితి కనిపించడం లేదు.

బీసీల సమస్యలపై మద్దతివ్వండి

ఆర్జేడీ అధ్యక్షుడు శరద్‌యాదవ్‌కు బీసీవీఎస్ కేంద్ర కమిటి విజ్ఞప్తి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తాము చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించాల్సిందిగా ఆర్‌జేడీ అధ్యక్షుడు శరద్‌యాదవ్‌కు బీసీ విద్యార్థి సంఘం (బీసీవీఎస్) కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆయనకు ఒక వినతి పత్రం సమర్పించింది. ఢిల్లీలో జరిగిన ఓబీసీ జాతీయ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన బీసీవీఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్‌తో పలువురు సంఘం నేతలు శరద్‌యాదవ్‌ను కలిసి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ, ఎంఫిల్, పీహెచ్‌డీ చదివే విద్యార్థులకు రాజీవ్ ఫెల్లోషిప్ ఇవ్వాలని కోరారు. అలాగే బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓట్లువేసే యంత్రాలుగానే వాడుకుంటున్నాయని ఆయున ఆందోళన వ్యక్తం చేశారు. అంతే తప్ప బీసీలకు రాజ్యాధికారంలో ఇప్పటి వరకు అవకాశం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడే బీసీలు రాజకీయంగా ఎదిగేందుకు అవకాశముంటుందన్నారు. తద్వారా ఆయా వర్గాలకు రాజ్యాధికారం లభిస్తుందన్నారు. ఇందుకు అన్ని పార్టీల్లోనీ బీసీ నాయకులంతా ఏకతాటిపైకి వచ్చి కృషి చేయాలని విక్రమ్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. రాజ్యసభలో బీసీ బిల్లు పెట్టినప్పుడు మద్దతు పలకాల్సిన అవసరముందన్నారు. కానీ రాజ్యసభలో బీసీ బిల్లు పెట్టినప్పుడు భాజపాకు చెందిన ముప్పై మంది సభ్యులు సభలో లేకపోవడం అత్యంత బాధాకరమని విక్రమ్‌గౌడ్ వ్యాఖ్యానించారు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ప్రధానమంత్రిగా కొనసాగుతున్నప్పటికీ బీసీల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆయన వాపోయారు. ఈ కార్యక్రమంలో జాజుల లింగంగౌడ్, ఇంద్రం ఎల్లం,పృథ్వీ, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీలే శాశ్వతం

కేసీఆర్‌కు నారాయణ కౌంటర్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బీజేపీ తమ రాజ్యసభ సభ్యులను గెలిపించుకునేందుకు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. తమకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్రాలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ''కేరళలోమాత్రమే దాడులు జరుగుతున్నాయా? మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో జరగడం లేదా..? అని ప్రశ్నించారు. పథకం ప్రకారం కేరళలో అల్లర్లు సృష్టించి ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారంటూ నారాయణ ఆరోపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు తీరును తప్పుబట్టారు. తానేపెద్ద కమ్యూనిస్టునని, కమ్యూనిస్టు ఎజెండానే తాను అమలు చేస్తున్నానని గర్వంగా చెప్పుకుంటున్న కేసీఆర్, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కాలం చెల్లిందంటూ పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యానాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ''ఎన్నో రాజకీయ పార్టీలు పుట్టుకొచ్చాయి, తర్వాత కాలగర్భంలోనూ కలిసిపోయిన రాజకీయ పార్టీలున్నాయి. కానీ కమ్యూనిస్టులు ఎప్పటికీ ఉన్నారు. భవిష్యత్తులోనూ ఉంటారు. రోజురోజుకీ ఎర్రజెండా ఇంకా ఎరుపుకెక్కుతోంది తప్ప తగ్గదన్నారు. సిరిసిల్ల ఇసుక మాఫియా అరాచకాలపైనా నారాయణ దుమ్మెత్తిపోశారు.

జాతీయ స్థాయిలో గీతం విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నగరంలోని గీతం విశ్వవిద్యాలయం విద్యార్థులు వర్చువల్ బాజా ఎస్ఏఈ ఇండియా-2017 జాతీయ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి తమ ప్రతిభను చాటారు. పంజాబ్‌రాష్ట్రం, పటియాలలోని చిత్కార విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన పోటీలలో ఈ ఘనత సాధించినట్లు గీతం ప్రోవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శివప్రసాద్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి తొలి రౌండ్ పోటీలలో ట్రైటెండ్ పేరిట జట్టుగా ఏర్పడిన గీతం విద్యార్థులు మొత్తం 200 మార్కులకుగానూ 167.8 పాయింట్లు సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

తెలంగాణలో విత్తనోత్పత్తులు భేష్

బంగ్లాదేశ్ అధికార బృందం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో విత్తనోత్పత్తులకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం అని బంగ్లాదేశ్ అధికార ప్రతినిధి బృందం పేర్కొంది. బంగ్లాదేశ్ వ్యవసాయ మంత్రిత్వశాఖ నుంచి ఖాజీ జహంగీర్ కబీర్ నేతృత్వంలోని విత్తన ధృవీకరణ సంస్థల అధికారుల బృందం భారతదేశంలో విత్తన ధృవీకరణ క్రమాన్ని అధ్యయనం చేసేందుకు మూడు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్ చేరుకుంది. సోమవారం హాకాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర విత్తన ,సేంద్రీయ ధృవీకరణ అథారిటీ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమైంది. విత్తన ధృవీకరణ , ఆన్‌లైన్ విత్తన ధృవీకరణలపై సంస్థ చేస్తున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్ డా.కే.కేశవులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కబీర్ బృందానికి వివరించారు. అనంతరం కబీర్ బృందం వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథితో భేటీ అయింది. బంగ్లాదేశ్ అవరాలమేరకు కావాలసిన వరి, జనుము, కూరగాయల నాణ్యమైన విత్తన ఎగుమతులు ప్రభుత్వరంగ సంస్థ టీఎస్ఎస్‌డీసి నుంచి సరఫరా చేయటానికి తాము సిద్ధంగా ఉన్నట్టు ఈ సందర్భంగా పార్థసారథి వెల్లడించారు. ఈజిప్ట్, సుడాన్, ఫిలిప్పీన్స్ దేశాలకు ఒఇసీడి విత్తన ధృవీకరణ విత్తనాలు భారతదేశంలో తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం 17000 క్వింటాళ్లకు పైగానే ఎగుమతి అయినట్టు తెలిపారు. ఇరు దేశాల విత్తన ధృవీకరణ మానువల్‌లను పరస్పర అధ్యయనం కోసం ఇచ్చిపుచ్చుకున్నారు. ఖాజీ జహంగీర్ కబీర్ మాట్లా డుతూ బంగ్లాదేశ్‌లో కూడా కొత్త విత్తన చట్టం రానుందన్నారు. తెలంగాణలో విత్తన ధృవీ కరణ చర్యలను కొనియాడారు. నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ వంటి మోడల్ విత్తన గ్రామాలు, విత్తన ధృవీకరణ , అంతర్జాతీయ స్థాయి విత్తన పరీక్షా విధానాలు ,క్వాలిటి కంట్రోల్ విధానాలు ,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలు బాగున్నాయన్నారు. తమ దేశంలో సిబ్బంది నైపుణ్యతను పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సహాయ సహకారాలు కావాలన్నారు. ఐఎస్‌టీఏలో , ఒఇసీడిలో సభ్యత్వం కోరనున్నట్టు వెల్లడించారు.

మా ప్రాణాలకు లేని విలువ లారీలకొచ్చిందా

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందక్రిష్ణ మాదిగ



తంగళ్లపల్లి, (కెఎన్ఎన్): ' మా ప్రాణాలకు లేని విలువ లారీలకొచ్చిందా ..' అని నేరేళ్ల ఘటనలో రాష్ట్రప్రభుత్వ తీరుపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందక్రిష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై మంత్రి కేటీఆర్ స్పందించకపోతే రాష్ట్రంలో తిరగనివ్వబోమన్నారు. సోమవారం మండలంలోని నేరేళ్ల బాధిత కుటుంబాలను మందక్రిష్ణమాదిగ మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరేళ్ల ఘటనపై అన్ని పార్టీల నాయకులు స్పందించాయని స్థానిక శాసన సభ్యులు మంత్రి కేటీఆర్ స్పందించపోవడంపై మండిపడ్డారు. గ్రామంలో వరుసగా ఇసుక లారీల మూలంగా ప్రాణాలు పోగొట్టుకున్న క్రమంలో జరిగిన ఈ ఘటనను మానవత్వంతో చూడాల్సింది పోయి కుట్రబుద్ధితో చూడడం సరికాదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంఘటనపై స్పందించిన తీరు దొరల దురంహకారానికి నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెబుతున్నారని రాష్ట్రంలో 500 మంది దళిత మహిళలపై అత్యాచారాలు, 120 హత్యలు జరిగితే ఎంతమందిపై కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ప్రశ్నించారు. దళితుల ప్రాణాలకు లేనివిలువ లారీకొచ్చిందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేరేళ్ల ఘటనలో బాధితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, దళిత కుటుంబాల మహిళలను మానసికంగా వేధించిన పోలీసులపైన కేసులు నమోదు చేయాలన్నారు. స్థానిక మంత్రిగా కేటీఆర్ బాధితులకు జరిగిన అన్యాయంపై గొంతు విప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

జంతుహింస నిరోధక కమిటీల పనితీరుపై నివేదిక ఇవ్వండి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో జంతు హింస నిరోధక కమిటీల పనితీరు ,వాటి సక్రమ నిర్వహణ నిమిత్తం ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరిస్తూ ఓ నివేదిక సమర్పించాలని హైకోర్టు ఏపీ పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించింది. అక్రమ రవాణాలో దొరికిన మూగజీవాలకు ఆశ్రయం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రదేశాలు, నీరు, గ్రాసం, దాణా ఏర్పాట్లు ఎంతవరకు చేశారో, వాటికి కేటాయించిన నిధుల వివరాలు తెలపాలని ఆదేశించింది. ఎస్ పీసీఏల రిజిస్ట్రేషన్ తదితర వివరాలను ఆ నివేదికలో పేర్కొనాలని స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. జంతు హింసను నిరోధించేందుకు ప్రతి జిల్లాలో ఎస్ పీసీఏలు ఏర్పాటు చేసేలా ఏపీ సర్కారును ఆదేశించాలని అభ్యర్థిస్తూ యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్, మరొకరు హైకోర్టులో ప్రజా హిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సంగర్భంగా ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎస్‌పీసీఏ కమిటీలను రిజిస్ట్రేషన్ చేసినట్లు విన్నవించారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

మంత్రి చందూలాల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గిరిజన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని గిరిజన అభివృద్ధిశాఖ మంత్రి ఎ.చందూలాల్ పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా మౌలిక సదు పాయాలు కల్పించడం, రెసిడెన్షియల్ విద్యా విధానం, కల్యాణలక్ష్మీ పథకాన్ని అమలు, విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునే వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం తదితర పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరించేప్రయత్నం చేస్తున్నాయని మంత్రి తెలిపారు. గిరిజనుల ఆర్థిక, విద్య, జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు ఆయా వర్గాలకు భద్రత, సామాజిక హోదా కల్పించేందుకు గిరిజనాభివృద్ధికి నిధిని పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం తన నివాసం నుంచి గిరిజన అభివృద్ధి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లోని గిరిజన తండాలు, గూడాలకు రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని రోడ్లకు రూ.247 కోట్లు, మైదాన ప్రాంతాల్లోని రోడ్లకు రూ.200 కోట్లను మంజూరు చేశామని, ఈ నిధులను త్వరితగతిన ఖర్చుచేస్తే మరిన్ని నిధులను మంజూరు చేస్తామని తెలిపారు. గిరిజన తండాలు, గూడాల్లో వైద్య సేవలను విస్తృపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో విషజ్వరాలు వ్యాపింకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గిరిజన విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రతినెలా వైద్య పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. ప్రాథమికంగా అవసరమైన మందులను విద్యాసంస్థల్లో అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఇంజనీరింగ్, గిరిజన శాఖాధికారులు పాల్గొన్నారు.


మహిళలకు ప్రభుత్వ రక్షణ

టీఎస్ఐఐసీ ఛైర్మన్ బాలమల్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహిళలకు తెలంగాణ ప్రభుత్వం రక్షణగా ఉంటుందని టీఎస్ఐఐసీ ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని టీఎస్ఐఐసీ కార్యక్రమంలో రాఖీపండుగ సందర్భంగా పలువురు మహిళలు బాలమల్లుకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నా, చెల్లెళ్లు ఆత్మీయతకు అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. అక్కాచెల్లెళ్లకు ఏ ఆపద రాకుండా కష్టసుఖాల్లో అన్నదమ్ములు అండగా ఉంటారని పేర్కొన్నారు. షీ టీమ్ ఏర్పాటుతో మహిళలపై అకతాయిల ఆగడాలకు అడ్డుకట్టపడిందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని బాలమల్లు తెలిపారు.

టీపీసీసీలో మూగ గళాలు!

ఉత్సవ విగ్రహాలుగా అధికార ప్రతినిధులు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను తిప్పికొట్టలేని స్థితిలో పారిపోయాయని టీపీసీసీలో అంతర్మథనం మొదలైంది. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావాలని కలలు కంటున్న కాంగ్రెస్ పార్టీ ఆ దిశలో చురు కైన పాత్ర పోషించడం లేదు. అంది వచ్చిన అవకాశాలను వినియో గించుకోవడంలో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ విఫలమైందని ఆ పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. ఒకప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అంతకు ముందు పి జనార్థనరెడ్డి విపక్ష నేతలుగా ఉన్నప్పుడు ఎన్టీరామారావు, చంద్రబాబు అంతటివారే పరేషాన్‌లో పడేవారు. విపక్ష నాయకులుగా శాసనసభలో ఏ అంశాన్ని లేవనెత్తుతున్నారోఅని వణికిపోయిన సంఘటనలు ఉన్నాయి. కేవలం 25 మందితో పీజేఆర్ దడదడలాడించేవారు. వైఎస్‌కు సంఖ్యాబలం ఉండడంతో పాటు విపక్ష నేతగా ఆయన సారథ్యంలో మాట్లాడే నేతలు పలువురు ఉండడం ఆయనకు కలిసి వచ్చింది. కానీ, పరిస్థితి మారింది. శాసనసభలో విపక్ష నాయకుడు కె జానారెడ్డి ఆర్థిక అంశాలపై తప్ప మిగతా వాటిపై మాట్లాడేందుకు ముందుకు రానిపరిస్థితి కాంగ్రెస్‌కు చిక్కు లుతెచ్చిపెడుతోందని చెబుతున్నారు. ఆయన్నే ఈ విషయమై విలేఖరులు ప్రశ్నిస్తే నా పెద్దరికాన్ని నిలబెట్టుకుంటాను...మాట్లాడేందుకు ఉత్సాహం చూపించే వారిని ప్రోత్స హిస్తానని సమాధానం చెబుతారు..టైం..,వస్తే మాత్రం తన సత్తా చూపుతానని ముక్తసరిగా జవాబిస్తారు. గతంలో ఎన్టీఆర్‌ను సైతం కల్వకుర్తిలో చిత్తుచేసిన ఘటనలు కాంగ్రెస్ నేతలకు ఉన్నాయి. టీపీసీసీ నేతల వైఫల్యం అధికార టీఆర్ఎస్‌కు వరంగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమైంది. తమ వైఫల్యాలను ఎండగట్టడంలో ప్రధాన ప్రతిపక్షం విఫలం కావడంతో అధికార టీఆర్ఎస్ కూడా కుషీగా ఉంది. ప్రైవేట్ సంభాషణల్లో సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు, నాయకులు సైతం ఇదే అభిప్రాయంతో ఉన్నారు. గడచిన మూడేళ్లుగా కేసీఆర్ సర్కార్ ఎన్నికల ప్రణాళికల అమలుపై ఏవో కొన్ని అంశాలపైనా ముఖ్య నాయకులు తప్ప మిగతా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. సీఎం కేసీఆర్,మంత్రులు కాంగ్రెస్‌ను తిడితే..,మరుసటి రోజు కాంగ్రెస్ బడా నేతలనే వారు సైతం స్పందించి ఏదో బదులిచ్చామని చేతు లుదులుపుకుంటున్నారని కాంగ్రెస్ నేతలే విమర్శిస్తున్నారు. నేరెళ్లలో 8 మంది దళితులు, బీసీలపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రదర్శించడంపై అధిష్టానం నేరుగా రంగంలోకి రావడం, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్కను సంఘటన స్థలానికి పంపించడంతో ఈ అంశాన్ని రాష్ట్ర స్థాయి అంశంగా చేయగలిగారు.అదే గుజరాత్‌లో సాక్షాత్తు ఏఐసీసీ ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీపై మత తత్వ శక్తులు దాడికి పాల్పడితే స్టేట్ కాల్ ఇచ్చేందుకు టీపీసీసీ సిద్ధం కాకపోవడం విమర్శలకు దారి తీసింది. రాష్ట్ర వ్యాప్త ప్రదర్శనలు ,బీజేపీ కార్యాలయాల ముట్టడి, గద్వాల, మహబూబ్‌నగర్ మరికొన్ని చోట్ల ధర్నాలు చేపట్టడంతో పరువు మిగి లింది. పీసీసీ మాజీ అధ్యక్షుడు వి హనుమంతరావు, టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్‌కుమార్ ,మహ్మద్ అలీ షబ్బీర్, సీఎల్పీ ఉప నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు డీకే అరుణ, వంశీచంద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లు రవి, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి మాత్రం రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు

కేసీఆర్ జీఎస్టీ డ్రామా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు గతంలో కేంద్ర కార్మిక మంత్రిగా ఉన్నప్పుడు ఇఎస్ఐ ఆసుపత్రి కాంట్రాక్టులో సీబీఐ కేసు నుంచి తప్పించుకునేందుకే జీఎస్టిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామంటూ నాటకం ఆడుతున్నారని తెలుగుదేశం పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. జీఎస్టి ముసాయిదాపై శాసనసభలో ఆమోదింపజేసి మళ్ళీ ఇప్పుడు కోర్టుకు వెళ్ళి రాష్ట్రానికి న్యాయం చేస్తామనడం ఎవరిని మభ్య పెట్టేందుకని ఆయన ప్రశ్నించారు. జీఎస్టి బిల్లు ఆమోదంలో టిఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో మద్దతు పలికి ఇప్పుడు అన్యాయం జరిగిపోతోందంటూ గగ్గోలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఆరోపించారు. జీఎస్టిపై అమలుతో రాష్ట్రంపై రూ.30వేల కోట్ల మేరకు అదనపు భారం పడుతోందని చెబుతున్న కేసీఆర్ బిల్లుకు మద్దతు పలికినపుడు తెలియదా అని రేవంత్ ప్రశ్నించారు. తెరాస ఎంపీలు జీఎస్టికి లోక్‌సభలో మద్దతు ఇవ్వడం, శాసనసభలో ప్రభుత్వమే ఏకగ్రీవంగా ఆమోదింపజేసి ఇప్పుడు సుప్రీంకోర్టుకు నివేదిస్తే ఆ కేసు నిలిచే అవకాశం లేదని రేవంత్ అభిప్రాయపడ్డారు. సీబీఐ కేసు నుంచి తనను కాపాడుకునేందుకే జీఎస్టిపై పోరాటమంటూ నాటకాలు ఆడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. జీఎస్టి వల్ల రాష్ట్రాలకు నష్టం జరిగితే ఆ రాష్ట్రాలతో కలిసి కేంద్రంపై ఒత్తిడితెస్తే ప్రయోజనం ఉంటుందని ఆయన సూచించారు. సీబీఐ కేసుల నుంచి తప్పించుకునేందుకే కేసీఆర్ అనేక అంశాల్లో కేంద్రానికి బేషరతుగా మద్దతు ఇస్తున్నారని, ఇది నిరాధార ఆరోపణ అయితే తనపై చట్టపరమైన చర్య తీసుకోవాలని రేవంత్ సవాల్ చేశారు. జీఎస్టి బిల్లు అమలుతో జరిగే అనర్థాలపై టిడిపి తరపున శాసనసభలో తాను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు.

15 నుంచి భట్టి విక్రమార్క పాదయాత్ర?

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై రోజురోజుకు పెరుగుతున్న దాడులు, వాటిని అరికట్టడంలో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర చేపట్టాలని యోచిస్తున్నారు. తొలి దశలో దళిత, గిరిజన సమస్యలపై యాత్రను చేపట్టే విషయం ఆలోచిస్తున్నారు. మలి దశలో పార్టీ అనుమతిస్తే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మాదిరిగా తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టాలని యోచిస్తున్నారు. తొలి దశ పాదయాత్ర విషయమై మధిర నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుంటున్నారు. వారితో పాటు టీపీసీసీ నాయకులతో కూడా చర్చిస్తున్నారు. బీసీ సమస్యలపై పీసీసీ మాజీ అధ్యక్షుడు వి హనుమంతరావు బస్సు యాత్ర చేపట్టనున్నట్లు ఇది వరకే ప్రకటించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా పూర్వ జిల్లా కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు,రాహుల్ సందేశ్ యాత్ర పేర బస్సు యాత్ర చేపడతానని ప్రకటించారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రాజెక్టుల బాట పట్టాలని యోచిస్తున్నారు.

ఈ సెషన్‌లోనే బీసీ కమిషనన్ బిల్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రస్తుత పార్లమెంట్ సమావేశంలోనే జాతీయ బీసీ కమిషన్ బిల్లును ఆమోదం పొందేటట్లు చర్యలు తీసుకుంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హంసరాజ్ గంగారామ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులకు హామి ఇచ్చారు. ప్రతిపక్షాలు సహకరించకపోవడం వల్లే బిల్లు ఆమోదం పొందడంలో జాప్యం జరుగుతోందన్నారు. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధమైన హోదా లభిస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పలువురు ఉన్నారు.

రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్

- వర్షాభావమే కారణం
- విద్యుత్ డిమాండ్ 11000 మెగావాట్లకు పెరిగే అవకాశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో నెలకున్న వర్షాభావ పరిస్థితులు విద్యుత్ రంగంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. బోర్ల కింద పంటలసాగు పెరుగుతూ రావటం, అందుకు తగ్గట్టుగా వర్షాలు లేకపోవటంతో వ్యవసాయరంగానికి విద్యుత్ డిమాండ్ బాగా పెరుగుతూ వస్తోంది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేనివిధంగా గత పదిరోజులుగా రాష్ట్రంలో విద్యుత్ పీక్ డిమాండ్ 9043 మెగావాట్లను తాకింది. సోమవారం వాతావరణం కాస్త చల్లబడటంతో విద్యుత్ డిమాండ్ 8704 మెగావాట్లు ఉన్నట్టు విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఖరీఫ్ పంటలసాగు సీజన్ ఊపందుకుంది. 85లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగులోకి రాగా అందులో 30లక్షల ఎకరాలు బోర్ల కిందకిందనే సాగయ్యాయి. దీంతో వ్యవసాయం రంగానికి విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతూ వస్తోంది. ఈ నెలాఖరు నాటికి వరినాట్ల పనులు మరింతముమ్మరం కానున్నాయి . ఈ నేపథ్యంలో విద్యుత్ పీక్ డిమాండ్ పదివేల మెగావాట్లు ఉండవచ్చని తొలుత అంచనా వేసినా అది ఈ సారి 11వేల మెగావాట్లుకు చేరే అవకాశాలు కనిపిస్తున్నట్టు విద్యుత్ పంపిణీ సంస్థలు చెబుతున్నాయి.

వ్యవసాయానికి ప్రత్యేకలైన్లు:


ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలమేరకు రాష్ట్రంలో వ్యవసాయరంగానికి నిరంతర విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టింది.దీంతో ఇపుడున్న వ్యవసాయ లైన్లను వేరుచేస్తూ



వ్యవసాయరంగానికి సరఫరా చేసే విద్యుత్ లైన్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గృహ, పారిశ్రామిక రంగాలకు సరఫరాచేసే విద్యుత్ లైన్లు , కేవలం వ్యవసాయ రంగానికి మాత్రమే విద్యుత్ సరపరా చేసే లైన్ల అన్నిజిల్లాల్లో వేరుపడుతున్నాయి. రాష్ట్రమంతటికీ 24గంటల విద్యుత్ సరఫరా లక్ష్యాలను నిర్దేశించుకున్న ప్రభుత్వం ఆ దిశగా ముందుకు సాగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 2013-14లో విద్యుత్ ఉత్పత్తి స్థాపిత సామర్థ్యం 6600మెగావాట్లు మాత్రమే ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ సర్కారు తీసుకున్న చర్యల ఫలితంగా అదనంగా 5348 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని జతచేయగలిగారు. రాష్ట్రంలో వ్యవసాయరంగానికి 24గంటల విద్యుత్ ద్వారా పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనావేసి ఆమేరకు ఏర్పాటు చేసుకోవటంలో సఫలీకృతులయ్యారు.

ప్రీమియం చార్జీలు ప్రియం

- ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న ప్రయాణికులు
- పెరిగిన ప్రయాణికులు-తగ్గిన సరకు రవాణా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గత సంవత్సరం ప్రయాణికుల సంఖ్య 1.17 కోట్లకు పెరిగింది. సరకు రవాణా 10 శాతం తగ్గింది. సువిధ, ప్రీమియం పేర్లతో ప్రవేశపెడుతున్న రైళ్లలో టికెట్ ఛార్జీలు అధికంగా ఉండటంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నారు. కొన్ని రైళ్లలో ప్రయాణం విమాన ఛార్జీలతో సమానంగా ఉండటంతో దూర ప్రాంత ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. దక్షిణ మధ్య రైల్వే పెద్దగా నష్టాల భారిన పడనప్పటికీ అప్రమత్తం కాని పక్షంలో నష్టాలను చవి చూడవలసి ఉంటుంది. ఉన్నతాధికారులు ఇప్పటికే అప్రమత్తమయ్యారు. గత ఆర్థిక సంవత్సరంలో రాబడి, 2016 -17లో వచ్చిన రాబడిని బేరీజు వేసుకుంటున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరిగినప్పటికీ సరకు రవాణా పడిపోవడంతో రాబడి రూ. 1000ల కోట్లకు పైగా పడిపోయిందనే నిర్ధారణకు వచ్చారు. 2015 -16 రాబడి రూ. 13,212 కోట్లు కాగా 2016 -17 రాబడి రూ. 12,410 కోట్లుగా ఆడిట్ అధికారులు పేర్కొన్నారు. బొగ్గు, సిమెంట్ రవాణా తగ్గడంతో వచ్చిన నష్టాన్ని అధిగమించడానికి ఇప్పటికే సిమెంట్ కంపెనీలు, సింగరేణి యాజమాన్యాలతో చర్చలు ప్రారంభించారు. దక్షిణ మధ్య రైల్వే ప్రతి నిత్యం 736 రైళ్లను నడిపిస్తుంది. వీటికి తోడు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు ఆరు డివిజన్ల పరిధిలో ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నారు. ప్యాసింజర్ రైళ్లను నడిపించడం వల్ల ఎలాంటి నష్టం జరగడం లేదని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. నిర్వహణ వ్యయం భారీగా పెరిగిందన్నారు. రూపాయి రాబడికి నిర్వహణ వ్యయం 108 పైసలు అవుతుందని వెల్లడించారు. నష్టదాయకమైన రూట్లు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో లేవని, కొత్తగా ఏర్పాటు చేసిన గద్వాల - రాయచూర్, పెద్దపల్లి - కరీంనగర్, కాకినాడ - కోటిపల్లి రూట్లను లాభాల బాట పట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దూర ప్రాంతాలకు నడిపించే రాజధాని, శతాబ్ది రైళ్లు కూడా తమ జోన్ పరిధిలో లాభదాయకంగా ఉన్నాయని వివరించారు. సికింద్రాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల పరిధిలో ప్రతి నిత్యం 261 మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 357 ప్యాసింజర్ రైళ్లను నడిపిస్తున్నారు. మరో 118 ఎంఎంటిఎస్ రైళ్లు మెట్రో నగరంలో ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. మెట్రో ఛార్జీలు తక్కువగా ఉంటాయి. ప్రత్యామ్నాయ మార్గాల్లో అధనపు రాబడి వస్తుంది. భారత రైల్వేలు నిర్వహణ వ్యయాన్ని పరిగణలోకి తీసుకోకుండా కనీస ఛార్జీలతో మెరుగైన ప్రయాణం కల్పిం చడానికే అత్యధిక రైళ్లను నడిపిస్తుంది. ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణ ఛార్జీలు చాలా తక్కువ. ఈ భారాన్ని సరకు రవాణా, ఇతరతర మార్గాల ద్వారా పూడ్చుకుంటుంది. వివిధ వర్గాలకు రాయితీతో కూడిన ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తుంది. దక్షిణ మధ్య రైల్వే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, మధ్య ప్రదేశ్ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నందున అన్ని రైళ్లు నిండుగా ప్రయాణం సాగిస్తున్నాయి. ప్రయాణికుల సంఖ్య కూడా నానాటికి పెరిగిపోతుంది. కొత్త ప్రాంతాలకు దక్షిణ మధ్య రైల్వే విస్తరించడం కూడా లాభదాయకంగానే ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

కాకినాడ, తిరుపతికి ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రయాణికుల రద్దీ పెరగడంతో సికింద్రాబాద్ - కాకినాడ, హైదరాబాద్ - తిరుపతి మధ్యన ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన ప్రజా సంబంధాల అధికారి ఎం. ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ నుండి కాకినాడకు ప్రత్యేక రైలు 11వ తేదీన బయలుదేరనుంది. తిరుగు ప్రయాణంలో 12న కాకినాడ నుండి బయలుదేరి మరుసటి రోజు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అదే విధంగా హైదరాబాద్ నుండి తిరుపతికి ప్రత్యేక రైలు 14వ తేదీన బయలుదేరనుంది. తిరుగు ప్రయాణంలో 15న తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు మార్గమధ్యలోని అన్ని ప్రధానమైన స్టేషన్‌లలో నిలుపుదల చేయడం జరుగుతుందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ రైళ్లలో ప్రత్యేక ఛార్జీలు వర్తిస్తాయి.

వ్యవసాయ వర్సిటీకి పీఆర్ అవార్డులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పీర్ రంగంలో జాతీయ అవార్డులు వచ్చాయి. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఇండియా హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన 2వ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ రిలేషన్స్ సమావేశంలో వివిధ కేటగిరీలకు సంబంధించి నాలుగు జాతీయ అవార్డులను విశ్వవిద్యాలయం సొంతం చేసుకుంది.

నయీం ఉదంతంలో 227 కేసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్యాంగ్‌స్టర్ నయీం కేసు విచారణ కొనసాగుతోందని, ఇప్పటివరకు ఈ అంశంలో 227 కేసులను నమోదు చేసినట్లు సిట్ స్పష్టం చేసింది. నయీం, ఆయన అనుచరులపై విచారణ పురోగతిలో ఉందని స్పష్టం చేసింది. ఈ కేసుల్లో భాగంగా 128 మందిని అరెస్టు చేసినట్లు తెలిపింది. మరో 109 మంది నిందితులను పోలీస్ కస్టడికీ తీసుకున్నామని పేర్కొంది. నయీం కేసులో దాదాపు 895 సాక్షులను విచారించినట్లుగా వెల్లడించింది. 9 కేసుల్లో చార్జిషీట్లు దాఖలయ్యాయని, 22 కేసుల్లో దర్యాప్తు పూర్తయినట్లుగా సిట్ స్పష్టం చేసింది. 22 కేసుల్లో చార్జి షీట్లు సిద్ధం చేశామని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ప్రకటించింది. మిగతా కేసుల్లో కూడా దర్యాప్తు చివరి దశకు చేరిందని, త్వరలో కేసుల పురోగతిని సాధిస్తామని ఈ సందర్భంగా సిట్ తెలిపింది. 14 మంది గ్యాంగ్‌స్టర్‌లు నయీం కేసుల్లో ఉన్నారని, ఐదుగురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేశామని సోమవారం సిట్ ఒక ప్రకటనలో తెలిపింది. నలుగురు అధికారులపై శాఖాపరమైన తీవ్ర చర్యలను, 16 మంది పోలీస్‌లపై చిన్నపాటి ఫిర్యాదులు వచ్చినట్లుగా స్పష్టం చేసింది.

మైనార్టీ వైద్య సీట్ల భర్తీపై హైకోర్టు స్టే

హైదరాబాద్,ఆంధ్ర ప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని మైనారిటీ వైద్య విద్య కళాశాలల్లో సీట్ల భర్తీపై హైకోర్టు స్టే విధించింది. ఆ కాలేజీల్లో ఏ కేటగిరి సీట్లను తగ్గించి, బీ కేటగిరీ సీట్లు పెంచడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ , జస్టిస్ టి.రజనిలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారణ చేపట్టి,ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది

కమింగా విచారణ పూర్తి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా వెయ్యి మందికి మత్తు పదార్థాలను అందించినట్టు డ్రగ్స్ కేసులో అరెస్టయిన నెదర్లాండ్ దేశస్తుడు మైక్ కమింగా పోలీసులకు చెప్పినట్టు తెలుస్తోంది. మాదక ద్రవ్యాల వ్యవహారంలో కమింగాను మూడు రోజులపాటు విచారించిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక సమాచారాన్ని రాబట్టినట్టు తెలుస్తోంది. కమింగా సెల్‌ఫోన్‌లో నమోదైన వెయ్యి నెంబర్లను పరిశీలించిన సిట్ వారికి మత్తు పదార్థాలు అందాయా, లేదా అనే అంశంపై విచారణ జరిపినట్టు తెలుస్తోంది. అయితే విచారణలో ఎటువంటి అంశాలు వెల్లడించలేదని మరోమారు కస్టడీకి తీసుకుని కమింగాపై ప్రశ్నల వర్షం కురిపించవలసి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్న కమింగా నుంచి మరింత సమాచారం రాబట్టవలసి ఉందని అధికారులు అంటున్నారు. డ్రగ్స్ సరఫరా ఎన్నేళ్ళుగా కమింగా నిర్వహిస్తున్నది, ఎవరెవరికి ఇవి చేరుతున్నాయి అనే అంశంపై కూపీ లాగినట్టు చెబుతున్నారు. మూడు రోజుల కస్టడీలో కమింగా నుంచి పలు కీలక వివరాలు రాబట్టినట్టు తెలుస్తోంది.

డ్రగ్స్ దర్యాప్తుపై రేవంత్ పిల్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: హైదరాబాద్ నగరంలో మాదక ద్రవ్యాల(డ్రగ్స్) సరఫరా దర్యాప్తును నార్కోటిక్స్ నియంత్రణ బ్యూరో, తదితర కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలకు అప్పగించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై దర్యాప్తు జరుపుతున్న ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరకొర వస్తు సామాగ్రితో దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించలేకపోతోందని, పైగా అది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ సంస్థలను సంప్రదించడం లేదని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని తెలంగాణ తెదేపా కార్యానిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎ.రేవంత్ రెడ్డి దాఖలు చేశారు. దర్యాప్తును కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సంస్థలైన నార్కోటిక్ నియంత్రణ బ్యూరో వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అప్పగించేలా తెలంగాణ సర్కారును ఆదేశించేలా, ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ హైకోర్టును అభ్యర్థించార్తు. జస్టిస్ రమేశ్ రంగనాథన్, నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది.

హిల్ స్టేషన్లు ప్రైవేట్‌పరం?

(మొదటిపేజీ తరువాయి)

ఇంతవరకు కార్యాచరణ దిశగా అడుగు ముందుకు పడలేదు.

ప్యాసింజర్ విభాగంలో 80శాతం నష్టాలే..

రైల్వేలకు సరకు రవాణా నుంచి కాస్తో కూస్తో వస్తున్న ఆదాయాన్ని ప్యాసింజర్ సెగ్మెంట్ హరీమనిస్తోంది. భారతీయ రైల్లే నెట్‌వర్క్‌లోని సాధారణ, స్లీపర్ తరగతుల్లో నష్టభారం చాలా తీవ్రస్థాయిలోఉంది. ఈ విభాగంలో దాదాపు 80 శాతం నష్టాలు తప్పడం లేదు. స్థూలవ్యయంలో ఇక్కడి నుంచ కేవలం 20 శాతం మాత్రమే రాబడి లభిస్తోంది. మొదటి తరగతి రిజర్వేషన్, ఆర్డినరి ద్వితీయశ్రేణి నుంచి 70శాతం నష్టాలను రైల్వే ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రయాణీకుల విభాగంలో లాభాలు వస్తున్న ఏకైక తరగతి ఏదైనా ఉందంటే అది కేవలం త్రీటైర్ ఏసీ మాత్రమే. ఏటా 7.5శాతం ఆదాయం లభిస్తోంది. పెద్దమొత్తంలో సబ్సిడీ కల్పిస్తున్న ప్రయాణీకుల విభాగం నుంచి ఏటేటా నష్టాలు అధికం అవుతున్నట్లు డీకే మిట్టల్, బిబేక్ దెబ్రోయ్ కమిటీలు నిర్ధారణకు వచ్చాయి. మొత్తం నష్టభారంలో సామాజికసేవా మార్గంలో నడిచేలైన్ల మూలంగా ఏటా రైల్వేకు రూ. 30వేల కోట్ల పైచిలుకు నష్టం వాటిల్లుతోంది.

సబ్సిడీ చెల్లించండి: ఆర్థిక శాఖకు పీఎంవో ఆదేశాలు

లాభాలతో ప్రమేయం లేకుండా, కేవలం ప్రజల సౌకర్యార్థం కోసమే రైలు సర్వీసులను నడిపిస్తున్న మార్గాల్లో వాటిల్లే నష్టాలను భర్తీచేయాల్సిందిగా ప్రధానమంత్రి కార్యాలయం ఆర్థికమంత్రిత్వశాఖకు తాజాగా ఆదేశాలు జారీచేసింది. గతంలో వేర్వేరు బడ్జెట్‌లు ఉన్నప్పుడు ఈ విధమైన మార్గాల్లోని నష్టాలను సబ్సిడీ రూపంలో భర్తీచేసేవారని, ఏకీకృత బడ్జెట్ తర్వాత ఆ నిధులను నిలిపివేడయం సమర్థనీయం కాదని పీఎంవో సూచించింది. దీంతో గత కొద్దినెలలుగా రైల్వే, ఆర్థికశాఖల మధ్య నలుగుతున్న వివాదానికి పరిష్కారం లభించినట్లయింది. వెనుకబడిన, పర్వత, సరిహద్దు ప్రాంతాల్లో దేశీయ, పౌర అవసరాల నిమిత్తం అత్యవసరంగా రైల్వే కొన్ని సర్వీసులను నడుపుతుంటుంది. వీటి నిర్వహణ వ్యయ భారాన్ని భర్తీ చేసేందుకు కేంద్రం సబ్సిడీ చెల్లిస్తూ వచ్చేది. అయితే, ఏకీకృత బడ్జెట్ తర్వాత ఆర్థిక శాఖ సుమారు 34వేల కోట్ల సబ్సిడీని నిలిపివేసింది. ఈ సమస్యపై చర్చించేందుకు ప్రిన్సిపల్ కార్యదర్శి నృపేంద్ర మిశ్రా, రైల్వే బోర్డు చైర్మన్ ఏకే మిటల్, రైల్వే ఆర్థిక కమిషనర్ మహాపాత్ర తదితరుల ఆధ్వర్యంలో భేటీ జరిగింది. సబ్సిడీ చెల్లించాలని ఈ సమావేశం తీర్మానించింది. ఈ మేరకు పీఎంవో ఆర్థికశాఖకు ఆదేశాలు జారీచేసింది. దీంతో రైల్వేకు కాస్తంత ఊరటలభించినట్లయింది.

కార్పొరైటైజేషన్..

గతేడాది బడ్జెట్ సందర్భంగా రైల్వే మంత్రి సురేష్ ప్రభు రైల్వేల భవిష్యత్‌పై తన దార్శనిక వ్యూహాన్ని వెల్లడించారు. పునర్వ్యవస్థీకరణ, పునర్నిర్మాణం, చైతన్యం మార్గాల్లో రైల్వేను పరుగులెత్తించాలని దిశానిర్దేశం చేశారు. ప్రప్రథమంగా రైల్వే భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం సిగ్నలింగ్, ట్రాకింగ్ వ్యవస్థల ఆధునీకరణకు కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం చేపడతామని వెల్లడించారు. నిరర్థక ఆస్తులను ఉపయోగంలోకి తీసుకురావడం, మానవ వనరులను సద్వినియోగ పరచడం, వ్యయభారాలను తగ్గించుకుని, ప్రైవేటు సంస్థలకు ధీటుగా రైల్వేల ద్వారా రవాణా, ఇతర సేవాపర సర్వీసులను పోటీతత్వానికి అనుగుణంగా విస్తరించాలని రెండేళ్లనాడే తన భవిష్యత్ కార్యాచరణలో ప్రకటించారు. అదేవిధంగా ఆదాయాలను మెరుగు పరుచుకునే దిశగా క్రమేణా రైల్వే స్టేషన్లను కార్పొరేటైజేషన్ చేయాలన్న ఆలోచననూ తెరపైకి తీసుకు వచ్చారు. మొత్తంగా ప్రభు హయాంలో రైల్వేలో క్రియాశీల ప్రగతి కార్యాచరణ పట్టాలెక్కింది.

రైతులకెంతో చేస్తున్నారు... 'సద్దిమూట' నీటిమూటైంది ఎందుకు?

- పథకం ఉద్దేశం మంచిదే... అమలులో చిత్తశుద్ధి లోపం
- మిగతా పథకాలతో సమానంగా ప్రాధాన్యత ఇవ్వని అధికారులు
- ప్రారంభ దశలో ఉన్న ఆసక్తి ఆ తర్వాత ఏమైంది?
- పర్యవేక్షణ లోపంతోనే క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోని ప్రభుత్వ ఆదేశాలు
- సమన్వయం కొరవడి రైతన్న ఆశలపై నీళ్లు చల్లిన అధికారులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సమాజానికి పట్టెడన్నం పెట్టే అన్నదాతకు చేదోడువాదోడుగా ఉండాలన్న సంకల్పంతో తలపెట్టిన 'సద్దిమూట' పథకం పురోగతికి నోచుకోవడంలేదు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారుల సమన్వయ లోపంతో ఈ ప్రయోజనాత్మక కార్యక్రమం అమలు స్తంభించింది. మొదట వ్యవసాయ మార్కెట్ కమిటీలు, మార్కెట్ యార్డులు, రైతు బజార్లలో ప్రారంభించి ఆ తర్వాత విస్తరించాలన్న సర్కారు నిర్ణయం ఏడాది కాలం గడిచినా కార్యరూపం దాల్చడంలేదు. మారుమూల గ్రామాల నుంచి సమీప పట్టణాలు, నగరాలకు తాము పండించిన వ్యవసాయోత్పత్తులను అమ్ముకునేందుకు నిత్యం వచ్చే రైతులకు బాసటగా సద్దిమూట పేరుతో రూ.5కే భోజన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న ఈ నిర్ణయం ఆచరణయోగ్యమే అయినప్పటికీ అధికార యంత్రాంగంలో ఉన్న చిత్తశుద్ధి లోపంతోనే ముందుకు కదలలేదు. ప్రభుత్వాదేశాల మేరకు కొన్ని ప్రధాన మార్కెట్ యార్డుల్లో కొంతకాలం పాటు సద్దిమూట పథకం అమలైనా, అది కొన్నాళ్ళ ముచ్చటగానే మిగిలింది. అనేక కష్టనష్టాలు భరిస్తూ వ్యవసాయాన్నే నమ్ముకున్న అన్నదాతలకు పట్టెడన్నం పెట్టాలన్న సంకల్పంపై ప్రారంభ దశలో హర్షద్వానాలు వ్యక్తమైనప్పటికీ, ప్రస్తుతం అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణాల్లోని ప్రధాన మార్కెట్లలోనే దిక్కులేదు... ఇక గ్రామాల్లో ఎలా అమలు చేస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ముందుచూపు నిర్ణయం, అయినా...

అతివృష్టి, అనావృష్టి, ప్రకృతి వైపరీత్యాలు, అనేక ప్రతికూల పరిస్థితులతో సతమతమవుతున్న రైతాంగానికి బాసటగా నిలువాలని ప్రభుత్వం ఈ ముందుచూపు నిర్ణయం తీసుకుంది. దాదాపు దశాబ్ధ కాలంగా కరువు కాటకాలతో విసిగి వేసారి ఉన్న అన్నదాతలకు గడిచిన రెండేళ్ళలో అనేకరకాల ప్రోత్సాహకాలు ఇచ్చినప్పటికీ, అవేవీ వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచలేదు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం రైతుల సంక్షేమానికి మరిన్ని కొత్త పథకాలను ప్రారంభించాలని నిర్ణయించింది. మూడేళ్ళ పాలనను విజయవంతంగా పూరిచేసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మూడో సంవత్సరంలోకి అడుగు పెట్టే తరుణంలో వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారని రైతులు ఆశిస్తున్నారు. గడిచిన మూడేళ్ళలోనూ రైతు సంక్షేమం పట్ల నిబద్ధత కనబరిచి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుని అమలు చేశారు.

రైతుల అవసరాలు గుర్తించి నిర్ణయాలు

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రైతుల ధీనస్థితిని దృష్టిలో పెట్టుకుని అవసరానికి మించి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.లక్షలోపు ఉన్న రైతుల రుణాలన్నింటినీ మాఫీ చేశారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై రూ.17వేల కోట్ల ఆర్థిక భారం పడినప్పటికీ, 36 లక్షల 33 వేల మంది రైతులు లబ్ధి పొందారు. కరవుతో పంట నష్టాన్ని భరించలేక, అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యలకు పాల్పడిన బడుగు రైతు కుటుంబాల ధీనస్థితిని దృష్టిలో పెట్టుకుని బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున చెల్లించే నష్టపరిహారాన్ని రూ.లక్షన్నర నుంచి రూ.6లక్షలకు పెంచారు. పెంచిన పరిహారాన్ని గత ఏడాది సెప్టెంబర్ 19 నుంచే అమల్లోకి తీసుకువచ్చారు.

రైతు కుటుంబాలకూ 'కళ్యాణ లక్ష్మి'

రైతు కుటుంబాల్లో ఉన్న ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేందుకు కళ్యాణ లక్ష్మి పథకాన్ని వర్తింపజేశారు. అకాల వర్షాలు, వరదలు, వడగండ్ల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు చెల్లించే ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను ఉమ్మడి రాష్ట్రంలో బకాయ పడినవి కూడా విడుదల చేశారు. గత ఏడాది రూ.480 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించి 12.64 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చారు. నిజామాబాద్ జిల్లాలో ఎర్రజొన్న రైతులకు ఆదుకునేందుకు చొరవ చూపి వారు నష్టపోయినందుకు దాదాపు రూ.10కోట్ల మొత్తాన్ని చెల్లించారు.

మౌలిక వసతులకు పెద్దపీట

ధాన్యంతో పాటు ఇతర వ్యవసాయోత్పత్తుల నిల్వకు గిడ్డంగులు లేక గిట్టుబాటు ధరలు అందని సమస్యను పరిష్కరించారు. రూ.1023 కోట్ల అంచనా వ్యయంతో 17 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కొత్తగా 330 గోదాములను నిర్మించేకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రైతులు గోదాముల్లో నిల్వ చేసుకునే సరుకు విలువలో 75శాతం మొత్తాన్ని 'రైతు బంధు' పథకం ద్వారా రుణాలను ఇస్తున్నారు. ఈ రుణాలపై గతంలో ఉన్న రూ.75వేల పరిమితిని రూ.2 లక్షలకు పెంచేశారు. కరువు నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు, వ్యవసాయ కార్మికులకు ఐదు రూపాయల భోజన పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించారు. సీఎం కేసీఆర్ మానస పుత్రిక 'సద్ధిమూట' పేరుతో ఇప్పటికే ఈ పథకాన్ని కొన్ని వ్యవసాయ మార్కెట్లలో ప్రారంభించారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని వ్యవసాయ మార్కెట్లతో పాటు గ్రామగ్రామాన రూ.5లకే భోజన పథకాన్ని అమలు చేసేందుకు సరిగ్గా ఏడాది క్రితం కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

రైతు కుటుంబాలకు మరింత చేయూత

అంతేకాకుండా గ్రామం యూనిట్‌గా పంటల భీమా పథకాన్ని ప్రారంభించారు. రైతులు పండించే కూరగాయలను నేరుగా పట్టణాల్లో అమ్ముకునేందుకు వీలు కల్పిస్తూ రూ.100 కోట్లతో అన్ని పురపాలక పరిపాలిత పట్టణాల్లో రైతు బజార్లను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. తెలంగాణను విత్తన భండాగారంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించారు. మార్కెట్ యార్డుల్లో పనిచేసే కార్మికులకు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది జూలై నుంచి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. వచ్చే సంవత్సరం నుంచి ఈ మొత్తాన్ని రూ.5లక్షలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్కెట్ యార్డుల్లో పనిచేసే దడ్వాయిలు, హమాలీలు, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు మొల్లం కలిపి దాదాపు 20వేల మంది ఈ పథకంతో లబ్ధి పొందనున్నారు. రైతుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 182 మార్కెట్ యార్డుల్లో విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు నిర్మించారు. కానీ ప్రజాదరణ పొందే 'సద్దిమూట' పథకంపై ప్రభుత్వం సరైన దృష్టికేంద్రీకరించలేకపోతోంది.

సిండికేట్లు...బందిపోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఉంటే మేలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని అనధికార బెల్టు దుకాణాలు ఆచరించి చూపుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని శాశించిన మద్యం సిండికేట్లు మళ్లీ వేళ్లూనుకుంటున్నాయి. అద్భుత ఆర్థిక ప్రగతిలో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రంలో మద్యం మత్తూ అంతే వేగంగా దూకుడును ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలో మంచినీళ్లు దొరకని పల్లెలు ఉన్నాయో లేవో కానీ మద్యం దొరకని పల్లెలు లేవనేది వాస్తవం. రాష్ట్రంలో 2144 వైన్ షాపులు(రిటైల్ దుకాణాలు), 840 బార్లు, 24క్లబ్‌లు, 8008 కల్లు దుకాణాలతో మత్తు మోతాదును తీవ్ర స్థాయికి చేర్చుతూ ఏడాదికి దాదాపు రూ. 20వేల కోట్ల విక్రయాలు జరుగుతున్నాయి. అయితే ఈ మద్యం అంతా అధికారిక దుకాణాలు, బార్లు, క్లబ్బుల ద్వారానే జరుగుతుందనే భావించడం పొరపాటే. అంతకు ఏడు నుంచి ఎనిమిది రెట్లుగా విస్తరించిన అనధికార బెల్టు షాపులే కారణమని అటు ప్రభుత్వానికి, ఇటు అబ్కారీ అధికారులకూ తెలుసు. ఏడాదికి దాదాపు 300 లక్షల పెట్టెల మద్యం, మరో 350 లక్షల పెట్టెల బీర్ విక్రయాలు జరుగుతున్నాయి. వీటికి అనధికారిక బెల్టు దుకాణాలే కీలక అడ్డాలుగా నిలుస్తున్నాయి. ఆ జిల్లా...ఈ జిల్లా అని లేకుండా అంతటా సిండికేట్ల హవా పెరిగింది.

రాష్ట్రంలో మద్యం విక్రయాలు అంతా సిండికేట్ల కబంద హస్తాల చేతుల్లోకి చేరాయి. ఏ జిల్లాలో చూసినా మద్యం వ్యాపారులంతా సిండికేట్లుగా మారిన పరిస్థితులే కనిపిసున్నాయి. అబ్కారీ శాఖ పర్యవేక్షణ కొరవడటం, ఇటీవలే ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డ్రగ్స్ వ్యవహారంపై దృష్టి పెట్టడంతో సిండికేట్ మాఫియా మరింత పేట్రేగిపోతోంది. ఇప్పటి వరకు ఎక్కడికక్కడ స్థానిక రాజకీయ నేతల కనుసన్నల్లో నడిచిన ఈ దందా ఇప్పుడు కొత్త దారుల్లో అక్రమ వ్యాపారాలకు తెగిస్తోంది. గరిష్ట చిల్లర ధరలను ఏ మాత్రం పట్టించుకోకుండా వారు నిర్దేశించిన ధరలనే చెల్లించాలని హుకూం జారీ చేస్తోంది. ఒక్కో మండలాన్ని ఒక్కో నేత దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తున్న ఉందతాలున్నాయి. ఒక్కో క్వార్టర్‌పై అదనంగా రూ. 20, ఒక్కో బీర్‌పై రూ. 15 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు జిల్లాలనుంచి సమాచారం అందుతోంది. మరోవైపు ఈ వ్యాపారం మరింత వికృతంగా మారిన ఉదంతాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఒక్కో గ్రామంలో అనధికార మద్యం దుకాణానికి వేలం పాటలు పాడించడం, వేలం ద్వారా బెల్టు షాపును దక్కించుకున్న వ్యక్తే మద్యం దుకాణం నడిపించాలని గ్రామ పంచాయతీలు తీర్మానాలు జారీ చేయడం, ఇతరులు విక్రయించినట్లు తేలితే పంచాయితీలు పెట్టి శిక్షలు విధించే సంఘటనలు కూడా జరుతున్నాయని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వీటికి గ్రామాభివృద్ధి నిధి అనే పేరుతో పక్కదారి పట్టిస్తున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి.

ఇప్పటికే కల్తీ మద్యం, కల్తీ కల్లు ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో పాతుకుపోయిందని అబ్కారీ శాఖ గుర్తించింది. దీనిపై నిఘా పెట్టినప్పటికీ పెద్దగా ప్రయోజనం చేకూరలేదు.

పొరుగు రాష్ట్రాలనుంచి...

కర్నాటక, మహారాష్ట్ర, గోవా, పుదుచ్చేరి, హర్యానా, పాండిచ్చేరి, తదితర రాష్ట్రాలనుంచి యధేచ్ఛగా అక్రమ మద్యం దిగుమతి అవుతోంది. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌ను కల్తీ చేసే ముఠాలు పెరిగాయి. అధిక ధరలున్న మేలు రకం మద్యంలో తక్కువ ధర మద్యం నింపడం, ఇతర రాష్ట్రాలనుంచి రెక్టిఫైడ్ స్పిరిట్‌ను తరలించి రాష్ట్రంలో మద్యం కల్తీలకు తెగబడ్తున్న ముఠాలు పెరిగినట్లుగా అబ్కారీ శాఖ అనుమానిస్తోంది. రాష్ట్రంలో ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ ఉత్పత్తి అవుతోంది. మొలాసిస్‌ను ఉడకబెడితే ఆర్ఎస్‌ను ఉత్పత్తి చేయడం, దీనిని మూడుసార్లు వేడిచేస్తే ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ తయారవుతుంది. పక్క రాష్ట్రాలనుంచి అనుమానం రాకుండా ఆర్ఎస్‌ను కొనుగోలు చేసి అందులో నీటిని కలిపి దొంగ లేబుళ్లతో రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఘాటైన ఆర్ఎస్‌లో 50లీటర్లకు 500 లీటర్ల నీటిని కలిపి ప్రముఖ బ్రాండ్ల ఖాళీ సీసాల్లో నింపి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. హర్యానా, గోవా రాష్ట్రాల్లో బీర్, మద్యం ధరలు మన రాష్ట్రాలకంటే ఐదు రెట్లు తక్కువ. ఏటా మూడు కోట్ల మద్యం పెట్టెల విక్రయాలు జరుగుతున్నాయి.

కేంద్రం సూచించినా చర్యలు లేవు...

మద్యంతో కలిగే అనర్థాలు, ప్రమాదాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాదాలకు కారణం మద్యమేనని, దుకాణాలను కట్టడి చేయాలని ఆదేశించినా ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోలేదు. అందుకు భిన్నంగా మద్యం దుకాణాలకు అనుసంధానంగా అనధికారిక బెల్టు షాపులు పెరుగుతూ వస్తున్నాయి. రాష్ట్రంలో లెక్కకి మించిన బెల్టు దుకాణాలు, గరిష్ట చిల్లర ధరకు మించిన అమ్మకాలతో సర్కార్‌కు, వినియోగదారుడికి నష్టం కలిగిస్తున్నా అధికార యంత్రాంగానికి పట్టడంలేదన్న విమర్శలు పెరుగుతున్నాయి. మరోవైపు జాతీయ రహదారులకు 100 మీటర్లలోపు ఉన్న మద్యం దుకాణాల తరలింపుపై కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తే ప్రభుత్వం కొత్త దారులు వెదికింది. అక్టోబర్ వరకు మినహాయింపు కోరడం, మరోవైపు జాతీయ రహదారులను డీ నోటిఫై చేయడం చకాచకా జరిగిపోయింది. తెలంగాణలోని సుమారు 440 మద్యం దుకాణాలను తొలగించకుంటే ప్రమాద మరణాల సంఖ్య అంచనాలకు మించుతుందని జాతీయ రోడ్డు భద్రతా విభాగం కూడా హెచ్చరికలు చేసింది. రాష్ట్రంలోని 16 జాతీయ రహదారుల వెంట ఉన్న అధికారిక, అనధికారిక మద్యం దుకాణాలు ప్రజల ప్రాణాలకు యమ పాశాలుగా మారాయని రోడ్ ఆక్సిడెంట్స్ ఇన్ ఇండియాసర్వేలో తేల్చింది. దేశవ్యాప్తంగా 2013లో 486476 ప్రమాదాలు జరిగి 137572 మంది ప్రాణాలు కోల్పోయారని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇందులో తమిళనాడు 13.6 శాతం ప్రమాదాలతో మొదటి స్థానంలో ఉండగా 8.9 శాతంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 5వ స్థానంలో నిలిచింది. ఇక ప్రమాద మృతుల్లో 11.6 శాతంతో ఉత్తరప్రదేశ్ మొదటిస్థానంలో నిలవగా10.3 శాతం మరణాలతో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో నిల్చింది. ఈ యేడాది 43482 రోడ్డు ప్రమాదాలు జరిగి విజయవాడ, విశాఖ, హైదరాబాద్ నగరాలు 13 శాతంతో గరిష్టప్రమాదాల జాబితాలో చేరాయి. ఇందులో 20290 ప్రమాదాలు మద్యం సేవించడం ద్వారానే జరిగాయని నివేదికలో వెల్లడైంది. హైదరాబాద్, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో హైవేలపై ఉన్న మద్యం దుకాణాలకు సిట్టింగ్ పర్మిట్ ఇవ్వడంతోపాటు బార్ అండ్ రెస్టారెంట్లకు ఇచ్చిన పర్మిట్లను పునః సమీక్షచేయాలని కేంద్రం ఆదేశించింది. ప్రాణాంతకంగా మారిన వీటిని కట్టడి చేయాలని కూడా సూచించింది. ఇందుకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా చర్యలు తీసుకోవాలని కోరింది.

ప్రతిష్టాత్మకంగా ఎస్సారెస్పీ పునరుజ్జీవ సభ

- హాజరుకానున్న ఐదు లక్షల మంది రైతులు!
- ఏర్పాట్ల పర్యవేక్షణలో మంత్రులు హరీష్, ఈటల


హైదరాబాద్, ఆంధ్రప్రభ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మహర్దశ పట్టించే ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి ముఖ్యమంత్రి కెసిఆర్ ఈనెల 10న అంకురార్పణ చేయనుండగా, రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నిజామాబాద్ జిల్లా పోచంపాడులో ఎస్సారెస్పీ వద్ద రూ.2వేల కోట్లతో చేపట్టే ఈ పనులకు సిఎం శంఖుస్థాపన చేయబోతున్నారు. ఎస్సారెస్పీ కింద ప్రస్తుతం 9.2లక్షల ఎకరాల ఆయకట్టు తాజా పథకం ద్వారా 5లక్షల ఎకరాల ఆయకట్టు పెరిగి 14.2లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని ప్రభుత్వం అంచనావేస్తోంది. ప్రస్తుతమున్న పథకం ద్వారా చివరిఆయకట్టుకే నీరందని పరిస్థితి నెలకొనగా, అనేక చోట్ల రైతులు కాల్వలను తమ పొలాల్లో కలిపేసుకున్నారు. ఈ నేపథ్యంలో సిఎం కెసిఆర్ ఈ పునరుజ్జీవ పథకానికి శ్రీకారం చుట్టి రైతాంగంలో కొత్త ఆశలు నింపారు. ఈ నేపథ్యంలో జరిగే పోచంపాడు సభకు రైతులు పెద్ద ఎత్తున కదిలిరానున్నారు. పూర్వనిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుండి ఐదులక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఆ పథకాన్ని ఎస్సారెస్పీకి అనుసంధానించేవిధంగా వ్యూహరచన చేశారు. మేడిగడ్డ నుండి రివర్స్ పంపింగ్ ద్వారా ఎల్లంపల్లి, అక్కడి నుండి నందిమేడారం, వరద కాల్వ ద్వారా ఎస్సారెస్పీలోకి రోజుకో టిఎంసి చొప్పున నీరు వచ్చేవిధంగా ఈ పథకాన్ని రూపొందించారు. ఎస్సారెస్పీ కింద ప్రస్తుతం ఆయకట్టుతో పాటు ప్రాజెక్టుపై ఆధారపడి నిజామాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలో సుమారు 35వరకు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎస్సారెస్పీ పునరుజ్జీవపథకం, కాల్వల ఆధునీకరణ కోసం రూ.2వేల కోట్లు ఖర్చుచేయనున్నారు. ఎస్సారెస్పీ 1983లో పూర్తి అయింది. దీని గరిష్టసామర్థ్యం 90టిఎంసిలు కాగా.. ఇప్పటివరకు గరిష్టంగా రెండుపంటలకు నీళ్ళు అందిన సందర్భాలు బహుతక్కువ.పునరుజ్జీవ పథకం ద్వారా మూడునెలల పాటు సాగునీరు అందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా మెండోర మండలం పోచంపాడు గ్రామపరిధిలోని ఎస్సారెస్పీ వద్ద జరిగే బహిరంగసభలో సిఎం పాల్గొనబోతున్నారు. ఎస్సారెస్పీ ఆధునీకరణ పనులకు ప్రభుత్వం ఇప్పటికూ రూ.1000 కోట్లను మంజూరు చేయగా, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. ఎస్సారెస్పీ పునరుజ్జీవం పథకానికి సంబంధించి కూడా ఇప్పటికే రూ.200కోట్లు మంజూరుచేయగా, మిగిలిన రూ.800కోట్లు కూడా ప్రభుత్వం త్వరలోనే మంజూరుచేయనుంది.

ఏర్పాట్లలో మంత్రుల నిమగ్నం

పోచంపాడు బహిరంగసభ ఏర్పాట్లలో మంత్రులు నిమగ్నమయ్యారు. సభావేదిక వద్ద ఏర్పాట్లను, హెలిపాడ్ ఏర్పాట్లను మంత్రి హరీష్‌రావు, మిషన్ భగీరధ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యవేక్షిస్తుండగా.. జనసమీకరణ ఏర్పాట్లను మంత్రి ఈటల రాజేందర్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల సభలు నిర్వహించిన ఈటల పోచంపాడు సభ ప్రతిష్టాత్మకమని, రైతులంతా పునరుజ్జీవ సంబురానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జోగురామన్న, ఎంపీలు కవిత, వినోద్‌లు కూడా ఏర్పాట్లను పర్యవేక్షించి.. అవసరమైన సహకారం అందిస్తున్నారు.

రబీ ఆశలు గల్లంతేనా!

- నాగార్జునసాగర్ అయకట్టు రైతాంగం నిర్వేదం
- వెక్కిరిస్తున్న ప్రాజెక్టులు..ఎండుతున్న పంటచేలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: చుక్కనీరు రాక నాగార్జునసాగర్ వెలవెల బోతుండడంతో ఆయకట్టు రైతాంగం పరిస్థితి అయోమయంగా ఉంది. భూగర్భజలాలు అడుగంటడం.. ప్రాజెక్టుల్లో నీళ్లు లేక పోవడంతో వరిసేద్యం వెనుకబడిపోయింది. సాగర్‌కు ఈ నెలాఖరు కల్లా నీళ్ళు రాకుంటే నార్లు ముదరనున్నాయి. ఆగస్టు తర్వాత నాట్లు వేసినా ధాన్యం దిగుబడులు రావు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ లేదా అక్టోబర్ నుండి అవసరమైతే ఆయకట్టులో ముందస్తు రబీకి రైతులను సిద్ధం చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు. మరో వారంలో వర్షాలు పడకుంటే.. పంటల పరిస్థితి దారుణంగా ఉండనుండగా, ఖరీఫ్ ఖతమైనట్లేనని ఆరుతడి పంటలే దిక్కని అధికారులు చెబుతున్నారు.

ఈ ఏడాది కృష్ణమ్మ కర్ణాటక నుండి కదలకపోవడంతో.. కృష్ణా జలాలు.. తెలంగాణకు ముఖం చాటేశాయి. గత ఏడాది జూరాలకు పెద్దఎత్తున వచ్చిన వరదతో పాలమూరు జిల్లాలు సస్యశ్యామలం కాగా, ఈ ఏడాది పాలమూరు కూడా ఆందోళన చెందుతోంది. ఇక నాగార్జునసాగర్ పరిధిలో గత ఏడాదే ఖరీఫ్ కటీఫ్ కాగా, ఈ ఏడాది కూడా పరిస్థితి అలానే ఉంటుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ ద్వారా నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. నీరు లేక ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మరోవైపు తాగునీటి సమస్య కూడా పొంచి ఉంది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు కలిపి సాగర్ ద్వారా 3.8లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, కనీస నీటిమట్టం కంటే దిగవన నీరుండడం.. చుక్కనీరు కూడా ఆగస్టు మొదటివారం వచ్చినా రాకపోవడంతో రైతుల్లో తీవ్ర బాధ వ్యక్తమవుతోంది. గత ఏడాది ఆలస్యంగా వచ్చిన వరదతో రబీసాగయినా.. ఈ ఏడాది మళ్ళీ అదే సీన్ రిపీట్ అవుతుందన్న ఆందోళన ఉంది. కృష్ణ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టగా, వరదలు నిలిచిపోవడంతో.. ఇప్పటిదాకా శ్రీశైలం ప్రాజెక్టుకే చుక్కనీరు రాలేదు.

ఇక నాగార్జునసాగర్ పరిస్థితి మరింత ఘోరం. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 778 అడుగుల వద్ద 19.68టిఎంసిల నీరు నిల్వ ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో లేక పోవడంతో నాగార్జునసాగర్‌కు నీరొచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో సాగర్ రిజర్వాయర్‌పై ఆశలు సన్నగిల్లాయి. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 500.5 అడుగుల వద్ద 116.10 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం మంచి నీటి కోసం సాగర్ నుండి రోజుకు 400క్యూసెక్కుల చొప్పున ఎస్ఎల్‌బిసికి విడుదల చేస్తున్నారు. సాగర్‌లో డెడ్ స్టోరేజీ కంటే మరింత లోతుకు నిల్వలు పడిపోగా, ఇలానే ఉంటే తాగునీటి కష్టాలూ తప్పకపోవచ్చన్న ఆందోళన ఉంది.

ప్రాజెక్టులు వెలవెల

ప్రాజెక్టులన్నీ వెలవెలలాడుతున్నాయి. ఎగువ నుండి వరద రాక.. రైతాంగంలో ఆందోళన కలిగిస్తున్నాయి. జూరాల రిజర్వాయర్ పూర్తిగా నిండకపోవడంతో ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టు సాగు దారుణంగా పడిపోయింది. గత ఏడాది జూలైలో రిజర్వాయర్ నిండి, ఆయకట్టు రైతులంతా ఉత్సాహంగా దుక్కులు దున్నుతున్నారు. ఈ ఏడాది కృష్ణానదికి వరదలు రాకపోవడం, కాల్వలకు నీరు వదలక పోవడంతో ఖరీఫ్‌లో 61,435ఎకరాల్లో వరి సాగవ్వాల్సిఉండగా, 10,681ఎకరాల్లోనే సాగు చేశారు. కరీంనగర్ పెద్దపల్లి జిల్లాల్లో 10వేల హెక్టార్లలో కూడా వరి నాట్లు పడలేదు. ఈ సీజన్‌లో శ్రీశైలం, నాగార్జునసాగర్‌లోకి కనీస నీటి ప్రవాహాలు కూడా నమోదు కాలేదన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిస్థితి ఇదే. నారాయణపూర్ ప్రాజెక్టు నుండి జలవిద్యుత్ కోసం 15వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా, ఇందులో 6వేల క్యూసెక్కులను మించి నీరు దిగువకు రావడం లేదు. ప్రారంభంలో జూరాల ప్రాజెక్టులో 9.657టిఎంసిలు ఉండగా, కర్ణాటకలో కురిసిన వర్షాలు.. వరదలు వస్తాయన్న అంచనాలతో ప్రాజెక్టు నుండి నీటిని ఇతర ప్రాజెక్టులకు వదిలారు. ఫలితంగా ప్రాజెక్టు అడుగంటగా, ఎగువ నుండి వచ్చిందేమీ లేదు. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.11 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉండగా, 6703క్యూసెక్కుల వరద ప్రాజెక్టులోకి వస్తోంది.

ప్రాజెక్టుల వారీగా నీటినిల్వలు


ప్రాజెక్టు	పూర్తిసామర్థ్యం (టిఎంసిలలో)	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో (క్యూ.లో)
నారాయణపూర్	37.64	36.85	9152
జూరాల	9.66	6.11	6703
శ్రీశైలం	215.8	19.62	76
నా.సాగర్	312.05	116.10	668
సింగూరు	29.91	17.78	0
నిజాంసాగర్	17.80	1.35	0
శ్రీరాంసాగర్	90.31	9.44	0
ఎల్లంపల్లి	20.18	10.38	16

నేడు నాయీ బ్రాహ్మణ సమాఖ్య అధునాతన యంత్రాల ప్రదర్శన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సహకార సంఘాల సమైఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని బేగంపేట్ ప్యాలెస్, యుఎస్ కౌన్సిల్‌కు సమీపంలో హేర్ స్టైల్స్, బ్యూటీషియన్‌పై అధునాత యంత్రాల ప్రదర్శన, డెమోలను ఏర్పాటు చేసింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ సమావేశానికి మంత్రులు జోగురామన్న, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఈటల రాజేందర్ తదితరులు హాజరుకానున్నారు.

విశాఖలో రూ. 1.92 కోట్ల పాతనోట్ల స్వాధీనం

విశాఖపట్నం, కెఎన్ఎన్ : కేంద్ర ప్రభుత్వం పెద్దనోట్లు రద్దు చేసి నెలలు గడుస్తున్నా ఇంకా ఏదో ఒక ప్రాంతంలో పాతనోట్లు దర్శనమిస్తూనే ఉన్నాయి. తాజాగా విశాఖలో రద్దు చేసిన పాతనోట్లను చెలామణి చేస్తున్న ముఠాను విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం విశాఖ పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ దాడి నాగేంద్రకుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బర్మాక్యాంపు ప్రాంతానికి చెందిన గెద్దం కళ్యాణ్‌కుమార్ ఈ వ్యవహారంలో కీలక నిందితుడుగా పోలీసులు గుర్తించారు. కళ్యాణ్, గుడ్ల వెంకటరమణలు కలిసి గతంలో పాతనోట్లు మార్పిడిలో ఇద్దరూ మీడియేటర్స్‌గా వ్యవహరించారు. వీరు పాతనోట్లు మార్చి కమిషన్ స్వీకరించడం అలవాటుగా చేసుకున్నారు.



చెన్నై : తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌తో బీజేవైఎం జాతీయ అధ్యక్షురాలు పూనమ్ మహాజన్ భేటీ

ఆంధ్రప్రభ

మంగళవారం 8 ఆగస్టు 2017

రాజ్‌భవన్‌లో రక్షాబంధన్



రాఖీ పౌర్ణిమ సందర్భంగా సోమవారం రాజ్‌భవన్‌లో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం దర్బార్ హాల్‌లో కొలువు దీరిన గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌తోపాటు ఆయన సతీమణి విమలా నరసింహన్ తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలతో పాటు నగరంలోని వివిధ పాఠశాలనుంచి వచ్చిన బాలికలు గవర్నర్ దంపతులకు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు పొందారు. అన్నా చెల్లెళ్ల మధ్య అభిమానం ఆప్యాయతలను సూచించే రాఖీ పండగ ఈ దేశంలో మంచి సాంప్రదాయాంగా వస్తోందని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ ఇంట రాఖీసందడి



ముఖ్యమంత్రి కెసిఆర్ ఇంట రాఖీపర్వదిన కోలాహలం నెలకొంది. ముఖ్యమంత్రి కెసిఆర్ సోదరీమణులు ప్రగతిభవన్‌లోని ఆయన నివాసంలో రాఖీ కట్టారు. ఈ సందర్భంగా కెసిఆర్ తన సోదరీమణుల కాళ్లకు నమస్కరించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌కు తొమ్మిదిమంది అక్కాచెల్లెళ్లు ఉండగా, కుటుంబసభ్యులతో ఇల్లంతా పండుగసందడి నెలకొంది.

కేటీఆర్‌కు హెల్మెట్ బహుకరణ



సిస్టర్స్ ఫర్ చేంజ్ నినాదంతో దేశవ్యాప్తంగా ఆలోచన రేకెత్తించిన కవిత సోమవారం తన సోదరుడు కల్వకుంట్ల తారకరామారావుకు రాఖీ కట్టి హెల్మెట్ బహుకరించారు. సోదరుల రక్షణ కోసం అంతా హెల్మెట్ బహుకరించాలని పిలుపునిచ్చిన కవిత ప్రగతిభవన్‌లోని సీఎం నివాసంలో రాఖీ కట్టి హెల్మెట్ బహుకరించారు. ఈ సందర్భంగా కవితకు మంత్రి కెటిఆర్ చేనేత చీరను బహుకరించారు.

మంత్రి హరీష్ నివాసంలో...



రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి హరీష్‌రావుకు సిద్దిపేటకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున రాఖీలు కట్టారు. వేకువజామునే మంత్రి ఇంటికి భారీగా తరలివచ్చిన మహిళలు మంత్రికి రాఖీలు కట్టారు. సిద్దిపేట మహిళలకు తాను సదారక్షణగా ఉంటానని, అక్కాచెల్లెళ్ళ అభిమానానికి కృతజ్ఞుడిగా ఉంటానని మంత్రి హరీష్ అన్నారు.

బీజేపీ కార్యాలయంలో...



రాఖి పండుగ పురస్కరించుకుని బీజేపీ కార్యాలయంలో మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ ఆధ్వర్యంలో రక్షా బంధన్ నిర్వహించారు. కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఆ పార్టీ ఎల్పీ నేత కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావుతో పార్టీ నేతలకు రాఖీలు కట్టారు.

ఉత్తమ్‌కు మహిళా కాంగ్రెస్ నేతల రాఖీ



రక్షాబంధన్‌ను పురస్కరించుకుని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద నేతృత్వంలో మహిళా నేతలు సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి నివాసంలో ఆయనకు రాఖీలు కట్టారు. రాఖీలు కట్టిన వారిలో నేరెళ్ల శారదతో పాటు మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దుర్గారాణి, కార్యదర్శులు స్వరూప, నమ్రత, సంయుక్త కార్యదర్శి పద్మ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు మల్లీశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి ఉన్నారు. తనకు రాఖీలు కట్టినందుకు ఉత్తమ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్మీ ఆధ్వర్యంలో...



ఆర్మీ కూడా రక్షాబంధనాలు ఘనంగా జరుపుకుంది. సికింద్రాబాద్‌లో మేజర్ జనరల్ ఎన్.శ్రీనివాసరావు రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిలు, బాలికలు సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో శ్రీనివాసరావుకు, ఆర్మీసిబ్బందికి రాఖీలు కట్టారు.

విన్నపాలు వినవలె

- ప్రధాని ఆగస్టు 15 ప్రసంగానికి సలహాలు, ఫిర్యాదుల వెల్లువ
- పదిహేను రంగాలపై యువత, మేధావుల సూచనలు, ఫిర్యాదులు



న్యూఢిల్లీ: పంద్రాగస్టు రోజున ఎర్రకోటపై నుంచి తాను చేయబోయే ప్రసంగానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గతనెల మన్‌కీ బాత్‌లో దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. గత మూడేళ్లుగా తన ప్రసంగాలకు దేశనలుమూలల నుంచి అనేకమంది సలహాలు ఇస్తూవచ్చారు. అందులో కొన్ని ఫిర్యాదులూ ఉన్నాయి. అలా అందిన సలహాలతో తన ప్రసంగం నిడివి చాలా ఎక్కువ అవుతుంది. అప్పటికీ దానిని 45-50 నిముషాలకు కుదించడం జరుగుతోందని పేర్కొన్నారు. ''ఆగస్టు 15న ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించే అవకాశం నాకు లభించింది. అయినా నేను ఒక మాధ్యమం మాత్రమే. ఇది ఒక వ్యక్తి మాట్లాడే తంతుకాదు. 125 కోట్ల మంది పౌరుల గొంతుక ఇక్కడ ప్రతిధ్వనించాలి' అని మోడీ స్పష్టంచేశారు. ప్రధాని పిలుపునకు స్పందించి ఇప్పటికే అనేకమంది తమ సలహాలను, ఫిర్యాదులను చేరవేశారు. ముఖ్యంగా 15 రంగాలపై యువత, మేధావులు తమ అమూల్యమైన సూచనలు చేశారు.

రక్షణరంగం

మేమూ సైన్యంలో చేరతాం.. మాకొక అవకాశం ఇవ్వండి. అటు చైనా డొక్లామ్ వద్ద భారత్‌ను వేధిస్తోంది. ఇటు నియంత్రణ రేఖవెంబడి పాక్ బలగాలు ప్రతినిత్యం కాల్పుల ఉల్లంఘనకు దిగుతూ రెచ్చగొడుతున్నాయి. ఎర్రకోట వేదికగా, త్రివర్ణ రెపరెపల సాక్షిగా ఆ రెండు దేశాలను గట్టిగా హెచ్చరించండి. వారి చర్యలు ఎంత మాత్రం క్షమార్హం కాదని చెప్పండి. చైనా వస్తువుల బహిష్కరణకు పిలుపునివ్వండి అని సందీప్ టాండరే ప్రధానికి సూచించారు. రక్షణ పరికరాల తయారీలో 'మేక్ ఇన్ ఇండియా'కు ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా డబ్బు ఆదా అవుతుంది. ఉపాధి అవకా శాలూ పెరుగుతాయని వైభర్ దేవాచె సూచించారు. ఇదివరకు సైన్యంలో చేరలేక పోయిన మాలాంటి వారికి మరొక అవకాశం ఇవ్వండి అని సర్బ్‌జీత్ సింగ్ కోరారు.

రిజర్వేషన్లు..

జనరల్ కేటగిరీ విద్యార్థిగా రిజర్వేషన్లను నేను తప్పుబడుతున్నాను. అవి అవసరాన్ని బట్టిమాత్రమే ఉండాలి. పుట్టుకతో దానిని ముడిపెట్టొద్దు. సమానత్వ సాధనే రిజర్వేషన్ల పరమార్థమైతే.. కొన్ని వర్గాల వారు కేవలం కులం పేరుతో అవకాశాలను కొల్లగొడుతుంటే మేము పరోక్షంగా వివక్షకు గురవుతున్నట్లే కదా? అని అస్మితా పంత్ అనే యువతి మోడీని సూటిగా ప్రశ్నించింది. గొప్పగొప్ప స్థాయిల్లో ఉన్న కుటుంబాలకు అంటే, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్, బీఎస్పీ అధినేత్రి మాయావతి వంటి కుటుంబాలకు రిజర్వేషన్లు నిలిపివేయండంటూ ఆర్తిగుప్తా భరద్వాజ్ విజ్ఞప్తిచేశారు.

స్వచ్ఛభారత్..

కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ ఆరంభశూరత్వంగానే మిగిలింది. చాలా చోట్ల నీటికొరత కారణంగా శౌచాలయాలు నిరుపయోగంగా పడివున్నాయి. దీంతో బహిరంగ ప్రాంతాల్లో మల,మూత్ర విసర్జన నియంత్రణ అటకెక్కింది. ప్రధానిగారూ, మీపట్ల మాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. నిస్సందేహంగా చెబుతున్నాం...మీరు దేశం కోసం అహర్నిశలు పనిచేస్తున్నారు. అయినా మీ దృష్టికి కొన్ని అంశాలు తీసుకురావాల్సి వస్తోంది. మీరు స్వచ్ఛఅభియాన్ ప్రారంభించినా మా నగరం ఇప్పటికీ మురికి కూపంలోనే ఉంది. నేను నా పరిసరాలను శుభ్రంగా ఉంచుతాను. ఇతరుల మాటేమిటి? దీనికి పరిష్కారం మీరే చూపాలి అని అస్మితా పంత్ సూచించారు.

ఆరోగ్యం..

అన్ని స్థాయిల్లో విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించండి. కొన్నిచోట్ల ప్రభుత్వ ఆసుపత్రులు లేవు. ఉన్నచోటేమో సిబ్బంది సరిగా పనిచేయరు. గత్యంతరం లేక పట్టణాల్లో కార్పొరేట్ ఆసుపత్రులకు వెళితే పీల్చిపిప్పి చేస్తున్నారు. మాకు ఈ దుస్థితిని తప్పించండి. అదేవిధంగా చొక్కా జేబులు ఎడంవైపు కాకుండా, కుడివైపు ఉండేలా నిర్దిష్ట ఆదేశాలు జారీచేయండి. మొబైల్ జేబులో ఉంచడం వల్ల రేడియేషన్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది అని యశ్వంత్ పరాటే ప్రధానికి సందేశం పంపారు. కాగా, ఆరోగ్య విభాగంలో పొరుగు సేవలను నిలిపివేయాలంటూ మరొకరు విజ్ఞప్తి చేశారు.

విద్య...

ఆన్‌లైన్ పరీక్షల విధానాన్ని మరింత పటిష్టం చేయండి. నీట్ పీజీ ఎగ్జామినేషన్ తరహా కుంభకోణాలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోండి అని అనురాగ్ అనే విద్యార్థి విజ్ఞప్తి చేశారు. కాగా, దేశవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే బోర్డు విధానం అమలు చేయాలని మహేశ్ రామచంద్ర సింగ్ సూచించారు. డిగ్రీలో నైపుణ్య అభివృద్ధిని తప్పనిసరి కోర్సుగా ప్రవేశపెట్టాలని, అదేవిధంగా విద్యారుణాలపై వడ్డీ రేట్లు తగ్గించాలని పలువురు విజ్ఞప్తులు చేశారు. విద్యావంతులైన గృహిణులకు ఉద్యోగ అవకాశాలున్నాయని, దేశనిర్మాణంలో వారి సహాయాన్నీ పొందాలని అంతిమా మొకావత్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల పిల్లలు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా ఆదేశించాలని నరేంద్ర చౌహాన్ విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగ కల్పన...

ప్రయివేటు రంగంలోని వారికి ఉద్యోగభద్రత కల్పించాలి. క్రమం తప్పకుండా ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. ఇందుకు ఆయా సంస్థల యాజమాన్యం బాధ్యత వహించేలా చేయాలి. లక్షలాది మంది గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఉన్నారు. జీవన పోరాటంలో చెడుదారులు పడుతున్నారు. దయజేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచండి అని స్వయం శుక్లా మోడీకి విన్నవించారు.

జీఎస్టీ...

దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు ఒకేలా ఉండేలా చూడండి. చట్టంలోని చిన్నచిన్న లోపాలు జీఎస్టీ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నాయి. పన్ను ఎగవేత దారులను గుర్తించి, కఠినంగా శిక్షించాలి. పెద్దమొత్తంలో జరిమానా విధించి, వారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలి.

జాతీయత..

రాష్ట్రాలకు ప్రత్యేక జెండాలు వద్దు. అలాంటి చర్యలను నిషేధించండి. దేశవ్యతిరేక శక్తులను కఠినంగా శిక్షించండి. దేశ నిర్మాణంలో పౌరుల పాత్రను గుర్తుచేయండి. ప్రతి ఒక్కరు దేశాన్ని గౌరవించేలా, ప్రేమించేలా చేయాలి. దేశమే ముందు.. ఆ తర్వాతే ఏదైనా అనే సంకల్పం బలపడాలి.

ఎన్నికల సంస్కరణలు

ప్రభుత్వం ఇప్పటికే ఏకకాల ఎన్నికలపై దృష్టిసారించింది. హర్షణీయం. అదే సమయంలో ఎన్నికైన ప్రజా ప్రతినిధిని రీకాల్ చేసే విధానం కూడా తీసుకొస్తే మంచిది.

అభివృద్ధి, పరిపాలన...

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం కావాలి. పేదలకు, సహాయార్థులకు చేయూతనిచ్చేలా డొనేట్ డే (వితరణ దినోత్సవం) ప్రకటించాలి. రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు సహాయపడే సమయంలో పోలీసుల వేధింపులు లేకుండా చేయాలి. స్మార్ట్ నగరాల మాదిరిగానే స్మార్ట్ పట్టణాలు, గ్రామాల పథకాన్ని ప్రారంభించాలి. గ్రామాల నుంచి పట్టణాలకు, పట్టణాల నుంచి నగరాలకు వలసలను క్రమేణా నియంత్రించాలి. అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులోకి వస్తే ఈమార్పు సాధ్యమవుతుంది. ఉద్యోగ, ఉపాధి కల్పనతో వలసలకు చెక్ చెప్పవచ్చు. అదేవిధంగా అవినీతి నిరోధానికి గాను ఆర్‌టీఐని మరింత బలోపేతంచేయాలి.

వ్యవసాయం...

అన్నదాతలు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. వ్యవసాయంలో పీపీపీ విధానాన్ని అమలు చేయాలి. సాగుభూమి రైతులది. అందుకు అవసరమైన పెట్టుబడులన్నీ కార్పొరేట్ సంస్థలు సమకూర్చాలి.ఈ విధానంతో అన్నదాతపై ఆర్థిక ఒత్తిళ్లు తగ్గుతాయి.

విద్యుత్...

పట్టణాలు, పల్లెలు అనే తేడాలేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరగాలి. సాయంత్రం ఆరు గంటల తర్వాత సరఫరాలో ఏదైనా సమస్య తలెత్తితే మరుసటి రోజుదాకా అది పరిష్కృతం కావడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు ఇది నాలుగైదు రోజులకు కూడా చేపట్టం లేదు. దీంతో గ్రామాలు రోజుల తరబడి అంధకారంలో మగ్గాల్సి వస్తోంది.

శాంతిభద్రతలు...

రాజకీయ హత్యలు.. కేరళ, ప.బెంగాల్ రాష్ట్రాల్లో హిందువులపై జరుగుతున్న దాడులను తక్షణమే అరికట్టాలి. ఇలాంటి వాటిపై కఠిన చర్యలు చేపట్టాలి. శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇవ్వాలి. దేశవ్యాప్తంగా పౌరులు భద్రతపై ధీమాతో ఉండే రోజులు రావాలి.

ఇతర అంశాలు..

యూనిఫారమ్ సివిల్‌కోడ్ అమలు చేయాలి. ఒకేదేశం.. ఒకే చట్టం దిశగా అడుగులు వేయాలి. గోవధశాలలను నిషేధించారు సరే. గోశాలల కోసం నిధులు సమీకరించాలి. గోవుల సంరక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి. కోర్టుల్లో పేరుకుపోయిన కేసుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలి. న్యాయస్థానాల పట్ల ప్రజల్లో గౌరవం పెరగాలంటే సత్వర న్యాయం జరిగి తీరాలి.

చంద్రబాబుకు రాఖీ కట్టిన సీతక్క



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ తెలంగాణ సీనియర్ నాయకురాలు, మాజీ శాసనసభ్యురాలు ధనసరి అనసూయ (సీతక్క) రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాఖీకట్టారు. అమరావతిలోని చంద్రబాబు నివాసంలో సోమవారం ఉదయం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పరిటాల సునీత, కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తదితరులు చంద్రబాబుకు రాఖీ కట్టిన వారిలో ఉన్నారు.

నా ఎన్నిక శ్రీవారి చలవే



తిరుమల , కెఎన్ఎన్ : సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన తనకు భారదేశంలోనే అత్యున్నతమైన రాజ్యాంగబద్ధమైన రెండో బాధ్యత అయిన ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యే అవకాశం శ్రీవారి ఆశీస్సుల వల్లే వచ్చిందని, ఇది తన జీవితంలో మరచిపోలేని ఘట్టమని ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యానాయుడు అన్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆయన సోమవారం ఉదయం శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. దేశ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని కోరుకు న్నట్లు చెప్పారు.తిరుమల శ్రీవారి దర్శనం వల్ల మరింత ఉత్సా హం, ధైర్యం, శ్వాంతన, స్ఫూర్తి, విశ్వాసం, వెలుగు వస్తుందన్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో, తిరుమల జేఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటంను అందచేశారు.

గోరటి, సుద్దాలకు జాలాది పురస్కారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రఖ్యాత సినీకవి జాలాది పేరిట స్థాపించిన జాతీయ ప్రతిభా పురస్కారాలు - 2017కు ప్రజాకవి గోరటి వెంకన్న, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజను ఎంపిక చేశారు. జాలాది కళా పరిషత్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ డాక్టర్ జాలాది విజయ ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో పురస్కారాలకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఒక మహాకవి పేరిట సంస్థ ఏర్పాటు చేసి, ఏటా ఆయన జయంతి రోజు (ఆగస్టు 9న) అవార్డులు అందజే యడం హర్షనీయమన్నారు. జాలాది విజయ మాట్లాడుతూ, జిరిపురంలోని ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పలువురు సినీ, టీవీ కళా కారులకు ఆత్మీయ సత్కారాలు అందజేయన్నట్లు తెలిపారు.

ఈసీ చొరవ తీసుకోవాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలో ఎన్నికల ఖర్చును అదుపు చేసేందుకు ఎన్నికల సంఘం (ఈసీ) చొరవ తీసుకోవాలని మంత్రి కేటీ రామారావు సూచించారు. హిందూ దినపత్రిక మాజీ ఎడిటర్ ఇన్ చీఫ్ ఎన్ఎం రామ్ రాసిన 'వై స్కామ్స్ ఆర్ హియట్ టు స్టే' పుస్తకాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు పెరిగిపోతోందన్నారు. ప్రపంచంలోని ఏ దేశం ఎన్నికల్లో ఖర్చు చేయని విధంగా అమెరికా ఖర్చు చేస్తుందని ఆయన తెలిపారు. అవినీతివల్ల కలిగే అనర్థాలపై పాఠశాల స్థాయిలోనే పిల్లలకు అవగాహన కల్పించాలని, మీడియా ఎలాంటి వార్తలను రాసిన అంతిమ నిర్ణయం ప్రజలదేనని మంత్రి అన్నారు. అనంతరం రామ్ మాట్లాడుతూ, అవినీతి కన్నా లాబీయింగ్ ప్రమాదకరమైందని అన్నారు. అంతకు ముందు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో రామ్ సమావేశమయ్యారు. ఆయన రాసిన పుస్తకాన్ని కేసీఆర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సమకాలీన అంశాలతో పాటు తెలంగాణ ఉద్యమం కొత్త రాష్ట్రం పయనిస్తున్న తీరుపై వారిద్దరు చర్చించారు.

గులాబీనేతలపై కమలం గురి!

- తెలంగాణలో బలపడేందుకు పక్కా ప్లాన్
- టీఆర్ఎస్ నేతలతో అమిత్ షా మంతనాలు..?
- అసెంబ్లీ సీట్లను పెంచకపోవడానికి కారణం ఇదే అంటున్న రాష్ట్ర బీజేపీ నేతలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో బలపడేందుకు బీజేపీ పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఇతర పార్టీల్లోని అసంతృప్తులపై నిఘాపెట్టిన 'కమలం' ప్రధానంగా 'గులాబీ' నేతలపై గురిపెట్టినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో పాగా వేయాలని పట్టుదలతో ఉన్న బీజేపీ ఛీఫ్ అమిత్ షా.. అందుకు తగిన ప్రణాళికనే రూపొందిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. మూడు నెలల క్రితం రాష్ట్రపర్యటకు వచ్చినప్పుడే కాంగ్రెస్, టీడీపీకి చెందిన పలువురు సీనియర్లు బీజేపీలో చేరుతారని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలోని కొంత మంది ముఖ్య నేతల్లో సమన్వయ లోపం కారణంగా చేరికలు వాయిదాపడినట్లు, పార్టీ చీఫ్ అమిత్ షా కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తంమీద బీజేపీ కన్ను రాష్ట్రంలోని అధికార టీఆర్ఎస్‌పై పడినట్లు తెలిసింది. అధికార పార్టీకి చెందిన ఒకరిద్దరు ఎంపీలతో బీజేపీ హైకమాండ్ మంతనాలు సాగిస్తున్నట్లు కూడా జోరుగా ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులైన రాం మాధవ్, మురళీధర్‌రావులకు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కొన్ని బాధ్యతలు హైకమాండ్ అప్పగించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఇద్దరు నేతలు ఆర్ఎస్ఎస్ నుంచి రావడమే కాకుండా ఇతర రాష్ట్రాల్లో పార్టీ ఇన్‌చార్జీలుగా పని చేయడం, మంచి వాగ్దాటి ఉండటం వల్ల మేలు జరుగుతుందనే ఆలోచనలో ఉన్నారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి రాంమాధవ్ హాజరుకావడం వెనక పక్కా ప్లాన్ ఉన్నట్లు సమాచారం.

గతంలో బీజేపీతో సంబంధాలుండి, టీఆర్ఎస్‌లో చేరిన వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లుగా పార్టీ వర్గాల సమాచారం. కాగా రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్, టీడీపీలకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు చాల మంది సీనియర్లను సీఎం కేసీఆర్ పార్టీలోకి చేర్చుకుని గులాబీ కండువాలు కప్పారు. దీంతో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటి చేసేందుకు నలుగురైదుగురు పోటి పడుతున్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశం ప్రకారం అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని, అందరికి అవకాశాలు ఉంటాయని కేసీఆర్ భరోసా కల్పించారు. అయితే కేంద్రం అసెంబ్లీ సీట్ల పెంపుపై నీళ్లు చల్లడంతో టీఆర్ఎస్‌లోని మెజార్టీ నేతలు తమ వైపు వస్తారన్న ఆశతో కమలం నేతలు ఉన్నారు. అసెంబ్లీ సీట్లను పెంచొద్దని రాష్ట్ర బీజేపీ నేతలు పార్టీ అధిష్టానానికి, కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ సీట్లు పెరగడం వల్ల టీఆర్ఎస్‌కే లాభమని, బీజేపీకి ఎలాంటి ప్రయోజనం ఉండదని సూచించారు. దీంతో పార్టీ హైకమాండ్ కూడా రాష్ట్ర పార్టీ సూచనల మేరకే.. సీట్ల పెంపు అంశాన్ని పక్కనపెట్టిందని చెబుతున్నారు.

రాష్ట్రంలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించుకునేందుకు గాను సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వం బిల్లులకు ఇప్పటిదాకా మద్దతు ప్రకటించారు.

జీఎస్టీ బిల్లు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ మద్దతు ప్రకటిం చింది. తీరా అసెంబ్లీ సీట్ల పెంపు ఇప్పట్లో కుదరని కేంద్రం స్పష్టం చేయడంతో సీఎం కేసీఆర్ తీవ్ర ఆగ్రహానికి గురై.. జీఎస్టీ విషయంలో న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించడం కూడా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే జీఎస్టీ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు.. ప్రధానమంత్రి నరేంద్రమోడిపై ఈగ వాలనీయలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన విమర్శలను బీజేపీ సభ్యులు సభలో ఉండగానే సీఎం కేసీఆరే తిప్పికొట్టారు. ఇప్పుడు కేంద్రానికి వ్యతిరేకంగా గళం విప్పడంపై రాజకీయ వర్గాల్లో పలు రకాలుగా చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వానికి అన్ని రకాలుగా సహకరిస్తున్నప్పటికి.. తాము చేసిన సూచనలను పరిగణలోకి తీసుకోకపోవడం మే ఇందుక్కారణమని అంటున్నారు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు చేత సోదరుడికి హెల్మెట్ ఇప్పిస్తున్న సోదరి



అమృత్‌సర్‌లో జవాన్లకు రాఖీలు కడుతున్న విద్యార్థులు



అహ్మదాబాద్‌లోని జగన్నాథ ఆలయంలో ప్రధాన అర్చకుడికి రాఖీ కట్టి తిలకం దిద్దుతున్న ముస్లిం మహిళ

షా.. షో.. పటేల్.. ఫైట్

- రసకందాయంలో గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు
- నేడే పోలింగ్
- కాంగ్రెస్‌కు ఎన్సీపీ మద్దతు
- క్రాస్ ఓటింగ్, నోటాపై ఉత్కంఠ
- షా.. పటేల్‌లలో గెలుపెవరిది..?



అహ్మదాబాద్: రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో గుజరాత్ రాజకీయ ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. గుజరాత్ నుంచి పెద్దల సభకు వెళ్లే ఆ ముగ్గురు ఎవరన్నదానిపై చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నువ్వా-నేనా అన్నట్లుగా పోటీపడుతున్నాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అహ్మద్ పటేల్‌కు పోటీగా రంగంలోకి దిగడంతో రాజ్యసభ ఎన్నికలు రసవత్తరంగా మారిపోయాయి. షా షోతో ఇప్పటికే పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ గూటికి చేరడంతో 44 మంది హస్తం పార్టీ ఎమ్మెల్యేలను పార్టీ అధినాయకత్వం 10 రోజుల పాటు బెంగళూరులోని ఓ రిసార్ట్ కు తరలించింది. మంగళవారం రాజ్యసభ ఎన్నికలు కావడంతో ఎమ్మెల్యేలంతా బెంగళూరు నుంచి గుజరాత్ వచ్చేశారు. అయితే ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఆ 44 మంది ఎమ్మెల్యేలు బయటకు వెళ్లకుండా కాంగ్రెస్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఎయిర్ పోర్టు నుంచి వారందరిని ప్రత్యేక బస్సుల్లో ఆనంద్‌లోని ఓ రిసార్ట్‌క ు తరలించారు. ఒక ఎంపీ గెలుపుకు 45 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం కావడంతో కాంగ్రెస్ ఇతర పార్టీల మద్దతుపై ఆధారపడింది. తమ పార్టీకి చెందిన 57మంది ఎమ్మెల్యేలలో పలువురు చేజారగా మిగిలిన44 మంది ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు, నోటాకు ఓటు వేయకుండా ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

మా ఎమ్మెల్యేలపై నాకు నమ్మకముంది: పటేల్

బెంగళూరు నుంచి గుజరాత్ చేరుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ఆ పార్టీరాజ్యసభ అభ్యర్థి భేటీ అయ్యారు. తనను గెలిపించడంలో ఎమ్మెల్యేలంతా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై తనకు నమ్మకముందని...44 మందిలో ఏ ఒక్కరూ క్రాస్ ఓటింగ్ పాల్పడబోరని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ కుటిల రాజకీయాలకు తెరతీసిందని ఆరోపించిన అహ్మద్ పటేల్...వారి ఉడత బెదిరింపులకు ఎవరూ లొంగలేరని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేయడమే బీజేపీ లక్ష్యమని ఆరోపించిన ఆయన.. మైనారిటీలకు సొంతిళ్లు దక్కనీయరని మండిపడ్డారు. రాజ్యసభ ఎన్నికల్లో తమకు మద్దతు పలికేందుకు నేషనల్‌కాంగ్రెస్ పార్టీ ముందుక ు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

నేను చేయాలనుకున్నదే చేస్తా: వాఘెలా

గుజరాత్ స్థానాలకు జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో కీలకంగా మారిన కాంగ్రెస్ బహిష్కృత నాయకుడు శంకర్ సిన్హా వాఘెలా తన మనోగతాన్ని బయటపెట్టారు. తాను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణకు గురైనప్పటికీ..పార్టీతో ఉన్న సుధీర్ఘ అనుబంధం, అహ్మద్ పటేల్‌తో ఉన్న మైత్రి దృష్ట్యా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఓటేస్తానని చెప్పకనే చెప్పారు. ఇప్పటికే తాను అహ్మద్ పటేల్‌తో భేటీ అయి పలు కీలక అంశాలపై చర్చించానని చెప్పారు. గుజరాత్ స్థానాలకు జరిగే రాజ్యసభ ఎన్నికల్లో ఏం చేయాలో..ఏం చేయకూడదో తనకు తెలుసని చెప్పుకొచ్చారు. రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలతో వాఘేలాను కాంగ్రెస్ అధినాయత్వం సస్పెండ్ చేసిన కొన్ని గంటలకు ఆయన పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు.

గెలుపుపై అమిత్ షా ధీమా

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మట్టికరిపించాలని బరిలోకి దిగిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా వ్యూహాలకు పదునుపెంచారు. మంగళవారం ఎన్నికలు కావడంతో మూడు రోజుల ముందే గుజరాత్ చేరుకుని రాజకీయాలు చక్కబెడుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయక ుడు అహ్మద్ పటేల్‌కు పోటీగా రంగంలోకి దిగిన షా.. షో ప్రారంభించారు. ఇప్పటికే పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆపరేషన్ ఆకర్ష్ ప్రయోగించిన షా.. మరికొంత మందిని క ూడా ప్రలోభాలకు గురిచేశారని ప్రచారం జరుగుతోంది. క్రాస్ ఓటింగ్, నోటా లకు పాల్పడవద్దని కాంగ్రెస్ తమ ఎమ్మెల్యేలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినప్పటికీ ..రాజకీయ



భవిష్యత్ కల్పిస్తామని కొంతమందికి షా మాటిచ్చినట్లు సమాచారం. ఈనేపథ్యంలోనే గుజరాత్ ముఖ్యమంత్రి విజయ రూపాని నివాసంలో పార్టీ కీలక నాయకులతో మంతనాలు జరిపారు. గుజరాత్ నుంచి జరుగుతున్న మూడు రాజ్యసభ స్థానాలు బీజేపీ కైవశం చేసుకునేలా ప్రయత్నాలను ముమ్మరం చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బీజేపీ గూటికి చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల ద్వారా మిగతా వారి కోసం రాయభారాలు నడుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో తమ గెలుపు ఖాయమన్న ధీమాతో బీజేపీ ఉన్నట్లు సమాచారం. మూడు స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో బీజేపీ ముగ్గురు అభ్యర్థులను బరిలోకి దించింది. అమిత్ షా, కేంద్రమంత్రి స్మృతీ ఇరానీలతో పాటు ఇటీవల కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీ తీర్థం పుచ్చుకున్న బల్వంత్ సింగ్ రాజ్‌పుత్ రంగంలోకి దిగారు.

ఉత్తర కొరియాతో ముప్పే





వాషింగ్టన్: ప్రపంచ దేశాలకు ఉత్తర కొరియా పెను ముప్పుగా మారిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే-ఇన్ అభిప్రాయపడ్డారు. సోమవారం వారిద్దరు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఉత్తర కొరియాపై ఐరాస భద్రతా మండలి కఠిన ఆంక్షలను ఇరు దేశాధినేతలు స్వాగతించారు. కొరియా ప్రాంతంలో మరో యుద్ధం జరిగే పరిస్థితి రాకూడదని ట్రంప్‌తో మూన్ అన్నట్లు తెలిసింది. అమెరికా, దక్షిణ కొరియా దేశాధినేతల మధ్య జరి గిన ఫోన్ సంభాషణను వైట్ హౌస్ కూడా ధృవీకరించింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్‌తో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ చేశారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఉత్తర కొరియాపై ఆంక్షల తీర్మానానికి ఏకగ్రీవంగా ఓటు వేయడంపై చాలా సంతోషంగా ఉందన్నారు. మరోవైపు ఉత్తర, దక్షిణ కొరియా విదేశాంగ మంత్రులు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో భేటీ అయ్యారు. యాసియా న్ ప్రాంతీయ ఫోరం సమావేశానికి ముందు దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి కాంగ్ క్యుంగ్ వా ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి రి యాంగ్-హోతో కలిసి విందులో పాల్గొన్నట్లు దక్షిణ కొరియాకు చెందిన యోన్‌హాప్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. కొరియా ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నివారణకు చర్చలకు ముందుకు రావాలని ఈ సందర్భంగా దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి కాంగ్ క్యుంగ్ వా, ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి రి యాంగ్-హోను కోరినట్లు తెలిసింది.

అయితే దక్షిణ కొరియాకు విధేయత లేదంటూ చర్చల ప్రతిపాదనను ఉత్తర కొరియా తిరస్కరించింది. ఓవైపు దక్షిణ కొరియా అమెరికాతో కలిసి తమ దేశంపై ఒత్తిడి తెస్తున్న తరుణంలో ఆ దేశానితో ఎలాంటి చర్చలు జరిపేది లేదని ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి రి యాంగ్-హో స్పష్టం చేసినట్లు దక్షిణ కొరియాకు చెందిన యోన్‌హాప్ న్యూస్ ఏజెన్సీ ప్రకటించింది. భద్రతా మండలి తాజాగా తీర్మానించిన కఠిన ఆంక్షలపైనా ఉత్తర కొరియా మండిపడుతోంది. ఆ దేశానికి 90 శాతం మేర వ్యాపార లావాదేవీలు చైనాతోనే ఉంటాయి. దీంతో ఆంక్షల అమలుకు చైనాయే కీలకం కావడాన, ఆ దేశంపై ప్రపంచ దేశాల ఒత్తిడి మరింత పెరిగింది.

మీ పని చట్ట విరుద్ధం

దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ నిర్మాణాలపై అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా మండిపాటు

మనిలా: దక్షిణ చైనా సముద్రంలో చైనా ఏకంగా ద్వీపాలనే నిర్మిస్తోంది. ఆ సముద్ర ప్రాంతంలో చాలా భాగం ఆసియాన్ దేశాల ప్రాదేశిక జలాల్లోకి వస్తుంది. ఆ సముద్రం మీద హక్కును డిమాండ్ చేయడం ద్వారా చైనా ఆ దేశాల మీద పెత్తనంతో పాటు అక్కడ నుంచి అమెరికాకు జరిగే 5 ట్రిలియన్ డాలర్ల (సుమా రు రూ. 3 కోట్ల కోట్లు) వ్యాపారాన్ని కూడా దెబ్బ తీయాలని చైనా వ్యూహం. ఈ వ్యూహాన్ని భార త్ సాయంతో అమెరికా ఎదు ర్కోవడం, ఆసియాన్ దేశా ల్లోనూ మెజారిటీ భారత్ అమెరికాలను సమర్థించడం చైనాకు రుచించడం లేదు. అందుకే డొక్లాం ప్రతిష్టంభన ను భారత్‌తో కయ్యానికి చైనా సాకుగా తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. దీంతో ఆసియాన్ దేశాలు భారత్, అమెరికా, చైనా. జపాన్ వం టి దేశాలతో కలిపి నిర్వహించే భద్రతా సమావేశాల్లో సోమవారం చైనాకు భంగ పాటు ఎదురైంది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా లు చైనాను తీవ్రంగా విమర్శించాయి. దక్షిణ చైనా సముద్రంలో చైనా చేసేదేదైనా సరే అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఉండాల్సిందేనని చెప్పాయి. దక్షిణ చైనా సముద్రంలో చైనా నిర్మాణాలు చట్టబద్ధం కావన్నాయి. అయితే.. ఆసి యన్ దేశాల్లోని కొన్ని దేశాలు మాత్రం చైనాతో చర్చలంటూ మెలికపెట్టాయి. దీంతో



అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలు తమను విమర్శిస్తున్న రోజే చైనా భారత్ జర్నలిస్టులకు తమ ఆయుధాగారాలను, తమ సైనిక సామర్థ్యాన్ని చూపించింది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో పాటు భారత్ కూడా దక్షిణ చైనా సముద్రంలో చైనా నిర్మిస్తున్న కృత్రి మ ద్వీపాలను వ్యతిరేకిస్తోంది. ఆసియాన్ దేశాలతో మిత్రత్వం నెరపుతోంది. అయి తే.. ఆసియాన్ దేశాలకు, తమకూ ద్వైపాక్షిక విషయాల్లో ఆయా దేశాలు కల్పించుకుంటున్నాయని చైనా ఆరోపిస్తోంది. ఇతర దేశాలు కల్పించుకుంటే చర్చల నుంచి వైదొలగుతామని డొక్లాంలో భారత్‌ను హెచ్చరిస్తున్నట్లే ఆసియాన్ దేశాలనూ హెచ్చరిస్తోంది.

మా మీద మీది దండయాత్రే

- భారత్‌పై చైనా నిప్పులు
- తమ సామర్థ్యం ఇండియా విలేకరులకు ప్రదర్శన
- డొక్లాంలో సైనిక చర్య వార్తలపై మౌనం



న్యూఢిల్లీ/బీజింగ్: ఇండో-చైనా ఉద్రిక్తతలు ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. స్థానిక అంతర్జాతీయ పరిణామాలన్నీ ఘర్షణ వాతావరణాన్నే పెంచుతున్నాయి. తాజాగా తమతో గొడవలొద్దని అనుకుంటే డొక్లాం నుంచి వెనక్కు తగ్గాలని చైనా సైన్యం భారత్‌కు హెచ్చరిక చేసింది. ఇదే సమయంలో దక్షిణ చైనా సముద్రంలో చైనా అంతర్జాతీయ నిబంధనలను పాటించాల్సిందేనని అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలు హెచ్చరించాయి. వారలా హెచ్చరిస్తున్న సమయంలోనే డొక్లాంలో భారత్ ఉనికిని తాము దండయాత్రగానే భావిస్తున్నామని పీఎల్ఏలో సీనియర్ కల్నల్ లీలీ అన్నారు. భారత జర్నలిస్టులకు పీఎల్ఏ సామర్థ్యాన్ని సోమవారం ప్రదర్శించారు. చైనా ప్రభుత్వమే భారత్ నుంచి కొంత మంది విలేక రులకు ఆహ్వానాలు పంపి మరీ ఈ సమావేశం ఏర్పాటు చేయించింది. పీఎల్ఏ అధికారులు వారితో మాట్లాడారు. డొక్లాంలో పరిస్థితిని గురించి చైనా సైన్యం ఆలోచనలు తెలియజేయడానికి జరిగినట్లు ఆ సమావేశం జరిగింది. చైనా సైనికులు ఏమనుకుంటున్నారో మీరు రాయొచ్చని లీలీ అన్నారు. తాను ఒక సైనికుడినని తన తో పాటు తన వారందరికీ తమ దేశాన్ని కాపాడుకునే సంకల్పం, బలం ఉన్నాయని అన్నారు. విలేకరులందరికీ ఆయుధాగారాలను లీలీ చూపించారు. ఇలాంటి సమావేశాలు గతంలో ఎన్నడూ జరగకపోవడం గమనార్హం. భారత విలేకరులకు చైనా తన ఆయుధాగారాలను చూపించడం తమ దగ్గర ఉన్నంత మదుగుండు లేదా ఆయుధాలు మీ దగ్గర లేవంటూ భారత్‌కు చెప్పడమేనని విశ్లేషకుల అంచనా. భారత్‌తో యుద్ధానికే చైనా కాలుదువ్వుతోందని, అమెరికాతోనూ ఒకేసారి యుద్ధం చేయడానికి చైనా సిద్ధంగా ఉందని భారత సంతతి ఆర్థికవేత్త బ్రిటన్లో చెప్పిన రెండు రోజుల్లోనే చైనా భారత విలేకరులకు తమ యుద్ధ సామర్థాన్ని పరిచయం చేయడం యుద్ధ నినాదమేనని సైనికాధికారులు భావిస్తున్నా రు. ఆయుధాగారాలను చూపడమే కాదు, తమ సైనికుల సామర్థ్యాన్ని కూడా చైనా సైన్యం విలేక రులకు ప్రదర్శనగా చేసింది. చిన్న తరహా ఆయుధాలతో యుద్ధం, లేజర్ సిము లేషన్, పదాతి దళాలను బలంగా వాడడం వంటి వాటిని విలేకరులకు పరిచయం చేసింది. తమకు ప్రత్యే క ఉద్దేశమేదీ లేదని లీలీ చెప్పినా, భారత్ చేతల మీద తమ సైన్యం స్పందన ఉంటుందని ఆయన చెప్పడం భారత్‌ను హెచ్చరిం చడమే. అవసరమైనప్పుడు తగిన విధంగా తమ సైన్యం స్పందిస్తుందని ఆయన అన్నా రు. డొక్లాంలో భారత్ 48 మంది సైనికులతో ఒక బుల్‌డోజర్‌తో ఉందని తేలిక చేసి మాట్లాడారు. భారత్ ఇప్పటికీ అక్కడ 400 మంది కంటే ఎక్కువగా సైనికులున్నారని చెబు తోంది. అక్కడ భారత్ సైనికులు చాలా మం దే ఉన్నారని చైనా విదేశాంగ మంత్రి ఇటీవల చెప్పడం కూడా గమనార్హం. కల్నల్ లీలీ మాటలకు తోడుగా చైనా అధికార మీడియా కూడా భారత్‌ను ఆడిపోసుకుం టోంది. భారత్ డొక్లాం విషయంలో భౌగోళికంగా తప్పుడు లెక్కలు వూస్తోందని, చైనా భూభాగంలోకి చొచ్చుకు వచ్చిందని, ఇది చైనా ఎంత మాత్రం సహించదని చైనా అధికార పత్రిక కారుకూతలు కూసింది. అది చైనా సార్వభౌమత్వాన్ని ప్రశ్నిం చడమేనంది. అంతలోనే భారత్ ఏం చేయాలో తానే చెప్పేసింది. చైనాతో భారత్ చర్చలు జరపాలని సూచించింది. రెచ్చగొట్టకుండా చైనాతో చర్చించాలని నిబంధన లు విధించింది. ఈ విషయంలో భారత్‌కు సమయం చాలా తక్కువగా ఉందని క ూ డా హెచ్చరికలాంటి సూచన చేసింది. చైనాకు ఎవరినైనా ఓడించే శక్తి ఉందని భారత్ గుర్తించాలని హితబోధ చేసింది. అయితే.. ఆ భూభాగం విషయంలో చైనా, భూటాన్‌ల మధ్య వివాదం ఉండడం, భూటాన్ తరపునే భారత్ అక్కడ సైనికులను మోహరించడం, అక్కడ చైనా ఉనికి భారత్‌లోని ఈశాన్య రాష్ట్రా లకు దారిని మూసే స్తుందన్న విషయాలను లీలీ ప్రస్తావించక పోవడం గమనార్హం. అలాగే డొక్లాంలో చైనా చిన్న తరహా సైనిక చర్యలకు పాల్పడుతుందన్న వార్తలపై స్పందించడానికి ఆయన నిరాకరించారు. భారత జర్నలిస్టులతో లీలీ సమావేశం, ఆసియాన్ సమావేశాల్లో అమెరికా మిత్రదేశాలు చైనాపై నిప్పులు కక్కడం ఒకే రోజు జరగడం గమనార్హం.

డొక్లాం వివాదంలో భారత్‌ను హెచ్చరిస్తున్న చైనా, తాజాగా బెదిరింపులకు దిగింది. మీ పరిస్థితి బాలేదు కాబట్టి జాగ్రత్తగా ఉండండని సూచిస్తోంది. ఆ దేశ అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్ భారత్‌లో ప్రస్తుతం అమలవుతున్న జీఎస్టీ, నిరుటి నోట్ల రద్దు వల్ల భారత్ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదల మందగించిందని తాజాగా రాసింది. నోట్ల రద్దు తరువాత భారత్‌లో వ్యాపార లావాదేవీలు తగ్గిపోయాయని పేర్కొంది. ఈ ఆర్థిక మాంద్యం ఎన్నాళ్లుంటుందో తెలియదని ఊహాగానాలు చేసింది. వ్యాపారస్తులందరూ అయోమయంలో ఉన్నారంటూ అనధికారిక ప్రకటన చేసేసింది. అసలు భారత్‌లో పన్ను వ్యవస్థనే ప్రశ్నించింది. జూన్‌లో భారత్ లో వ్యాపార లావాదేవీలు తగ్గాయన్న వార్తలతో గ్లోబల్ టైమ్స్ సొంత కథనాలు వండి వార్చేసింది. జీఎస్టీ

భారత్ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం: చైనా

కారణంగా మారుతున్న వ్యవస్థల వల్ల తాత్కాలికంగా తగ్గిన లావాదేవీలను భారత్‌లో వ్యాపారాలు కుదేలయ్యాయంటూ గ్లోబల్ టైమ్స్ నిర్ణయించేసింది. ఈ కారణంగా బ్యాంకులు కొత్త వారికి రుణాలు ఇవ్వడం లేదంటూ తీర్మానించేసింది. అసలు ఈ మాటలకు ఎక్కడా ఆధారమే లేదు. ఎంత మొత్తుకునుఆ చివరకు ఆర్బీఐ రేట్ తగ్గింపు ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తుందని తన ఎడిటోరియల్‌లో ముక్తాయింపునివ్వడంతోనే రాతల్లో డొల్లతనం బయటపడిపోయింది.

సౌభ్రాతృత్వం పరిఢవిల్లాలన్న రాష్ట్రపతి

న్యూఢిల్లీ: రక్షాబంధన్ సందర్భంగా దేశ ప్రజలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోడీ దేశప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం విడివిడిగా విడుదల చేసిన ప్రకటనల్లో వారు దేశ ప్రజలు పవిత్ర సోదర బంధంతో ఒకటవ్వాలని కోరారు. మోడీ దేశానికి శుభాకాంక్షలు తెలుపగా, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా రక్షాబంధన్‌ను రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొహ్సిన్ షేక్ అనే పాకిస్థానీ మహిళ తాను మోడీకి 20 ఏళ్లుగా రాఖీ కడుతున్నానని చెప్పింది. రాఖీ పండుగ సందర్భంగా మోడీ, కోవింద్‌లకు విద్యార్థులు మహిళలు రాఖీలు కట్టారు. ఇరువురి కార్యాలయాల్లోనూ పండుగ వాతావరణం కనిపించింది. దేశసరిహద్దుల్లోనూ పలు చోట్ల మహిళలు, విద్యార్థులు సైనికులకు రాఖీలు కట్టారు. మహారాష్ట్రలో మహిళలు తాము రాఖీ కట్టిన వారికి హెల్మెట్లు బహూకరించారు. ఆ పని రాష్ట్ర గవర్నర్‌తో చేయించడం విశేషం.

20 ఏళ్లుగా మోడీకి రాఖీ కడుతున్న పాక్ మహిళ



న్యూఢిల్లీ: భారత్-పాక్ మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమనే పరిస్థితుల్లోనూ ఇరు దేశాల ప్రజలు సామరస్యాన్ని చాటుకుంటున్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఓ మహిళ 20 ఏళ్లకుపైగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాఖీ కడుతోంది. మోడీ ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా పనిచేస్తున్నప్పటి నుంచీ ప్రతీ ఏడాది రాఖీ పౌర్ణమికి ఆయనకు రాఖీ కడుతున్నట్లు ఖమర్ మోసిన్ షైక్ తెలిపింది.

త్రిపురలో టీఎంసీకి షాక్

న్యూఢిల్లీ: త్రిపురలో రాజకీయం రంజుగా మారుతోంది. ఇటీవలతృణమూల్ కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురైన ఆరుగురు ఎమ్మెల్యేలు సోమవారం బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు ఓటు వేయడంతో ఆరుగురు ఎమ్మెల్యేలపై టీఎంసీ అధినాయకత్వం వేటువేసింది. గతంలో కాంగ్రెస్ తరపున గెలిచిన వీరు ఆ తర్వాత తృణమూల్‌లోకి దూకారు. తాజాగా బీజేపీలో చేరారు. తాజా పరిణామాల తో బీజేపీ జాక్‌పాట్ కొట్టింది. దశాబ్దాలుగా కమ్యూనిస్టు కంచుకోటగా ఉన్న త్రిపురలో కాలుపెట్టే అవకాశం వెతుక్కుంటూ వచ్చింది. ఆరుగురు సభ్యులు బీజేపీ లో చేరడంతో బీజేపీకి ప్రతిపక్షహోదా దక్కబోతోంది.

అంబు ెన్స్ ఆపేసిన బీజేపీ నేత

న్యూఢిల్లీ: హర్యానాలో బీజేపీ నేత వీరంగం సృష్టించారు. తన కారును ఓ అంబులెన్స్ ఢీకొనడంతో దానిని అక్కడే ఆపేసి నానా యాగీ చేశారు. అంబులెన్స్‌లో రోగి చావు బతుకుల మధ్య ఉన్నాడని చెప్పినా వినిపించుకోకుండా అంబులెన్స్ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో రోగి నాగ్‌పాల్ కుటుంబ సభ్యులు అంబులెన్స్‌ను వెళ్లేందుకు దారివ్వాలని వేడుకున్నా వినలేదు. ఈ నేపథ్యంలో రోగి నవీన్ మృతిచెందాడు. దీనిపై రోగి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పళనిస్వామి కాన్వాయ్ కోసం అంబులెన్స్ నిలిపివేత

చెన్నై: తమిళనాడులోనూ అంబులెన్సుకు దారి కరవైంది. జులై 27న జరిగిన ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి కాన్వాయ్ కోసం వాహనాలను నిలిపివేయడంతో అందులో అంబులెన్స్ కూడా ఉండిపోయింది. దీనిపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పళనిస్వామిపై విపక్షాలు కూడా విమర్శలు ఎక్కుపెట్టాయి. అమ్మ జయలలిత ప్రజల మనిషి అని, ఆమె ప్రజలకు సహాయం చేయాలని చెప్పేవారని, కానీ పళనిస్వామి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవరహిస్తోందని, మానవత్వాన్ని మంటగలుపుతోందని, కాన్వాయ్ కోసం అంబులెన్స్‌ను ఆపివేయడాన్ని తాము ఖండిస్తున్నామని అన్నాడీఎంకే పన్నీర్ సెల్వం వర్గం ఐటీ కార్యదర్శి రామచంద్రన్ పేర్కొన్నారు.

జీవ కణాలను రవాణా చేసే సూక్ష్మజీవి అభివృద్ధి

వాషింగ్టన్: జీవ కణాలను సేకరించి రవాణా చేసే అయస్కాంత సూక్ష్మజీవి పాక్-మ్యాన్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. మందులకు క్యాన్సర్ కణాల ప్రతిస్పందనలను అధ్యయనం చేసేందుకు ఇది ఎంతో ఉపకరిస్తుందని వారు భావిస్తున్నారు. అమెరికా నార్త్ కరోలినా స్టేట్ యూనివర్శిటీ, డ్యూక్ యూనివర్శిటీలకు చెందిన పరిశోధకులు మైక్రోస్కోపిక్ క్యూబ్స్ నుంచి మాగ్నెటెక్ మైక్రోబోట్ జీవిని రూపొందించారు. అయస్కాంత శక్తితో ఇది జీవ కణాల సేకరణ, రవాణా వంటి పనులు సునాయసంగా చేస్తుందని వివరించారు.

అమర్‌నాథ్ యాత్ర పూర్తి



శ్రీనగర్: అమర్ధనాథ్ యాత్ర పూర్తయింది. సోమవారం నాటికి ఈ ఏడు 2.6 లక్షల మంది యాత్రికులు అమరలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. జూలైలో యాత్రికుల బస్సు మీద ఉగ్రవాదుల దాడి జరిగి ఎనిమిది మంది మరణించిన తరువాత కూడా యాత్రికుల ప్రవాహం తగ్గకపోవడం గమనార్హం. నిరుడు 2.2 లక్షల మది మాత్రమే అమర్‌నాథ్‌కు రాగా, ఈ ఏడు మరో 40 వేల మంది అదనంగా వచ్చారు.

ఇండస్ ఒప్పందానికి తూట్లు పొడిచేందుకు..

ఇస్లామాబాద్: ఇండస్ నదీ జలాల వినియోగ ఒప్పందానికి తూట్లు పొడిచేందుకు భారత్, అమెరికా కుట్ర పన్నుతున్నాయని పాకిస్థాన్ కొత్త విదేశంగ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆరోపించారు. విదేశాంగ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్ ప్రపంచ బ్యాంకు నిధులతో జీలం, చెనాబ్ నదులపై కిషన్‌గంగా, రాట్లే జల విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్యాస్ సిలిండర్‌కు.. అంత్యక్రియలు

కోయంబత్తూరు: ప్రతి నెలా గ్యాస్ ధర పెంచి అంతిమంగా సబ్సిడీ ఎత్తివేయాలన్న కేంద్ర ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ వినూత్నంగా నిరసన తెలిపింది. సోమవారం తమిళనాడులోని కోయంబత్తూరులో ఆ పార్టీకి చెందిన మహిళా కార్యకర్తలు గ్యాస్ సిలిండర్‌కు అంత్యక్రియలు నిర్వహించారు.

మీరేం చేస్తున్నారో చెప్పేస్తాం



బోస్టన్: ఎన్నో రకాల విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సాంకేతిక పరిజ్ఞానం మనిషి నిత్యజీవితంలో ఒక భాగమైపోయింది. రేడియో తరంగాల అభివృద్ధి తర్వాత టెక్నాలజీ వాడకం మరింతగా పెరిగిపోయింది. ఈ విషయాలన్ని ఇప్పుడెందుకనుకుంటున్నారా..? మనిషిలోని అంతర్లీన అంశాలను పసిగట్టే నూతన యంత్రాన్ని అమెరికన్ శాస్త్రవేత్తలు రూపొందిస్తున్నారు. కృత్రిమ మేధస్సు ద్వారా పనిచేసే ఈ యంత్రం అందుబాటులోకి వస్తే మనిషి నిద్రిస్తున్నప్పుడు కూడా అతనిలోని అంతర్గీన విషయాలను చెప్పేస్తుంది.వ్యక్తి నిద్రిస్తున్న సమయంలో అతని పల్స్ రేట్, బీపీ వంటి కీలక సమాచారాన్ని కూడా సులువుగా తెలుసుకోవచ్చు. చాలామంది ఎక్కువ సేపు నిద్రించిన తర్వాత కూడా రిలాక్స్ కాలేకపోతారు. అలాంటివారికి ఈ పరికరం ఎంతో ఉపయోగకరంగా పనిచేస్తుంది. నిద్రిస్తున్నవ్యక్తి గాఢ నిద్రలో ఉన్నాడా..లేక రెప్పపాటు నిద్రలో ఉన్నాడా అనే విషయాన్ని కూడా అతడికి తెలియకుండానే తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్య పరంగా వ్యక్తుల్లో వచ్చే భౌతిక పరమైన మార్పులను సులువుగా గుర్తించాలన్న లక్ష్యంతోనే అధ్యయనం చేస్తున్నట్లు మాస్సచుసెట్స్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు డినా కతాబి తెలిపారు. దూరం నుంచి వ్యక్తిలోని భౌతిక మార్పులను అధ్యయనం చేసి..వ్యాధి లక్షణాలను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. నూతన అధ్యయనం ఆచరణలోకి వస్తే ఎంతో మంది మానసిక రోగులకు మేలు కలుగుతుంది. వైద్యులకు కూడా ఇలాంటి పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

ఆంధ్రప్రభ

క్రీడాప్రభ

మంగళవారం 8 ఆగస్టు 2017 | హైదరాబాద్ | 12

మహిళల 100 మీటర్ల పరుగు విజేత బోవీ

ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్

లండన్: ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ మహిళల వంద మీటర్ల స్వర్ణాన్ని అమెరికా స్ప్రింటర్ టోరీ బోవీ దక్కించుకుంది. గత ఒలింపిక్స్‌లో రజతం గెలిచిన బోవీ రేసును 10.85 సెకన్లలో పూర్తిచేసింది. మేరీ జోస్ తా లా 10.84 సెకన్లతో, షిఫర్స్ 10.96 సెకన్లతో రేసును పూర్తిచేసి రజత, కాంస్యాలు గెలిచారు. కాగా ఫేవరెట్‌గా బరిలోకి దిగిన బ్రిటిష్ అథ్లెట్ ఎలీనా థాంప్సన్ విఫలమైంది. రియో ఒలింపిక్స్‌లో గోల్డ్ గెలిచిన ఎలీనా 5వ స్థానంతో సరిపెట్టుకుంది. ''గెలవాలన్న కాంక్షే నాకు స్వర్ణం తెచ్చింది. ఈ విజయాన్ని నమ్మలేకున్నా'' అని బోవి చెప్పింది.



శ్రీశాంత్‌కు ఊరట

• బీసీసీఐ జీవితకాల నిషేధాన్ని ఎత్తివేసిన కేరళ హైకోర్టు



కోచి: ఫిక్సింగ్ కేసులో జీవితకాల నిషేధాన్ని ఎదుర్కొంటున్న కేరళ పేస్ బౌలర్ శ్రీశాంత్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. ఐపీఎల్‌లో స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడన్న ఆరోపణతో 2013లో బీసీసీఐ విధించిన జీవితకాల నిషేధాన్ని కేరళ హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. రాజస్థాన్ రాయల్స్ సహచరులు అజిత్ చండిలా, అంకిత్ చవాన్‌లతో పాటు శ్రీశాంత్ కూడా ఐపీఎల్ 6లో ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని బీసీసీఐ ఆరోపణలు చేసింది. ఐతే తగినన్ని ఆధారాలు లేవని చెబుతూ 2015లో శ్రీశాంత్‌ను ఢిల్లీ ట్రయల్ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. కాని నిషేధాన్ని మాత్రం బీసీసీఐ ఎత్తకపోవడంతో అతను నాటి నుంచి పోరాడుతూనే ఉన్నాడు. బీసీసీఐ వైఖరిని హైకోర్టు తప్పుపట్టింది. నిషేధాన్ని ఎత్తివేయకపోవడం సహజ న్యాయాన్ని ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. నిషేధాన్ని సవాలు చేస్తూ శ్రీశాంత్ చేసిన అప్పీలుపై వైఖరిని చెప్పాలంటూ బీసీసీఐని కేరళ హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాన్ని బోర్డు లీగల్ బృందం అధ్యయనంచేసిన తర్వాత నివేదిక సమర్పిస్తామని బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా తెలిపారు. ''లీగల్ బృందం అభిప్రాయం తెలిసిన తర్వాత ఏం చేయాలో నిర్ణయిస్తాం'' అన్నారు. హైకోర్టు ఆదేశంపై సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశాలు లేకపోలేదని మరో బీసీసీఐ అధికారి చెప్పారు. ''ఆదేశాల్ని మేం చూడాలి. చూడకుండా ఏమీ చెప్పలేం'' అన్నారు.

రంజీల్లో ఆడతా: హైకోర్టు ఆదేశంపై శ్రీశాంత్ సంతోషం వ్యక్తంచేశాడు. ''ఎంతో మంది నాకు మద్దతిచ్చారు. వారందరికీ ఎంతో రుణపడివుంటాను. ఇపుడు కేరళ రంజీ జట్టుకు ఆడడమే నా తొలి ప్రాధాన్యం. శారీరకంగా ఫిట్‌గా ఉన్నాను. త్వరలోనేయ మైదానంలోకి దిగుతాను'' అని చెప్పాడు.

కేరళ క్రికెట్ సంఘం హర్షం: హైకోర్టు తీర్పును కేరళ క్రికెట్ సంఘం హర్షించింది. ''శ్రీశాంత్ మా ఆటగాడు. నిరంతరం అతనికి మద్దతిస్తున్నాం. మేం త్వరలోనే ఓ సానుకూల నిర్ణయం తీసుకుంటాం'' కేసీఏ అధ్యక్షుడు వినోద్ కుమార్ చెప్పాడు.

అసలేమైంది?

స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలపై 2013లో ఢిల్లీ పోలీసులు క్రికెటర్లు శ్రీశాంత్, అజిత్ చండిలా, అంకిత్ చవాన్‌లను అరెస్టు చేయడం క్రికెట్ ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వీరంతా రాజస్థాన్ రాయల్స్ ఆటగాళ్లే. వీరితో పాటు 11 మంది బుకీలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. శ్రీశాంత్‌పై బీసీసీఐ జీవితకాల నిషేధాన్ని విధించింది. కానీ 2015లో కోర్టు అతణ్ని నిర్దోషిగా తేల్చింది. కానీ బీసీసీఐ మాత్రం నిషేధాన్ని ఎత్తివేయలేదు. దీంతో కేరళ హైకోర్టులో శ్రీశాంత్ అప్పీలు చేసుకున్నాడు.



ఆ క్యాచ్‌ల్ని మేం ఇంకా మెరుగ్గా అందుకోవాలి

• కోహ్లీ

కొలంబో: వికెట్లకు సమీపంలో అందివచ్చే క్యాచ్‌ల్ని తాము ఇంకా మెరుగ్గా అందుకోలసిన అవసరం ఉందని భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. మెరుపులా దూసుకొచ్చే క్యాచ్‌లను ఫార్వర్డ్ షార్ట్ లెగ్‌లో ఒడిసిపట్టుకుంటేనే విజయం దక్కుతుందని చెప్పాడు. ''అలాంటి క్యాచ్‌లు అందుకోవడంలో మేం ఇంకా మెరుగుపడాలి. కొలంబో వంటి మందకొడి పిచ్‌పై క్యాచ్‌ల కోసం వికెట్ల సమీపంలో నిలబడాల్సివుంటుంది. ఐతే భారీ షాట్లు ఆడినపుడు, బంతిని వేగంగా సంధించినపుడు జాగ్రత్తపడాలి. మేం ఓ స్థానంలో నిలబడి ఉన్నప్పుడు బంతి మన ముందు పడుతుందో లేదో తెలియదు. వికెట్‌కు సమీపంలో ఉండే నిపుణులైన ఫీల్డర్లు మెరుగ్గా క్యాచ్‌ల్ని అందుకుంటున్నారు. కేఎల్ రాహుల్, పుజారా ఇందులో నిష్ణాతులు. స్పిన్నర్లకు పుజారా గల్లీలో ఫీల్డింగ్ చేస్తాడు. కానీ రాహుల్ ఫార్వర్డ్‌షార్ట్‌లెగ్‌లో అద్భుత ఫీల్డర్'' అని కోహ్లీ చెప్పాడు.

జడేజా అమూల్య రత్నం: లంకపై సిరీస్ విజయంలో ఆల్‌రౌండ్ ప్రతిభ ప్రదర్శించిన రవీంద్ర జడేజా జట్టుకు అమూల్యమైన ఆటగాడని కోహ్లీ కొనియాడాడు. జడేజా వల్ల జట్టులో సమతూకం ఏర్పడిందని చెప్పాడు. ''ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లోనూ విశేష ప్రతిభ అందరిలోనూ ఉండదు. అందుకే అలాంటి ప్రతిభ ఉన్నవారు అమూల్యమైనవాళ్లు. ప్రత్యేకించి టెస్టుల్లో ఇలాంటి వారి వల్ల సమతూకం ఏర్పడుతుంది. జడేజా వేగంగా 60, 70 పరుగులు చేయగలడు. మ్యాచ్‌ను మనవైపు తిప్పగలడు. అందుకే జట్టుకు అతను అమూల్యమైన ఆటగాడు'' అని చెప్పాడు.

కాలిని కలిసిన కోహ్లీ: రెండో టెస్టు ముగిసిన తర్వాత కోహ్లీ.. డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్ గ్రేట్ కాలిని కొలంబోలో కలిశాడు.



జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సోమవారం జరిగిన ఫ్యాషన్ పెరెడ్‌లో వీవీఎస్.లక్ష్మణ్, గుత్తాజ్వాల, మిథాలీరాజ్



మొహిత్, రావత్‌లకు రజతాలు

• ఆసియా జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: ఫిలిప్పీన్స్‌లో జరుగుతున్న ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు సతేందర్ రావత్, మొహిత్ రజతాలు దక్కించుకున్నారు. ఫైనల్లో సతేందర్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన షాక్రుష్ చేతిలో ఓడగా.. మొహిత్ కజకస్తాన్ బాక్సర్ సగిండిక్ చేతిలో పరాజయం పాలయ్యారు. సతేందర్, మొహిత్‌లు 80 కిలోల విభాగంలో పోటీపడ్డారు.



గాట్లిన్‌కు బోల్ట్ ప్రశంస

అతను అత్యుత్తమ అథ్లెట్

లండన్: తన చివరి పరుగులో స్వర్ణం గెలుచుకున్న అమెరికా అథ్లెట్ జస్టిన్ గాట్లిన్‌పై జమైకా పరుగుల చిరుత ఉసేన్ బోల్ట్ ప్రశంసల వర్షం కురిపించాడు. తనకు ఎదురైన పోటీదారుల్లో గాట్లిన్ అత్యుత్తమ అథ్లెట్ అని పొగిడాడు. ''గాట్లిన్‌ను పోటీదారుగా ఎప్పుడూ గౌరవిస్తాను. నేను ఎదుర్కొన్న వారిలో అతనో అత్యుత్తమ అథ్లెట్. అతను స్వర్ణానికి అర్హుడు. పునరాగమనం కోసం గాట్లిన్ చాలా కష్టపడ్డాడు. అత్యుత్తమ అథ్లెట్‌గా ఎదగడానికి తీవ్రంగా శ్రమించాడు. అతను మెరుపు వేగంతో పరుగెడుతున్నాడు. మళ్లీ సంచలనాలు సృష్టిస్తాడు. తక్కిన అథ్లెట్ల మాదిరిగానే అతనిని కూడా నేను చూస్తాను'' అని చెప్పాడు. ఈ సారి స్వర్ణం గెలవలేకపోయినందుకు తాను విచారించడం లేదని బోల్ట్ అన్నాడు. ''నేను ఎంతమాత్రం విచారించడం లేదు. అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నించా. గెలవచ్చు. ఓడిపోవచ్చు. కానీ ఏదైనా నా అభిమానుల కోసం చేశా. వారు నేను మరో సీజన్ ఆడాలని కోరుకుంటున్నారు. గెలవనందుకు ఎవరూ సంతోషించరు. కానీ ఓటమి నా కెరీర్‌ను ఏ మాత్రం మార్చలేదు'' అని బోల్ట్‌పేర్కొన్నాడు.

సుప్రీంకోర్టుకు లతీఫ్



కరాచీ: 'స్పాట్-ఫిక్సింగ్' కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్ ఖలీద్ లతీఫ్ సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నాడు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు నుంచి సస్పెన్షన్‌కు గురైన లతీఫ్ ప్రస్తుతం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు నేతృత్వంలోని అవినీతి నిరోధక ట్రిబ్యునల్‌లో త్రిసభ్య ధర్మాసనం ముందు విచాణ ఎదుర్కొంటున్నారు. త్వరలో తుది తీర్పు రానున్న నేపథ్యంలో లతీఫ్ న్యాయవాది వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ట్రిబ్యునల్ మరియు పీసీబీ పనితీరు, చట్టబద్ధతలపై సుప్రీంకోర్టులో బుధవారం పిల్ దాఖలు చేయనున్నట్లు లతీఫ్ న్యాయవాది బాదర్ అలామ్ తెలిపారు. ఆగస్టు 9వ తేదీలోపు తుదితీర్పు రానిపక్షంలో సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించామన్నారు.

యుకి@159



న్యూఢిల్లీ: వాషింగ్టన్‌లో మెరుగైన ప్రదర్శన ఇచ్చిన భారత యవ ఆటగాడు యుకీ బాంబ్రి ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 159వ స్థానానికి ఎగబాకాడు. అతని ఖాతాలో ఇపుడు 365 పాయింట్లున్నాయి. రామ్‌కుమార్ రామనాథన్ 179వ ర్యాంకులో నిలిచాడు. కాగా గున్నేస్వరన్ 213, సుమిత్ నగల్, శ్రీరామ్ బాలాజీ 297వ స్థానంలో నిలిచారు. యుకి 41 స్థానాలు ఎగబాకాడు. అతనిపుడు భారత అత్యుత్తమ ర్యాంకర్లలో ముందున్నాడు. డబుల్స్‌లో రోహన్ బోపన్న 21వ స్థానంలో కొనసాగుతున్నాడు. డివిజ్ శరణ్ 53, పురవ్ రాజా 53, లియాండర్ పేస్ 62 జీవన్ నెడుంచెజియన్ 95వ ర్యాంకుల్లో ఉన్నారు.

మహిళల ర్యాంకింగ్స్‌లో సానియా మీర్జా ఏడో స్థానంలో కొనసాగుతోంది. ప్రార్థన నాలుగు ర్యాంకులు ఎగబాకి 130వ స్థానానికి చేరుకుంది. అంకిత రైనా 196వ స్థానంలో నిలిచింది.



తమ దేశంలో జరిగిన మహిళల యూరో 2017 సాకర్ ఫైనల్లో డెన్మార్క్‌ను ఓడించి విజేతగా నిలిచిన నెదర్లాండ్స్ క్రీడాకారుల సంబరం.



స్కాట్లాండ్‌లో జరిగిన మహిళల బ్రిటిష్ ఓపెన్ గోల్ఫ్ ట్రోఫీతో కొరియాకు చెందిన ఇన్ కుంగ్ కిమ్

ఇంగ్లండ్‌ను గెలిపించిన అలీ



నాలుగో టెస్టులో దక్షిణాఫ్రికా ఓటమి

లండన్: స్పిన్నర్ మొయిన్ అలీ (5-69) స్పిన్ మాయాజాలం చేయడంతో ఇంగ్లాండ్ నాలుగో టెస్టులో దక్షిణాఫ్రికాపై జయకేతన ఎగురవేసింది. మూడో రోజు తమ రెండో ఇన్నింగ్స్‌లో 75 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును ఆదుకున్న అలీ.. దక్షిణాఫ్రికాను రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసి ఇంగ్లాండ్ విజయంలో ప్రధాన భూమిక పోషించాడు. నాలుగు టెస్టుల సిరీస్‌ను ఇంగ్లాండ్ 3-1 తేడాతో గెలుచుకుంది. సోమవారం ఇంగ్లాండ్ 243 పరుగలకు ఆలౌట్ అయి దక్షిణాఫ్రికా ముందు 380 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

ఐతే అలీ స్పిన్‌ను దాసోహం చేసిన దక్షిణాఫ్రికా 202 పరుగులకే ఆలౌటై 177 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. హషీమ్ ఆమ్లా (83, 159 బంతుల్లో, 13 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేశాడు. అలీకే మ్యాన్‌ఆఫ్ ద మ్యాచ్, సిరీస్ అవార్డు రెండూ దక్కాయి.

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 362, దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 226, ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: 243, దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 202.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
మంగళవారం 8 ఆగస్టు 2017



కొత్తగా... గమ్మత్తుగా

- 1950 నుంచే మొదలైన కాన్సెప్ట్ కార్ షోలు
- సాధారణ కార్లకు విరుద్ధంగా కాన్సెప్ట్ కార్లు
- షోలకు ముందుండే జనరల్ మెటార్స్, సెయిక్
- ప్రతిభను చాటుకునేందుకు కంపెనీలు తహతహ
- ఇంకో ఎనిమిదేళ్లలో అటానమస్ ఎలక్ట్రిక్ కార్లు
- మార్కెట్లోకి రంగులు మార్చే ఊసరవెల్లి కార్లు
- ఈ ఏడాది చివర్లో ఎగిరేకారు కిట్టీహాక్ ఫ్లయర్
- ఇండియన్ మార్కెట్లోకి క్యాబిన్ మోటార్ సైకిల్
- ఆరోగ్య సంస్థలకు కొలిమ్ కార్వాన్ వెహికల్
- ఈ ఏడాదే స్లోవేకియా ఏరోమొబిల్ ఫ్లయింగ్ కార్
- చైనా తయారుచేసిన వరల్డ్ ఫస్ట్ పాసింజర్ డ్రోన్

వెహికల్ వరల్డ్‌లో రకరకాల కాన్సెప్ట్‌లు వచ్చి మనిషిని మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. కాన్సెప్ట్ వెహికల్స్ పేరుతో వచ్చే వాహనాలన్నీ... నేటి యువతను టార్గెట్ చేసుకుని వస్తున్నవే. ఈ తరహా వెహికల్స్‌లో మనకు ఎక్కువగా ప్లేస్ రిడక్షన్ అనేది కనిపిస్తుంది. మనకు కావల్సిన ప్లేసే... మన వాహనంలో ఉండాలి తప్ప అనవసర స్థల వృధా అవసరమా అనేది ఈ కాన్సెప్ట్ ఫీలింగ్. ఆ యాంగిల్లో ఆలోచించే సైంటిస్టులు అటువైపుగా అడుగులు వేస్తున్నారు. అయితే కాన్సెప్ట్ వెహికల్స్‌లో ప్రధానంగా మాయ చేసే అంశాలు మనల్ని టెంప్ట్ చేస్తున్నాయి. అవే యూత్‌కు ఫ్యూచర్ వెహికల్స్‌గా మారబోతున్నాయి. అయితే వాటిలో కొన్ని ఆల్‌రెడీ రెఢీ అయిపోయి...రోడ్లపైకి దూకడానికి అనుమతుల కోసం సిద్ధంగా ఉన్నాయి. ఇంకొన్ని రేపే మాపో అన్నట్లుగా ఊరిస్తున్నాయి.

ఆటోమొబైల్ రంగంలో టెక్నాలజీ వేగం పెరిగిపోయింది. డ్రైవర్‌లెస్ కార్లు ,ఎగిరే కార్లు, నీటిలో ఈదే కార్లు పోటీపడి మరీ.. మనల్ని మురిపించడానికి వచ్చేస్తున్నాయి. రంగులు మార్చే కార్లు,అదృశ్యమయ్యే కార్లు కూడా మార్కెట్‌ను చుట్టి ముట్టేస్తున్నాయంటే ఆటోమొబైల్ రంగం ఎంతలా మారిపోయిందో అర్ధం చేసుకోవచ్చు. ఇవన్నీ ఇంకొన్ని రోజులలో మన ముందుకు వచ్చి వాలబోతున్నాయి. కేవలం ఆయా దేశాల అనుమతులు కోసం మాత్రమే వేచి చూస్తున్నాయి. ఇంతకీ మనల్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తడానికి ముందు కొస్తోన్న ఆ కాన్సెప్ట్ వెహికల్స్ ఏమున్నాయో ఇప్పుడు చూద్దాం.

బచెటా గిరో 26:



మనిషి ప్రయాణం మొదలైంది జంతువులతోనే అయినా.. మెకానికల్‌గా చూస్తే మాత్రం మనకు ముందుగా సైకిలే గుర్తుకు వస్తుంది. సైకిల్ తర్వాత వచ్చిన బైక్ ,కారు ఆల్మోస్ట్ సైకిల్‌ను మర్చిపోయేలా చేసాయి. కాని సైకిల్‌లో వచ్చే సరికొత్త హెల్తీ కాన్సెప్ట్‌లు... మళ్లీ సైకిల్ ప్రయాణంపై ఫోకస్ పెట్టేలా చేస్తున్నాయి. అలాంటిదే బచెటా కంపెనీ తీసుకొచ్చిన గిరో 26. ఇందుల్లో కూర్చుని తొక్కకుండా వెనకకు జారబడి పడుకుని తొక్కవచ్చు. హ్యాండిల్ దగ్గర పెడల్స్ ఉండడం ఈ గిరో 26 ప్రత్యేకత. ఈ సైకిల్ పాశ్చాత్య దేశాలలో అక్కడక్కడ ఉన్నప్పటికీ... ఇంకా ఇండియాలోకి సరిగా ప్రవేశించలేదు. దీనికోసమని మనం బాడీలో ఎక్కువ శక్తిని ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. సింపుల్ గా తొక్కి తే.. ముందుకు దూసుకుపోయేలా తయారుచేశారు.

క్యాబిన్ మోటార్ సైకిల్



క్యాబిన్ మోటార్ సైకిల్ గురించి చెప్పుకోవాలంటే... ఇదొక పర్సనల్ మొబిలిటీ వెహికల్ . భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకని దీనిని రూపొందించారు. నిజానికి ఈ క్యాబిన్ మోటార్‌సైకిల్ ను నాలుగేళ్ల క్రితమే జపనీస్ కంపెనీ టొయోటా తయారుచేసింది. దీనికి ఐ రోడ్ కాన్సెప్ట్ అని పేరు పెట్టింది. జెనీవా అంతర్జాతీయ కార్‌షోస్‌లో ఈ కాన్సెప్ట్ వెహికల్ క్యాబిన్ మోటార్ సైకిల్‌ను ప్రదర్శించారు. కాని వీటిని వినియోగదారులకు పూర్తి అందుబాటులోకి తేలేకపోయింది. దానికి కారణాలు అనేకం. ఇద్దరు మాత్రమే కూర్చునే ఈ ఎలక్ట్రానిక్ బైక్ ను ఒక్కసారి చార్జ్ చేస్తే... 30 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయవచ్చు. పూర్తిగా కారు మాదిరిగా కవర్ చేయబడి ఉండడంతో దుమ్ము,దూళి, వర్షం, ఎండ ,చలి నుంచి మనల్ని రక్షిస్తుంది. వర్షాకాలంలో చాలామందికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. లిథియం అయాన్ బ్యాటరీల సాయంతో ఈ క్యాబిన్ మోటార్ సైకిల్ నడుస్తుంది. మూడు చక్రాలు ఉండడంతో కాలు క్రింద పెట్టి బ్యాలెన్స్ చేసుకోవల్సిన అవసరం కూడా లేదు. హైబ్రిడ్జ్ సినర్జీ టెక్నాలజీ వాడటం వలన మీడియం డిస్టన్స్ జర్నీకి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంతకీ దీని రేటెంతో తెలుసా 60వేల యుఎస్ డాలర్లు . మన కరెన్సీలో 38లక్షల 24వేల రూపాయలు .

ఏరోమొబిల్ ఫ్లయింగ్ కార్ @2017

స్లోవోకియాకు చెందిన ఇంజనీర్ స్టీఫెన్ క్లీన్ తయా రుచేసిన ఏరోమొబిల్ ఫ్లయింగ్ కార్‌ను ఈఏడాది మార్కెట్లోకి విడుదల చేస్తున్నారు. ఈ కారును 2014లో ఆస్ట్రియాలోని వియన్నాలో జరిగిన పయోనీర్స్ ఫెస్టివల్లో ప్రదర్శించారు. ఇప్పుడు కమర్శియల్‌గా ముందు తేవాలని అన్ని పరీక్షలను పూర్తి చేసుకుని ఆయా దేశాల అనుమతుల కోసం ఎదురుచూస్తుంది. ఏరోమొబిల్ సంస్థ 1990 నుంచే ఫ్లయింగ్‌కార్ పై దృష్టి పెట్టింది. అది ఇంతకాలానికి నెరవేరడం ఆనందాన్ని ఇస్తుందంటున్నా రు కంపెనీ సిఇవో.. జురజ్ వక్యులిక్ . ఏరో మొబిల్ కార్ గాలిలో 700 కిలోమీటర్లు, నేలపై 875 కిలోమీటర్లు ప్రయాణించగలదు. గాలిలో గంటకు 15లీటర్ల ఇంద నాన్ని నేలపై లీటరుకు 12.5 కిలీమీటర్లు ప్రయాణిస్తుంది. దీని టేకాఫ్ స్పీడ్ గంటకు 130కిలోమీటర్లుగా ఉంది. దీనిలో రెండు సీట్లు ఉంటాయి. ఒకటి పైలట్ కోసం కాక్ పిట్ అయితే... ఇంకొకటి పాసింజర్ సీట్.




కొలిమ్ కార్వాన్

క్రిస్టియన్ సుసానే అనే ఆస్ట్రియన్ డిజైనర్ సరికొత్త కార్ డిజైన్‌ను తయారుచేశాడు. కారు, కార్వాన్‌లను కలుపుతూ కొలిమ్ కార్వాన్ అనే కాన్సెప్ట్ ను రూపొం దించాడు. అంటే ఇదొక డిటాచబుల్ కారవాన్ . ఇందులో కొలిమ్ అంటే మీనింగ్... కలర్స్ ఆఫ్ లైఫ్ ఇన్ మోషన్. జియెమెట్రిక్ షేప్‌తో ఉండే ఈ వెహికల్‌లోకి



కార్‌ను అప్పటికప్పుడు ఎటాచ్ చేసుకోవచ్చు. కాంబినేషనల్ వెహికల్‌గా దీనిని పిలుస్తున్నారు. ఇంటిలిజెంట్ మొబిలిటీ కాన్సెప్ట్‌గా వచ్చిన కారవాన్ క్యాంపర్లో కాక్‌పిట్‌కు లివింగ్ స్పేస్ కనెక్ట్ అవ్వదు. ఇద్దరి నుంచి నలుగురు ఇందుల్లో ప్రయాణించవచ్చు. లైఫ్‌స్టైల్ మోటార్ హోంగా దీనిని చూడవచ్చు. ఆసియాలో దీనిని అందుబాటులోకి తేలేకపోయి నా కొన్ని దేశాలలో అప్పుడే వీటిని వినియోగంలోకి తెచ్చేశారు. అయితే వీటిని ప్రైవేట్ వ్యక్తులు సొంతం చేసుకోలేరు. కేవలం ప్రభుత్వ తరహా సంస్థలు, వైద్య రంగానికి చెందిన వారికి మాత్రమే ఈకారును సొంతం చేసుకోవడానికి అనుమతులు లభిస్తున్నాయి.

కిట్టీ హాక్ ఫ్లయర్



సిలికాన్ వ్యాలీకి చెందిన ఫ్లెయింగ్ కార్ స్టార్టప్ కంపెనీ కిట్టీ హాక్ పర్సనల్ ఫ్లెయింగ్ మిషన్ వాహనాన్ని రూపొం దించింది. ఇప్పటికే ఈ కంపెనీ దీనికి సంబంధించి మొన్న ఏప్రిల్‌లో ఎయిర్ బోర్న్ టైప్ వీడియోను కూడా విడుదల చేసింది. గూగుల్ సహ వ్యవస్థాపకుడు లారీ పేజ్ దీనిని ఆవిష్కరించాడు. 8మోటార్లు కలిగిన ఈ ఫ్లయింగ్ మిషన్ 220 పౌండ్ల బరువుంటుంది. గంటకు 25మైళ్ల వేగంతో దూసుకుపోతుంది. 15మీటర్ల వర కు పైకి ఎగరగల ఈ పర్సనల్ ఫ్లయింగ్ మిషన్ ను మరో ఏడాదిలో జనాలకు అందుబాటులోకి తెస్తామని కిట్టీ హాక్ తన సైట్లో పేర్కొంది. అమెరికాలో జనాలు రద్దీ లేని ప్రాంతాలలో తమకు వీటిని వినియోగించడానికి అనుమతులు కూడా ఉన్నాయని కంపెనీ చెబుతుంది. వీటిని నడపడానికి పైలట్ కోర్స్ చేయాల్సిన అవసరం లేదని కేవలం రెండు గంటల పాటు శిక్షణ ఇస్తే సరిపోతుందని కంపెనీ నిర్వాహకులు చెబుతున్నారు. 2017 చివరినాటికి వీటిని ముందుగా అందుబాటులోకి తెస్తామని .. వినియోగదారుల అభిప్రాయాలు తీసుకున్నాక వచ్చే ఏడాది నుంచి పూర్తిగా మార్కెటింగ్ చేస్తామంటున్నారు.

డ్రైవర్ లెస్ కార్లు భారత్‌లో లేనట్లే

గూగుల్ కంపెనీ డ్రైవర్‌లెస్ కార్లు తయారీపై ఆసక్తి ప్రదర్శిస్తున్న విషయం మనందరికీ తెలిసిందే. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో టెస్ట్‌డ్రైవ్‌లు కూడా చేస్తుంది. దీంతో త్వరలో ఇండియాలో కూడా ఈ తరహా కార్లు రాబోతున్నాయని చాలామంది భావిస్తున్నారు. కాని అలాంటి పరిస్థితి ఇండియాలో ఉండబోదని డ్రైవర్‌లెస్ కార్లు ఇండియాలోకి రానీయమని కేంద్ర రోడ్డు రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీ చెబుతున్నారు. డ్రైవర్‌లెస్ కార్లను అనుమతించే బదులు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి 50లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించొచ్చని చెబుతున్నారు.


వరల్డ్ ఫస్ట్ పాసింజర్ డ్రోన్



చైనాకు చెందిన ఈహ్యాంగ్ కంపెనీ.. అటానమస్ ఏరియల్ వెహికల్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనికి ఈహ్యాంగ్ 184 అని పేరు పెట్టింది. నిజానికి ఇదొక ఎలక్ట్రిక్ పాసెంజర్ డ్రోన్ . 2016లో జరిగిన కంప్యూటర్ ఎలక్ట్రానిక్ షోలో దీనిని ప్రదర్శించారు. ప్రస్తుతానికి ఈ డ్రోన్ కేవలం ఒక వ్యక్తిని మాత్రమే గమ్యానికి తీసుకు వెళ్లగలదు. 11,500 మీటర్ల ఎత్తు వరకు ఇది ఎగరగలదు. గంటకు 101 కిలోమీటర్ల వేగంతో ఇది ప్రయాణించ గలదు. 8 ప్రొపెల్లర్స్ దీనికి అమర్చబడి ఉంటా యి. సూపర్ సైజ్డ్ డ్రోన్‌ను ఫస్ట్ ఏరియల్ ట్యాక్సీగా వాడాలని ప్రపంచ దేశాలు చూస్తున్నాయి. దీనిని సొంతం చేసుకోవాలంటే 2లక్షల డాలర్ల నుంచి 3లక్షల డాలర్ల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్లో టార్గెట్ లోకేషన్ ఫిక్స్ చేయడం ద్వారా ఈహ్యాంగ్ 184 మనల్ని గమ్యానికి చేర్చుతుంది.


ఊసరవెల్లి కారు, అదృశ్యమయ్యే కారు

కాన్సెప్ట్ కార్లు అందుబాటులోకి రావడానికి కొంత సమయం పడుతుంది. కాని మనకున్న కార్లకు కాస్త హైఫై టెక్నాలజీ జోడించడం ద్వారా అప్పటికప్పుడు ఊసరవెల్లి కారు, అదృశ్యమయ్యే కారులను కూడా తయారు చేయవచ్చని నేటి ఇంజనీర్లు నిరూపిస్తున్నారు.



ముందుగా ఊసరవెల్లిలా రంగులు మార్చే కార్ దగ్గరకే వద్దాం. ఎవరి కైనా ఒకే కలర్ కారును కొంతకాలం వాడాక కలర్ ఏమైనా చేంజ్ చేస్తే బాగుంటుంది కదా అనిపిస్తుంది. దీని కోసమని టెఫ్లాన్ కోటింగ్‌కు వెళితే భారీస్థాయిలో బిల్‌తో బాదేస్తారు. అదే జస్ట్ రిమోట్ నొక్కితే అప్పటికప్పుడు కార్ కలర్ మారితే ఎలా ఉంటుంది. రోజుకొక కలర్‌తో మన కారును కలర్‌ఫుల్‌గా మార్చేయవచ్చు. అయితే కారు ఇలా కలర్ మార్చడానికి లిట్ కోట్ కంపెనీ... పారా మ్యాగ్నటిక్ పెయింట్‌ను అభివృద్ధి చేసింది. ఇక్కడ చెప్పుకోవల్సిన విషయం ఇంజన్ ఆఫ్ చేసే ఈ కారు కలర్ చేంజ్ అవ్వదట. చెప్పుకోవడానికి అంత బాగానే ఉంది కాని.. ఈ తరహా కార్లకు ప్రభుత్వాల నుంచి అనుమతులు దొరకడం అంత వీజీ కాదు. దొంగతనాలు మరింత పెరిగిపోవచ్చనే ఉద్దేశ్యంతో కార్లకు ఈ టెక్నాలజీ పెయింట్ లను వేయడానికి దాదాపు అన్ని దేశాలలోను పర్మిషన్స్ నిరాకరించడంతో లిట్ కోట్ కంపెనీ తెగ బాధ పడిపోతుంది.

ఇక అదృశ్యమయ్యే కారు విషయానికొస్తే... జేమ్స్ బాండ్ సినిమా గుర్తు రాకమానదు. బాండ్ సినిమాలలో ఫ్యూచర్లో రాబోయె కార్ల ప్రస్తావన కచ్చితం గా ఉంటుంది. జేమ్స్ బాండ్ సినిమాల్లో ఎలాంటి కార్లను సీక్రెట్ ఏజెంట్‌లు వాడతారో చూపిస్తారు. అలా వాడగా మనం చూసిందే అదృశ్యమయ్యే కారు. జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జీరియస్ కార్... మెర్సిడెస్ బెంజ్ సరికొత్త ఫ్యూయల్ సెల్ హైడ్రోజన్ టెక్నాలజీని ప్రమోట్ చేసేందుకు సిద్ధమైంది. దీనిలో భాగం గా జీరో ఎమిషన్ మెర్సిడెస్ బెంజ్ బి క్లాస్ ఎఫ్ సెల్ కారును ప్రత్యేకంగా తయారు చేసింది.



ఈ కారును రోడ్ పై పార్క్ చేస్తే దీనికి అవతల వైపు ఉన్నవి కూడా స్పష్టంగా కనిపిస్తాయి. ఇన్‌విజిబుల్ కారుగా పిలిచే ఈకారును దూరం నుంచి చూస్తే దాదాపు అదృశ్యమైనట్లే కనిపిస్తుంది.

ఇలా చెప్పుకుంటూ పోవాలే గాని రోజుకొక కొత్త రకం కారు ఇంజనీర్ల చేతిలో పురుడు పోసుకుంటుంది.బడా కంపెనీలన్నీ కొత్త కాన్సెప్ట్ కార్లను తయారుచేయడం కోసం కోట్ల డాలర్లు వెచ్చిస్తున్నాయి. ఈ ఇన్వెస్ట్ మెంట్ అంతా ఏదో సరదా కోసం చేసేది కాదు. ఫ్యూచర్ మార్కెట్ లో మేము నిలబడాలంటే ఆ మాత్రం ప్రయోగాలు చేయకపోతే ఎలా అంటున్నారు. ఏది ఏమైనా కాన్సెప్ట్ వెహికల్స్ ప్రజా రవాణాను మరింత సులభతరం చేస్తే అంతకంటే ఏం కావాలి.

- సూర్యమ్ కలిదిండి

వాసన చూడు...కండిషన్ తెలుసుకో

కారు కొనేసామా... ఫ్రెండ్స్‌ను వేసుకుని చక్కెర్లు కొట్టేశామా అన్నది కాదు.. కార్ మెకానిజంపై మినిమమ్ అవగాహన ఉండాలి. లేదంటే బాగోదు. ఇబ్బంది పడిపోతారు. ఎంతోమంది కారునుకొన్నాక దాని మెయిన్‌టెనెన్స్ విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కారణం.. ఏ ఇష్యూ వస్తే ఏం చేయాలో సరిగా తెలియకపోవడం. అందుల్లోను ఇష్యూ వచ్చే ముందుగానే తెలుసుకునే చిట్కాలు చాలామంది వాహన వినియోగదారులకు తెలియకపోవడంతో.. సమస్య వచ్చాక కారుకు వేలకు వేలు ఖర్చు పెడుతున్నారు. జస్ట్ స్మెల్ చూసి కారు కండిషన్ ను పసిగట్టేసే మెకానిక్ లు ఎంతోమంది ఉంటారు. వారు చెబుతున్న వివరాల ప్రకారం ఏ కార్ కండిషన్ ఎలా ఉందో తెలుసుకునే ప్రయత్నం ఇప్పుడు చేద్దాం.

- **కాలిన రబ్బరు వాసన :** కారు ఇంజన్ కంపార్ట్‌మెంట్ నుంచి కాలిన రబ్బరు వాసన వస్తుంటే డ్రైవ్ బెల్ట్ ఏమైనా జారిపోయాయో లేక రబ్బర్ హోస్ పైపులు ఏవైనా తిరుగుతున్న పరికరాలతో రాపిడికి గురౌతున్నాయో లేదో చెక్ చేయండి. ఇంజన్ కంపార్ట్‌మెంట్ వేడిగా ఉంటే కారును కాసేపు నీడగా ఉన్నచోట పార్క్ చేసి ఇంజన్ చల్లబడిన తర్వాత సరి చూస్కోండి. దీనిని చెక్ చేయకుం డా అలానే వదిలేస్తే... డ్రైవ్ బెల్ట్ పై ఆధారపడి ఉండే మోటార్లు పనిచేయక పోవడం, హోస్ పైపుల నుంచి ఫ్లూయిడ్స్ , ఎయిర్ లీక్ కావడంతో ఇంజన్ కంపార్ట్‌మెంట్ లో ఒక్కోసారి మంటలు చెలరేగడం ఖాయం.



- **ఇందనం వాసన :** కారు నుంచి పెట్రోల్ ,డీజిల్ ,గ్యాస్ వాసన కాస్త ఎక్కువగా వస్తే.. అది రొటీనే కదా అని తేలిగ్గా తీసిపారేయెద్దు. అలా వస్తుందంటే ఇంజన్ కంపార్ట్‌మెంట్ ఫ్యూయల్ ఇంజక్టర్ లైన్‌లో కాని ,ఫ్యూయల్ ట్యాంక్ వద్ద గాని ఇంధనం లీక్ అవుతున్నట్లు అర్ధం. కారునుంచి ఇలాంటి ఇంధన వాసన రాగానే కారును పక్కన నిలిపి ఎక్కడైనా ఇంధనం లీక్ అవుతుందేమోనని చెక్ చేసుకోవాలి. ఒకవేళ ఇంధనం లీక్ అవుతున్నట్లు అనిపిస్తే తక్షణమే రోడ్ సైడ్ అసిస్టెన్స్ కు కాని లేదా సమీపంలోని అధీకృత సర్వీస్ సెంటర్‌కు కాల్ చేయాలి.
- **సిరప్ తరహా తీపి వాసన :** కారు ఇంజన్ కంపార్ట్ మెంట్ నుంచి సిరప్ లాంటి తీపి వాసన వస్తుంటే ఇంజన్ ఆయిల్ కూలెంట్ లీక్ అవుతుందేమోనని చూసుకోవాలి. కార్ కూలింగ్ సిస్టమ్ కు సంబంధించిన ఏ పార్ట్ నుండైనా కూలెంట్ ఆయిల్ లీక్ అవుతుంటే ఇలాంటి వాసనే వస్తుంది. అలాంటి సంధర్భాలలో కారును సర్వీస్ సెంటర్ కు తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలి. ఇంజన్ వేడిగా ఉన్న టైమ్లో రేడియేటర్ క్యాప్‌ను ముట్టుకోకండి. దీనిని ఇలానే వదిలేస్తే... కూలెంట్ ఆయిల్ లెవల్ తగ్గి ఇంజన్ వేడెక్కడంతో పాటు దాని పనితీరు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.
- **కాలుతున్న కార్పెట్ వాసన:** కారునుంచి కాలుతున్న కార్పెట్ వాసన వస్తుంటే అది బ్రేక్ సమస్య అని గుర్తించండి. అలాంటి వాసన వచ్చిన వెంటనే బ్రేక్‌లను సరిగా ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలి. సాధారణ డ్రైవింగ్ పరిస్థితులలో కార్పెట్ వాసన వస్తే చాలా అప్రమత్తంగా ఉండాలి. సమస్యను ఇలానే వదిలేస్తే... బ్రేక్స్ ఫెయిలయ్యే ఆస్కారం ఉంటుంది.
- **కుళ్లిన కోడిగుడ్డు వాసన:** కారు నుంచి కుళ్లిన కోడిగుడ్డు వాసన వస్తుంటే ,సైలెన్సర్‌కు సంబంధించిన క్యాటలైటిక్ కన్వర్టర్ సైలెన్సర్‌లోని హైడ్రోజన్ సల్ఫైడ్ ను సల్ఫర్ డైఆక్సైడ్‌గా సరిగ్గా కన్వర్ట్ చేయకపోతే ఇలాంటి వాసన వస్తుంది. దీనిని ఇలాగే వదిలేస్తే ఇంజన్ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపి క్యాటలైటిక్ కన్వర్టర్ పై ఓవర్ లోడ్ పడటంతో అది ఫెయిల్ అవుతుంది.

ఇవే కాకుండా కారు ఇంజన్ నుంచి కాని లేదా వేరే సైడ్ నుంచి ఏమైనా వాసనలు వస్తే వాటిని అలానే వదిలేయకుండా కారణం ఏంటో అన్వేషించండి. ఏమాత్రం సందేహం కలిగిన నిపుణులైన మెకానిక్ లను సంప్రదించండి.

చింతన

శ్రీ కృష్ణస్తుతి

చిరుప్రాయముననె దుష్టుల
పరిమార్చిన లోకేశా! పౌరుష భూజా!
పరమార్థము బోధించే
పరమపురుషుడా! పురుషోత్తముడవు కృష్ణా॥



అక్రూరవరద! మాధవ!
చక్రధారివియై, పాపులచరితల కూల్చీ,
విక్రమార్కుడవై, జీవుల
చక్రము ద్రిప్పిన పావన చరితా! కృష్ణా॥

బలరామ సోదరుడవై,
హలమును బట్టీ, చేలను కాల్వల తడిపీ
నేలను సస్యశ్యామగ
నిలిపీ పుడమిని బ్రోచిన నీలా కృష్ణా॥


శేషుని పడగల నీడను
శేషుడవైశయనించీ శేషాచలము
న్విశ్వశ్రేయము సేయగ
శేషా! ఈశా!యని కీర్తింతుము కృష్ణా॥

సమాప్తం
ఓం తత్సత్!
సర్వేజనా స్సుఖినోభవంతు॥
సమస్త సన్మంగళానిభవంతు॥

- ఊటుకూరి సుహాసిని

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

సర్వం అంటే యేమిటి?



శ్రీ రమణాశ్రమం
5-7-46

నేటికి మూడు రోజుల నుంచీ కొత్తగా వచ్చిన ఒక యువకుడు భగవానులను ఏవో ప్రశ్నలు వేస్తూ విధి విరామం లేకుండా బాధిస్తూ వున్నాడు. శ్రీవారు ఎంతో సహనంతో తమ బోధను విశదీకరిస్తూనే వున్నారు. ఈ ఉదయం 9గంటలకు మళ్లీ మొదలుపెట్టాడా యువకుడు. ''సర్వం తానే అంటారే, ఆ సర్వం తానుగా భావించడం ఎట్లా?'' అని ప్రశ్నించేసరికి భగవాన్ ఇంచుక రూక్షస్వరంతో ''సర్వం అంటే యేమిటి? నీవెవరు? నీవెవరో ముందు చెపితే సర్వం సంగతి ఆలోచిద్దాం. ఇన్ని ప్రశ్నలు ఇన్నాళ్ల నుంచి అడుగుతున్నావుగాని, నీవెవరవు అన్న నా ప్రశ్న కింత వరకు జవాబివ్వవే. నీవెవరవో ముందు చెప్పి ఆ వెనక సర్వాన్ని గురించి ప్రశ్నించు, నే జవాబిస్తాను. నా ప్రశ్నకు జవాబు చెప్పే ప్రయత్నమే లేదు. అసలు నీవెవరో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే ఈ ప్రశ్నలు రావు. ఆ ప్రయత్నం విడిచి ఏ ప్రశ్న వేద్దామా అని యోచిస్తూ వుంటే అంతులేని ప్రవాహం లాగా పోతూనే ఉంటుంది. దీనికి ఎల్లలేదు. తన్ను విచారించి తెలుసుకుంటేనే శాంతి వుంది గాని, తన్ను విడిచి, వారెట్లా వున్నారు వీరెట్లా వున్నారు అని విచారిస్తూ ప్రశ్నిస్తే ఏమి లాభం? ఇదంతా వృథా ప్రయాస'' అన్నారు.

''తన్ను తెలుసుకోడానికి గురువు, సాధన వద్దా?'' అన్నాడా యువకుడు. ''నీకు గురువెందుకు? సాధనెందుకు? నీకే అన్నీ తెలుసునంటావే, ఇక గురువెందుకు? చెప్పింది వినవు. గురువేం జేస్తాడు? చెప్పిన త్రోవను పోతే గదా గురు సహాయం? సాధన అంటావు. దేనికి సాధన? ఏ సాధన? ఎన్ని ప్రశ్నలు? ఏదో ఒక త్రోవన పోవాలి గాని, ప్రశ్న పరంపరలతో ఉరుకులు పెడితే లాభం యేమున్నది? నీవు తింటే కడుపు నిండుతుందా? వేరొకరు తింటే నిండుతుందా? వారెట్లా, వీరెట్లా, అదెట్లా, ఇదెట్లా అంటూ ప్రశ్నలతో కాలం గడిపితే ప్రయోజనం ఏమిటి. మెదలకుండా తన స్థితిలో తానున్నట్లుంటుందా యీ ప్రసంగ సుఖం? తన్ను విడిచేదీ, ఏది సుఖం! ఏది సుఖం! అంటూ ఆకాశం భూమి అంతా వెదికేది. ఈ తిరిగే, ఈ అడిగే, నేనెవరు అని ముందు ప్రశ్నించుకోవాలి. ఇట్లా తన్ను తాను ప్రశ్నించుకుంటే మరి ప్రశ్న రాదు'' అన్నారు భగవాన్.

ఇంతలో మరొకరందుకొని, ''జీవుడికి కర్మ ఎట్లా వచ్చింది?'' అన్నారు. ''అసలు జీవుడంటే ఎవరో ముందు నిర్ణయిస్తే కర్మ ఎట్లా వచ్చిందో వెనుక చూచుకుందాం. జీవుడంటే ఏమిటో తెలియదు. ఆ జీవుడికి కర్మ ఎట్లా వచ్చింది. ఆ కర్మ జీవుడికి అంటి వుందా? దూరంగా వుందా? ఇవి ఆలోచనలు. ఈ బయటికి విజృంభించే మనస్సును అంతర్ముఖం చేస్తే ఈ గొడవలన్నీ వుండవు'' అన్నారు భగవాన్.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

కల్కి పలుకు



Sri Amma Bhagavan

వివరణ : కూనపురెడ్డి అరుణ్ కుమార్

ఆధిపత్యం వహించే ఆలోచనల పట్లే ఆకర్షితులవుతుంటారు.

ధర్మో రక్షతి రక్షితః

వశిష్ఠుడు లోకకళ్యాణ కారకుడు కనుక అతడు తన్ను తాను త్యాగం చేసుకోవాలని చూసినప్పటికి ప్రకృతి అతనికి అపకారం చేయలేక కాపాడుతూనే ఉంది. అతను అజ్ఞానంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా, అది మహాపాపం కనుక ఆ అధర్మాన్ని జరగనివ్వలేదు. కనుక ధర్మాన్ని మనం రక్షిస్తే ఆ ధర్మమే మనలను ఎల్లప్పటికీ రక్షిస్తుంది.



ఒక్కోసారి ఎన్ని సంపదలున్నా, ఎంత ధనమున్నా కూడా పక్కవారిని చూసి అసూయ కలుగుతుంది. దాన్ని ఎలాగైనా తీసుకోవాలన్న బుద్ధి పుడుతుంది. ఇది సహజమే. కాని దీనిని నిగ్రహించుకుని అసూయను గెలవగలిగితే జితేంద్రియుడన్న ఖ్యాతి లభిస్తుంది. అలా ఖ్యాతి తెచ్చుకోకపోయినా విశ్వామిత్రుడు మొదట స్పర్థ తోను, తర్వాత నిజం తెలుసుకుని వివేకంతోను ఆలోచించి బ్రహ్మర్షి అయ్యాడు. అది తర్వాత తెలుసుకుందాం.

అసలు ఈ విశ్వామిత్రుడు ఒక రాజు. వశిష్ఠుడు ఒక ముని అని తెలిసిందే. వీరిద్దరికి మధ్య నందిని అనే గోవు వల్ల స్పర్థ ఏర్పడింది. వశిష్ఠుని ఎలాగైనా బాధించాలని విశ్వామిత్రుడు అవకాశం కోసం ఎదురుచూస్తూండేవాడు.

ఒకనాడు వశిష్ఠునికి ఉన్న నూరుమంది కొడుకుల్లో పెద్దవాడైన శక్తి ఒక దారిలో వెళ్తున్నాడు. అదే దారిలో కల్మషపాదుడనే ఇక్ష్వాకు వంశపు రాజు వస్తున్నాడు. ఇద్దరూ ఒకరికొకరు ఎదురువచ్చారు. రాజుననే గర్వంతో కల్మషపాదుడు, మహా తపశ్శాలి అయిన శక్తిని అడ్డుకొనమని కసిరాడు. అప్పుడు శక్తి, 'ఎవరైనా వేదం చదు వుకున్న వారు ఎదురు వస్తే రాజైనా నమస్కరించి దారి తొలగుతారు కదా. మరి నీవెందుకు నన్ను దారివ్వమని అడుగుతున్నావు' అని అన్నాడు. ఆ మాటలకు కల్మష పాదుడు కోపం తెచ్చుకుని చేతికి అందిన కొరడాతో శక్తిని కొట్టాడు. ఆ దెబ్బలకు తాళలేక శక్తి, 'రాజువై ఉండి కూడా అధర్మ ప్రవర్తనతో నన్ను బాధించావు కనుక నీవు రాక్షసునివై పోదువు గాక!' అని శపించాడు.

అప్పుడు విశ్వామిత్రుడు తన ఆధీనంలో ఉన్న కింకరుడనే రాక్షసుడిని కల్మషపాదునిలో ప్రవేశపెట్టాడు. కల్మషపాదుడు రాక్షస స్వరూపం పొందినప్పుడు రాజ్య వ్యవహారాలు చూడకుండా రాజ్యానికి దూరంగా ఉండేవాడు. రాక్షస బుద్ధి లేనప్పుడు రాజ్య వ్యవహారాలను చూడడం కల్మషపాదుడు నేర్చుకున్నాడు.

కాని ఒకరోజు కల్మషపాదుడు రాజ్యవ్యవహారాలు చూసేటప్పుడు ఒక ఆకలి గొన్న బ్రాహ్మణుడు వచ్చాడు. అతడు కల్మషపాదుని చూచి తనకు ఆహారాన్ని ఇవ్వమని అడిగాడు. కల్మషపాదుడు వెంటనే, నేను నీకు భోజన వసతిని కలుగచేస్తాను. కూర్చుని ఉండమని తన ప్రాసాదానికి వెళ్లాడు. కాని ఈ విషయం మరిచిపోయాడు.

అర్ధరాత్రి సమయంలో కల్మషపాదునికి తాను ఇచ్చిన మాట గుర్తుకువచ్చింది. ఎలాగైనా ఆ బ్రాహ్మణుని ఆకలి తీర్చాలని చెప్పి వంటశాలకు వెళ్లాడు. అక్కడున్న వంటవాళ్లకు బ్రాహ్మణునికి భోజనం పెట్టమని చెప్పాడు. ఆ సమయంలోనే విశ్వామిత్రుని వల్ల కల్మషపాదునిలో చేరిన రాక్షసుని బుద్ధి ప్రకోపించి ఆ వేచి వున్న బ్రాహ్మణునికి మనిషి మాంసం రుచిగా తయారుచేసి వండి పెట్టమని చెప్పి రాజు వెళ్లాడు. అర్ధరాత్రి అయినా రాజుగారి ఆజ్ఞ కనుక వంటవాడు వెళ్లి మనిషి మాంసం తెచ్చి మరీ వండి ఆ బ్రాహ్మణునికి పెట్టాడు. దాన్ని చూడగానే కల్మషపాదుడు చేసిన అకృత్యం బ్రాహ్మణునికి తెలిసింది. వెంటనే కల్మషపాదుని పిలిచి రాక్షసునిగా వ్యవహరించి నాకు మనిషి మాంసం పెట్టావు కనుక నీవు రాక్షసునివై పోదువుగాక అని శపించాడు.

కల్మషపాదుడు ఇదంతా కేవలం శక్తి మహాముని వల్ల కలిగిన సమస్య అనుకుని వెంటనే వశిష్ఠుని ఆశ్రమానికి వెళ్లి శక్తిని చూసి తనకు రాక్షసత్వం రావడానికి అతను కారణం కనుక అతన్ని చంపివేశాడు. అంతేకాదు వశిష్ఠుని నూరు మంది పుత్రులను కూడా విశ్వామిత్రుని ప్రోద్బలంతో చంపివేశాడు.

అలా పుత్రులను పోగొట్టుకున్న వశిష్ఠుడు ఎంతటి ముని అయినా, వేదం వేదాంతం తెలిసినవాడైనప్పటికీ పుత్రశోకంతో కరిగిపోయాడు. తాను ఇక జీవించి ఉండడం ఎందుకంటూ ఆత్మహత్యాప్రయత్నం చేశాడు. ఆత్మహత్య ప్రయత్నం పరమ పాపమని తెలిసి కూడా పుత్రశోకాన్ని భరించలేనని అనేక విధాలుగా ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. నదిలో దూకాడు. కాని నదీజలాలు వశిష్ఠునికి అపాయం కలుగకుండా ఒడ్డుకు చేర్చాయి. ఇలా కాదనుకుని ఎత్తైన శిఖరం నుంచి దూకాడు. అనేక కఠిన నియమాలతో కట్టుబడి ఉన్న దేహం దూదిలాగా అయ్యింది. వశిష్ఠుని ఏమాత్రంబాధ కలుగకుండా ఆయన్ను కాపాడింది ఆయన చర్మం. మరొకసారి సముద్రంలో దూకి చావాలనుకుని సముద్రంలోకి దూకాడు. సముద్రుడే తన అలలతో వశిష్ఠుని సముద్రతీరానికి చేర్చాడు. ఇలా ఎంతకీ ప్రాణం విడవక దేహాన్ని పట్టి ఉండడం చూసి నేను ఎంతటి పాపినో కదా అనుకుని బాగా మొసళ్లతో నిండి ఉన్న నదిలోకి దూకాడు. ఆ నది మునిని తాకడానికి కూడా భయపడిపోయింది. నూరుపాయలుగా వారి దూరంగా పారిపోయింది. అందుకే ఆ నదికి శతద్రువు అన్న పేరు వచ్చింది. ఇంకోసారి తన్ను తాను మూటగా కట్టుకుని ఓ నదిలోకి దూకాడు వశిష్ఠుడు. ఆ నది మహిమాన్వితుడైన వశిష్ఠునికి వచ్చిన కష్టాన్ని చూచి చలించిపోయి తనలోకి దూకిన వశిష్ఠుని కట్లు విప్పి ఒడ్డుకు చేర్చింది. దాంతో ఆ నదికి విపాశ అన్న పేరు స్థిరంగా నిలిచింది. ఇలా ఎన్ని విధాలుగా చావాలని ప్రయత్నిం చినా అవేవి అనుకూలించక తన్ను తాను నిందించుకుంటూ ముందుకు నడుస్తుండగా వెనుక నుంచి తన కొడుకైన శక్తి గొంతుతో వేదనాదం వినిపించింది. ఆత్రంతోను, ఆనందంతోను వెనుతిరిగి చూడగా తన వెనుక శక్తి మహాముని భార్య అదృశ్యంతి కనబడింది. తన కోడలు తన కొడుకు ద్వారా వంశాకురాన్ని ధరించి ఉందని విచారాన్ని దూరంగా తరిమివేసి ఆ మనువడి ముఖం చూసి నేను కృతార్థుడిని అవుతాను అనుకున్నాడు. తన మనవడు గర్భంలో 12 ఏళ్లు ఉండి అతడి తండ్రి చదివిన వేదనాదాన్ని నేర్చుకుని వల్లె వేస్తున్నాడని అదే ఆ శబ్దమని గ్రహించి కోడలితో ఆశ్రమానికి వెళ్లాడు. కొన్నాళ్లకు మరల కల్మషపాదుడు రాక్షస రూపంతోనే వశిష్ఠుని చెంతకు వచ్చాడు. అతడిని చూసి అదృశ్యంతి భయపడింది. ఆమెను భయపడవద్దని వశిష్ఠుడు చెప్పి తన కమండలంలోని జలాన్ని తీసుకుని మంత్రాన్ని పఠిస్తూ మంత్ర పూరిత జలాన్ని కల్మషపాదుని మీద చల్లాడు. దాంతో అతనికి రాక్షస రూపం పోయింది.

వెంటనే కల్మషపాదుడు 'మీవల్లనే నాకు 12ఏళ్ల తరువాత శాపవిముక్తి కలిగింద'ని చేతులు జోడించి నమస్కరించాడు. 'ఇక మీద నీవు విప్రభక్తిని కలిగి రాజ్యంలోని పౌరులందరిని కన్నబిడ్డల వలె పాలించు! ఎవరికీ అపకారం కలిగిం చకు. అధర్మంతో ప్రవర్తించేవారంతా రాక్షసగుణాలు కలిగిన వారుగా జీవించాల్సి వస్తుందని ఇప్పటికైనా తెలిసింది కదా. అందుకనే ధర్మాన్ని ఆచరిస్తూ నీవు సుఖంగా జీవించు' అని దీవించి పంపాడు. అలా కల్మషపాదుడు శాపవిముక్తి పొందాడు. వశిష్ఠుడు లోకకళ్యాణ కారకుడు కనుక అతడు తన్ను తాను త్యాగం చేసుకోవాలని చూసినప్పటికి ప్రకృతి అతనికి అపకారం చేయలేక కాపాడుతూనే ఉంది. అతను అజ్ఞానంతో ఆత్మహత్య చేసు కోవాలనుకున్నా, అది మహాపాపం కనుక ఆ అధర్మాన్ని జరగనివ్వలేదు. కనుక ధర్మాన్ని మనం రక్షిస్తే ఆ ధర్మమే మనలను ఎల్లప్పటికీ రక్షిస్తుంది.

- అశ్విని

మూషికాలయం

హైందవ సంప్రదాయంలో రకరకాల జీవ జంతువుల ఆరాధన కనిపిస్తుంది. పెద్ద జీవుల నుంచి చిన్న జీవుల వరకూ కొన్నిటిని ఆరాధించే సంప్రదాయం ఉంది. అలాగే చిన్న జీవి అయిన ఎలుకలకు రాజస్థాన్‌లో ఏకంగా ఆలయమే ఉంది. వాస్తవానికి ఎలుక గణపతితో పాటు ఆయన గుళ్లలోను, ఆయన బొమ్మలలోనే ఎక్కడో అక్కడ కనిపిస్తూనే ఉంటుంది. రాజస్థాల్లోని ఎలుకల ఆలయం ప్రపంచంలోని నలు మూలల నుంచి ఎంతో మందిని ఆకర్షించింది. చివరకు దీనిపై సిని మాలు కూడా చిత్రించారు.

ఎలుకలను పూజించే కర్ని మాత ఆలయం విషయానికి వస్తే అది రాజస్థాన్‌లోని బికనీర్ సమీపంలో ఉంది. ఈ ఆలయాన్ని ఎలుకల ఆలయంగా పిలుస్తారు. ఈ ఆలయం ఆవరణలో 25,000 నల్ల ఎలుకలుంటాయి. అక్కడ వాటికి ఎవరూ హాని చేయరు, పైగా ఆరాధిస్తారు. వాటిని కబ్బాలనే పేరుతో పిలుస్తారు.

ఈ వింత ఆలయాన్ని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడ ఎలుకలకు ఆలయం నిర్మితం కావడానికి, అవి ఆరాధనలందుకోవడానికి, కర్నిమాతకు ఎలుకలతో సంబంధం ఏమిటనే దానికి సంబంధించి కథలు ఉన్నాయి. దాని ప్రకారం కొన్ని శతాబ్దాల క్రితం ఇక్కడ కర్ని మాత అనే క్షాత్ర గుణం కలిగిన యోగిని ఉండేది. 1538 ప్రాంతంలో జోధ్‌పూర్‌లో ఆమె జన్మించిందని చెబుతారు. ఆమెను అక్కడి ఒక తెగ వారు దుర్గా మాత అపర అవతారంగా భావిస్తారు. కర్ని మాత అనుయాయుల్లో ఒకరి కుమారుడైన లక్ష్మణ్ ఇక్కడి కొలాయ్ ప్రాంతంలోని కపిల సరోవరంలో నీరు తాగే ప్రయత్నంలో దానిలో మునిగి మరణించారు. తన అనుయాయుల కుమారులనందరినీ తన కుమారులుగా భావించే కర్ని మాత అతన్ని బతికించమని యముణ్ని కోరింది. మొదట్లో యముడు ఇందుకు నిరాకరించినా ఆ తర్వాత ఆమె కుమారులుగా భావించేవారిలో మరణించినవారినందరినీ ఎలుకలుగా పుట్టిస్తానని మాట ఇచ్చారు. ఆ రకంగా ఎలుకలు కర్ని మాత సంతానమని కొందరు చెబుతారు.

మరొక కథనం ప్రకారం ఇక్కడికి దగ్గరలో జరిగిన ఒక యుద్ధ రంగం నుంచి 20,000 మంది సైనికులు తమ పాలకుని పక్షాన యుద్ధం చేయకుండా పారిపోయి కర్ని మాత ఆలయానికి వచ్చారు. తమను నమ్ముకున్న వారిని వదలి రావడానికి మరణశిక్షే తగినదని ఆ రోజుల్లో భావిం చేవారు. అయితే కర్ని మాత వారిని క్షమించి ఆ ఆలయమే వారికి పునరావాస స్థలం అవుతుందని పేర్కొందని అప్పటి నుంచి ఎలుకలు అక్కడ ఉంటున్నాయని ఆ కథనం. అంతేకాక ఆ సైనికులు ఆమెకు



కృతజ్ఞతలు చెప్పి ఎప్పుడూ ఆమెను సేవించుకుంటూ ఉంటామని హామీ ఇచ్చారు. అక్కడకు వచ్చేవారు ఇచ్చిన ఆహారాన్ని ఎలుకలు కొరకడమే ఒక గొప్ప గౌరవంగా భావిస్తారు. అక్కడున్న ఎలుకల్లో ఏదైనా చనిపోతే వాటి స్థానంలో వెండి ఎలుకను చేయిస్తారని చెబుతారు. ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని 20వ శతాబ్దం పూర్వార్ధంలో బికనీర్‌కు చెందిన మహారాజా గంగా సింగ్ ముగల్ కళారీతిలో నిర్మించారు. ఈ ఆలయం ముందు భాగాన్ని అందంగా పాలరాతితో నిర్మించారు. ఆలయ ప్రవేశ ద్వారాలు వెండి తో చేశారు. ఆలయం లోపలి భాగంలో గోడలకు కర్నిమాత జీవితంలోని విశేషాలను వివరించే చిత్రా



లను వేలాడదీశారు. లోపల ఉండే గర్భగుడిలో కర్ని మాత విగ్రహం ఉంటుంది. ఈ ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన కర్ని జువెలర్స్ అనే సంస్థకు చెందిన కుందన్‌లాల్ వర్మ 1999లో మరిన్ని హంగులు చేకూర్చారని చెబుతారు.

ఆలయంలో అన్నీ నల్ల ఎలుకలే అయినా అదృష్టం బాగుంటే ఒకటి రెండు తెల్ల ఎలుకలు కనిపిస్తాయి నిజానికక్కడ నాలుగైదు తెల్ల ఎలుకలున్నాయని చెబుతారు. అవి కర్ని మాత, ఆమె నలుగురు కొడుకుల రూపాలని నమ్ముతారు. అవి మరింత పవిత్రమైనవని వాటిని దర్శించడం మరింత పుణ్యప్రదమని భావిస్తారు. వాటని చూసేందుకు, బయటకు రప్పించేందుకు భక్తులు ప్రయత్నాలు చేస్తుంటారు. అక్కడ ఆలయంలో కర్ని మాత చరణ్ వర్గానికి చెందిన పూజారులు ఉదయాన్నే హారతి ఇచ్చి, ప్రసాదం పెడతారు. యాత్రికులు ఎలుకలకు ఆహారం పెడతారు. ఇక్కడ భక్తులు రెండు విధాల అర్పణలు చేస్తారు. దానిలో ధ్వార్ భెంట్ అనే దాని ద్వారా వచ్చే ఆదాయం పూజారులకు, ఆలయంలో పని చేసే వారి తం, కలశ్ భెంట్ అనేది ఆలయ నిర్వహణ, అభివృద్ధికి ఖర్చు చేస్తారు.

భగవద్గీత



భగవత్సేవా పరాయణుడు కర్మబంధితుడు కాదు

అధ్యాయం 4

శ్లోకం 22:

యదృచ్ఛాలాభసంతుష్టో
ద్వంద్వాతీతో విమత్సరః।
సమః సిద్ధావసిద్ధౌ చ
కృత్వాపి న నిబధ్యతే॥

తాత్పర్యం:

యాదృచ్ఛికంగా లభించినదానితో సంతుష్టుడగువాడు, ద్వంద్వాతీతుడు, అసూయ లేనివాడు, జయాపజయాల యందు స్థిరుడై యుండెడి వాడు అగు మానవుడు కర్మలను చేస్తున్నప్పటికీ ఎన్నడును బంధితుడు కాడు.

భాష్యం :

భగవత్సేవా తత్పరుడు దేహ పోషణార్థమై ఎక్కువగా శ్రమింపడు. న్యాయంగా శక్తి కొలది కర్మను చేసి వచ్చిన దానితో సంతృప్తి పొందుతాడు. ఈ సమాజంలో జీవిస్తున్నపుడు చేయవలసిన బాధ్యతలు తన సేవకు అవి ఆటంకము కాకుండా ఉండేటట్లు అతడు చూసుకుంటాడు. భగవంతుని కోసం ఏ కార్యమైనా చేయటానికి సిద్ధమే కనుక సుఖదుఃఖాలలో, శీతోష్ణాదులలో చలించకసేవను కొనసాగిస్తాడు. ఆ విధంగా ద్వంద్వాతీతుడగుటచేత జయాపజయములందూ కలవరపడడు. మనుజుడు దివ్యజ్ఞానమును పొందినపుడు అతనిలో ఇటువంటి చిహ్నములు కనిపిస్తాయి

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీ శ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



తగ్గిపోవడం, మంటలు, నడకలో మార్పు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కారణాలు

నర్వ్ కంప్రెషన్

నరాలపై ఒత్తిడి పడటం వల్ల నొప్పి ప్రారంభమవుతుంది.

స్పైనల్ డిస్క్ హెర్నియేషన్

ఎల్ 4, ఎల్ 5 నరాల రూట్స్ ఒత్తిడికి గురై సరియైన పొజిషన్‌లో వంగక పక్కకు జరిగి సయాటికా నొప్పి వస్తుంది.

స్పైనల్ స్టెనోసిస్

ఎముకల్లో ఏర్పడే స్పర్శ వల్ల వెన్నెముక కంప్రెస్ అవుతుంది. ఇది కూడా నొప్పికి కారణమవుతుంది.

పైరి ఫార్మిస్ సిండ్రోమ్

దెబ్బలు, గాయాలు తగిలినప్పుడు పైరిపార్మిస్ కండరం వాచి నరాలపై ఒత్తిడిని కలగజేస్తుంది.

సాక్రో ఇలియక్ జాయింట్ డిస్క్ ఫంక్షన్

శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడం వల్ల కీలు సరిగ్గా పనిచేయ క సయాటికా నొప్పి రావచ్చు.

ప్రెగ్నెన్సీ

గర్భిణీల్లో పిండం బరువు పెరిగి నరాలపై ఒత్తిడి పడటం వల్ల నొప్పి వస్తుంది.

సయాటికా వల్ల భరించలేని నొప్పి

సయాటికా... ఈ పదాన్ని ఆధునిక యుగంలో యుక్త, మధ్య వయస్సు వారిలో వినని వారు ఉండరు. ఈ నొప్పి వర్ణనాతీతంగా, భరింపరానిదిగా ఉండటమే కాకుండా దైనందిన జీవితంలో ఆటంకాన్ని కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది ఈ సమస్యతో తమ విధులు సరిగ్గా నిర్వర్తించలేకపోతున్నారు. అయితే ఈ సమస్యను త్వరగా గుర్తించి సరియైన చికిత్సను అందించడంతో పాటు దైనందిన జీవితంలో మార్పులు చేసుకోవడం, ఫిజియో థెరపీ, యోగ వంటివి చేయడం ద్వారా పూర్తిగా నివారించవచ్చు. ముఖ్యంగా సయాటికా అంటే ఆపరేషన్ వరకు వెళ్లాల్సి వస్తుందని చాలామంది భయపడుతుంటారు. కానీ హోమియో మందులతో సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా తగ్గించవచ్చు.

శరీరంలో అన్నిటికన్నా పెద్ద నరం సయాటికా. ఇది కింది వీపు భాగం నుంచి పిరుదుల మీదుగా కాలు వెనక భాగం గుండా పాదాల వరకు ప్రయాణిస్తుంది. ఈ నరం ఇతర ఐదు నరాల (ఎల్4, ఎల్5, ఎస్1, ఎస్2, ఎస్3) సమూహాలత ఏర్పడి ఉంటుంది. వెన్నుపూస లోపల నుంచి ప్రయాణించు నరాలపైన ఒత్తిడి వల్ల కాలు వెనక భాగం నొప్పికి గురవుతుంది. దీనినే సయాటికా నొప్పి అంటారు. ఈ నొప్పి



వీపు భాగంలో నుంచి పాదం వరకు ఉంటుంది. తిమ్మిర్లు, స్పర్శ

పరీక్షలు

డాక్టర్ సమక్షంలో కొన్ని వ్యాయామాలు చేయడం ద్వారా సయాటికా నొప్పిని గుర్తించవచ్చు. డిస్క్ హెర్నియేషన్, డిస్క్ ప్రొలాప్స్‌ని గుర్తించడానికి ఎమ్ఆర్ఐ స్కాన్ ఉపయోగపడుతుంది. నరంపై ఎక్కడ ఒత్తిడి పడుతుందో ఇందులో స్పష్టంగా తెలిసిపోతుంది.


హోమియో చికిత్స

సయాటికా నొప్పి, వెన్నుపూస సమస్యలకు హోమియో వైద్య విధానంలో మంచి చికిత్స అందుబాటులో ఉంది. ఎక్స్‌రే, ఎమ్ ఆర్ఐ పరీక్షలు చేయించిన తర్వాత సమస్యను నిర్ధారణ చేసుకుని చికిత్స అందించడం జరుగుతుంది. ఆపరేషన్ లేకుండానే మందులతో సయాటికా సమస్య పూర్తిగా తగ్గిపోతుంది.

డాక్టర్ గీత
ఫ్యామిలీ హెల్త్‌కేర్ హోమియోపతి
హైదరాబాద్
8019109109



కరోనరీ హార్ట్ డిసీజ్



కరోనరీ హార్ట్ డిసీజ్ (సిహెచ్‌డి) అనేది భారతదేశంలో పెరిగిపోతున్న మహమ్మారిగా మారింది. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా ప్రకారం 2010-13లో మొత్తం మరణాల్లో 23శాతం వయోజనుల మరణాల్లో 32శాతం వాటికి సిహెచ్‌డితో ప్రమేయం ఉంది. అనారోగ్యదాయక జీవనశైలి ఎంపికలు, స్థూలకాయం, కొన్ని సందర్భాల్లో కుటుంబ చరిత్ర హృదయ ధమనిలో ఫలకం ఏర్పడేందుకు దారి తీస్తుంది. అది బ్లాకేజిలకు, గుండెకు సరఫరా అయ్యే ఆక్సిజన్ తగ్గిపోయేందుకు కారణమవుతుంది. ఇది ఛాతినొప్పి రూపంలో, తీవ్ర సందర్భాల్లో హార్ట్ ఎటాక్‌గా బయటపడుతుంది.

బ్లాకేజ్ ఏ మేరకు ఉందన్నదాన్ని కచ్చితంగా గుర్తించడంపై సిహెచ్‌డి చికిత్స ఆధారపడి ఉంటుంది. హృదయ ధమని బ్లాకేజ్‌ను నయం చేయడం అనేది దాని తీవ్రతను బట్టి ఉంటుంది. ప్రాథమికంగా మూడు రకాల చికిత్సలు ఉంటాయి. మెడికల్ మేనేజ్‌మెంట్, పర్క్యుటనెయస్ కరొనరీ ఇంటర్వెన్షన్ (పీసీఐ), బైపాస్ సర్జరీ, పీసీఐలో, అవరోధాలతో ఉన్న ధమనులను ఓపెన్ చేసేందుకు, రక్తం ఎలాంటి అవరోధాలు లేకుండా ప్రవహించేందుకు ఒక స్టెంట్ (వైర్ మెష్ ట్యూబ్)ను ఉంచేందుకు కేథటర్‌ను ఉపయోగిస్తారు. బైపాస్ సర్జరీలో రక్తనాళాలను లాంగ్ సఫెషీనస్ వెయిన్ లేదా రేడియల్ ఆర్టరీ లాంటి శరీరంలోని ఇతర భాగాల నుంచి తీసుకుంటారు.

అవరోధం గనుక మరీ పెద్దది కాకుంటే మందుల వాడకం ద్వారా దాన్ని తగ్గించవచ్చు గానీ అది గనుక పెద్దదైతే, పీసీఐ లేదా బైపాస్ సర్జరీ చేస్తారు. గత కొన్ని దశాబ్దాలుగా, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్‌లు కార్డియాక్ చికిత్సల కోసం పీసీఐని విస్తృతంగా వినియోగిస్తున్నారు. అత్యుత్తమ ఫలితాల కోసం పీసీఐని సరైన విధానంలో చేయాల్సి ఉంటుంది. పీసీఐ ఆప్టిమైజేషన్ అంటే ట్రీట్‌మెంట్ ప్రొసీజర్ అత్యంత తగిన విధంగా తీసుకోబడిన చికిత్స నిర్ణయం ప్రకారం, ఎలాంటి పోస్ట్ ప్రొసీజర్ సమస్యలు రాకుండా జరగడం. ఆధునాతన సాంకేతికతల పురోగతితో పీసీఐ ద్వారా చికిత్స గణనీయంగా మెరుగైంది. వాడుకలో ఉన్న ఇతర ఇమేజింగ్, ఫి జియోలాజికల్ విధివిధానాలు గాకుండా ఫ్రాక్షనల్ ఫ్లో రిజర్వ్(ఎఫ్ఎఫ్ఆర్), ఆప్టికల్ కోహెరెన్స్ టొమోగ్రఫీ (ఓసీటీ) వంటివి పీసీఐని ఆప్టిమైజ్ చేయడంలో ముఖ్యమైన ఉపకరణాలుగా మారడం పెరిగిపోతున్నది.

స్టెంటింగ్ అవసరం నిర్ధారణలో ఉండే అనిశ్చితి దూరం చేసేందుకు ఎఫ్ఎఫ్ఆర్ ప్రొసీజర్ నిర్వహిస్తారు. ఇది మైక్రో సెన్సర్ ఆధారిత ప్రొసీజర్. అవరోధం ఉన్న ధమని చుట్టూరా ప్రెషర్ తేడాను కొలిచేందుకు దీన్ని చేస్తారు. ఆ విలువ 0.8 కంటే తక్కువగా ఉంటే, ఆ అవరోధం గణనీయమైనదని, స్టెంటింగ్ అవసరమని అర్థం. అదే విధంగా ఆ విలువ 0.8 కంటే ఎక్కువగా ఉంటే, ఆ అవరోధం అంత పెద్దదికాదని, స్టెంటింగ్ అవసరం లేదని సూచిస్తుంది. ఆ విధంగా మెజర్‌మెంట్ పరిణామాత్మక విలువ ఆధారంగా ట్రీట్‌మెంట్ నిర్ణయం తీసుకునేందుకు ఇది తోడ్పడుతుంది.

డాక్టర్ పీసీ రథ్
కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్
అపోలో హాస్పిటల్స్
హైదరాబాద్



కులాసా


రైస్‌బ్రాన్ వల్ల ఆరోగ్య ప్రయోజనాలు



రైస్‌బ్రాన్ ఆయిల్ వల్ల ఆరోగ్య ప్రయోజనాలు సమృద్ధిగా ఉన్నాయని ఇటీవలి నిర్వహించిన ఒక అధ్యయనంలో నిరూపితమయ్యింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసులకు అనుగుణంగా ఉంది. ఇది చెడు కొలస్ట్రాల్(ఎల్‌డిఎల్)ను తగ్గించడంతో పాటుగా మంచి కొలస్ట్రాల్ (హెచ్‌డిఎల్) పెంచడంలో కీలకపాత్ర పోషిస్తుంది. గుండెసంబంధిత రక్తనాళాలకు రక్షణ అందిస్తుంది. గుండె ధమనుల గోడలలో కొలస్ట్రాల్ చేరడమనేది గుండెపోటు రావడానికి ప్రధాన కారణం. రైస్ బ్రాన్ అయిల్‌లో మాత్రమే ఒరిజినాల్ అనే యాంటీ ఆక్సిడెంట్ లభ్యమవుతుంది. ఇది హృదయ ధమనుల్లో కొలస్ట్రాల్ నిల్వలు చేరకుండా అడ్డుకోవడంతో పాటుగా రక్తం సులువుగా గుండెకు చేరేందుకు భరోసా కల్పిస్తుంది. మిగతా ఆయిల్స్‌తో పోలిస్తే దాదాపు 15శాతం తక్కువగా నూనె పీల్చుకోవడంతో వేపుళ్ల సమయాల్లో కూడా ఆరోగ్యకరమైన ఆహారం సాధ్యమవుతుంది. ఇది పూర్తి శాఖాహార నూనె కావడంతో గుండె పదికాలలపాటు పదిలంగా ఉండే అవకాశం ఉందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. జీర్ణప్రక్రియపై మంచి ప్రభావం చూపుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా కలిగిన ఈ నూనెను రైస్ పాలిషింగ్ ప్రాసెస్‌లో ఊక నుంచి తయారు చేస్తారు. అంతర్జాతీయంగా చేసిన అధ్యయనాల్లో ఈ ఆయిల్‌లో కొలస్ట్రాల్ తగ్గించే గుణాలు ఉన్నాయి. దీనిలో ఉన్న ఒరిజనాల్, టోకో ఫెరాల్, టోకో ట్రినాల్స్ , స్క్వాలేన్ వల్లనే ఇది సాధ్యమవుతుంది. ఫిజికల్‌గా రిఫైన్ చేసిన రైస్ బ్రాన్ ఆయిల్ సాధారణంగా గోల్డెన్ ఎల్లో రంగులో ఉంటుంది. దీనిని స్టీమ్ డిస్టిలేషన్ విధానంలో రిఫైన్డ్ చేస్తారు. దీనివల్ల ఎంయుఎఫ్ఏ, పీయుఎఫ్ఏల ఆదర్శ నిష్పత్తి ఉండడం వల్ల ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఈ సందర్భంగా ఫ్రీడం రైస్ బ్రాన్ ఆయిల్ సేల్స్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ పి. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ '' అన్ని బ్రాండెడ్ రైస్ బ్రాన్ ఆయిల్స్‌లో ఒకే తరహా ఒరిజినాల్ ఉండకపోవచ్చు. ఫ్రీడం ఫిజికల్లీ రిఫైన్డ్ రైస్ బ్రాన్ ఆయిల్‌లో సరిఅయిన ప్రమాణాల్లో ఒరిజినాల్ అంటే 1000 పీపీఎం కలిగి ఉంది'' అని అన్నారు.

డెంగ్యూతో జర జాగ్రత్త



అసలే ఇది వర్షాకాలం. ఈ కాలంలో డెంగ్యూవ్యాధి సోకకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం. ఈ వర్షాకాలంలో డెంగ్యూ చాలా ప్రమాదకరమైంది. డెంగ్యూ రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. డెంగ్యూకి నార్మల్‌గా ఏ ట్రీట్‌మెంట్ ఉండదు. ఈ వ్యాధి రాకుండా ఆపడానికి వ్యక్తిగత శుభ్రతతో పాటు చుట్టుపక్కల పరిసరాలు కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. దోమలు ఇంట్లోకి రాకుండా చూడాలి.

వీటితో పాటు బయటికి వెళ్లేటప్పుడు పూర్తిగా శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి. ఇంటి పక్కన ఉండే డ్రైనేజీలు, ఇంటి బయట మురుగు కాలువలు ఉంటే మస్కిటో రెఫల్ క్రీమ్స్ వాడితే చాలా మంచిది. ఇంటి లోపల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తగా పడాలి.

డెంగ్యూ జ్వరం కూడా ప్రాణాపాయ పరిస్థితిని తెచ్చి పెట్టొచ్చు. కానీ తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఈ సమస్య నుండి బయటపడొచ్చు. డెంగ్యూ వ్యాధి డెంగ్యూ వైరస్ వల్ల సంక్రమించేవ్యాధి. డెంగ్యూ దోమ కుట్టడం వల్ల వస్తుంది. డెంగ్యూ వ్యాధి ఉన్న రోగిని కుట్టిన ఈ దోమ మరొకరిని కుట్టడం వల్ల ఒకరి నుండి ఇంకొకరికి వ్యాప్తి చెందుతుంది. దోమకుట్టిన నాలుగు నుంచి 15రోజుల్లో ఈ వ్యాధి బయటపడుతుంది. విపరీతమైన ఒళ్లు నొప్పులు, కంటి వెనుకభాగంలో నొప్పి, మితిమీరిన నీరసం ఉంటుంది. రెండు, మూడు రోజుల్లో తగ్గి మళ్లీ జ్వరం కనిపిస్తుంది. ఈ వైద్యానికి ప్రత్యేకమైన పరికరాలు, ప్రత్యేకమైన వసతులు అవసరం లేదు. లక్షణాలను బట్టి వైద్యం చేస్తారు. డెంగ్యూ వ్యాధికి టీకా మందు లేదు. దోమలు అధిక సంఖ్యలో పుట్టకుండా, పుట్టిన దోమలు కుట్టకుండా చూసుకోవడమే నివారించదగ్గ పరిష్కార మార్గం.

డాక్టర్ రాహుల్
జనరల్ ఫిజిషియన్
మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్
9246245185



బీపీని అదుపు చేసే అరటి




ఏడాది పొడవునా లభించే అరటిపండు శరీరానికి అమృత తుల్యమే. పోషకాలకు అది పెట్టని కోట. ఒక్కో అరటి పండు దాదాపు 100 కేలరీల శక్తినిస్తుంది. ఇందులోని పోషకాలను గమనిస్తే... పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, పాస్ఫరస్, మాంగనీస్ వంటి ఖనిజాలతో పాటు ఇనుము, జింక్, ఫోలిక్ ఆమ్లాలు కూడా శరీరానికి అవసరమైన పరిమాణంలో లభిస్తాయి. అరటిపండు తిన్నప్పుడు అందులోని ట్రిఫ్టోఫన్ అనేది అమినో సెరటోనిన్‌గా మారుతుంది. ఫలితంగా శరీరంలో ఒత్తిడి తగ్గి మనసుకు స్వాంతన లభిస్తుంది.

ఇందులోని ఐరన్ హిమో గ్లోబిన్ స్థాయిని పెంచి రక్తహీనతను నివారిస్తుంది. పెద్ద పేగుకు మేలు చేసే ప్రోబయాటిక్ బ్యాక్టీరియాను విడుదల చేస్తుంది. ఈ బ్యాక్టీరియా ఎంజైములను ఉత్పత్తి చేసి తద్వారా జీర్ణశక్తి చురుగ్గా పనిచేసేందుకు తోడ్పడుతుంది.

అరటిపండులో ఉండే పొటాషియం, చాలా తక్కువ మోతాదులో ఉండే సోడియం అధిక రక్తపోటును నియంత్రిస్తాయి. ఈ పండులో చెక్కరలే కాకుండా, ప్రోటీన్లు సైతం అధికంగానే ఉంటాయి. ఒక్క అరటి పండు 3 ఆపిల్స్ లేదా 2 గుడ్లు లేదా అరలీటర్ పాలకు సమానం. పాలు అరటిపండ్లను రోజూ తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం మీ చెంతన ఉన్నట్టే. అధిక రక్తపోటు ఉన్నవారికి రోజు ఒక అరటిపండు తినిపిస్తే అదుపులో వ స్తుంది.


కాలిమడమలో పగుళ్లు



చలికాలం వస్తోందంటే కొంత మందికి అది ఒక పీడకలలాగే అనిపిస్తుంది. పాదాలు, మడమలు పగిలి రక్తం వెలికిరావడం, దాని తాలూకు నొప్పి, మంటలు, కొందరికి నిజంగానే నర కాన్ని తలపిస్తాయి. నిజానికి ఈ సమస్యను చిన్నపాటి చిట్కా వైద్యాలతో అధిగ మించొచ్చు. ముఖ్యంగా చలికాలంలో రోజుకు రెండు సార్లు మాయిశ్చ రైజర్‌తో పాదాల్ని శుభ్రం చేసుకోవడం ఒక పద్ధతి. ఇలా చేయడం వల్ల పాదాలు ఎండిపోవడం గానీ, గరుకుగా మారడం గానీ ఉండదు. గోరు వెచ్చని నీళ్లలో కొంచెం తేనె వేసి, ఆ నీళ్లలో పాదాలు ఉంచితే పాదాలు పగుళ్లు పోయి మృదువుగా మారతాయి. ఆయుర్వేదశాస్త్రం బ్యాక్టీరియా, సెప్టిక్ సమస్యల నుంచి మడమలు, పాదాల్ని కాపాడుకోవడానికి ఈ విధానాన్నే సూచిస్తుంది. తేనెలో మాయిశ్చరైజర్‌గా ఉపయోగపడే గుణాలు కూడా ఉన్నాయి. వీటన్నింటితోపాటు పాదాల పరిరక్షణలో ఆలివ్ ఆయిల్ పాత్ర కూడా కీలకమే. పాదాలు పగుళ్లు బారిన చోట ఆలివ్ ఆయిల్‌తో మర్దనా చేస్తే ఆ భాగాల్లో రక్తప్రసరణ పెరుగుతుంది. చాలామంది స్నానానికి ముందు ఆలివ్ ఆయిల్ మర్దనం చేసుకోవడంలోని ఉద్దేశం ఇదే. వీటితో పాటు చలికాలంలో పాదాలకు కాటన్ సాక్స్ వాడటం మేలు. ఇవి కాలుష్యాల నుంచి, దుమ్ము, ధూళి నుంచి కాపాడతాయి. పాదాల్ని కాపాడటంలో హెర్బల్ క్రీములు బాగా ఉపయోగపడతాయి. ఈ క్రీము గోరువెచ్చని నీళ్లతో కలిపి పాదాలు పగిలిన చోట పూయాలి. ఉదయం వేళల్లోనూ, నిద్రకుముందు ఇలా రోజుకు రెండుసార్లు ఈ క్రీము వాడితే మడమల, పాదాల బాధలు చాలావరకు తగ్గిపోతాయి.

సీజనల్ ఫ్రూట్స్‌తో మేలు

సీజనల్ పండ్లలలో విటమిన్స్, మినిరల్స్, పీచు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి రోగ నిరోధక శక్తి పెంచేందుకు ఉపయోగపడతాయి. విటమిన్ ఎ అనేది రోగ నిరోధకశక్తి, కంటి చూపుకోసం బాగా ఉపయోగపడుతుంది. విటమిన్ ఎ పసుపురంగులో ఉండే పండ్లలో లభిస్తుంది. బొప్పాయి, పనస, మామిడిపండ్లు, స్టార్‌ఫ్రూట్, అనాస, నారింజ, జీడిమామిడి, నిమ్మకాయ, టమాటలో విటమిన్ ఎ బాగా లభిస్తుంది. విటమిన్ సి తాజా పండ్లలలో సమృద్ధిగా లభిస్తుంది. ముఖ్యంగా ఉసిరి, జామ, సిట్రస్ ఫ్రూట్స్‌లలో విటమిన్ సి దొరుకుతుంది. విటమిన్ సితో శరీరానికి చాలా లాభాలు ఉన్నాయి. ముఖ్యంగా ధృఢమైన యముకలకు ఐరన్ యబ్సోర్‌పేషన్, కొలెజన్ అనే ప్రొటీన్ తయారి కోసం ఉపయోగపడుతుంది. ఇకపోతే బి.కాంప్లెక్స్ విటమిన్‌లు ఆరోగ్యవంతమైన చర్మం, జుట్టు, కళ్లు, కాలేయం కోసం సహాయ పడతాయి. అంతేకాక నాడీ వ్యవస్థను బలపరుస్తుంది. ఫోలిక్‌యాసిడ్ ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి తోడ్పడతాయి. విటమిన్ డి మన శరీరంలో క్యాల్షియంను పెంపొందించడానికి ఉపయోగపడుతుంది. దీని వల్ల ఎముకలు గట్టిప డతాయి. విటమిన్ డి రోగనిరోధక వ్యవస్థను పెంపొం దిస్తుంది. విటమిన్ ఇ ఒక యాంటి ఆక్సిడెంట్. ఇది ఫ్రీరాడికల్‌తో కలిగే నష్టాన్ని నివారిస్తుంది.





అనుష్క

భాగమతికి హిందీలోనూ క్రేజ్

ఒకప్పుడు బాలీవుడ్ చిత్రాలకే అంతర్జాతీయ మార్కెట్, క్రేజ్ ఉండేది. అయితే ఇప్పుడు దక్షిణ భారత చిత్రాలకు కూడా మార్కెట్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా బాహుబలి సిరీస్ చిత్రాలు అంతర్జాతీయంగా తెలుగు సినీరంగానికి విశేషమైన ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. దాంతో కేవలం ఒక్క తెలుగుకే పరిమితం కాకుండా తమిళ, హిందీ వంటి పలు భాషలలో కూడా తమ చిత్రాలను విడుదల చేసేందుకు టాలీవుడ్ నిర్మాతలు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈ కోవలో అనుష్క టైటిల్ పాత్రలో తెరకెక్కుతున్న భాగమతి చిత్రానికి అంచనాలు మిన్నంటుతున్నాయి. జి.అశోక్ దర్శకత్వంలో ప్రమోద్, వంశీకృష్ణారెడ్డి భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాహుబలి చిత్రాలతో అనుష్క పేరు బాలీవుడ్‌తో పాటు ఓవర్‌సీస్‌లో కూడా మారుమోగింది. ఈ నేపథ్యంలో బాలీవుడ్‌లో కూడా అనుష్కకు అవకాశాలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆమె అక్కడ నటించేందుకు అంత ఆసక్తిని కనబరచడం లేదన్న మాటలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ ప్రస్తుతం అనుష్క నటిస్తున్న భాగమతి చిత్రం హిందీ వెర్షన్ డిజిటల్ హక్కుల కోసం విపరీతమైన పోటీ ఏర్పడినట్లు పరిశ్రమలో చెప్పుకుంటున్నారు. ఎంత ఆఫర్ చేస్తున్నారన్న అంశం కరెక్ట్‌గా తెలియకపోయినప్పటికీ, వినపడుతున్న సమాచారం ప్రకారం హిందీ వెర్షన్ డిజిటల్ హక్కుల కోసం 12 కోట్ల రూపాయలకు పైగా ఆఫర్ పలుకుతోందట.



జూ.ఎన్టీఆర్

జై లవకుమార్

జూ.ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న చిత్రం జై లవకుశ. అందరినీ ఆకర్షిస్తున్న ఈ చిత్ర నిర్మాణం చివరిదశలో ఉంది. ఇప్పటికే జై ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. సోమవారం నాడు మూడు పాత్రల్లో మరో పాత్ర లవకుమార్ లుక్ విడుదల చేశారు. పక్కా లవర్‌బాయ్ లుక్‌లో జూనియర్ కనిపిస్తున్నారు. కుశ గెటప్ రిలీజ్ చేయాల్సి ఉంది. పూనేలో షూటింగ్ పూర్తిచేసి గతవారం యూనిట్ హైదరాబాద్ చేరుకున్న విషయం తెలిసిందే. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కల్యాణ్‌రామ్ నందమూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాశిఖన్నా, నివేదాథామస్ కథానాయికలుగా నటిస్తున్నారు. బాబి దర్శకుడు. సెప్టెంబర్ 21న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని రావాలన్నదే దర్శక, నిర్మాతల సంకల్పం. ఈ చిత్రానికి సి.కె.మురళీధరన్ ఛాయాగ్రహణాన్ని అందిస్తుండగా, దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.



'ఇష్క్' తో విజయాల దారిలో పడిన నితిన్ ఆ పేరు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే 'అ..ఆ' వరకు హిట్ సినిమాలు అందుకున్నారు. ప్రస్తుతం ఈ యువ హీరో 'లై' తో తెరపైకి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణంలో దర్శకుడు హను రాఘవపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆగస్టు 11న 'లై' ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నితిన్ చిత్ర విశేషాలు తెలిపారు.

పవన్ ఇమేజ్ ఇప్పుడు వాడుకోనవసరం లేదు..

- నితిన్

☆ 'అ..ఆ' విజయం సాధించిన తర్వాత రెండు నెలలు ఏ కథా వినకుండా ఉన్నాను. ఎలాంటి సినిమా చేయాలనే సందేహం మొదలైంది. ముందు చిత్రానికి దక్కిన ఆదరణతో మరింత మంచి సినిమానే చేయాలనే ఆలోచించాను. ఏ నిర్ణయం తీసుకులోని స్థితిలో దర్శకుడు త్రివిక్రమ్ దగ్గరకి వెళ్లి కలిశాను. ఆయన కొత్త సినిమా యాక్షన్ నేపథ్యంతో చేయమని చెప్పారు. త్రివిక్రమ్‌తో మాట్లాడాక ఏ సినిమా చేయాలనే స్పష్టత వచ్చింది.

☆ చాలా కథలు విన్నా నచ్చలేదు. హను రాఘవపూడి వచ్చి అరగంటలో 'లై' కథ వినిపించారు. ఇందులోని ప్రేమ, యాక్షన్, నా క్యారెక్టర్ అన్నీ ఆకట్టుకున్నాయి. సినిమా చేద్దామని నిర్ణయించాం. సినిమా మొత్తం హాలీవుడ్ తరహాలో కనిపించాలని దర్శకుడు పట్టుదలగా ఉండేవారు. ఆర్నెళ్ల ముందే పూర్వ నిర్మాణ కార్యక్రమాలు మొదలయ్యాయి. నేనూ కొత్త గెటప్ కోసం కసరత్తులు చేశాను. చిత్రీకరణ అమెరికాలో సాగింది. నిర్మాత అనిల్, దర్శకుడు హను రాఘవపూడి అక్కడికి వెళ్లి రెండు నెలలు లొకేషన్లు మొత్తం వెతికారు.

☆ పనీ పాటా లేకుండా తిరిగే యువకుడి పాత్ర నాది. అమెరికా వెళ్లి..అక్కడ ఓ తెల్ల అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనేది అతని కల. ఈ లక్ష్యంతో అమెరికా వెళ్తాడు. అక్కడ ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయనేది మలుపులతో ఆసక్తికరంగా ఉంటుంది.

☆ ప్రేమ సన్నివేశాలల్లో నేనూ నాయిక అన్నీ అబద్ధాలే మాట్లాడుకుంటూనే ఉంటాం. అవన్నీ ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తాయి. అబద్ధాలు మాట్లాడుకుంటూనే ఉన్నా...అవి స్పష్టంగా అర్థమవుతాయి. కథనంలో ఆ జాగ్రత్తలు తీసుకున్నారు.

☆ ప్రేమ, శత్రువు, హీరో విలన్ మధ్య మైండ్ గేమ్ చాలా సినిమాల్లో చూసి ఉంటాం. కానీ 'లై' లో ఈ ఆట విభిన్నంగా ఉంటుంది. అమెరికాలో చిత్రీకరణ చేయడం వల్ల మొత్తం కథకు కొత్త రూపు ఏర్పడింది. అమెరికాలో చాలా ఖరీదైన లొకేషన్లలో షూటింగ్ చేశాం. క్యాసినో లో షూటింగ్ ఆరు గంటలకు పాతిక లక్షలు అద్దె తీసుకునేవారు. క్లైమాక్స్ కోసం విమానాలు నిలిపే ప్రదేశంలో రూపకల్పన చేశాం.

☆ నా తదుపరి చిత్రానికి కూడా మేఘా ఆకాష్ నాయికగా పనిచేస్తుంది. రెండో సారి ఎందుకని అడిగితే...పాత్రకు సరిపోతుంది ఇంకేం సందేహాలు వద్దని త్రివిక్రమ్ చెప్పారు. అర్జున్‌తో శ్రీ ఆంజనేయం సినిమాలో కలిసి పనిచేశాను. ఇప్పుడు మళ్లీ నటిస్తున్నాను. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆయన ఒకేలా ఉన్నారు. ఓ నటుడు తన శరీరాన్ని మానసిక స్థితిని ఎలా కొనసాగించాలో ఆయన్ను చూసి నేర్చుకోవచ్చు.

☆ ప్రతి చిత్రానికి మార్కెట్ లెక్కలు వేసుకుంటాను. గత చిత్రం 20 కోట్ల రూపాయలు వసూలు చేస్తే...ఇది 40 కోట్లు చేయాలని ఆశిస్తాను. కథానాయకుడిగా ఈ లెక్కలు అవసరమని భావిస్తా.

☆ ట్రైలర్, టీజర్, పాటలు విడుదలయ్యాక సినిమాపై అంచనాలు బాగా పెరిగాయి. వాటిని చేరుకుంటుందనే నమ్మకం ఉన్నా...భయంగానే ఉంది. పవన్ కళ్యాణ్ సినిమాలు చూస్తూ పెరిగాను. అభిమానిగా ఆయన ప్రభావం నాపై ఖచ్చితంగా ఉంటుంది. ఆయన సినిమాల్లోని పాటలు, స్టైల్స్ వాడుకున్నానని అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు విజయాల్లోనే ఉన్నా కదా..ఇప్పుడు నా చిత్రాల కోసం పవన్ ఇమేజ్ వాడుకోవాల్సిన అవసరం లేదు. కానీ 'లై' లో కూడా మీకు ఆ ప్రభావం కనిపిస్తుంటుంది.

ఎన్నో ఎన్నో భావాలే...!



నాగచైతన్య

రారండోయ్ వేడుక చూద్దాం సక్సెస్ తర్వాత నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం యుద్ధం శరణం. కృష్ణ ఆర్వీ మరిముత్తు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వారాహి చలనచిత్రం పతాకం నిర్మిస్తోంది. నాగచైతన్య సరసన లావణ్యత్రిపాఠి నాయికగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ కార్యక్రమాలను పూర్తిచేసుకుని, నిర్మాణానంతర పనుల్లో ఉంది. కాగా సోమవారం రాఖీ పండుగ సందర్భంగా చిత్రబృందం ఓ పాటను విడుదలచేసింది. ఎన్నో ఎన్నో భావాలే అంటూ సాగే ఈ పాట ఎంతగానో అలరింపజేస్తోంది. సినిమాలో నాగచైతన్యకు రాఖీ కడుతున్నట్లు ఈ సన్నివేశం ఉంటుంది. కుటుంబ అనుబంధాలు, ఆప్యాయతలను ఆవిష్కరించేవిధంగా ఈ పాట సాగుతుంది. పాట మొదలు కావడానికి ముందు రేవతి చెప్పిన డైలాగ్ కూడా ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా సాగుతుంది. అక్కాచెల్లెళ్లు రాఖీ ఎందుకు కడతారో తెలుసా అమ్మానాన్నల తర్వాత వాళ్ల బాధ్యత అన్నాతమ్ముళ్లదే అనే ఈ డైలాగ్ ప్రతిఒక్కరినీ కదిలించక మానదు. ఇందులో నాగచైతన్య తల్లిదండ్రులుగా రావురమేష్, రేవతి నటించగా, శ్రీకాంత్ ప్రతినాయకుడిగా కనిపించబోతున్నారు.

ప్రతిక్షణం థ్రిల్

మనీష్‌బాబు, తేజశ్విని నాయకానాయికలుగా తెరకెక్కిన చిత్రం ప్రతిక్షణం. శ్రీ భాగ్యలక్ష్మి మూవీమేకర్స్ పతాకంపై జి.మల్లికార్జునరెడ్డి నిర్మించగా, నాగేంద్రప్రసాద్ దర్శకత్వం వహించారు. ఈ నెల 18న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఇదే వేదికపై చిత్రం ప్లాటినమ్ డిస్క్ వేడుక కూడా జరిగింది. అతిథుల చేతులమీదుగా చిత్రబృందానికి జ్ఞాపికల ప్రదానం కూడా జరిగింది. ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న రాజ్ కందుకూరి మాట్లాడుతూ, టైటిల్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. కంటెంట్ ఉంటే ఎలాంటి సినిమా అయినా ఆడుతుంది. క్షణం సినిమా ఎంతపెద్ద విజయం సాధించిందో ఈ సినిమా అంతకంటే పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. నిర్మాత మల్లికార్జునరెడ్డి, ఇతర చిత్రబృందానికి అభినందనలు అని అన్నారు. మరో అతిథి తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ, పాటలు, ట్రైలర్ చూస్తుంటే నిర్మాత ఎంత అభిరుచితో ఈ సినిమాను చేశారో అర్థమౌతోంది. ఎనభై నుంచి వంద థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు నిర్మాత ప్రయత్నాలు చేస్తున్నారు అని అన్నారు. చిత్ర నిర్మాత జి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ, ప్రేక్షకులంతా థ్రిల్లయ్యేలా ఈ చిత్రం ఉంటుంది. తప్పకుండా అందరికీ ఈ చిత్రం నచ్చుతుందన్న నమ్మకం ఉంది. రఘురాం సంగీతాన్ని అందించిన ఆడియోకు చాలా మంచి స్పందన లభించింది. టైటిల్‌లానే ప్రతీ సన్నివేశం కొత్తరకమైన అనుభూతిని కలిగిస్తుంది అని అన్నారు. చిత్ర హీరో మనీష్‌బాబు మాట్లాడుతూ, నిర్మాత ఎంతో అభిరుచితో సినీరంగంలోకి అడుగుపెట్టారు. హారర్ సినిమాల్లో చెప్పుకోదగ్గ సినిమా అవుతుంది అని అన్నారు. సంగీత దర్శకుడు రఘురాం మాట్లాడుతూ, తన కెరీర్ ఆరంభంలోనే వైవిధ్యమైన సంగీతాన్ని అందించే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నా అని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం శివకుమార్, తెలంగాణ డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ అమృతరావు, సాయివెంకట్, ఎన్.పద్మిని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ దేవారెడ్డి, ఓంనాథ్‌రెడ్డి, కళా దర్శకుడు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో అర్చన, విజయసాయి, వైవా హర్ష, సుదర్శన్‌రెడ్డి తదితరు లు తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: రఘురాం, ఛాయాగ్రహణం: కళ్యాణ్‌సమి, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే దర్శకత్వం: నాగేంద్ర ప్రసాద్.



తేజశ్విని , మనీష్‌బాబు

మనుషుల్ని ప్రేమించే దెయ్యం!



సుజయ్, తనిష్క్, చంద్రకాంత్, రష్మి నాయకానాయికలుగా సోని ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం నాకు మనసున్నది. సోని టీమ్ సమర్పణలో సాయిహాసిని ప్రొడక్షన్ పతాకంపై దేవశంకర్‌గౌడ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, రాజశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ట్రైలర్‌ను తెలంగాణ ఫిలిం చాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్, బిగ్ సీడీని సీనియర్ నటి కవిత, ఆడియో సీడీలను నటుడు భానుచందర్ విడుదలచేశారు. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ, దర్శకుడు ఈ చిత్రాన్ని ఎంతోబాగా తెరకెక్కించారు. చిత్రబృందానికంతటికీ శుభాభినందనలు అని చెప్పగా, సాయివెంకట్ మాట్లాడుతూ, దెయ్యం మనుషుల్ని ప్రేమించడమనే కొత్త కాన్సెప్ట్‌తో మలచబడ్డ ఈ చిత్రం తప్పకుండా విభిన్నచిత్రంగా ప్రేక్షకులను అలరింపజేస్తుందన్న నమ్మకం ఉంది అని అన్నారు. కవిత మాట్లాడుతూ, దర్శకుడు ఈ చిత్రం ద్వారా ఎంతోమంది కొత్తవాళ్లను ప్రోత్సహించడం ఆనందంగా ఉందని పేర్కొనగా, దర్శక, నిర్మాతలతో పాటు చిత్రబృందం అంతటికీ భానుచందర్ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: పెద్దాడ వెంకటరమణ, సంగీతం: ఉదయ్‌కిరణ్, ఎడిటింగ్: చందు ఐశ్వర్య.